సంపుటి: 18
సంచిక: 1

ఫోన్ నెం:
36959

సచిత్ర డైజెస్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) రూ. 39/-
30-8-'74 తేదీ లోపల చేరేవారికి 30 రూపాయలు.
ఉచిత చందా డిపాజిట్టు 180 రూపాయలు.
"హోమ్ డెలివరీ" సభ్యత్వం 3 రూపాయలు.

ఆగస్టు, 1974

మేనేజింగ్ ఎడిటర్:
శ్యామ దామోదరరెడ్డి
అసిస్టెంట్ ఎడిటర్:
మిస్. మంజుల
సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
ఏ. పి. మోహన్రావ్
సుజనశ్రీ
వాసవదత్త
కంచర్ల రమణ

తొలిమాట

నమస్కారము. పోస్టుకార్డు ధర పెరిగిపోయిన కారణంగా పోటీ శీర్షికలలో పాల్గొనే పాఠకులు ఇకమీదట అన్ని పోటీల జవాబులను పోస్టుకార్డు సైజు తెల్ల కాగితములపై వ్రాసి, అన్నిటినీ ఒకే కవరులో పెట్టి మాకు పంపవచ్చు. ఒక కాగితంపై ఒక్క పోటీకి మాత్రమే వ్రాయాలి.

ఈ నెలనుండి అన్ని పోటీలకు నగదు బహుమతులను ఏర్పాటు చేశాము. 'రీడర్స్ క్లబ్' కు కూడా కొత్తగా కొన్ని బహుమతులను ప్రకటించాము. యీ శీర్షిక ఇకపైన "సప్లిమెంట్స్"లో ప్రచురించ బడుతుంది. 'మీరే ఎన్నుకోండి'కి కూపన్ చింపి పంపనక్కర్లేకుండా, ప్రవేశరుసుము పెట్టాము.

"హోమ్ డెలివరీ" సభ్యులకు పత్రికలు తగ్గింపు రేటులో లభించటమే కాకుండా, గ్యారంటీగాను, అతిత్వరితంగాను చేరుతాయి. డబ్బు ఏనెల కానెల ఇంటి వద్దనే చెల్లించి కాపీలు తీసుకోవచ్చును. అంతే గాకుండా, యీ నెలనుండి అన్ని పోటీలలో పాల్గొనటానికి "హోమ్ డెలివరీ" సభ్యులకు మాత్రమే అవకాశం వుంటుంది. దీనివల్ల న్యాయంగా పత్రికలు కొనేవారికే బహుమతులు పొందే వీలు కల్గుతుంది.

ఇప్పటి వరకు "హోమ్ డెలివరీ" సభ్యత్వము తీసుకోని వారుకూడా తమ సభ్యత్వ రుసుము పంపుతూ, అన్ని పోటీలలో పాల్గొన వచ్చును. ఐతే ప్రతికూపనుపై ఆ విషయం వివరంగా వ్రాయాలి. సభ్యులైతే తమ చిరునామాతోపాటు, తమ సభ్యత్వము నెంబరు వ్రాస్తే చాలును. సెలవా మరి—

—శ్యామ దామోదర్ రెడ్డి

ఈ సంచికలో ....

కథలు

4. ఫ్లయింగ్ సాసర్ — సంపత్.
40. 10 గంటలసేపు ప్రపంచానికి ప్రమాదం — కొమ్మూరి సాంబశివరావు.
70. దేవీకటాక్షం — రమణశ్రీ.
108. నిప్పులాంటి అమ్మాయి — ఏ. వీ. మోహన్రావ్.
156. దొంగ వెధవ — కంచర్ల రమణ.
170. బావిలో శవాలు — శశికుమార్.
212. బలికోరిన వజ్రాలు — మల్లాది వెంకటకృష్ణమూర్తి.

శీర్షికలు

11. అపరాధ పరిశోధన పోటీ—73.
37. పాఠకుల ప్రశ్నలు?
60. మీ తీర్పు ఏమిటి?
66. ఈ నెల జోక్స్ — పెందుర్తి మాపక్రీ.
91. అపరాధ పరిశోధన పోటీ—71 (ఫలితాలు)
103. పాఠకుల పరిశోధన పోటీ.
119. మీరే ఎన్నుకోండి?
131. హమేషా—హంగామా.
166. ఈ నెల జోక్స్ — కె. ప్రభాకర్ దేవ్.
200. రీడర్స్ క్లబ్.
203. హోమ్ డెలివరీ.
209. క్రైమ్‌లో తమాషాలు.
221. ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ.
222. లేఖలు.

ఇంకా—చంద్ర కార్టూన్లు, చెప్తావినండి, వింత ప్రపంచం, మీకు తెలుసా, మరెన్నో ఆకర్షణలు!!!

ఫ్లయింగ్ సాసర్
సంపత్

"మన టౌన్‌లో ఎగిరే ఫ్లైయింగ్ సాసర్స్ గురించి విన్నావా?" అడిగాడు దివాకర్.

"ఏమిటి?" అదిరి పడ్డాడు రాజు.

"అవును. మొన్న మా ఊరెళ్ళివస్తుంటే టౌను పరిసరాలలోనికి రాగానే టైరు పోయింది. రాత్రి సుమారు ఒంటిగంట అయి ఉంటుందప్పుడు. టైరు మార్చటానికి జాకీ ఎత్తి, డిక్కీలో టైరుతీసి, మార్చబోతున్నాను. ఇంతలో ఏదో శబ్దం విన్పించింది. విమానం శబ్దమేమో ననుకున్నాను మొదట. కాని ఆకాశం వంకచూశాను. మనం కొన్ని ఇంగ్లీష్ సినిమాలలో చూసి ఉంటాము అటువంటి సాసర్‌ని. అది అతివేగంగా క్రిందకు రావటం గమనించాను. తెల్లగా, ప్రకాశవంతంగా ఉంది. నేను దిమ్మెరపోయాను. కాని దురదృష్టవశాత్తు అది కొండలప్రక్కకు వెళ్ళిపోయింది. నేను ఇంటికి తిరిగి వచ్చేశాను."

ఆసక్తిగా వినసాగాడు రాజు.

"కొండల దగ్గరకువెళ్ళి పరీక్షించలేదా?" ప్రశ్నించాడు.

"మర్నాడు ఉదయం వెళ్ళాను. నా అనుమానం నిజమయింది. ఒక కొండమీద దిగినట్టు గుర్తులు కన్పించాయి."

"గుర్తులా? ఏమిటవి?"

"నీ వెప్పుడైనా ఆ కొండలు ఎక్కావా?"

"ఇంతవరకు ఎక్కలేదు."

"ఐతే కష్టమే. మనకు రోడ్‌మీదనుండి కన్పించే కొండ వెనుక మరొక కొండ ఉందికదా! ఆ కొండ పైభాగంలో చదునుగా, నేలలాగ ఉంటుంది. అక్కడ దిగింది. అది దిగినచోట గుండ్రంగా ఉన్న చోటుఉంది. అది నల్లగా ఉంది. కారణం అక్కడఉన్న గడ్డి అంతా మాడిపోయింది. ఇంతకన్న విచిత్రమైన విషయం, ఆ ఫ్లయింగ్ సాసర్

శబ్దాన్ని ఇంతవరకు నేను తప్ప, మరెవరు వినలేదు.''

"అదెలా సంభవం? ఎవరో ఒకరు విని ఉండాలి గదా?''

''అవును, నేను అదే ఆలోచించాను. కాని టౌనులో ఎవరూ ఆ శబ్దాన్ని పట్టించుకోరని, ఒకవేళ విన్నా ఏ విమాన శబ్దమో అని భావిస్తారని నన్ను నేను తృప్తిపరుచుకున్నాను.''

''నీలాగే యితరు లెవరైనా దానిని చూశారా?''

''ఉహూఁ! ఇంతవరకు ఎవ్వరు చూడలేదు. నేను చెప్పినా నమ్మటం లేదు.''

రాజు దీర్ఘంగా నిశ్వసించాడు.

ఫ్లైయింగ్ సాసర్స్!

శాస్త్రజ్ఞులు తలబద్దలు కొట్టుకుంటున్నారు వీటి నిరూపణ కోసం.

ఎవరికీ అంతుబట్టలేదు వీటిరహస్యం. భూమిమీద దిగగా చూసినవాళ్లు ఎవరూలేరు. కాని యిప్పుడు దివాకర్ తాను చూశానంటున్నాడు. ఎంతవరకు నిజం? దివాకర్ భ్రమ పడ్డాడా? ఉహూఁ! అతను అది దిగినచోటును గూడ పరిశీలించానంటున్నాడు.

''ఏమిటి? ఆలోచిస్తున్నావా వాటి గురించి?''

''దివాకర్! నాకుకూడా ఆ ఫ్లయింగ్ సాసర్ దిగినచోటు చూపిస్తావా?''

''నా మాటలమీద నమ్మకం లేదా నీకు?''

''నమ్మకం లేక కాదు. నాకు కూడ ఎందుకో ఆ ప్రదేశం చూడాలనిపిస్తూంది.''

''ఐతే రేపు ఉదయం పదింటికి రా! ఇద్దరం వెళదాము.''

2

ఉదయం పదిగంటలు కావొస్తోంది. దివాకర్, కాలేజీకి సెలవుపెట్టి, రాజుకోసం వెయిట్ చేయసాగాడు. అతను

స్థానిక కాలేజీలో లెక్చరరుగా పనిచేస్తున్నాడు. కరక్టుగా పదిగంటలకు రాజు కారులో వచ్చాడు.

"సరిగ్గా పదింటికే వచ్చావే!" నవ్వుతూ అన్నాడు దివాకర్.

రాజుకూడ నవ్వాడు. "మరేమిటనుకున్నావ్! వాది ఫారిన్ పంక్చువాలిటి. ఇండియన్స్‌లాగ కాదు."

"సరే! నీతో వాదనెందుకు. పద."

డోర్ తెరుచుకొని ఎక్కి కూర్చున్నాడు దివాకర్. కారు బయలుదేరింది. సుమారొక గంట ప్రయాణించి ఆ కొండ దగ్గరకు చేరారు. డోర్ తెరుచుకొని దిగా రిద్దరు. ఎండ మండిపోతూంది! పాంటుజేబులోనుండి కూలింగ్ గ్లాసెస్ తీసి ధరించారు.

రాజు చుట్టూ పరిశీలించాడు. టౌనుకు దూరంగా ఉన్నాయా కొండలు. దరిదాపుల్లో ఎక్కడా జనసంచారం లేదు. పగలు కనుక కొండరాళ్లు పగలకొట్టే కార్మికులు మాత్రం దూరంగా మరో కొండదగ్గర కన్పిస్తున్నారు.

"కొండపైకి ఎక్కుదాం పద," దివాకర్ అన్నాడు.

ఇద్దరు కారు లాక్ చేసి, కొండవైపు బయలుదేరారు. కొండ ఏటవాలుగా వుంది. ముళ్లపొదలు గీసుకు పోతు న్నాయి. మధ్యమధ్య బూటుకాళ్లు జారుతున్నాయి. సుమా రొక అరగంట కష్టపడి పైకి ఎక్కారు.

"ఇంకా ఎంతదూరం బాబు? కాళ్లు నొప్పి పుట్టు తున్నాయ్!" ఆయాసంగా అన్నాడు రాజు.

"ఇంకెంత దూరం! వచ్చేశాం. అదుగో ఆ ప్రక్కకు నడవాలి."

రాజు బలం పుంజుకొని లేచాడు.

సుమారొక పావుగంట నడిచి, చదునుగా నున్న ఒక

ప్రదేశం చేరారు. రాజు కళ్లు ఆనందంతో మెరిశాయి. ఆ ప్రదేశం నేలమట్టానికి సమాంతరంగా, చదును చేసినట్టు వుంది. మధ్యలో గడ్డి అంతా గుండ్రని ఆకారంలో మాడి పోయి వుంది.

"ఈ వృత్తవ్యాసాన్ని కొలిచాను. సుమారుగా వంద మీటర్లు వుంటుంది."

ఆశ్చర్యంగా చూస్తున్నాడు రాజు. కూలింగ్ గ్లాసెస్ తీశాడు. కళ్లు మంటలు పుట్టాయి. "అయితే ఆ సాసర్ చాలా పెద్దదే అయివుండాలి" తనలో తాను అనుకుంటు న్నట్లు అన్నాడు రాజు.

"అవును. దీన్నిబట్టి చూస్తే ఆ ఫ్లయింగ్ సాసర్ ఎత్తు సుమారు నాలుగయిదొందల అడుగులన్నా వుంటుంది."

"దానిలో ఎవరన్నా వున్నారా?"

"చెప్పాను గదా నేను చూడలేదని! అయినా దానిలో బహుశా మానవు లుండకపోవచ్చు."

"మరి?" ఆశ్చర్యంగా అడిగాడు రాజు.

"ఇంతవరకు మనం చూడనటువంటి జీవు లుండ వచ్చును."

"అంటే మన గ్రహంమీదే కాక, మరోచోటకూడ జీవ జాల మున్నదన్నమాట."

"నిశ్చయంగా చెప్పలేను. నీకు తెలుసుగదా మన సూర్య కుటుంబంలో తొమ్మిది గ్రహాలున్నాయని?"

"తెలుసు. అయితే?"

"ఇటువంటి సూర్య కుటుంబాలు కొన్ని కోట్లు ఈ విశా లానంతాకాశంలో ఉన్నాయని శాస్త్రజ్ఞులు ఊహిస్తున్నారు. అటువంటప్పుడు జీవజాలానికి సరిపడే పరిస్థితులున్న గ్రహం కనీసం ఒక్కటైనా వుండకపోదు."

"అయితే మన మొక పనిచేద్దాం!"

"ఏమిటి?" దివాకర్, రాజువంక చూశాడు.

"నేను చెప్పబోయే ముందు మరో ప్రశ్నకు జవాబు చెప్పు. అది ప్రతిరోజు ఇక్కడకు వస్తుందా?"

దివాకర్ తల అడ్డంగా ఊపాడు తెలియదన్నట్లు.

"అయితే కష్టమే! మనం రోజు ఇక్కడికి వద్దాం. ఏదో ఒకరోజు అది మరలా ఇక్కడకు రాకపోదని నా ఉద్దేశ్యం."

"అయితే..." అర్థంగాక అడిగాడు దివాకర్.

"మనం ఆ ఫ్లైయింగ్ సాసర్‌ని దొంగతనంగా పరిశీలిద్దాం. ఎవరయినా ఉన్నారో, లేక నువ్వు చెప్పినట్లు ఆ జీవులేమయినా వున్నాయేమో పరిశీలించి, ఫొటోలు తీద్దాం."

దివాకర్ అదిరిపడ్డాడు. "మనిద్దరమా? అసలదేమిటో తెలియకుండా? పైగా ఆ వింత జీవులమధ్య...?"

అసహనంగా కదిలాడు రాజు. "ఛీఛీ! నువ్వింత పిరికి వాడివే?"

దివాకర్ కోపంగా అన్నాడు. "పిరికి వాడినని కాదు. నువ్వు చెప్పేది ప్రాణాలతో చెలగాటం. ఎవరి ప్రాణం వారికి తీపి."

"నీకు తెల్సుగా నాకిటువంటి సాహసాలు చాలా ఇష్టమని? ఓ. కె! నువ్వు రానవసరం లేదు. నే నొక్కడినే పరిశీలిస్తాను" దృఢనిశ్చయంతో అన్నాడు రాజు.

"కోరి ప్రాణాలకు ఆపద తెచ్చుకుంటున్నావు. ఇహ పద! నీతో చెప్పటం నాదే బుద్ధి తక్కువ."

ఇద్దరు మౌనంగా క్రిందికి దిగి, కారెక్కారు. రివ్వున బయలుదేరింది మరుక్షణం.

3

ఆ రోజు రాత్రి తనారోజు చూసింది, తన అభిప్రాయా

లను డైరీలో వ్రాసుకున్నాడు రాజు. అందుకు ఏమేమి చేయాలో ఆలోచించాడు.

మర్నాడు ఉదయం తన స్నేహితుడయిన సైంటిస్టు రంగాచారి ఇంటికి వెళ్ళాడు. ఆ సమయంలో రంగాచారి ఇంటిలోనే వున్నాడు. రాజును చూడగానే ఆహ్వానించాడు.

"ఏమిటిలా దారితప్పి వచ్చావు? చిరకాల దర్శనం" నవ్వుతూ అన్నాడు రంగాచారి.

కుర్చీలో కూర్చుంటూ అన్నాడు రాజు. "మరేమిలేదు. మీతో చిన్నపని తగిలింది."

"నాతోనా? ఏమిటబ్బా!"

"నేను, నిన్న ఒకవింత విషయాన్ని చూశాను" అని దివాకర్ తనతో చెప్పిన సంగతి, తను వెళ్ళి చూసిన వివరాలు చెప్పాడు రాజు. పూర్తిగా విన్న రంగాచారి ఆశ్చర్యపోయాడు.

"రాజు! నువ్వు పొరబడటం లేదుగదా? ఫ్లయింగ్ సాసర్స్ అనేవేలేవని శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. నువ్వా సమస్యని తిరగదోడుతున్నావు."

"కళ్ళముందు ప్రత్యక్షంగా కన్పిస్తుంటే నమ్మకుండా ఎలా?"

"నువ్వు చెప్పేదే నిజమయితే నాకొక అనుమానం వస్తూంది" రాజు కళ్ళలోనికి సూటిగా చూస్తూ అన్నాడు రంగాచారి.

"ఏమిటి?"

"ఈ మధ్యకొన్ని సంపన్న దేశాలు ఫ్లయింగ్ సాసర్స్ ఆకారంలో విమానాలు తయారుచేసి, శత్రుదేశాలను భయపెట్టడానికి ప్రయత్నిస్తున్నాయట. ఒకవేళ అదీ ఇటువంటిదేనేమో?"

అపరాధ పరిశోధన పోటీ-73

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు. వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్లకాగితంపై వ్రాసి, దానితో 60 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరిచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన "హోమ్ డెలివరీ" సభ్యులకు ఒక్కొక్కరికి రు. 20-00 చొప్పున నగదు బహుమతి పంపగలము.

ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 60 పైసలు పోస్టలు స్టాంపులు జతపరచి, యీ నెల 30 తేదీలోగా మాకు చేరేటట్లు పంపండి. ప్రతి కూపను వెనక మీ పూర్తి చిరునామా, సభ్యత్వము నెంబరు స్పష్టంగా వ్రాయాలి. ఫలితాలు అక్టోబర్ '74 నెల సంచికలో ప్రకటిస్తాము.

"హోమ్ డెలివరీ" సభ్యత్వము లేనివారి కూపన్లు ఎంతమాత్రం పరిశీలించబడవు. సభ్యులు కానివారు వెంటనే సభ్యత్వరుసుము పంపుతూ, వారు కూడా తమ కూపన్లను పంపవచ్చును. తుదినిర్ణయం సంపాదకులదే.*

1. ఇండియా అణుపరీక్ష మూలంగా యీ దేశం చిందులు త్రొక్కుతూంది__? (ఫ్రాన్స్, పాకిస్తాన్.)

2. దేశాభివృద్ధి వీరిపై ఆధారపడివుంది__? (కార్మికులు, కర్షకులు.)

3. ఇవికూడా నేరస్తులను పట్టుకొంటాయి__? (పోలీసు కుక్కలు, మరమనుషులు.)

4. ఇది సేవించటం నేడు వ్యాపనైంది?__ (సారాయి, గంజాయి.)

5. ఎండాకాలంలో ఇవెక్కువగా వుంటాయి__? (అగ్నిప్రమాదాలు, అలజడులు.)

"ఉహుఁ! నీ అభిప్రాయం తప్పు" రాజు అన్నాడు.

"ఎందుకు? ఎలాగ?"

"ఒకవేళ నువ్వు చెప్పిందే నిజమయితే. ఆ విమానం మన రక్షక దళం కంటబడకుండా రావటం అసాధ్యం. ఒక వేళ సముద్రం మీదనుండి వచ్చిందన్నా. అది దిగిన చోటు అంతా వృత్తాకారంగా మాడిపోవటానికి కారణం ఏమిటి? పైగా అదికొండ ప్రదేశం. విమానం పట్టేంత చోటు మాత్రమే వుంటుంది మహా అయితే! కాని రన్‌వే లేకుండా ఎలా దిగగలిగి వుంటుంది?"

"ఎందుకు వీలులేదు? రన్‌వే అవసరంలేకుండా ఏకంగా గాలిలో లేచి, గాలిలోనే స్ట్రెయిట్‌గా దిగే విమానాలను కనుక్కున్నారు గదా!"

"అలా అయితే మిగిలిన ప్రశ్నలకు జవాబు?"

రంగచారి మాట్లాడలేదు, "నేను కూడ ఆ ప్రదేశం చూస్తే బాగుంటుందేమో?"

"ఐతే పద! ఇప్పుడే వెళదాం. నీకు ఇతరమైన పనులు లేవా?"

"ఉహుఁ! ఈరోజు సెలవు. వెళదాం పద."

ఇద్దరూ కొండ దగ్గరకు చేరుకున్నారు. పైకి ఎక్కారు.

"ఇదే ఆ సర్కిల్" రాజు ఎదురుగా కన్పిస్తున్న సర్కిల్ వంక చూస్తూ అన్నాడు. రంగాచారి పరీక్షించటం మొదలు పెట్టాడు. క్రింద వంగుని మాడిపోయిన గడ్డిని తాకాడు. నల్లని బూడిద అంటుకుంది చేతికి.

"నువ్వు చెప్పింది నిజమే! ఐతే ఈ గడ్డి ఎందుకు మాడినట్టు."

"సైంటిస్ట్‌వి! ఆమాత్రం ఆలోచించ లేవా?"

రెండు నిమిషాల తరువాత అన్నాడు రంగాచారి

''బహుశా ఆ సాసర్ దీని మీదకి దిగడంతో ఘర్షణ వల్ల వేడి పుట్టి, మాడిపోయి ఉండవచ్చును.''

''అలా జరగదు. ఆ ఫ్లయింగ్ సాసర్ పైకి లేచేటప్పుడు అడుగున గల భాగాలనుండి రాకెట్‌లో మాదిరి మంటలు వచ్చుంటాయి.''

''నీది తప్పే!'' రంగాచారి అన్నాడు. ''మంటలు గనుక వస్తే ఈ చుట్టుప్రక్కల గడ్డి కూడా మాడి వుండాలి. కనీసం పొగ ఐనా తగలాలి. కాని ఇక్కడలా లేదుగా?''

రాజు తలూపాడు. ''నువ్వు చెప్పింది నిజమే! మరైతే ఎలా సంభవించిందిది?''

రంగాచారి అన్నాడు. ''నా ఊహ ప్రకారం నేను చెప్పిందే రైటై ఉండాలి. అది క్రిందికి దిగినప్పుడో, పైకి లేచినప్పుడో ఘర్షణ వల్ల వేడిపుట్టి ఉంటుంది. ఇక్కడ మరో విషయం గమనించాలి. రాకెట్ పైకి లేవాలంటే కొంత తోపిడిశక్తి క్రింది దిశగా పనిచేయాలి. అందువల్ల రాకెట్ అడుగు భాగాన మంటలు మండి, తద్వారా ఉత్పన్నమైన వాయుశక్తి సహాయంతో పైకి ప్రయాణిస్తాయి. కాని ఇక్కడ, ఈ ఫ్లయింగ్ సాసర్‌లో మంటలు మండే అవకాశం లేదు. అందువల్ల అడుగు భాగంనుండి డైరెక్టుగా వాయువులు ప్రవహించి, ఫ్లయింగ్ సాసర్‌ని పైకి లేపి ఉంటుంది.''

''ఎలా ఐనా సైంటిస్టువి! నువ్వు చెప్పిందే నిజమై ఉండొచ్చు'' రాజు అన్నాడు.

''ఐతే ఇప్పుడేమి చేద్దాం?'' రంగాచారి అడిగాడు రాజుని.

''నువ్వే చెప్పు ఏం చేయాలో!'' రాజు నవ్వుతూ అన్నాడు.

''మనం వెంటనే ఈ విషయాన్ని సైంటిస్టులకు తెలియపరచాలి.''

రాజు అయిష్టంగా తల వూపాడు. "ఉహూ! నా కిష్టం లేదు. నేను మరొకలాగా ఆలోచించాను."

"ఏమని?"

"మనమే ఇక్కడ రహస్యంగా కాపు వేద్దాం! ఆ సాసర్‌లో వింత జీవులున్నాయో, లేవో లేక మానవులే ఉన్నారో తెలుసుకుందాం. వీలైతే దానిలోకి ప్రవేశించాలి."

రాజు మాటలకు విస్తుపోయాడు రంగాచారి. అతని ధోరణి కలవర పెట్టింది. "రాజు! నువ్వు మతి సరిగా ఉండే మాట్లాడుతున్నావా?"

రాజు మాట్లాడలేదు.

రంగాచారి మౌనంగా కొండ దిగసాగాడు. రాజు అతన్ని అనుసరించాడు.

4

రాత్రి పదిగంటలు దాటింది.

కారుని కొండ దిగువగా ఆపాడు రాజు.

కారు దిగి చుట్టు ఒకసారి చూశాడు. దూరంగా పట్టణపు దీపాలు మినుకు మినుకుమంటూ కన్పిస్తున్నాయి.

జేబులోనుండి సిగరెట్ పాకెట్‌తీసి, ఒక సిగిరెట్‌ను నోట్లో ఉంచుకున్నాడు. పెట్టెను లోనపెట్టి, అగ్గిపెట్టెతో ముట్టించుకొని, ఒక దమ్ములాగి, డిక్కీవైపు నడిచాడు.

డిక్కీతెరిచి ఒక సూట్‌కేస్ చేతితోపట్టుకొని,కారుని లాక్ చేసి, కొండపైకి ఎక్కసాగాడు టార్చ్‌లైట్ సహాయంతో.

ఫ్లయింగ్ సాసర్ దిగిన ప్రదేశం చేరుకున్నాడు. కొంచం దూరంలో ఒక పొదమాటున కూర్చొని, మరొక సిగిరెట్ ముట్టించాడు.

టైము గడిచిపోతోంది. కాని, ఫ్లైయింగ్ సాసర్

రాలేదు. నాలుగైదు పెట్టెల సిగరెట్లు అయిపోయాయి.

మరొక గంట గడిచింది. విసుగ్గా టైము చూసుకున్నాడు రాజు. రాత్రి రెండున్నర గంటలు దాటింది.

'అసలు దివాకర్ చెప్పింది నిజమేనా?' అనుకున్నాడు రాజు. కాని మరుక్షణం తనకి తానే సమాధాన పరుచుకున్నాడు. ఫ్లయింగ్ సాసర్ కోసం ఆశతో ఎదురుచూడ సాగాడు. కాని అతని ఆశ ఫలించలేదు.

తూర్పున వెలుగురేఖలు విచ్చుకుంటున్నాయి.

రాత్రంతా నిద్రలేక పోవటంవలన కళ్లు మండుతున్నాయి రాజుకి. సమయం ఉదయం అయిదున్నర గంటలు కావొచ్చింది. లాభం లేదనుకున్నాడు.

కొండ దిగి, సూట్ కేస్‌ను డిక్కీలో పెట్టి తాళం వేశాడు. కారెక్కి టౌను దిశగా బయలుదేరాడు.

5

సుమారు వారం రోజులు గడిచాయి.

ప్రతిరోజు రాత్రి పదిగంటలకువెళ్ళి ఫ్లయింగ్ సాసర్ కోసం కాపు వెయ్యటం, అది రాకపోవటం, ఉదయం తిరిగి రావటం రాజు దినచర్యగా పరిణమించింది. కాని అతనిలో పట్టుదల ఎక్కువైపోయింది.

ఇలా ఉండగా ఎనిమిదో రోజున.

ఎప్పటిలా పదిగంటలకు బయలుదేరి, కొండపైకి చేరాడు రాజు. సుమారు పదకొండున్నర అయింది. ప్రతిరోజు ఇలా జరగటంవలన, అతనికి నిద్రలేమి అలవాటైపోయింది. సిగిరెట్టుతీసి ముట్టించాడు. కాని అతనిచెవులు ఏదో వింత శబ్దాన్ని పసిగట్టాయి.

చెవులు రిక్కించి విన్నాడు. సందేహంలేదు. అదే!

ఫ్లయింగ్ సాసర్ శబ్దమే! సిగిరెట్ క్రింద పడవేసి, తలెత్తి పైకి చూశాడు.

దూరంగా, ఆకాశంలో తళతళమెరుస్తూ ఫ్లయింగ్‌సాసర్ మెల్లగా వస్తూంది. ఒక సాసర్‌పై, మరోసాసర్‌ను బోర్లిస్తే ఏ ఆకారంవస్తుందో, అచ్చం అదే ఆకారంలో ఉంది.

రాజు వెంటనే సూట్‌కేస్ తెరిచి, బైనాక్యులర్‌తీసి, దానిని చూడటం మొదలెట్టాడు.

ఆ ఫ్లయింగ్ సాసర్‌కు మధ్యలో- అంటే రెండు సాసర్‌లు కలిసేచోట, కిటికీలు ఉన్నాయి. తెల్లగా పింగాణీతో చేసినట్టుంది. రివ్వున దూసుకువస్తోంది భూమివైపు.

సుమారుగా భూమినుండి వెయ్యిమైళ్ళ ఎత్తులో అది ఉండవచ్చు. చాలా స్పీడ్‌గా వస్తూంది.

రాజు నిర్ఘాంతపోయాడు.

మామూలుగా ఆ స్పీడ్‌లో భూవాతావరణంలోనికి ప్రవేశిస్తే ఏ వస్తువైనా ఘర్షణవల్ల మాడి మసి అయిపోతుంది. కాని దీనికి అటువంటి కవచంఉన్నట్లు కన్పించటంలేదు. అయినా రాజు తొందరపడి ఏనిర్ణయం చేసుకొనలేదు.

అది భూమిని సమీపించసాగింది.

రాజు సర్దుకొని కూర్చున్నాడు. ఫ్లయింగ్ సాసర్ మోత ఎక్కువైపోతోందంతకంతకు. చెవులు చిల్లులుపడేలా ఉందా శబ్దం.

ఇంత శబ్దం విన్పిస్తున్నా ఎవ్వరూ దానిని గమనించకపోవటం రాజుకి ఆశ్చర్యం గొలిపింది.

భూమిని సమీపించేకొలది, ఫ్లైయింగ్ సాసర్ వేగం క్రమంగా తగ్గిపోసాగింది. మెల్లగా వచ్చి, పక్షి క్రిందకు వాలినట్లు, అక్కడ వున్న సర్కిల్‌లో దిగింది.

రాజు కళ్ళార్పకుండా దానినే చూడసాగాడు. సుమారు ఐదువందల అడుగుల ఎత్తు ఉంటుందది. తెల్లని పాల రంగు, కిటికీలకు అద్దాలున్నాయి. లోపల ఏదో కాంతి కన్పిస్తూంది.

ఇంతలో సాసర్ అడుగుభాగంలో, కొద్దిగా వాలుగా వున్న భాగం, కొంత చప్పుడుచేస్తూ తొలిగింది ప్రక్కకు. లోపలినుండి మెట్లవంటి పలకలు వచ్చాయి బయటకు.

రాజు శ్వాసించడంకూడ మరిచిపోయినట్లు దానివంకే చూడసాగాడు.

ఎవరో వస్తున్నట్లు రెండు ఆకారాల నీడలు నేలపై బడ్డాయి. రాజు ఉత్సాహంగా చూడసాగాడు.

రెండు ఆకారాలు క్రిందకు దిగాయి. వాటిని చూసి రాజు అదిరిపడ్డాడు.

అవి సుమారు ఏడడుగుల ఎత్తు వుంటాయి. మానవులకు మాదిరిగానే మొండెము, తల, కాళ్ళు, చేతులు వున్నాయి. కానయితే తలమీద జుట్టులేదు. శరీరం అంతా రోమాలతో నిండి వుంది. చూడగానే చింపాంజీ గుర్తుకు వచ్చింది రాజుకి. చెవులుమాత్రం చాలా పెద్దవి. కాళ్ళకు వేళ్ళు లేవు. చేతికి ఆరు వేళ్ళున్నాయి. తల భాగంలో రెండు కళ్ళు, అగ్నిలా మెరుస్తున్నాయి. ముక్కు లోపలికి పోయివుంది. నోటినుండి రెండు కోరలవంటి దంత నిర్మాణం బయటకు పొడుచుకువచ్చింది.

ఆ రెండు జీవులు కదిలి, రాజు వున్న పొదవైపుకే నడవసాగాయి.

రాజుకు గుండె ఆగినంత పనైంది. అవి తనని గమనించాయని గ్రహించాడతను.

అవి దగ్గరకొచ్చి నిలబడ్డాయి. ఐనా గాభరా పడకుండా, సూటిగా వాటి కళ్ల ల్లోకి చూశాడు రాజు.

అవి ఏదో శబ్దం చేశాయి వింతగా. ఆ శబ్దం పై నుండి పడే జలపాతం హోరులా వుంది. అవి ఏదో సంజ్ఞలు చేస్తున్నాయని భావించాడు రాజు. కాని అదేమిటో అర్థం కాలేదు.

ఇంతలో ఒక ఆకారం అతని ముందుకు ఒక అడుగు వేసి, తోసింది. ఒళ్ళు జలదరించింది రాజుకి. వాటి చేతులు చాల వేడిగా వున్నాయి.

వాటి ఉద్దేశ్యం అర్థమయింది రాజుకి. సూట్ కేస్ తీసు కొని నిలుచున్నాడు. అవి రెండు ఒకడుగు వెనక్కు వేశాయి.

రాజు ఫ్లయింగ్ సాసర్ దిశగా అడుగులు వేశాడు.

అతని మదిలో అనేక ఆలోచనలు సుళ్లు తిరుగు తున్నాయి. ఆ జీవులు భూగ్రహానికి ఎందుకు వచ్చాయో, అతనికి అర్థం కాకుండా వుంది. అసలా జీవులు ఇక్కడి కెలా వచ్చాయి? ఎందుకు వచ్చాయి?

రాజు ఫ్లయింగ్ సాసర్ దిశగా అడుగులు వేయటం చూసి, ఆ రెండు జీవులు వెంట నడిచాయి. వెలుతురులోనికి రాగానే రాజు మరొక విషయం గమనించాడు. వాటికి సుమారు అడుగు పొడవుగల తోకలు ఉన్నాయి.

వాళ్ళు లోనికి రాగానే తలుపు మూసుకుపోయింది. రాజు చుట్టూ చూస్తూ ఆలోచిస్తూ నిలబడ్డాడు. ఇంతలో సాసర్ పైకి లేవటానికిగాను, చిన్నగా కదిలింది. తూలి క్రింద పడ్డాడు రాజు.

ఫ్లయింగ్ సాసర్ మెల్లిగా గాలిలోకి లేచింది. క్రమ

క్రమంగా వేగాన్ని పుంజుకుంటూ, అంతరిక్షంలోకి దూసుకు పోసాగింది.

6

కళ్లు తెరిచి చూశాడు రాజు. తలంతా దిమ్ముగా వుంది. తనెక్కడున్నాడో తెలుసుకోవటానికి ప్రయత్నించాడు.

క్రమంగా జరిగిన విషయాలు ఒకటొకటే గుర్తుకు వచ్చాయి రాజుకి. ఫ్లయింగ్ సాసర్ పైకి లేవగానే తాను తూలి క్రింద పడ్డాడు. తలకి దెబ్బ తగిలటం వలన స్పృహ పోయింది.

తల త్రిప్పి అటు ఇటు చూశాడు. తనొక బెడ్‌మీద ఉన్నట్లు తెలుసుకున్నాడు. అది చాలా మెత్తగా వుంది.

కొద్దిసేపు కళ్లు మూసుకునే వుండిపోయాడు.

"అమ్మయ్య! లేచారన్నమాట! ముందీ కాఫీ తాగండి!"

ఉలిక్కిపడి కళ్ళుతెరిచి చూశాడు రాజు.

కొంపదీసి తను కలగన్నాడా ఏమిటి? లేకపోతే మాన వులు సంచరించని దీనిలో మానవ భాష, అందులోను 'తీయ తెలుగు భాష'లో తనని పల్కరించడమేమిటి?

కళ్లు తెరిచి చూసిన రాజుకి, ఎదురుగా ఒక యువకుడు నవ్వుతూ నిలబడి వుండటం కన్పించింది.

తనకంటే పదేళ్ళు చిన్నవాడయి వుండవచ్చు. సుమారు పాతికేళ్ళు వుంటాయి అతనికి. తెల్లటి డ్రస్ ధరించి వున్నాడు. ఫుల్‌హేండ్స్ షర్ట్, పాయింటెడ్ షూస్ అత నొక ధనవంతుడని చెబుతున్నాయి.

"మీరు...? మీరిక్కడికెలా వచ్చారు?" రాజు ఆశ్చ ర్యంగా ప్రశ్నించాడు.

"నేనూ మీలాగానే ఇక్కడికి వచ్చాను. మన విషయం

తరువాత మాట్లాడుకోవచ్చు. ముందీ కాఫీ తాగండి'' రాజు ఎదుట ఒక కప్ వుంచాడు.

రాజు మారు మాట్లాడకుండా దానిని తాగేశాడు. అద్భుతంగా, కాఫీకంటే రుచిగా ఉందది. దానిని ఎప్పుడయినా, ఎక్కడయినా తాగినట్లు రాజుకి జ్ఞాపకం లేదు.

''ఇది చాల అద్భుతంగా వుంది. ఎలా తయారు చేశారు?''

ఆ యువకుడు మంచంమీద కూర్చున్నాడు ''అబ్బే! ఇది మన కాఫీ కాదండీ. ఈ సాసర్‌లోని జీవులు, అదే కోతులని పిలుస్తాను నేను, తయారుచేసి, మనకోసం పంపాయి. నేను మన భాషలో కాఫీ అని పేరు పెట్టాను.''

''మీ పేరేమిటి?'' రాజు అడిగాడు.

''చూడండి! మీరు నాకంటె పెద్దవారులా వున్నారు. దయచేసి మీరు, గారు అని పిలవకండి, నేనూ ఇంకనుంచి మిమ్మల్ని ఏకవచనంలోనే సంబోధిస్తాను.''

''ఓ. కె! నాపేరు రాజు!'' అని రాజు తన వృత్తాంతమంతా చెప్పాడు.

ఆ యువకుడు నవ్వి అన్నాడు. ''నేనూ మీలాగే సైన్స్ ఫిక్షన్ లంటే చెవి కోసుకుంటాను. ప్రస్తుతం ఎమ్మెస్సీ చదువుతున్నాను. ఇంతకీ నా పేరు చెప్పనే లేదు. నా పేరు ఆనంద్.''

''అది సరే! మీకీ సారీ! నీకీ ఫ్లయింగ్ సాసర్ విషయం ఎలా తెలిసింది?'' రాజు అతనిని అడిగాడు.

''మా లెక్చరర్ ఈ విషయం చెప్పారు మాతో! కాని ఎవ్వరూ నమ్మలేదు. మొదట్లో నేను కూడా నమ్మలేదు. అయినా చూద్దామని కొండ ఎక్కి చూశాను. వారు చెప్పింది నిజమని తెలుసుకున్నాను."

అలా జరిగితే తను ఊహించినదంతా కలలాగే మిగిలి పోతుంది.

ఈ విషయంలో ఇతరుల జోక్యం తను సహించలేడు.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?"

ఆనంద్ ప్రశ్నతో ఊహాలోకంలోంచి బయటపడ్డాడు రాజు. "అబ్బే! ఏం లేదు."

"ఇంటిదగ్గర భార్యా పిల్లల కోసమా?"

"నో, నో! నాకింకా పెళ్ళి కాలేదు. పెళ్లి చేసుకోవాలన్న ఆసక్తి కూడ లేదు" నిర్లిప్తంగా అన్నాడు రాజు.

"అదృష్టవంతులు! అన్నట్టు ఇప్పుడు మనమేమి చేద్దాం?"

"ఏముంది? ఈ జీవులతోపాటు, వాటి లోకానికిపోయి, అక్కడి వింతలు, విడ్డూరాలు చూసి, వీలుంటే తిరిగివద్దాం లేకపోదే చద్దాం!"

అతను మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తున్నాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నావు? చావు అనగానే భయం పుట్టిందా?"

"నో! నో! నాకు చావంటే భయంలేదు. కాని ఇందాక తిరిగొద్దాం. అన్నావు గదూ? ఎలా తిరిగొద్దాం అని ఆలోచిస్తున్నాను."

ఇంతలో ఆ గదంతా ఎర్రగా అయిపోయింది. ఫ్లయింగ్ సాసర్ వేగం తగ్గుతున్నట్లు అన్పించింది. ఇద్దరు మంచం మీద పడుకొని చూస్తూండి పోయారు.

కొద్దిసేపు తరువాత, సాసర్ క్రిందికి దిగినట్టు కుదుపు కలిగింది. ఇద్దరూ అలానే చూస్తూండిపోయారు.

7

తలుపు తెరుచుకున్న చప్పుడయి తల తిప్పి చూశారు

రాజు, ఆనంద్ లు.

రెండు కోతులు ద్వారం దగ్గర నిలబడి, వారిని రమ్మ న్నట్టుగా సైగలు చేస్తున్నాయి.

ఇద్దరు లేచి, బయటకు నడిచారు.

బయట గచ్చుతో చేయబడిన వరండా వుంది. ఆరడు గుల వెడల్పుతో పైభాగం అర్థవృత్తాకారంతో కప్పబడి, సొరంగంలా వుందా మార్గం. నేలమీద, పైన ఉన్న డోమ్ మీద చిత్రమైన డిజైనులు గీయబడి వున్నాయి. రాజు, ఆనంద్ ముందుకు నడిచారు.

కొంతదూరం పోయాక ఒక తలుపు తెరుచుకుంది. అప్ప టికిగాని తానెక్కడున్నది రాజుకు అర్థంకాలేదు.

వారున్న గది ఫ్లయింగ్ సాసర్ పైభాగంలో వుంది. అక్కడనుండి వృత్తాకారంగా, క్రమంగా దిగేమార్గం వుంది.

తలుపు తెరుచుకోగానే, లోపలికి నడిచారు.

అదొక పెద్ద హాలు. రకరకాలయిన మిషన్లు, కంప్యూ టర్లు మొదలయినవి ఉన్నాయక్కడ. ప్రతి మిషన్ ముందు ఒక్కొక్క కోతి కూర్చొని వుంది. రాజు వాటినిచూసి నిర్ఘాంతపోయాడు.

మానవుడు ఎంతకాలం నుంచో గాని శ్రమపడితే, కొద్దిగా విజ్ఞానం డెవలప్ ఐంది. ఐనా అతనికి తెలియని విషయాలు కోటాను కోట్లున్నాయి. మానవుడితో పోలిస్తే ఆ వింత జీవులు వైజ్ఞానికంగా చాలా ప్రగతి పథంలో ఉన్నట్లు స్పష్ట మవుతూవుంది.

ఆనంద్ అవేమీ గమనించలేదు. హాలు ఈ చివరి నుండి ఆ కోతులను అనుసరిస్తూ, ఆ చివరకు నడిచాడు. రాజు

కూడా అనుసరించాడు.

హాలు ఆ చివర మరొక తలుపు తెరుచుకుంది. అక్కడొక చిన్నగది వృత్తాకారంలో ఉంది. అక్కడినుండి మరొక తలుపు తెరుచుకొని బయటకు నడిచారు.

అక్కడి దృశ్యం రాజు, ఆనంద్‌లను విభ్రాంతుల్ని చేసింది. పెద్ద భూగృహం లాగుందా హాలు. బహుశా అది ఆ గ్రహం అంతర్భాగం అయి ఉండవచ్చును. గోడలు నున్నగా ఉన్నాయి. నేలమీద అక్కడక్కడ కొన్ని తలుపులున్నాయి. వాటిని తెరుచుకొని కొన్ని జీవులు బయటకు వస్తున్నాయి. కొన్ని లోనికి పోతున్నాయి.

ఇంతలో ఆ రెండు జీవులు రాజు, ఆనంద్‌లను కదలమన్నట్టుగా వెనక్కు వచ్చి, ముందుకు తోశాయి.

రాజు కాక్షణంలో అర్థమైంది, వాటి చేతులంతా వేడిగా ఎందుకున్నాయో! ఆ జీవులు ఎప్పుడూ ఈ గ్రహం అడుగు భాగాన నివశిస్తాయి. అంటే గ్రహం పై భాగంలో ఉపరితలం మీద విపరీతమైన చల్లదనం ఉండి ఉండాలి. అంటే మంచు కురియాలి. అంటే గాలి, నీరు ఈ గ్రహంమీద ఉన్నాయన్న మాట.

సూర్యుడికి చాలా దూరంలో, భూమికంటె దూరంలో ఈ గ్రహం ఉండి ఉండవచ్చు. ఇదంతా చూస్తూంటే, భూవాతావరణ పరిస్థితులు గల గ్రహాలు ఉండకపోవన్న సిద్ధాంతం రైటే ననిపించింది రాజుకు.

ఆలోచనలనుండి తేరుకొని, ముందుకు నడిచాడు రాజు. ఆ రెండు జీవులు ఒక తలుపు తెరిచి, దిగమన్నట్టుగా వారి వంక చూశాయి. ఇద్దరు దానికి అమర్చబడి ఉన్న మెట్ల ద్వారా క్రిందకు దిగారు.

అక్కడొక పట్నం వంటిది ఉంది. చిన్న చిన్న రహదారులు, ఎత్తైన ఇళ్లు కన్పిస్తున్నాయి. పైనున్న హాలుక్రింద ఇంతటి పట్టణం ఉంటుందని భావించనైనా లేదు వారు. అక్కడి దృశ్యం చూసి అవాక్కయి పోయారు.

అనేక వింత వింత మిషన్లు రహదారుల మీద తిరుగుతున్నాయి. రాజుకి భూమి మీద టాక్సీలు గుర్తుకు వచ్చాయి. చిన్నగా నవ్వుకున్నాడు. అక్కడికి, ఇక్కడికి ఎంత తేడా? అక్కడంత రద్ది, ధ్వని ఇక్కడ లేదు. సాఫీగా, తాముతప్ప మరెవరూ లేనట్టుగా తిరుగుతున్నాయా "టాక్సీలు." అంతా కంప్యూటర్ల మయంలా ఉంది.

రాజు తల తిరిగిపోయింది. వైజ్ఞానికంగా ఆ కోతులు సాధించిన ప్రగతి అతడ్ని ఆశ్చర్యచకితుణ్ని చేసింది.

రాజు, ఆనంద్‌లను ఒక చిన్నగృహంలోఉంచి బంధించారు. అది సుమారు ఎనిమిదడుగుల ఎత్తు, నాలుగడుగుల వెడల్పు ఉంటుంది. ఆరడుగుల పొడవుఉంది. గది మధ్యలో నేలమీద చిన్నగుంట ఉంది. దానిలో నిప్పులున్నాయి. వాటి నుండి వెచ్చదనం గదంతా వ్యాపిస్తూంది.

"ఇవన్నీ చూస్తూంటే మనకంటే సాంకేతికంగా అభివృద్ధి సాధించారనిపిస్తోంది" రాజు నిప్పులవంక చూస్తూ అన్నాడు.

"అవును. మనకంటే ముందున్నారు. అన్నట్లు ఈ గ్రహం మనభూమిని పోలిఉందే! గాలి కూడా ఉంది" ఆనంద్ సెగ కాచుకుంటూ అన్నాడు.

"అవును. మనం ఆక్సిజన్ లేనిదే బ్రతకలేము. మనమిక్కడ మామూలుగానే ఉన్నామంటే తప్పకుండా ఆక్సిజన్ ఉండితీరాలి. ప్రకృతి సిద్ధమైన గాలి లేకపోయినా, ఈ

జీవులు యిలాంటి ఏర్పాటుచేసుకొని ఉంటాయి.''

''ఏనాడైనా ఎవరైనా యిలా అనుకున్నారా?''

''ఏమని!''

''భూమిమీద తప్ప, మరో గ్రహంమీద జీవసృష్టి ఉందని. అయినా ఈ కోతుల్ని చూస్తుంటే, ఇవి మానవ జాతికంటే చాలాకాలం తరవాత సృష్టించబడ్డాయి అని పిస్తోంది.''

''ఎలా?''

''నీకు డార్విన్ సిద్ధాంతం తెలుసునా?''

''చెప్పు.''

''డార్విన్ అనే శాస్త్రజ్ఞుడు మన మానవప్రపంచం ఒక్క సారిగా, యిప్పుడున్నట్టు సృష్టించబడలేదని వివరించాడు. అంటే గుర్రానికి గుర్రం, చేపకు చేప, మానవుడికి మాన వుడు మొదలైనవి పుట్టలేదు. మొదట సముద్రంలో జీవ సృష్టికి అంకురార్పణ జరిగింది. ఎలా జరిగిన దన్నది యిప్పటికీ వివాదగ్రస్తంగానే ఉన్నది. అది తరవాత సంగతి

''సముద్రంలో జీవసృష్టి మొదటిసారిగా జరిగినపుడు జన్మించిన జీవులు కంటికి కనపడని వైరస్, అమీబా లాంటి 'ఏకకణజీవులు' అంటే వాటిలో ఒకే కణం ఉంటుంది. అవి తరువాత పరిణామంచెంది బహుకణజీవు లుగా మారాయి. వాటినుండే చేపలు, తిమింగిలాలు మొద లైనవి పుట్టాయి, అంటే ఒక్కసారిగా కాదు. ఇవి మార్పు చెందడానికి కొన్నికోట్ల సంవత్సరాలు పట్టింది.

''కొంతకాలం తరువాత, సముద్రంలోని కొన్ని జీవ జాతులు చోటు దొరకక కానియ్యి, ఆహారం దొరకక కానియ్యి, రక్షణకోసం కానియ్యి, మొత్తానికెలాగైతేనేం

భూమిమీద మనుగడ ప్రారంభించి, సాగించాయి. అలా కొంతకాలం జరిగాక భూమిపై జీవనానికి అనుగుణంగా వాటిలోని అంగాలు మార్పు చెందాయి.

"క్రమంగా వాటిలోకూడ జాతులు ఏర్పడ్డాయి. సరీసృపాలు, క్షీరదాలు మొదలైన జాతులు ఏర్పడ్డాయి. క్షీరదాలలో జీవులు తమ పిల్లలకు పాలిచ్చి పెంచుతాయన్న మాట! ఇలాగ జీవిస్తున్న జీవులలో కొన్ని కోతులుగా పరిణమించాయి. అవి క్రమంగా పరిణామం చెంది ఆటవిక మానవునిగా మారాయి. తరువాత అతడు అభివృద్ధి చెంది ఆధునిక మానవుడిగా విలసిల్లాడు.

"ఇంత కథ జరగటానికి కొన్ని కోట్ల సంవత్సరాలు పట్టాయి. ప్రస్తుత మానవుడు కోతులనుంచి రూపొందడానికి సుమారు లక్ష సంవత్సరాలు పట్టిందని అంచనా. అంటే మానవుడుగా మారటానికి ముందు అతడు కోతి. ఈ జీవులుకూడా కోతివంటి రూపాలను పోలి వున్నాయని మరవకు."

"చాలా పెద్ద ఉపన్యాసం ఇచ్చావు. మానవుడు పూర్వకాలంలో కోతి అనటానికి నిదర్శనాలు ఏమిటి?"

రాజు అనుమానంగా అతనివంక చూశాడు. 'తను యమ్మెస్సీ చదువుతున్నా నంటున్నాడు. మరి ఇటువంటి విషయాలు తెలియకుండా వుంటుందా?'

"స్త్రీ గర్భంలో పెరిగే పిండాన్ని పరీక్షించి చూశారు. నడుము వెనుకాల తోకలా పెరిగే భాగం ఉన్నట్లు గమనించారు. కాని మన కది అవసరంలేదు కనుక పూర్తిగా పెరగదు. ఐనా నీకీ అనుమానం ఎందుకు వచ్చింది?" అతని కళ్ళల్లోకి చూస్తూ రాజు అన్నాడు.

"అహః! ఈ జీవులు చూస్తుంటే వైజ్ఞానికంగా చాలా ముందున్నట్లు తెలుస్తోంది కదా? కాని మానవుడు ఇలా ఉన్నప్పుడు ఎలా ఉండేవాడో నీకు తెలుసు కదా?"

"నీ పాయింట్ అర్థమయింది. ఈ జీవులు ఇప్పుడే ఇలా వున్నాయి. మానవుడెందుకు డెవలప్ కాలేదనేగా నీ ప్రశ్న? దీనికి కారణాలు తెలియవు. బహుశా మానవుడు పుట్టి, పెరిగిన పరిస్థితులు, అతని మెదడు, తెలివితేటలు కావచ్చు."

"సరే! ఆ సంగతి అలా వదిలేయి. మన మిక్కడి నుండెలా తప్పించుకోవాలి?" ఆనంద్, రాజుతో అన్నాడు.

రాజుకి వెంటనే తన సూట్‌కేస్‌ను ఫ్లయింగ్ సాసర్ లోనే మర్చిపోయినట్లు గుర్తుకొచ్చింది. తనని తానే తిట్టుకున్నాడు. దానిలో కెమెరాలు, టేప్ రికార్డర్స్ మొదలైనవి ఉన్నాయి.

"ముందివి మనల్ని ఏం చేస్తాయో చూడని!" అన్నాడు రాజు.

"ఇంకేం చేస్తాయి? చంపేస్తాయి."

"ఉహుఁ! చంపేవైతే ఎప్పుడో చంపేయాలి. కాని వీటి ఆలోచన ఏమిటో తెలియటం లేదు."

"అబ్బ! ఆకలేస్తోంది" ఆనంద్ అన్నాడు. రాజు కూడా గ్రహించాడు, మాటల సందడిలో పడి. కడుపు చేసే గోలని తాను మరచినట్లు.

ఇద్దరు తలుపు దగ్గరకు నడిచి బాదారు. కాని అది తెరుచుకోలేదు. "లాభం లేదు! ఇది ఆటోమాటిక్ డోర్‌లా ఉంది" ఆనంద్ నిస్పృహగా అన్నాడు.

వెనక్కి తిరిగి తలుపు కానుకొని, నుంచున్నాడు. అతని

దృష్టి ఎదురుగా ఉన్న గోడపై బడింది. అక్కడొక చిన్న స్విచ్ కన్పించింది.

చటుక్కున దానిదగ్గర తిరిగి, నొక్కాడు దానిని. వెంటనే చిన్న తలుపు ఒకటి, గోడలో ప్రక్కకు తొలిగింది. రెండు పళ్ళాల నిండుగా ఏదో పచ్చని కూరలతో చేసినటువంటి పదార్థం కన్పించింది. ప్రక్కనే రెండు గ్లాసుల వంటి వానితో. "కాఫీ" వంటి ద్రవం కన్పించింది.

ఇద్దరూ శుభ్రంగా తినేసి, దానిని తాగారు. నేలమీదే చేతులు పెట్టుకొని పడుకున్నారు. కొద్ది క్షణాల్లోనే గాఢనిద్ర ఆవరించింది.

8

ఉలిక్కిపడి లేచాడు రాజు.

ఆ గది నిండా పచ్చని పొగ అలుముకొని ఉంది. తలుపులు తెరుచుకొని ఉన్నాయి. బయట ఏవేవో చప్పుళ్ల విన్పిస్తున్నాయి.

ఆనంద్‌ను తట్టి లేపాడు. ఇద్దరు బయటకు పరుగెత్తారు.

బయట దృశ్యం చాలా హృదయవిదారకంగా ఉంది. చాలా కోతులు క్రింద పడి గిలగిలా కొట్టుకుంటున్నాయి. కొన్ని చలనం లేకుండా పడి ఉన్నాయి. మరికొన్ని కంగారుగా అటూ ఇటూ పరుగెత్తు తున్నాయి.

ఆనంద్, రాజులకు అవి ఎందుకలా పరుగెత్తుతున్నాయో అర్థం కాలేదు.

"బహుశా ఏదైనా దండయాత్రేమో?" రాజు గొణుక్కున్నట్లు అన్నాడు.

"దండయాత్రా? వీటి మీదికి ఎవరు దండెత్తి ఉంటారు?" ఆశ్చర్యపోతూ అన్నాడు ఆనంద్.

"వీటికి శత్రువులుండి ఉండవచ్చు? వీనిలో వీనికే పోట్లాట రావచ్చు. ఐనా మన మిక్కడ, ఈ పరిస్థితులలో ఉండటం క్షేమం కాదు. వెంటనే తప్పించుకోవాలి."

"ఎక్కడికి?"

"ఇంకెక్కడికి! ఆ ఫ్లయింగ్ సాసర్ చేరుకొని, మన భూమిని చేరటానికి ప్రయత్నిద్దాం."

రాజు, ఆనంద్‌లు తామువచ్చిన దిశగా పరుగెత్తారు. వీరిద్దరు ఇలా పారిపోవటం కొన్నిజీవులు చూచి, వెంట పడ్డాయి.

రాజు, ఆనంద్ తమశక్తికొలది పరుగెత్తసాగారు. పరుగెత్తుతూనే అరిచాడు రాజు. "ఆనంద్! మనం వీటికి చిక్క గూడదు. చూస్తే మనల్ని చంపేటట్లుగా ఉన్నాయ్ త్వరగా పరుగెత్తు!"

అయితే వారిలో శక్తి సన్నగిలింది. వేగం తగ్గింది. రాజుకేం చేయాలో పాలుపోలేదు. ఆ జీవులు దగ్గర కాసాగాయి.

ఇంతలో అతనిదృష్టి, రోడ్ ప్రక్కఉన్న ఒక ఇనుప రాడ్ పై పడింది. మెరుపులాంటి ఆలోచనవచ్చింది రాజుకి. చటుక్కున దానిని పట్టుకొని లాగాడు. వెంటనే వారి పైభాగంలో ఉన్న ఒక తలుపు తెరుచుకొంది.

రాజు నిర్ఘాంతపోయి, బలం కొద్ది దానిని లాగాడు. కాని రాలేదు. అప్పటికి అర్థమైంది రాజుకి. అది తలుపు తెరవ డానికి ఉపయోగించే స్విచ్ అని. రాడ్‌ని వదిలేసి, మెట్ల మీదుగా పైకిచేరాడు. ఆనంద్ కూడ అతనిని అనుసరించాడు.

ఆ జీవులు కూడా మెట్లెక్కి పైకి రాసాగాయి.

సరిగ్గా పైకి రానిచ్చి, చటుక్కున తలుపు ముందుకు

తోసి, బలం కొద్ది అదిమాడు ఆనంద్. కీచుమంటూ అరిచాయి అవి.

ఇద్దరు తలుపులు తెరుచుకుని, మూస్తూ ఫ్లయింగ్ సాసర్ ఉన్న గదిలోనికి ప్రవేశించారు.

కంట్రోలు రూం లోనికి ప్రవేశించారు. ఐతే ఆ కంప్యూటర్ల క్రింద ఉన్న భాష వారికి అర్ధం కాలేదు. అన్ని స్విచ్‌లు వరసగా నొక్కుకుంటూపోయారు. ఇంతలో ఫ్లయింగ్ సాసర్ కదిలిన చప్పుడైంది.

ఐతే రాజుదృష్టి ఒక కంప్యూటర్‌పై నిలిచింది. దాని మీద టెలివిజన్ స్క్రీన్ ఉంది. దానిపైన గ్రహాలు వాటి కింద వాటిపేర్లు కాబోలు వ్రాయబడిఉన్నాయి. ఫ్లయింగ్ సాసర్ ఉనికికి నిదర్శనంగా ఆ గ్రహాలమధ్య ఒకచోట చిన్న చుక్కవంటి బల్బు వెలుగుతూ, ఆరిపోతూ ఉంది.

"బాప్‌రే! మన మెక్కడున్నామో తెలుసా?" ఆశ్చర్యంగా అన్నాడు రాజు. కంప్యూటర్ వంకచూస్తూ.

"ఎక్కడ?"

"అంగారకగ్రహానికి, గురుగ్రహానికి మధ్య ఉన్నాము."

"అంటే?"

"మన సూర్య కుటుంబంలో తొమ్మిదిగ్రహాలు ఉన్నాయి కదా?"

"అవును. వరస ఏదో తెలియదు కాని తొమ్మిది ఉన్నాయి."

"నే చెబుతాను విను! సూర్యుని తరువాత బుధుడు, తరువాతి వలయంలో శుక్రుడు తరువాత భూమి, తరువాత వరుసగా అంగారకుడు, గురుడు, శని, యురేనస్, నెప్ట్యూన్, ప్లూటో. అంటే నా ఊహ కరెక్ట్."

"ఏమిటది?"

"ఈ జీవులు తిరుగాడే గ్రహం అంగారక గ్రహానికి, గురుగ్రహానికి మధ్యలో వుంది. అంటే విపరీతమయిన చలి. సూర్యరశ్మి సరిగ్గాపడదు. అంగారకుడి మీద జీవులు వున్నాయని నమ్మి, అనేకమంది శాస్త్రజ్ఞులు పరిశోధించారు. కాని జీవసృష్టికి అనువైన పరిస్థితులు లేవని గమనించారు."

"మరి ఇదెలా సంభవమయింది?"

రాజు మాట్లాడలేదు వెంటనే. కొద్దిసేపు తరువాత అతనే అన్నాడు. "బహుశా ఈ గ్రహం ఈ జీవుల అధీనంలోనే వుంటుందనుకుంటా. దారితప్పో, లేక కావాలనో ఇవి మన గ్రహ కుటుంబాలలోనికి ప్రవేశించి వుంటాయి."

"అలా ఎందుకనుకోవాలి? మన శాస్త్రజ్ఞులు ఈ చిన్న గ్రహాన్ని గమనించి ఉండకపోవచ్చు. పైగా ఇవి లోన ఉన్నాయి కాబట్టి, గమనించే అవకాశం లేదు."

"అయుండొచ్చు" రాజు ఆలోచిస్తూ అన్నాడు.

ఇంతలో ఆ కంప్యూటర్ ప్రక్కనేగల మరొక స్క్రీన్‌పై ఒక పెద్ద గ్రహం స్పష్టంగా కన్పించసాగింది. రాజు ఇండికేటర్‌లోనికి చూశాడు. ఆ ఫ్లయింగ్ సాసర్ గురుగ్రహాన్ని సమీపిస్తోంది.

"చూశావా వీళ్ల విజ్ఞానం? మనం సమీపించబోయే గురుగ్రహం స్పష్టంగా కన్పించేటట్లు చేసుకున్నారు. అంటే భూమి దగ్గరకురాగానే మనము తేలిగ్గా గుర్తుపట్టవచ్చును" ఆనంద్ సంతోషంగా అన్నాడు.

అయితే రాజు మెదడు మరొక విషయాన్ని తీవ్రంగా ఆలోచిస్తూంది.

'ఈ ఫ్లయింగ్ సాసర్ విపరీతమయిన స్పీడ్‌తో పోతుంది. దానికి నిదర్శనం, కొద్ది గంటల్లోనే రెండుగ్రహాల మధ్య దూరంలో సగాన్ని దాటెయ్యడమే. అయినా తమ శరీరాల్లో మార్పు కలగక పోవటానికి కారణం ఏమిటి? సహజంగా ఇంత స్పీడుతో ప్రయాణిస్తే ప్రమాదం సంభవిస్తుంది. ఐనా ఇప్పుడీ గురుగ్రహ ఆకర్షణశక్తికి తాము లొంగుతామా?' అనుకున్నాడతను.

కాని అది గురుగ్రహాన్ని దాటింది. ఇక భయం లేదనుకున్నాడు రాజు.

సుమారు పదిగంటల తరువాత భూమిని సమీపించారు వారు. ఖండములన్నీ స్పష్టంగా అవుపిస్తున్నాయి. తాము నడపకపోయినా అది భూమివైపే ప్రయాణించడం రాజుకి ఆశ్చర్యాన్ని కలుగచేసింది.

ఇది ఆ జీవుల పనేనని గ్రహించాడు. ఆ ఫ్లయింగ్ సాసర్ భూమితో సంబంధం కలిగి వుంది. అక్కడికి తప్ప మరెక్కడికి ప్రయాణించదు.

"థాంక్ గాడ్! మనం భారతదేశంలోనే ప్రయాణించబోతున్నాం" ఆనందంగా అరిచాడు ఆనంద్.

"భారతదేశ మేమిటి? మనం ఎక్కడనుండి బయలుదేరామో అక్కడే దిగుతాము."

"నిజంగా?"

"అవును."

ఆ ఫ్లయింగ్ సాసర్ వేగం అంతకంతకు ఎక్కువ కాసాగింది. వారికేంచేయాలో పాలుపోలేదు. తమకి దాన్ని నడపటం రాదు. కనీసం ఆ భాష ఐనా రాదు. ఇప్పుడేం చేయాలి?

"మై గాడ్! ఇదేమిటి వేగం అంతకంతకు ఎక్కువవుతున్నట్లుగా ఉంది?" ఆనంద్ గాభరాగా అడిగాడు.

"అవును. మనం భూమ్యాకర్షణ పరిధిలోనికి ప్రవేశించాము."

"ఐతే ఇప్పుడెలా? పోనీ అన్ని స్విచ్‌లు ఆఫ్ చేస్తే?"

"ఇప్పుడలా చేసినా, చెయ్యకపోయినా ఒకటే. ఇది భూమిని గ్రుద్దుకోవడం ఖాయం. అందువలన మనం తప్పించుకుంటానికి ఇతర మార్గాలు అన్వేషించాలి."

"పోనీ! భూమికి సాధ్యమైనంత దగ్గరకు రాగానే క్రిందికి దూకేస్తే సరి!"

"ప్రాణాలు పోయినా పోవచ్చు!"

"అదృష్టం వుంటే బ్రదుకుతాము. లేకపోతే ఎలానూ చావవలసిన వాళ్లమేకదా! మన ప్రయత్నం మనం చేద్దాము."

ఆనంద్ మెల్లిగా అన్నాడు. ఐతే రాజు మనసు ఇంకొక విషయాన్ని ఆలోచిస్తోంది. 'తను చావగూడదు. అంటే తన పేరు శాశ్వతంగా ప్రపంచంలో నిలిచిపోవాలి. ఔను, ఆనంద్ బ్రతకకూడదు. అతన్ని వెంటనే మట్టుపెట్టాలి.'

రాజు కళ్లు ఎరుపెక్కాయి. ఆనంద్ వంక చూశాడు. అతను అమాయకంగా కంప్యూటర్ వైపే చూస్తున్నాడు.

"సరే! నీవు చెప్పినట్టే చేద్దాం! పద తలుపు దగ్గరకు," అన్ని స్విచ్‌లు ఆఫ్‌చేసి, ఇద్దరు తలుపు దగ్గరకు నడిచారు. అరగంటలో అది భూమిని ఢీకొట్టుకోవడం ఖాయం అని తెలుసు ఇద్దరికి.

ఇద్దరు తలుపు దగ్గర నుంచున్నారు రెడీగా.

సుమారు పావుగంట గడిచాక తలుపు తెరిచేందు కుపయోగించే స్విచ్ నొక్కారు. తలుపు తెరుచుకుంది. అంత

ఎత్తునుండి భూమిని చూసేసరికి ఇద్దరికీ కళ్లు తిరిగాయి. తట్టుకోలేక కళ్లు మూసుకున్నాడు ఆనంద్.

అంతే!

మరుక్షణం అతని శరీరం గాలిలో తేలుతూ పడిపోసాగింది.

అతను కన్పించేవరకు చూస్తుండి పోయాడు రాజు. అతనికిప్పుడు ఎంతో ఆనందంగా ఉంది. తన పేరొక్కటే సువర్ణాక్షరాలతో లిఖింప బడుతుంది చరిత్రలో.

భూమికి మైలు ఎత్తులోనికి వచ్చింది ఫ్లయింగ్ సాసర్. రాజు నిర్ఘాంత పోయాడు. అది తననుకున్నట్లుగా కొండల మీద దిగడం లేదు. ఏవో పొలాలలో దిగబోతోంది. ఇదీ ఒకందుకు మంచిదే ఐంది రాజుకి.

భూమికి సుమారు వంద అడుగుల ఎత్తుకు రాగానే బలం కొద్దీ,తన శక్తినంతా ఉపయోగించి,ముందుకు దూకాడు రాజు.

అదృష్టవశాత్తు, అవి పొలాలు, అందులోను తడిపి ఉంటం చేత బురదగా ఉంది. దూకగానే వెళ్ళి బురదలో పడ్డాడు. పడీ పడ్డంతోనే అతను స్పృహ కోల్పోయాడు.

అతనికి సుమారు నాలుగైదు గజాల దూరంలో, ఆ ఫ్లయింగ్ సాసర్ భూమిని ఢీకొట్టుకుని, పిప్పి పిప్పి అయి పోయింది.

9

కళ్ళు తెరిచి చూశాడు రాజు. జరిగినసంగతు లొకటొకటే జ్ఞాపకం వచ్చాయి. తనొక హాస్పిటల్‌లో ఉన్నట్లు తెలుసుకున్నాడు.

తనచుట్టు డాక్టర్లు, ఇద్దరు ముసలివాళ్లు, పోలీసులున్నారు.

రాజు కళ్ళుతెరవటంచూసి, డాక్టర్ఏదో ఇంజక్షన్ ఇచ్చాడు.

"యస్! ఇతను యిప్పుడు కోలుకున్నాడు. మీరేదైనా మాట్లాడవచ్చు."

ఆ వృద్ధులలో ఒకడువచ్చి, మంచంమీద కూర్చున్నాడు. అతని వయసు సుమారు యాభై యైదుఉండవచ్చు. అతనిని తనెక్కడో చూసినట్లు అన్పించింది రాజుకి.

"రాజు! నన్ను గుర్తుపట్టేవా? నేను! దివాకర్‌ని!" ఆ వృద్ధుడు మెల్లిగా అన్నాడు.

"వాట్?" అదిరిపడ్డాడు రాజు. "అవును నేనే! ఇతను రంగాచారి!" మరో వృద్ధుణ్ని చూపిస్తూ అన్నాడు దివాకర్.

"దివాకర్!! రంగాచారి!! ఏమిటీ మాయ?"

"రాజు! మా కిదంతా వింతగా, గమ్మత్తుగాఉంది. నువ్వా రోజు ఫ్లయింగ్ సాసర్ అంటూ వెళ్లి, మరల ఈ రోజు కన్పించావు. ఎన్ని సంవత్సరాలు గడిచాయో తెలుసా? పాతిక."

"డామిట్! ఇదంతా కలలాగా ఉంది. నేను నమ్మను. మీరు ముసలివాళ్ళవటమేమిటి? నే నింకా కుర్రవాడిగానే ఉండటం ఏమిటి?" అరిచాడు రాజు.

దివాకర్ మాట్లాడలేదు. రాజు కళ్ళు మూసుకున్నాడు.

10

"ఏమిటీ వింత? మా వయస్సే ఉన్న రాజు, పాతిక సంవత్సరాల నాడు మాయమై, తిరిగి అదే వయసుతో మా ముందు ప్రత్యక్ష మయ్యాడు. ఇదెలా సంభవం డాక్టర్?" ఆదుర్దాగా ప్రశ్నించాడు రంగాచారి.

ప్రముఖ సైంటిస్ట్ డాక్టర్ విలియం మాట్లాడలేదు. రాజుని స్టడీ చేయటానికి ప్రత్యేకంగా అమెరికానుండి వచ్చాడాయన.

"అంతా వింతగా ఉంది. అతడి ఆయుర్దాయం తరిగి పోకుండా ఎలా ఉంది? అతని శరీరంలోని కణాలను పరిశీలించాము. వృద్ధాప్యం రెండు రకాలుగా ఉంటుంది. భౌతిక

మైన వృద్ధాప్యం. అంతరంగమైన వృద్ధాప్యం. పైకి మనిషి బలంగా, యువకుడిలా అవుపించ వచ్చు. కాని లోపల అతని కణాలు వృద్ధుడి కణాలు పోలి ఉంటాయి. ఇటువంటి వాళ్ళ త్వరగా చనిపోవచ్చు. ఇలాగే పైకి వృద్ధుడిలా కన్పించినా కొందరికి కణాలు ముసలితనాన్ని పొందవు.''

''ఇంతకి మీరనేది ఏమిటో మాకర్థం కాలేదు'' దివాకర్ అన్నాడు, ఆయనను చూస్తూ.

''ఇంకా ఏముంది? రాజు నిజంగా కుర్రవాడు.''

''ఇదెలా సంభవం డాక్టర్?'' రంగాచారి అన్నాడు.

ఆయన మాట్లాడలేదు.

రాజు వ్యవహారం శాస్త్రజ్ఞులను కలవర పరిచింది. ఎందరో ఎన్ని విధాలుగానో ప్రయత్నించారు. కాని సాధ్య పడలేదు. పాతిక సంవత్సరాలపాటు యవ్వనాన్ని కోల్పోకుండా, వయసు పెరగకుండా ఎలా వున్నాడో అర్థం కాలేదు. చివరకు అతన్ని వదిలివేశారు.

ఆ రోజే రాజును డిశ్చార్జి చేశారు.

రాజు బయటకు వచ్చాడు. బయట పోలీస్ ఇన్‌స్పెక్టర్ నిలబడి వున్నాడు.

''మిస్టర్ రాజు! మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాం!''

''నన్నా? ఎందుకు?'' ఆశ్చర్యపోతూ అన్నాడు రాజు.

''ఆనంద్‌ను బలవంతంగా క్రిందికి తోసి హత్యచేసి నందుకు. అతడు ఒక సరస్సులో పడగా బలమైన గాయాలు తగిలి మరణించాడు. మరణించే ముందు నీ విషయం చెప్పాడు. అయితే నీ మీద పరిశోధన సాగుతుండటం వలన వెంటనే అరెస్టు చేయలేకపోయాము.''

రాజు మౌనంగా పోలీస్ వ్యాన్‌లో కూర్చున్నాడు.

వ్యాన్ బయలుదేరింది. ★

పాఠకుల ప్రశ్నలు

కుమారి శ్యామలజ్యోతి, కందకుర్తి.

అన్నయ్యా! ఒక నిస్సహాయ వ్యక్తి, ఎవరి సహాయం గాని, ఆదరణగాని లభించకుంటే — అతను ఏం చెయ్యాలి?

ఒకరి ఆదరణ, సహాయాలతో పైకిరావాలని చూచేవాడు ఎన్నటికీ ఉన్నతుడు కాలేడు. స్వశక్తితో పైకిరావటంలోనే ఆత్మతృప్తీ, గౌరవం వున్నాయి.

కరుణ, అమలాపురం.

ఎడిటర్జీ! నేను 'మీ తీర్పేమిటి?' శీర్షికకు సరియైన జవాబులనే వ్రాశాను. కాని, నా పేరు ప్రచురించలేదేమిటి?

మీరు పోటీ నిబంధనలు పాటించక పోవడమే. ఇన్ లాండ్ లెటర్ లో వ్రాసే జవాబులు పోటీకి స్వీకరించడంలేదు.

పెండ్యాల ఎస్వీరెడ్డి, హైద్రాబాదు.

ఎడిటర్‌గారూ! 'క్రైమ్‌లో తమాషాల' నిమిత్తమై ఇంత మట్టుకు నేను ఎన్నో రచనలు పంపాను. కాని ఒక్కటీ ప్రచురించలేదు. ఎందువల్లో నాకు బోధపడ్డంలేదు. ముఖ్యంగా ప్రచురణయోగ్యమైన వాటినికూడా ప్రచురించలేదంటే, నాకు ఒకే ఒక్కటి గోచరమవుతూంది. అదే మీలో పక్షపాతం! లేదా, ప్రచురణకొరకై రచనలతోపాటు ఏమైనా 'దక్షిణ' కూడా పంపాలా?

మీకు ప్రచురణ యోగ్యమనిపించిన రచనలు మాకు అలా అనిపించకపోవచ్చు. ఏది ఏమైనా, మంచి రచనలను ఎవరి ప్రోద్బలం, దక్షిణలు లేకుండానే ప్రచురిస్తున్నాము.

ఎమ్. వీరాస్వామి, మల్కాజిగిరి.

మానవుడికి కోరికలనేవే ఉద్భవించకపోతే?

ప్రగతి వుండకపోవును. మనం ఇంకా రాతియుగంలోనే వుండేవాళ్ళం.

కాళంగి మురళీమోహనరావు, గుంటూరు-2.

నేటి విద్యార్థులకు దేనిపై ఎక్కువ అభిరుచి ఉంది?

లేటెస్ట్ ఫ్యాషన్లపైన, కాపీ కొట్టడంపైన.

వి. సోమేశ్వరరావు, తెనాలి.

శ్యామ్‌జీ! "సప్లిమెంట్" లో బయటి రచయిత (త్రు) లకు కూడా అవకాశమిస్తారా?

మంచి నవలలు ఎవరు రాసినా అవకాశం వుంటుంది.

బి. సరాశ్రీ, రుద్రంపూర్.

అన్నయ్యా! మీ బుట్టాసురుని బాధ భరించలేకపోతున్నాం. ఎత్తుకుపోవటానికి వస్తున్నాం—?

అబ్బే. మీకు వాడంత సులభంగా చిక్కే ఘటంకాదు లెండి. పైగా మిమ్మల్నే బుట్టలో వేసుకున్నా వేసుకోవచ్చు. తగిన జాగ్రత్తలో రండి!

ఆర్. ఎమ్. గుంటూరు

అయ్యా, ఎడిటర్‌గారూ! మీ పత్రికలో లాయర్సు, ఇన్‌స్పెక్టర్లూ వాళ్ళ కూతుళ్ళకీ, కొడుకులకైతే బాగా స్థానముంటుందన్నమాట. అలా పెద్ద పొజిషన్‌లో వున్నవాళ్ళకే ఇంకా సాయంచేస్తూ, ఇంకా ప్రైజులిస్తూ, బీదవాళ్ళ కసలు సాయం చేయకండి—?

మీ సుదీర్ఘమైన లేఖ చేరింది. మీ ఆరోపణలన్నీ నిరాధారమైనవే. లాయర్లు, ఇన్‌స్పెక్టర్లు, మీరన్నట్లు పెద్ద పొజి

షన్‌లో వున్నవాళ్లు, అనుభవంమీద మామూలు పాఠకుల కంటె ఎక్కువగా ఆలోచించగలరు. బాగా రాయగలరనేది మీరూ ఒప్పుకుంటారు. పత్రికలో బహుమతులిచ్చేది పాఠకుల శక్తి సామర్థ్యాలనుబట్టి గాని, బీదా గొప్ప చూచి కాదు. అసలు బీదవారు రు. 3-00 పెట్టి పత్రికను కొని చదువుతున్నారంటే నమ్మశక్యంగాని పని.

పి. హరిబాబు, గూడూరు.

'హోమ్ డెలివరీ' సభ్యత్వానికి 3 రూపాయలెందుకు?

'హోమ్ డెలివరీ' కాపీలు వి. పి. పి. ద్వారా పంపబడతాయి. ఒకవేళ సభ్యులు వి. పి. పి. తీసుకోకుండా త్రిప్పి పంపితే మేము పోస్టేజీ, కాపీలు నష్టపోవలసి వస్తుంది. అటువంటప్పుడు వారు సభ్యత్వ రుసుముగా పంపిన రు. 3/- లు నష్టపరిహారం క్రింద ముదరా పెట్టుకొని వారి సభ్యత్వమును రద్దుచేయటం జరుగుతుంది.

మిట్టపెల్లి నిరంజన్. సికింద్రాబాద్-17.

శ్యామ్‌జీ! జీవితం, జీతంనకు గల తేడా ఏమిటి?

జీతంపై ఆధారపడినది జీవితం. కాని జీవితంతో అక్కరలేనిది జీతం! అదే తేడా!

టి. రామమూర్తి, చిత్తూరు.

రెడ్డిగారూ! మా వూళ్లో "అపరాధ పరిశోధన" సకాలములో దొరుకుటలేదు. అది ఏజెంటు పొరబాటో, మీ పొరబాటో గాని, మాకు మాత్రం పోటీలలో పాల్గొనే అవకాశం లేకుండా పోతోంది—?

"హోమ్ డెలివరీ" లో చేరితే మీకు ఆ ఇబ్బందులేవీ వుండవు. పత్రిక విడుదలైన వెంటనే ఖచ్చితంగా మీ ఇంటికి చేరుతుంది.

★

10 గంటల సేపు ప్రపంచానికే ప్రమాదం

కొమ్మూరి సాంబశివరావు

(గత సంచిక తరువాయి)

6

తన పేరు తనకి తెలియదని విశ్వనాథ్ అనగానే, లక్ష్మీదేవి ఏదో అనబోయి, గొంతు పెగలక, అటూ, ఇటూ చూసి, భర్త రెండు చేతులూ పట్టుకుని, "పోనీ నేను ఎవరో తెలుసా మీకు!" అడిగింది.

విశ్వనాథ్ ఆమెని పరీక్షగా చూసి, "క్షమించండి! తెలియదు. మీ పేరు? మీరు విశ్వనాథ్ గారి క్ — ?" అడుగుతున్నాడు.

లక్ష్మీదేవి భర్త రెండు చేతులూ, వొదిలేసి, అతని పాదాల మీద పడి ఏడ్వటం ప్రారంభించింది.

"లక్ష్మీదేవిగారూ! ఇది ఏడవ వలసిన సమయం కాదు. ఆయన తిరిగి వచ్చారు. క్షేమంగా. అందుకు సంతోషించండి!" అన్నాడు యుగంధర్.

రాజు విశ్వనాథ్ చెయ్యి పట్టుకుని, సోఫా దగ్గిరకి తీసుకు వెళ్లి పడుకోపెట్టాడు.

"ఒక్క క్షణం అలా పడుకోండి!" అన్నాడు యుగంధర్. తర్వాత అతని కళ్ళు పరీక్ష చేశాడు. షర్టు, చేతి పైకి తీసి, జబ్బ చూశాడు.

"మిమ్మల్ని గురించి మీకేం తెలుసు? తెలుసున్నంత వరకూ చెప్పండి?" అడిగాడు యుగంధర్.

"నాకేమి తెలియదండి. నేను ఎవర్నో-నా పేరేమిటో, నా ఇల్లు ఎక్కడో-నా వాళ్ళు ఎవరో తెలియదు," అన్నాడు అతను.

"పోనీ మీకు తెలిసినదేమిటో చెప్పండి," అన్నాడు యుగంధర్.

"నేను కింగ్స్ సర్కిల్ దగ్గిర నిలుచున్నాను. అక్కడ ఎందుకు నిలుచున్నానో-అక్కడికి ఎలా వెళ్ళానో నాకు తెలియదు. ఎక్కడికి వెళ్లాలో. ఎక్కడ వుండాలో తెలియదు. ఆ సమయంలో ఎవరో వచ్చి. నాకు యీ చీటీ ఇచ్చి విశ్వనాథ్‌గారు మిమ్మల్ని రమ్మన్నారు. ఈ అడ్రస్‌కి వెళ్ళండి. మీకు సహాయం చేస్తారు. అని చెప్పి వెళ్లిపోయాడు. అంతే. వెతుక్కుంటూ ఇక్కడికి వచ్చాను," అన్నాడు విశ్వనాథ్.

"ఆ చీటీ ఇచ్చిన అతను ఎలా వున్నాడు? మళ్లీ అతన్ని చూస్తే గుర్తు పట్టగలరా?"

విశ్వనాథ్ తల విదిలించి, "మెడకీ, చెవులకీ, మఫ్లర్ చుట్టుకున్నాడు. ఫెల్టు హేట్ పెట్టుకున్నాడు. అతన్ని నేను సరిగా చూడలేదు" అన్నాడు.

యుగంధర్ ఏమంటాడా అని లక్ష్మి ఆదుర్దాతో అతన్నే చూస్తోంది.

"మీ పేరే విశ్వనాథ్. కె. విశ్వనాథ్. ఈమె మీ భార్య. మీ కొడుకు కిశోర్ నిద్రపోతున్నాడు. మీరు అణుశక్తి పరిశోధనా కేంద్రంలో జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు" అన్నాడు యుగంధర్.

విశ్వనాథ్ అయోమయంగా చూస్తున్నాడు.

"మిగతా వివరాలు ఇప్పుడు మీకు చెప్పినా అర్థం కావు. జ్ఞాపకశక్తి నాశనం అయి, మీ గురించి మీకు ఏమీ తెలియకుండా వుండేందుకు, ఎవరో మందు ఇచ్చారు. ఇంజక్షన్ ఇచ్చిన మచ్చలు మీ చేతిమీద స్పష్టంగా కనబడుతున్నాయి. మందుల వల్ల పోయే జ్ఞాపకశక్తి, శాశ్వతంగా పోదు. మళ్లీ కొద్ది రోజులలో తిరిగి వస్తుంది. ఎటొచ్చీ, మీకు వైద్య సహాయం కూడా వుంటే త్వరగా కోలుకుంటారు. మీరుగాని, మీ భార్య లక్ష్మీదేవిగారు కానీ, కంగారు పడవలసిన అవ

సరం లేదు. మిమ్మల్ని ఆస్పత్రికి పంపించే ఏర్పాటు చేస్తాను'' అన్నాడు యుగంధర్.

విశ్వనాథ్ మౌనంగా వుండిపోయాడు. తనకేమీ సంబంధం లేనట్టు. అతని కళ్లు మూసుకుపోతున్నాయి.

''మీకు నిద్ర వస్తోంది. నిద్ర పొండి. ఏమీ భయంలేదు'' అన్నాడు యుగంధర్.

యుగంధర్ వాక్యం పూర్తికాక ముందే. విశ్వనాథ్ కళ్ళు మూసుకున్నాడు.

''రాజూ! నువ్వు వెళ్ళి, ఎక్కణ్ణించయినా బండార్కర్‌కి ఫోన్‌చేసి యీ విషయం చెప్పు. విశ్వనాథ్‌గార్ని ఏ ప్రయివేటు నర్సింగ్ హోమ్‌కో తీసుకువెళ్లమనీ, అంబులెన్సు పంపమనీ చెప్పు! ఇక్కణ్ణించి నువ్వు, నేను X 202 ఇంటికి వెళుతున్నామనీ చెప్పు'' అన్నాడు యుగంధర్.

7

''ఎం. హెచ్. రోడ్. నెంబర్ 22/450. అక్కడికి వెళ్ళాలి'' అన్నాడు రాజు టాక్సీ డ్రైవర్‌తో.

టాక్సీ బయలుదేరింది.

''విశ్వనాథ్ తిరిగి రావడంతో యీ కేసులో ఒక ఘట్టం పూర్తి అయింది కదూ!'' అన్నాడు రాజు.

''అవును. కొత్త ఘట్టం ప్రారంభం అయింది. విశ్వనాథ్‌ని ఎవరో ఎత్తుకుపోయారు. తర్వాత అతనికి జ్ఞాపకశక్తి పోయేందుకు మందు ఇచ్చి. కింగ్స్ సర్కిల్ దగ్గిర వదిలిపెట్టారు. తను ఎవరో తెలియక, కష్టాలపాలు కాకుండా వుండేందుకు. అతని పేరు, చిరునామా ఇచ్చారు. అంటే విశ్వనాథ్ కష్టాలుపాలు కావడంకానీ. అతనికి ప్రమాదం జరగటం కానీ, అతన్ని ఎత్తుకుపోయినవారికి ఇష్టంలేదని తెలుస్తోంది'' అన్నాడు యుగంధర్.

"అంతమాత్రాన ఎవరికీ ఏమీ హాని చెయ్యరని అనుకోవడానికి వీల్లేదు. X202 విషయం ఎలా మర్చిపోగలం?" అన్నాడు రాజు.

యుగంధర్ తల వూపి, "మనం మారువేషాలలో, మారుపేర్లతో యీ వూరికి వచ్చాము. మనలా బండార్కర్ మారుపేరుతో హోటల్లో దిగాడు. ఐనా ఎవరికో తెలిసి పోయింది మన విషయం. X202 గురించి మనం దర్యాప్తు చేస్తున్నామనీ తెలిసింది. లేకపోతే, మన గదిముందు ఆ కవరు, X202 ఫోటోతో, వెనక ఎర్రని సిరాతో ప్రమాదం అని వ్రాయడంలో అర్థం ఏమిటి?" అన్నాడు యుగంధర్.

అంతలో టాక్సీ ఆపి, "సర్! బహుశా ఆ మేడ అయ్యుండాలి, మీరు చెప్పిన నెంబర్. అక్కడ పార్కు చెయ్యకూడదు" అన్నాడు డ్రైవర్.

రాజు టాక్సీకి డబ్బుయిచ్చి పంపేశాడు.

అది ఎనిమిది అంతస్థుల మేడ. ముందు గుమ్మం దగ్గిర జవాను నిలుచున్నాడు. అతన్ని ఏమీ అడగకుండా, యుగంధరూ, రాజూ లిఫ్ట్ ఎక్కారు. నాలుగో అంతస్తు రాగానే రాజు లిఫ్ట్ ఆపాడు.

అది పెద్ద నడవా. నడవకి రెండువైపులా పన్నెండు అడుగులకి ఒకటి చొప్పున తలుపు - తలుపుమీద అంకెలున్నాయి. ఐదారు తలుపులు దాటిన తరవాత, రాజు ఒక తలుపు ముందు ఆగి, తలుపు తోశాడు. తలుపు తెరుచుకోలేదు. తలుపుమీద చిన్న కార్డున్నది. ఎన్. అగర్వాల్.

రాజు జేబులోంచి మారుతాళంచెవుల గుత్తి తీసి, క్షణంలో తలుపు తెరిచాడు. రాజు, యుగంధర్ లోపలకి వెళ్ళి తలుపు మూసేశారు.

నిశ్శబ్దం. కిటికీ తలుపులు మూసివున్నాయి. చీకటి.

తలుపు పక్కనున్న స్విచ్ నొక్కాడు యుగంధర్. దీపం వెలిగింది. ఒక బల్ల-నాలుగు కుర్చీలు, ఇంకోమూల టైప్ మిషన్, దాని పక్కన షెల్ఫు, షెల్ఫులో ఫైల్సు. దాని పక్కనే టెలిఫోన్.

రాజు బల్లసొరుగు తెరిచాడు. ఖాళీగా వుంది. యుగంధర్ షెల్ఫులో ఫైల్సు తీశాడు. అదీ ఖాళీగా వుంది.

"బహుశా, స్పెషల్ బ్రాంచివాళ్లు అన్నీ తీసుకు వెళ్ళిపోయి వుంటారు" అన్నాడు రాజు.

"అవును X202 ముఖ్య ఏజంటు. అతనివద్ద డాక్యుమెంట్సు ఎవరిచేతుల్లో పడకూడదు" అన్నాడు యుగంధర్.

"ఐతే మనం ఇక్కడికి రావడం వృధా శ్రమ అనుకుంటాను" అన్నాడు రాజు సిగరెట్ వెలిగించి.

"అతని అఫిషియల్ ఫైల్సులో సూచనలుంటాయని రాలేదు. అతని పడకగదిలోకి వెళదాం రా" అని యుగంధర్ షెల్ఫుకి అవతలవున్న ఇంకో తలుపు తెరిచాడు.

క్షణంపాటు తలుపుదగ్గిర నిలబడ్డారు ఇద్దరు డిటెక్టివ్‌లు.

గది మధ్యన మంచం, దోమ తెర, ఒక టవల్ స్టాండ్, దానిమీద బట్టలు, పక్కన కోటు స్టాండ్, దానిమీద బట్టలు, మంచం పక్కన ఒక చిన్నబల్ల, బల్లమీద టేబిల్ లైట్, రెండు పుస్తకాలు, ఒక డైరీలాటి చిన్న పుస్తకం, మంచం అవతల వార్డ్ రోబ్.

"ఆ ఇంకో తలుపు బహుశా బాత్‌రూంలోకి అయ్యుంటుంది" అన్నాడు యుగంధర్.

"అవును. ఈ గది కూడా పోలీసులూ, స్పెషల్ బ్రాంచి ఏజంట్లు, పూచికపుల్ల వొదలకుండా వెతిక వుంటారు" అన్నాడు రాజు.

"పోలీసుల, స్పెషల్‌బ్రాంచి ఏజంట్ల, శక్తిసామర్థ్యాలలో

నాకు నమ్మకం లేక కాదు రాజు. ఒక్కొకప్పుడు, పొరపాటు వల్ల, ఏదైనా పరీక్ష చేయకపోవడమో, ముఖ్యమైన సూచనని గమనించక పోవడమో జరుగుతుంది. X 202 దర్యాప్తు ఏ మార్గాలలో పోయిందో తెలుస్తుందేమో నని-'' అంటూ యుగంధర్ లోపలికి వెళ్ళాడు. మంచం పక్కనున్న డైరీ తీసి, తిరగేస్తున్నాడు.

''ఆశ్చర్యంగా వుంది రాజూ! X 202 పర్సనల్ డైరీ ఇది. అతను దర్యాప్తు చేసిన, చేస్తున్న కేసుల వివరాలన్నీ వ్రాశాడు- స్పెషల్ బ్రాంచివాళ్ళు యీ డైరీని ఎందుకు ఇక్కడ వొదిలేశారు?'' అంటున్నాడు.

అంతలో కీచుమన్న చప్పుడైంది. ఇద్దరూ ఒకేసారి వెనక్కి తిరిగారు.

వార్డ్‌రోబ్ తలుపు తెరిచి వుంది. వార్డ్‌రోబ్‌లో ఒక మనిషి నిలుచు నున్నాడు. మొహం కన్పించకుండా నల్లని గుడ్డ మొహానికి కట్టుకున్నాడు. కళ్ళ దగ్గర రెండు కంతలు.

అతని చేతిలో ఒక చిన్న మెషిన్‌గన్ వుంది. ఆ మెషిన్ గన్ ఇద్దరి డిటెక్టివ్‌ల మీదకి గురిపెట్టి వుంది.

అతను కాని, డిటెక్టివ్‌లు కాని నిమిషం పాటు మాట్లాడ లేదు. ఆ మెషిన్‌గన్ చూసాక, యుగంధర్, రాజులు చేతులు పైకి ఎత్తారు. అతను వార్డ్‌రోబ్‌లోంచి బయటికి రాలేదు.

చివరికి యుగంధర్ అడిగాడు. ''నువ్వు ఎవరు? ఏమిటీ వేషం? మెషిన్‌గన్‌తో ఏమిటీ బెదిరింపు?'' అన్నాడు.

''మిమ్మల్ని చంపడం నా వుద్దేశం కాదు. మీకు ఎటు వంటి హానీ చెయ్యదలచు కోలేదు. మీతో మాట్లాడాలి. అంతే.'' అన్నాడు అతను.

''మాట్లాడదలచుకుంటే ఆ మెషిన్ గన్ ఎందుకు? వార్డ్ రోబ్‌లోంచి బయటికి రా! కూర్చుని ఎంత సేపైనా మాట్లాడ

చెప్తా వినండి?

1. అబ్రహాంలికను 1860లో అమెరికా ప్రెసిడెంట్ అయ్యాడు. కెనడీ 1960లో ప్రెసిడెంట్ అయ్యాడు. ఇద్దరూ తమదేశ ప్రజలకై ఎంతో పాటు పడ్డారు.

2. లింకన్ సెక్రటరీ పేరు కెనడీ, ప్రెసిడెంట్ కెనడీ సెక్రటరీ పేరు లింకన్.

3. ప్రెసిడెంట్స్ లింకన్ మరియు కెనడీలను తమ తమ భార్యలతో కారులో వున్నప్పుడే హత్యచేశారు.

4. ప్రెసిడెంట్లు నిద్దరినీ తల వెనుక భాగంనుండి తుపాకీతో కాల్చి చంపారు.

5. లింకన్ మరియు కెనడీలను హత్యచేసిన హంతకులను పట్టుకుని వారిని కోర్టుకు తీసుకెళ్తూంటే, దారిలోనే ఎవరో చాటుగా వారిని 'షూట్' చేసి చంపేశారు.

6. లింకన్ హత్యచేసిన హంతకుడు ఒక 'థియేటర్'లో నుండి తుపాకితో లింకన్‌ను కాల్చి 'వేర్ హౌసు'లోకి పారిపోయాడు. కెనడీని చంపిన హంతకుడు ఒక 'వేర్ హౌసు' నుండి తుపాకితో కెనడీని కాల్చి అతడు 'థియేటర్'లోకి పారిపోయాడు.

7. లింకన్ చనిపోయే రోజున అతని సెక్రటరీ అతన్ని 'థియేటర్'కు వెళ్ళవద్దని కోరాడు. కెనడీ చనిపోయిన రోజుకూడా అతని సెక్రటరీ కెనడీని 'డల్లాస్' వెళ్ళొద్దని కోరాడు. కాని ఇద్దరు ప్రెసిడెంట్స్ తమ సెక్రటరీల మాటలు వినకుండా వెళ్ళి మృత్యువాత పడ్డారు.

—కె. చంద్రరావు.

వచ్చు" అన్నాడు యుగంధర్.

"నేను కాదు మాట్లాడ వలసింది. మా నాయకుడు" అన్నాడతను.

"మీ నాయకుడు ఏడీ! నీ వెనక నిలుచున్నాడా? ఐతే బయటికి రమ్మను" అన్నాడు యుగంధర్.

"యుగంధర్‌గారూ! మీ ధైర్య సాహసాలను గురించి చాలా విన్నాను. మెషిన్‌గన్ చూపించినంత మాత్రాన మీరు బెదిరిపోరని తెలుసు. కాని ఒక హెచ్చరిక. ఈ హెచ్చరిక మీరు మీ హోటల్లోంచి బయటికి వస్తున్నపుడు, X 202 ఫోటో మీకు అందించాము. ఆ హెచ్చరిక మీరు పాటించ లేదు. కనుక మా నాయకుడు మీతో స్వయంగా మాట్లాడాలని అనుకున్నారు. మిమ్మల్ని తన దగ్గరకు తీసుకుని రమ్మన్నారు. మీరు ఎదురు తిరిగితే- మెషిన్‌గన్ వుపయోగించ మన్నారు. అవసరమైతే మేము చంపడానికి సందేహించమనీ, మీకు తెలుసుండాలి."

యుగంధర్ తల వూపాడు.

"దయచేసి నేను చెప్పినట్టు చెయ్యండి. యుగంధర్ గారూ! మీరు రెండు చేతులూ పైకి ఎత్తి, వీపు నావైపు తిప్పి, రెండడుగులు నావైపు వేసి, నిలుచోండి. మిస్టర్ రాజూ! మీరు దయచేసి, మీ జేబులో వున్న వస్తువులన్నీ తీసి మంచం మీద పడెయ్యండి! మిస్టర్ రాజూ మీరు ఏదైనా కిటుకు ప్రయత్నించారా! ఎదురు తిరగడానికి సాహసం చేశారా యుగంధర్‌గారి ప్రాణం పోతుంది. మెషిన్‌గన్ ఆయన వీపుమీదకి గురిపెట్టి వుంచాను. జాగ్రత్త" అన్నాడు.

అతను చెప్పినట్టు చెయ్యక తప్పలేదు రాజుకి.

జేబులో వున్న పిస్తోలు, మారుతాళంచెవుల గుత్తి, ఇంకా కొన్ని పనిముట్లు, మనీపర్సు, అన్నీ తీసి, మంచం మీద

పడేశాడు.

తర్వాత అదేవిధంగా యుగంధర్ జేబులు ఖాళీచేసి, వస్తువులన్నీ మంచంమీద పడేశాడు.

"థాంక్ యు వెరీమచ్ యుగంధర్‌గారూ! నేను చెప్పినట్టు నడుచుకుంటే ఎవరికీ ఎటువంటి హానీ జరగదు" అన్నాడు.

యుగంధర్ భుజాలు చరిచి, "సరే, తర్వాత కార్యక్రమం ఏమిటి?" అడిగాడు.

"మీ వీపుకి పిస్తోలు ఆనించి పెడ్తాను. ముందు రాజు, వెనక మీరు ఈ బిల్డింగ్‌లోంచి, లిఫ్టులో కాదు, మెట్లుదిగి వెళదాము. వీధిలో మా కారు ఒకటి వుంది. అది ఎక్కి వెళ్ళాలి, అంతే!"

"ఆల్‌రైట్!" అన్నాడు యుగంధర్ రెండడుగులు ముందుకు వేసి, వీపు అతనివైపు తిప్పి.

"మిస్టర్ రాజూ! నో ట్రిక్ ప్లీజ్. యుగంధర్ గారి ప్రాణం బలి ఇవ్వద్దు!" అన్నాడు అతను.

రాజుకి చాలా కోపంగా వుంది. పళ్ళు పట పట, కొరుకుతున్నాడు. పిడికిళ్ళు బిగించాడు. వీడెవడో చెపితే, కీలుబొమ్మల్లా, వాడు చెప్పినట్లు చెయ్యడం అతనికి ఏమాత్రం ఇష్టం లేదు.

అది గ్రహించి, "రాజూ! ఎదురు తిరగడం అనేది కొన్ని పరిస్థితుల్లో సాహసం కాదు. అవివేకం. అతను చెప్పినట్టు చెయ్యి" అన్నాడు యుగంధర్.

ఎవరెవరో మెట్లు దిగుతున్నారు, మెట్లు ఎక్కుతున్నారు. కాని, వీళ్ళ విషయం ఎవరూ పట్టించుకోలేదు.

యుగంధర్ వీపుమీద చెయ్యి వేసుకుని, దిగుతున్న

అతన్ని చూసినా, ఎవరికీ విడ్డూరంగా లేదు. ఆ ఇంటి జవాను కూడా ఏమీ పట్టించుకోలేదు.

వీధిలోకి వెళ్ళారో లేదో, నల్లని కారు వచ్చి వాళ్ల ముందు ఆగింది.

"ఎక్కండి!" అన్నాడు అతను. కారు వెనక తలుపు తెరుచుకుంది. యుగంధర్ కారు ఎక్కాడు. ఎవరో వున్నారు కారులో. రాజు ఎక్కాడు. రాజు వెనక తమని బెదిరించిన అతను ఎక్కాడు. తలుపు మూసేశాడు.

కారు కదిలింది.

8

పద్మా క్లినిక్ విజిటర్స్ రూంలో కూర్చునున్నాడు స్పెషల్ బ్రాంచి డైరెక్టర్ బండార్కర్. అతని పక్కనే కూర్చునున్నది విశ్వనాథ్ భార్య లక్ష్మి. ఆమె కొడుకు కిశోర్.

విశ్వనాథ్‌ని పరీక్ష చెయ్యడానికి డాక్టర్ లోపలకి తీసి కెళ్ళి అరగంటయింది. లక్ష్మి క్షణక్షణానికి గడియారం చూస్తోంది.

అంతలో నర్సు వచ్చి, వాళ్ళని రమ్మని సంజ్ఞ చేసింది.

బండార్కర్, లక్ష్మి డాక్టర్ గదిలోకి వెళ్ళారు.

"కూర్చోండి! పేషంటు పేరు విశ్వనాథ్ అనీ, అణు శక్తి పరిశోధనా కేంద్రంలో ఉద్యోగి అనీ, అడ్మిషన్ స్లిప్ మీద వ్రాశారు. ముందు రోగిని గురించి చెపుతాను. రోగికి ఎటువంటి ప్రమాదంలేదు. జ్ఞాపకశక్తి పూర్తిగా నశించింది. దానికి కారణం స్వతహా విశ్వనాథ్‌గారి మెమరీకి హాని జర గడంవల్ల కాదు. ఎమ్నీజియాకూడా కాదు. షాక్‌వల్లా కాదు. ఎవరో ఆయనకి మందులు ఇచ్చారు, జ్ఞాపకశక్తి పోయేం

దుకు. రోజూ ఒకటి చొప్పున ఐదు ఇంజక్షన్స్ ఇచ్చారని అనుకుంటున్నాను.

"విశ్రాంతి, B12 ఇంజక్షన్స్ ఇస్తూవుంటే, క్రమంగా కొన్నిరోజుల తర్వాత విశ్వనాథ్‌గార్కి ఎప్పటిలా పూర్వ స్మృతి వస్తుంది. అందులో సందేహంలేదు. ఎన్నిరోజుల్లో పూర్తిగా కోలుకుంటారో నేను ఇప్పుడు చెప్పలేను. రెండు రోజుల్లో రావచ్చు-లేదు-వారంరోజులు పట్టవచ్చు. వారం రోజులకన్న ఎక్కువ పట్టదు" అన్నాడు డాక్టర్.

లక్ష్మి ఒక్క నిట్టూర్పు వొదిలింది - గుండెమీద బరువు తీసినట్టు. సంతోషంతో కళ్లు చెమ్మగిల్లాయి.

డాక్టర్, బండార్కర్‌వైపు తిరిగి "ఈమె విశ్వనాథ్‌గారి భార్య అని నర్సు చెప్పింది. మీరు ఎవరో, విశ్వనాథ్‌గార్కి ఏమవుతారో నాకు తెలియదు. విశ్వనాథ్‌గార్కి ఎవరు ఇంజక్షన్స్ ఇచ్చారు, ఎందుకు ఇచ్చారు, తెలుసుకోవాలి. అంటే ఇది పోలీసు వ్యవహారం. ఈ విషయం నేను పోలీసులకి రిపోర్టు చెయ్యక తప్పదు" అన్నాడు డాక్టర్.

బండార్కర్ చిన్నగా నవ్వి "నాపేరు బండార్కర్. స్పెషల్ బ్రాంచి డైరక్టర్ని" అంటూ తన కార్డు తీసి డాక్టర్‌కి ఇచ్చి, "పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మీ అనుమతితో, విశ్వనాథ్ గదిముందు మఫ్టీలో వున్న కానిస్టేబుల్‌ని అట్టిపెడతాను, ఎందుకైనా మంచిది. అంతేకాక మీకు అభ్యంతరం లేకపోతే లక్ష్మిదేవి, పిల్లాడు-"

"నాకేమీ అభ్యంతరం లేదు. వాళ్లు ఇక్కడే వుంటే రోగి త్వరగా కోలుకుంటాడు" అన్నాడు డాక్టర్.

"థాంక్ యు. మీ బిల్లు మా డిపార్టుమెంట్ ఇస్తుంది" అని లక్ష్మిదేవివైపు తిరిగి, "అమ్మా! ఇద్దరు పోలీస్ ఉద్యోగులు వస్తారు. ఒకతను ఇక్కడ కాపలా వుంటాడు.

ఇంకొకతను మీకు తోడుగా వస్తాడు. ఇంటికివెళ్ళి కావలసిన బట్టలూ, వస్తువులూ తెచ్చుకోండి. పోలీసు జవాను కూడా లేనిదే దయచేసి బయటికి వెళ్ళకండి. మళ్ళీ వస్తాను నేను" అని బండార్కర్ నర్సింగ్ హోమ్‌నించి బయలుదేరాడు.

తిన్నగా తను బసచేసిన హోటలుకి వెళ్లి పోలీస్ కమిషనర్‌కి ఫోన్‌చేసి; నర్సింగ్ హోమ్‌కి ఇద్దరు కాన్‌స్టేబుల్స్‌ని పంపే ఏర్పాటుచేశాడు బండార్కర్.

తర్వాత కాఫీ తాగి టెలిఫోన్ పక్కనే కూర్చున్నాడు, యుగంధర్‌నించి టెలిఫోన్ కాల్‌కోసం. చాలాసేపు కాచుకున్నాడు-గంటలు దొర్లిపోతున్నాయి.

X202 ఇంట్లో యుగంధర్, రాజులు అంతసేపు ఏంచేస్తున్నారు. డైరీ తీసి X202 టెలిఫోన్ నెంబర్ చూసి తిప్పాడు. అవతల రింగ్ అవుతున్న చప్పుడు లేదు. మళ్లీ డిస్కనెక్ట్ చేసి, మళ్లీ తిప్పాడు. మళ్లీ అంతే.

టెలిఫోన్ కంప్లయింట్స్ సెక్షన్‌కి ఫోన్ చేశాడు. అయిదు నిమిషాల తర్వాత టెలిఫోన్ మోగింది.

"సారీ సర్. టెలిఫోన్ చెడిపోయినట్టున్నది. సరిచెయ్యడానికి మనుష్యులని పంపుతున్నాము" అని చెప్పింది ఆపరేటర్.

బండార్కర్ మళ్ళీ టెలిఫోన్ తీశాడు. కమిషనర్‌కి ఫోన్‌చేసి, "22/450, ఎం. హెచ్. రోడ్, ఫ్లాట్ నంబర్ 14, ఎన్. అగర్వాల్ ఫ్లాట్ అది. దయచేసి మీ ఆఫీసర్లని అక్కడికి వెళ్లి డిటెక్టివ్ యుగంధర్, రాజులు వున్నారా, లేదా చూడమనండి. రిపోర్టు చెయ్యవలసినది ఏదైనా వుంటే వెంటనే తిన్నగా నాకు రిపోర్టు చెయ్యమనండి. నేను కాచుకుని వుంటాను" అన్నాడు బండార్కర్.

9

"దయచేసి మాతో సహకరించండి" అన్నాడు కారులో వున్న అతను.

యుగంధర్ నవ్వి, "ఇంతకన్నా ఏం సహకరించం! పసిపిల్లల్లా మీతో వస్తున్నాం". అన్నాడు.

"మీ కళ్లకి గంతలు కట్టాలి. మనం ఎక్కడికి, ఎటు వెళుతున్నదీ తెలియకూడదు మీకు."

"ఆల్ రైట్" అన్నాడు యుగంధర్.

రాజుకీ, యుగంధర్‌కీ కళ్లకి నల్లని పేలికలు కట్టేశారు. కారు హెవీ ట్రాఫిక్‌లో వెళుతోంది. కాస్సేపటికి కార్ల హారన్ల మోత, ఇంజన్ల హోరు తగ్గింది. ఊరి సరిహద్దులు దాటి వెళుతున్నామేమో అనుకున్నాడు యుగంధర్. కారు మలుపులు తిరుగుతోంది. మళ్లీ కార్లు, హారన్ల మోత, రోడ్‌మీద రద్దీవల్ల కలిగే శబ్దాలు వినిపిస్తున్నాయి. అంటే ఇంకా సిటీలోనే వున్నాం అనుకున్నారు.

చటుక్కున కారు ఆగింది. తలుపు తెరిచాడు. "దిగండి" అన్నాడు.

"కళ్లు కన్పించడం లేదు" అన్నాడు యుగంధర్.

"ఫర్వాలేదు. నేను చెయ్యి పట్టుకుంటాను" అన్నాడు అతను.

తన వెనకే రాజు వస్తున్నాడని అడుగులు చప్పుడు పట్టి యుగంధర్ గ్రహించాడు. పది గజాలు నడిచాడు. తర్వాత నాలుగు మెట్లు ఎక్కారు. తర్వాత, మళ్ళీ మెత్తగా తివాసీలా వుంది కాళ్ళ క్రింద. పది గజాలు నడిచారు. ఈసారి ఇరవై ఎనిమిది మెట్లు ఎక్కారు, తలుపులు తీసిన చప్పుడు వినపడింది.

"కూర్చోండి!" అన్నాడు అతను. మెత్తని సోఫా, తన పక్కనరాజు కూర్చున్నాడని యుగంధర్ గ్రహించాడు. తలుపు మూసుకున్న చప్పుడు అయింది.

"ఇబ్బందిగా వుందేమో కళ్ళకి కట్టిన ఆ పేలికలు వూడ తియ్యండి?" అన్న మాటలు వినిపించాయి.

యుగంధర్ రాజులు కళ్ళకి గంతలు విప్పేశారు.

గదిలో ఎవరూ లేరు. అది చాలా పెద్ద గది. మెత్తని సోఫాలు, తివాసీలు ఏర్‌కండిషనింగ్. గోడలకి అందమైన పటాలు;-యుగంధర్ గదంతా కలయ చూశాడు.

"బల్లమీద, ఎదురుగా కాఫీ పాట్, కప్పులూ వున్నాయి. కాఫీ తాగండి! యుగంధర్!" అన్న మాటలు వినిపించాయి.

ఎవరో, ఎక్కడనుంచో, ఇంకో గదిలోంచి మాట్లాడు తున్నారు. స్పీకర్లోంచి అతని మాటలు వినిపిస్తున్నాయని యుగంధర్ గ్రహించాడు. బహుశా క్లోజ్‌డ్ సర్క్యూట్ టెలివిజన్‌కూడా వుండి వుండవచ్చు. తమని చూస్తూ వుండి వుంటాడు.

"థాంక్ యు. మీరెవరు? మమ్మల్ని ఇక్కడికి ఎందుకు ఇలా బలవంతాన తీసుకొచ్చారు? మాతో మాట్లాడదలచు కుంటే-ఎక్కడో కూర్చుని మాట్లాడడం దేనికి? ఎదురుగా వచ్చి మాట్లాడవచ్చు కదా?" అన్నాడు యుగంధర్.

"నేను ఎవర్నో మీకు ఇప్పుడు చెప్పే స్థితిలో లేను. మీ ముందుకు వచ్చి నేను మీతో మాట్లాడితే మీరు నన్ను గుర్తు పడతారు. మీకూ, నాకూ పరిచయం వుంది. అందు వల్ల యీ దాపరికం. మిమ్మల్ని ఇక్కడికి రప్పించడానికి కారణం, మీకు కొన్ని విషయాలు చెప్పి, మీ సహకారం కాదు-మీ సహకారం నాకు లభించదని నాకు తెలుసు. జోక్యం

లేకుండా చెయ్యగలననే ఆశ. అంతే!''

''చెప్పండి. వింటాను'' అన్నాడు యుగంధర్ బల్లమీద వున్న సిగరెట్ తీసి వెలిగించి.

''యుగంధర్‌గారూ! నేను చెప్పే విషయాలు శ్రద్ధగా వినండి. మనదేశంలో అరాచకమూ, లంచగొండితనమూ, బాగా ఎక్కువై పోయాయి. అటు పాలకుల్లోనూ, ఇటు ప్రజల్లోనూ, స్వార్థం పెచ్చుపెరిగిపోయింది. తోటి మానవుడు ఏమవుతున్నాడో అనే చింత ఎవరికీ, ఏ కోశానా లేకుండా పోయింది.

అందువల్లే, ప్రతి నిత్యావసర వస్తువుకీ కొరత. అందువల్లే సమ్మెలు, అందువల్లే దోపిడీలు-దొంగతనాలు, అందువల్లే రోగాలు, ఒక్కటేమిటి, దేశం నాశనం ఐపోతోంది. ఎవరిగోడు ఇంకొకరు పట్టించుకునే స్థితిలో లేరు. ఇన్‌ఫ్లేషన్ పరుగులు తీస్తోంది. ఇంకొన్నాళ్లు పోతే, ఒక సంచీ నిండా నోట్లు కుక్కుకుని కూరగాయల బజారుకి వెళితే, సంచీ సహానికి కూరగాయలు మాత్రం కొనగలిగే దుర్భర పరిస్థితి ఏర్పడుతుంది. అవునా?'' అడిగాడు.

''క్షమించండి. ప్రశ్నలు వెయ్యకండి మీరు. చెప్పవలసినదంతా చెప్పిన తర్వాత మీరూ, నేనూ ప్రశ్నలువేసుకుని చర్చిద్దాం'' అన్నాడు యుగంధర్.

''సరే. ఇటువంటి స్థితి కలగడానికా! రక్తం ధారపోసి, స్వాతంత్ర్యం తెచ్చుకున్నది; ఇటువంటి నికృష్టపు జీవితాలు జీవించడానికా, లక్షలాది ప్రజలు బ్రిటిష్‌వారి తుపాకీలకి ఛాతీలు చూపించి ఎదురుతిరిగి నిలబడ్డారు! కొద్దిమంది రాజకీయవేత్తలకి పెత్తనం ఇచ్చి, పెట్టుబడిదారులకి దేశం అంకితం చెయ్యడానికా గాంధీజీలాటివారు స్వాతంత్ర్య

సమరం సాగించారు. బ్రిటిష్‌వారి దాస్యంనించి విముక్తి చెందాము నిజమే కాని, నేటి రాజకీయవేత్తల దాస్యంలోకి పోయాము.

ఈ పరిస్థితి మారాలి-మార్చాలి. మార్చేందుకు ఏమిటి మార్గం? ప్రజాస్వామ్యం ద్వారానా! కుల, మత, జాతి, శాఖలంటూ అమాయకప్రజల్లో విరోధాలు తెచ్చిపెట్టి, రాజకీయవేత్తలు నిజమైన ప్రజాస్వామ్యం నిలబడకుండా చేశారు. మరెలా యీ దేశానికి పట్టిన యీ దుస్థితిని మార్చడం! సైనిక అధికారులు ఎదురు తిరిగి, రాజకీయవేత్తలని, జైళ్ళలో పెట్టి, అధికారం చేపట్టడం ద్వారానా! అది యీ దేశంలో జరగదు - అది వాంఛనీయం కాదు - అదీ ఇంకో దాస్యం.

ప్రజలు ఎదురు తిరిగి విప్లవం తెస్తారా! ఏమో! తీసుకురావచ్చు. అలాటి విప్లవమే వస్తే, ఎందరో అమాయకుల రక్తం కాలవలుగా పారుతుంది. లక్షలాది జనం మరణిస్తారు. అలాటి విప్లవం రాకముందే దేశాన్ని, ఆ విపత్తులోంచి తప్పించి, న్యాయమూ-ధర్మమూ నిలబెట్టి, ప్రతి మనిషికి తిండీ, బట్ట, నీడా ఇచ్చి, మనిషి ఇంకో మనిష శ్రమని పీక్కుతినే అవకాశంలేని సమాజం స్థాపించాలనీ, నేనూ-నా మిత్రులం కొందరం, రాత్రింపగళ్లు ఆలోచించి, నిర్దిష్టమైన పథకాన్ని తయారుచేసి అమలు జరుపుతున్నాం.''

''ఏమిటా పథకం?'' అడిగాడు యుగంధర్.

''క్షమించాలి యుగంధర్. ఆ పథకమేమిటో మీకు చెప్పలేను. మిమ్మల్ని ఇక్కణ్ణించి వెళ్ళనివ్వకుండా, ఇక్కడే మిమ్మల్నీ, రాజునీ చంపేసే ఉద్దేశంవుంటే చెప్పేవాణ్ణి.

నాకు అటువంటి ఉద్దేశంలేదు. కనుక చెప్పలేను. మా ఆశయం చెప్పాను. ఆ పథకం ఫలిస్తుందనీ, త్వరలోనే అధికారం మా చేతుల్లోకి వస్తుందనీ, అప్పుడు మా ఆశయాలని అమలు పరుస్తామనీ చెప్పగలను.

X202 అతని దురదృష్టవశాత్తు; మా విషయం, మా పథకం విషయం, మా వర్గంలో ముఖ్యుల ఆనవాలు తెలుసుకున్నాడు. అతన్ని చంపక తప్పలేదు. అతనిలా మా ఉనికి తెలుసుకోవడానికీ, మా పథకం వివరాలు తెలుసుకోవడానికీ ప్రయత్నించేవారికి అదే గతి పడుతుందని, హెచ్చరికగా అతన్ని చిత్రవధ చేసి, పార్కులో పడేశాం అతని శవాన్ని.

క్షమించాలి. ఆ హెచ్చరిక మీకూ వర్తిస్తుంది. నేటి యీ ప్రభుత్వ వ్యవస్థలో ఒకరైన మీరు మాకు సహాయం చేస్తారని ఆశించడం లేదు. నేను కోరేదల్లా మీరు జోక్యం కల్పించుకోకండి. అంతే! మీరంటే నాకు చాలా గౌరవం కనుక చెప్పాను. హెచ్చరిక పాటించకుండా మీరు మా గురించి దర్యాప్తు చేస్తే- తప్పదు మీకూ శిక్ష పడుతుంది.

విశ్వనాధ్‌వల్ల మాకేదో లాభం వుంటుందని, అతన్ని తీసుకువచ్చాము. అతనివల్ల మాకు ఏమీ ప్రయోజనం వుండదని తెలిశాక అతన్ని ఇంటికి పంపేశాము. అతనికి జరిగిన హాని ఏమీలేదు. బాగా ఆలోచించుకోండి యుగంధర్. అనవసరంగా అమూల్యమైన మీ ప్రాణాన్ని పోగొట్టుకోకండి! గుడ్‌బై!''

స్పీకర్ ఆపేశాడని యుగంధర్ గ్రహించాడు. తను మాట్లాడి ప్రయోజనంలేదని తెలిసింది. నిమిషం తర్వాత తలుపు తెరుచుకుంది. గదిలోకి ఇద్దరు వచ్చారు.

10

X202 ఫ్లాట్‌నించి పోలీసులు ఫోన్ చెయ్యగానే బండార్కర్ వెంటనే వెళ్ళాడు. పడకగదిలో మంచంమీద పడివున్న వస్తువులన్నీ చూశాడు బండార్కర్.

యుగంధర్ రాజుల పిస్తోళ్లు, విజిటింగ్ కార్డు, వాళ్ళ వృత్తికి సంబంధించిన మరికొన్ని వస్తువులు చూశాడు. వార్డ్‌రోబ్‌లో వున్న మెషిన్‌గన్ చూశాడు.

యుగంధర్ రాజులకి ఏదో ఆపద జరిగిందని తెలుసు. ఏమిటది? వాళ్ళని అక్కణ్ణించి ఎలా తీసికెళ్ళారు? ఎక్కడికి? ఇవన్నీ ప్రశ్నలుగానే వుండిపోయాయి బండార్కర్‌కి.

దర్యాప్తు పోలీసులకి వదిలిపెట్టి బండార్కర్ తన హోటలుకి తిరిగివచ్చాడు.

యుగంధర్ కాని, రాజు కాని, ఫోన్ చేస్తారనే ఆశ పోయింది. గదిలో పచార్లు చేస్తున్నాడు. రాత్రి ఎన్నిగంటలైందోకూడా తెలియదు. చేతిగడియారంకూడా చూసుకో లేదు.

తలుపు చప్పుడయ్యేసరికి బండార్కర్ ఉలిక్కిపడ్డాడు. తలుపు తియ్యడానికి తలుపువరకూ వెళ్లి, ఆగి, వెనక్కి వెళ్లి, దిల్ల సొరుగులోంచి పిస్తోలు తీసుకుని తలుపుతీశాడు.

"యస్. ఎవరు కావాలి?" అడిగాడు. నడవాలో వెలుగు ఆట్టేలేదు.

"మిస్టర్ బండార్కర్!"

"నేనే." ఆ వచ్చిన ఇద్దరూ గదితలుపు దాటి లోపలకి వచ్చారు. ముందున్న అతని చేతిలో ఒక చీటీ వుంది. ఆ చీటీ బండార్కర్‌కి ఇచ్చి, "వీరు ఎక్కడున్నారో చెప్పు

తారా? వారిని కలుసుకుంటే మాకు సహాయం చేస్తారుట" అన్నాడు. బండార్కర్ ఆశ్చర్యంతో చూశాడు వాళ్లని. ఆ ఇద్దరూ యుగంధరూ, రాజూ. యుగంధర్ చేతిలో చీటీ తీసుకున్నాడు బండార్కర్.

"యుగంధర్-రాజు" అని వ్రాసివుంది చీటీమీద. ఆ డిటెక్టివ్‌ల కళ్ళు మత్తుగా వున్నాయి. బెదురుచూపులు చూస్తున్నారు. "నేను ఎవరో మీకు తెలియనా?" అడిగాడు బండార్కర్.

"చెప్పారుగా ఇప్పుడే మీపేరు బండార్కర్ అని" అన్నాడు యుగంధర్.

"మీ పేరు?" అడిగాడు బండార్కర్ ఆశ్చర్యంతో.

"క్షమించాలి. నాపేరు ఏమిటో నాకే తెలియదు. అదే చిక్కు. యుగంధర్ని కలుసుకుంటే మేము ఎవరో ఆయన చెపుతారట" అన్నాడు యుగంధర్.

—(సశేషం)

డిటెక్టివ్:_హంతకుడు ఎలా వుంటాడు?

క్లయింట్:_నల్లగా, బొద్దుగా వుంటాడు. అతడి చేతిలో ఎప్పుడూ పిస్టలుంటుందండి.

చివరి మాటలు విన్న డిటెక్టివ్, "అతడి చేతిలో ఎప్పుడూ పిస్టలుంటుం దంటూరా! అయితే, కేసు చాల క్లిష్టమైందిగా వున్నట్లుంది. మీరు మరో డిటెక్టివ్‌ని కల్సుకోండి," చెప్పాడు నెమ్మదిగా.

—సి. సుబ్రమణ్యం, ఖాదరాబాద్.



(బహుమతి రు. 100-/ నగదు)

1

ఆడిసన్ అనే అమెరికా దేశస్థుడు, మాధురి అనే భారతీయ వనిత, ఒక ఇటాలియన్ నౌకలో ప్రయాణిస్తున్నారు. నౌక అంతర్జాతీయ జలాలలో ఉండగా ఆడిసన్, మాధురి రిస్ట్‌వాచీ, నగలూ దొంగిలించాడు.

కొద్ది రోజులకు ఆ నౌక బొంబాయి హార్బర్ చేరుకుంది.

మాధురి, ఆడిసన్‌పై దొంగతనం నేరం క్రింద కేసు పెట్టింది. ఆడిసన్‌ను అరెస్ట్ చేశారు. అతని వద్ద మాధురి నగలు, రిస్టువాచీ దొరికాయి. అవి మాధురివేనని రుజువైంది.

కాని, కోర్టులో ఆసడిన్, తాను అమెరికన్ దేశస్థుడననీ, తనను శిక్షించే అధికారం భారతదేశపు కోర్టులకు లేదని వాదించాడు.

మీరెలా తీర్పు ఇస్తారు?

2

ఏదో విషయంలో తగాదా వచ్చింది అప్పారావు, సుబ్బా రావులకు. అప్పారావు పగబట్టి సుబ్బారావును తీవ్రంగా గాయ పరిచాడు.

సుబ్బారావు ఏ డాక్టరు వద్దకు వెళ్ళక ఇంటిలోనే చిట్కా వైద్యం చేసుకున్నాడు. కొద్ది రోజులలో మరణించాడు.

పోలీసులు అప్పారావుపై కేసు పెట్టారు 'కల్పబుల్ హోమీసైడ్' నేరం క్రింద.

ప్రముఖ డాక్టరు ఒకరు, సుబ్బారావు వెంటనే తగిన వైద్యం చేయించుకుంటే బ్రతికేవాడని, ఎక్స్‌పర్ట్ ఒపీనియన్ చెప్పాడు.

ఆ సాక్ష్యాన్ని ఆధారంగా తీసుకున్న అప్పారావు, సుబ్బా రావు అశ్రద్ధే అతని మరణానికి కారణమనీ, అందువలన తాను నిర్దోషిననీ వాదించాడు. దీనికి మీ తీర్పు ఏమిటి?

3

శాస్త్రి, నారాయణ స్నేహితులు. ఒకరోజు శాస్త్రి ఇంట్లో వాళ్ళు కలుసుకొని మాట్లాడుకుంటున్నారు. వారి మధ్య ఎందుకో పోట్లాట వచ్చింది.

నారాయణ కోపంతో తన చేతిలోని కర్రను శాస్త్రి మీదకు గురి చూశాడు. శాస్త్రి భార్య స్నేహితుల మధ్య వివాదం తప్పించుదామని వారిమధ్య నిలచింది.

ఆ దెబ్బ ఆమె భుజంపై ఉన్న పసిపాపకు తగిలి, తీవ్ర మైన గాయం ఏర్పడింది. తరవాత ఆ పసిపాప మరణించింది.

పోలీసులు నారాయణను అరెస్ట్ చేసి 'కల్పబుల్ హోమి సైడ్' నేరం ఆరోపించారు.

పసిపాప మరణానికి నారాయణ కారకుడని ప్రాసిక్యూషన్

వాదించింది.

"నేను శాస్త్రిని కొట్టబోయాను. మధ్యలో శాస్త్రి భార్య అడ్డు రావటం వల్ల అది ఆమె భుజంపై నున్న బిడ్డకు తగిలింది. ఇది కేవలం ప్రమాదవశాత్తూ జరిగింది. ఆ పాప అంటే నాకూ చాలా అభిమానం. నేను నిర్దోషిని" అన్నాడు నారాయణ.

మరి మీరేమంటారు?

* * *

[పై మూడు కేసులకు మీ తీర్పు ఎలా ఇస్తారో, వివరంగా ఒక పోస్ట్ కార్డుపై గాని, పోస్ట్‌కార్డు సైజు తెల్ల కాగితంపై గాని వ్రాసి, యీ నెల 20 వ తేదీలోగా మాకు చేరేటట్లు పంపండి. సరియైన తీర్పు ఇచ్చిన "హోమ్‌డెలివరీ" పాఠకుల పేర్లు అక్టోబరు '74 నెల సంచికలో ప్రకటిస్తూ, అత్యుత్తమ తీర్పు నిచ్చిన ఇద్దరు సభ్యులకు ఒక్కొక్కరికి రు. 50/-లు చొప్పున రు. 100/-లు నగదు బహుమతి పంపగలము.

"హోమ్ డెలివరీ" సభ్యత్వము లేని పాఠకుల జవాబులు ఎంతమాత్రం పరిశీలించటం జరగదు. సభ్యులు తమ నెంబరును విధిగా వ్రాయాలి. ఇప్పటి వరకు సభ్యత్వము పొందని పాఠకులు వెంటనే తమ సభ్యత్వ రుసుమును పంపుతూ పోటీలలో పాల్గొన వచ్చును. తుదినిర్ణయం సంపాదకులదే.

—ఎడిటర్.]

జూన్ '74 వివా తీర్పు?

(1) సూరయ్య, నరసయ్య నేరస్థులు:

ఎవరైనా పరొకరిని ప్రోత్సహించి, నేరం చేయిస్తే, అలా ప్రోత్సహించిన వారు కూడా శిక్షార్హు లవుతారు. ఈ

కేసులో నరసయ్య, సూరయ్యను బాగా త్రాగించి, ప్రోత్స హించి, వెంకయ్య ఇంటికి నిప్పు పెట్టించాడు. అందువలన ఈ కేసులో ఇరువురూ నేరస్థులే.

(2) అరుణ్ కుమార్ నేరస్థుడు, రాజీవ్ నిరపరాధి!

మతిహీనుడైన వ్యక్తి చేసే ఏ పనినీ నేరంగా పరిగ ణించరు. అందువలన రాజీవ్ నిరపరాధి. కాని దురుద్దేశంతో మరొకరిచేత హత్యా ప్రయత్నం చేయించి నందుకు అరుణ్ కుమార్‌కు శిక్ష తప్పదు.

(4) అహమ్మద్ ఖాన్‌ను శిక్షించాలి!

ఐ. పి. సి. సెక్షన్-378లో దొంగతనానికి ఇచ్చిన నిర్వ చనాల ప్రకారం, అహమ్మద్‌ఖాన్ దొంగతనం చేసినట్లే అవుతుంది. అతను కుక్కను తాకకపోయినా, దానిని ఆక ర్షించడానికి ఎముకలు జేబులో వేసుకుని నాటకం ఆడాడు. అందువలన అతడు నేరస్థుడే.

పై విధంగా అత్యుత్తమ తీర్పు చెప్పిన పాఠక న్యాయ నిర్ణేత—మిస్. డి. హైమావతి, కేరాఫ్- డి. సీతారామారావు (ఏ. ఇ.) 10 పి. పి. సి. క్వార్టర్స్, తిరుమలై హిల్స్ (చిత్తూరు జిల్లా) గారికి బహుమతి పైకం రు. 50/-లు యీ నెలాఖరులోగా అందజేయబడుతుంది.

పై మూడు కేసులకు సరియైన తీర్పు చెప్పగలిగిన ఇతర పాఠక న్యాయనిర్ణేతలు :

1. ఆర్. అప్పలాచారి, (బి. ఇ., జూనియర్ ఇంజనీర్) హైద్రాబాదు. 2. కూచిభొట్ల శ్రీనివాసశాస్త్రి, (బి. ఏ.) గుడి వాడ. 3. శ్రీమతి కురుమద్దాలి విజయలక్ష్మి, (రచయిత్రి) విజయవాడ. 4. శ్రీమతి ఐ. హేమప్రభ, (ఎం. ఏ.) బేగం పేట. 5. ఏ. షఫీవుల్లా, (సినీ ఆపరేటర్) కడప. 6. శ్రీమతి జి. ప్రభావతి, కాకినాడ. 7. ఆర్. నరసింహం, (అడ్వొకేట్)

బెంగుళూరు. 8. ఎన్. వాసుదేవాచార్, (ఉడిపి హోటల్) ఆలూరు. 9. వడ్లమూడి శేషగిరిరావు, (ప్రొప్రయిటర్, అభ్యుదయ గ్రంథమాల) గుడివాడ. 1. కడలి వీరవెంకట సత్యనారాయణ, (బి. కాం.) పుల్లేటికుర్రు.

11. ఉప్పలూరి మురళీకృష్ణ, (ఎమ్.ఎస్ సి., రచయిత, లెక్చరర్) ఇచ్ఛాపురం. 12. శ్రీమతి కాశీ అనంత లక్ష్మి, (రచయిత్రి) విశాఖపట్నం. 13. ఆర్. కె. యోగానంద్, (ఎమ్.ఎస్‌సి.) బళ్ళారి. 14. మర్రి సూర్యనారాయణ, పుల్లేటికుర్రు. 15. ఎస్. వాహిద్, (ప్రవేట్ మాస్టర్) కడప. 16. డాక్టర్ పి. ప్రహ్లాదరావ్,(ఎం.ఏ., ఎల్.ఎల్.బి.) గద్వాల. 17. శ్రీమతి కోకా అన్నపూర్ణ, (బి. ఎస్‌సి., టీచర్) ఖైరతాబాద్. 18. బి. శౌరయ్య, (పోలీస్ ఇన్ స్పెక్టర్) హైద్రాబాద్. 19. మిట్టపల్లి నిరంజన్, (టర్నర్ ఆపరేటర్) సికింద్రాబాద్. 20. తేల్కర్ శంకరరావు, (జర్నలిస్ట్) పామిడి.

21. శ్రీమతి పీసపాటి నవనీతం, (టైపిస్ట్) కటక్. 22. శ్రీమతి జి. కె. లైలా, (టీచర్) రాజమండ్రి. 23. శ్రీమతి ముళ్ళ సులోచనా రెడ్డి, విశాఖపట్టణం. 24. సందా వెంకటరమణ, కడప. 25. బొల్లాప్రగడ సుబ్రహ్మణ్యం, (బి.కాం) కాకినాడ. 26. శ్రీమతి పి. రత్నకుమారి, (ల్యాండ్ లార్డ్) అకివీడు. 27. బి. ఆర్. రావ్, యెలమంచిలి. 28. జి. నారాయణరావు, (బి కాం.) ఏకాంబరకుప్పం. 29. జమ్ము సత్యనారాయణ, (బి. కాం., క్లార్క్) వేడంగి. 30. శ్రీమతి ఎమ్. ఎన్. ప్రకాశరావు, (టీచర్) నల్లగుట్ట.

31. కోనే నాగవెంకట ఆంజనేయులు, (బి. కాం.) ఏలూరు. 32. శ్రీమతి ఎమ్. ఆర్. కె. తులసి, (లెక్చరర్) మలక్ పేట. 33. యం. శంకర్ రెడ్డి, (న్యూస్ ఏజంట్)

బెల్లంపల్లి. 34. డాక్టర్ బి. కేశవరావు, (ఎం.బి.బి.యస్.) సికింద్రాబాద్. 35. శ్రీమతి పి. సుందరమ్మ, (ఎం. ఏ.) బర్కత్‌పురా. 36. ఎమ్. సత్యనారాయణమూర్తి, (బి.కాం,) కాకినాడ. 37. బి. వి. ప్రకాశరాజు, (టీచర్) చింతపల్లి. 38. రాంరాజు ప్రభాకరరావు, (బి.కాం.) గుండెపురి. 30. శ్రీమతి కొమ్మారెడ్డి రోజలీన, మఠంపల్లి, 40. శ్రీమతి కళాలక్ష్మి హైద్రాబాద్.

41. టి. రామమూర్తి, (బి. ఏ.) చిత్తూరు. 42. కె. పురుషోత్తంపాత్రో, (టైంకీపర్) విశాఖపట్టణం. 43. పోకా తిరుపాలు, (ఆర్మీ) పూనా. 44. శ్రీమతి జొన్నలగడ్డ రమాదేవి, (బి.ఎస్సీ., టీచర్, రచయిత్రి) రాజమండ్రి. 45. కె. లక్ష్మిరెడ్డి, (అడ్వొకేట్) నల్లగొండ. 46. రెడ్ రోజా, వసంతవాడ. 47. బొయ్నపల్లి భుజంగరావు, (బి.కాం.) సల్కునూరు. 48. పి. ఎల్. ఎస్. బాబ, (ల్యాండ్‌లార్డ్) అకివీడు. 49. పచ్చిపులుసు నారాయణ మూర్తి, (ఇంటర్) గోపాలపురం. 50. ఎన్. రాజగోపాలన్, (బి.కాం.) నిడదవోలు.

51. శ్రీమతి. కె. కళ్యాణి, (సేల్పగరల్) హిమాయత్ నగర్. 52. రాణి కమలాదేవి, (ఎమ్.ఎస్‌సి., టీచర్) గుంటూరు. 53. జెడిగం రంగనాయకులు, (సేల్స రిప్రజెంటెటివ్) బొంబాయి. 54. వజ్రాలరాజా, (బి. ఏ.) కడప. 55. వహీద్ ఖన్నా, (రచయిత) హైద్రాబాద్. 56. ముద్దా రమేష్, కాకినాడ. 57. షేక్ గౌస్‌బాషా, (ఇంటర్) కావలి. 58. బి. వరదయ్య, ప్రొద్దుటూరు. 59. బి. సరాశ్రీ, (ఇంటర్) రుద్రంపూర్. 60. వి. ఎస్. బాపిరెడ్డి, విజయవాడ.61. ఎమ్.ప్రసాదరావు, సికింద్రాబాద్. 62. మిస్. శ్యామలాజ్యోతి, కందకుర్తి - తదితరులు.... ★

ఈనెల జోక్స్

-డా॥ పెందుర్తి మాష్టర్జీ

అరష్టు చేయబడ్డ యువకుడి తండ్రితో యస్.ఐ అన్నాడు. "ఏమండి, మీ అబ్బాయి చాలా మంచివాడే కదా! యీ దొంగతనం ఎలా చేశాడంటారు?"

"మొన్న యాక్సిడెంట్ అయినప్పుడు ఒక దొంగ వెధవ రక్తం ఎక్కించామండి. అప్పటి నుండి యిలా తయారయ్యాడు."

* * *

"లక్షలు సంపాదించటం ఎలా? అనే గ్రంధాన్ని రచియించింది మీరేకదా! మీ యిల్లు కనుక్కోలేకపోయానుసుమండి" అన్నాడొక పాఠకుడు.

"భలే వారండి. పదేళ్ళ నుండి యిదే తాటాకుపాకలో

వుంటున్నాను'' అన్నాడు ఆ మహారచయిత.

*　　　*　　　*

ఒక హత్యకేసులో సాక్ష్యాలు సేకరిస్తున్న ఇన్‌స్పెక్టర్ సాక్షిని అడిగాడు.

''హత్య జరిగింది మీ గడియారాల షాపులో. నీకు టైము తెలియకపోవట మేమిటి?''

''చిత్తం ఆ గడియారాలలో ఒక్కటి కరక్ట్ టైము చూపటం లేదండి.''

*　　　*　　　*

''ఆ అమ్మాయి నన్ను చాలా అవమాన పరిచింది!''

''ఆ అమ్మాయి నిన్ను చూడనేలేదు కదా!''

''అదే అనేది. నేను గంటనుండి చూస్తుంటే కనీసం ఒక్కచూపు నన్ను చూడకపోవటం అవమానం కదా!''

*　　　*　　　*

ఒక జడ్జి వాది కథనం విని ''నీవు చెప్పినట్లు ఆమె అతని భార్యలాగే వుందోయ్'' అన్నాడు.

ప్రతివాదికి కోపంవచ్చి గంట వాదించాడు.

''నీవు చెప్పినట్లు భార్యకాదు లాగుందోయ్'' అన్నాడు జడ్జి.

అందుకాయువతికి కోపంవచ్చి ఓ గంటసేపు వాగింది.

''నీవు చెప్పినట్లు వాది, ప్రతివాదిది తప్పులా వుందమ్మాయి'' అన్నాడు జడ్జి.

అందుకా భర్త ''అందరిది కరెక్ట్ ఎలా అవుతుందండి'' అన్నాడు.

"నీవు అన్నది కరెక్టేనోయ్" అన్నాడు జడ్జి తాపీగా.

* * *

ఒక డిటెక్టివ్ రచయిత భార్య, మరోమ్మాయితో అంటుంది:

"మావారు ఒక ప్రఖ్యాత డిటెక్టివ్ నవల వ్రాస్తున్నారు."

"ఎందుకమ్మా కొనుక్కుంటే పోదూ!" అందా మిత్రురాలు.

* * *

"ఏమండీ! మీ యింట్లో దొంగతనం ఎలా జరిగింది?" ఎస్.ఐ. ప్రశ్న.

"నైట్ వాచ్‌మన్ కావాలని పేపర్లో వేశాం. అంతే ఆ రాత్రే దొంగతనం జరిగింది."

* * *

జ్యోతిష్కమొచ్చిన ఒక లాయరు, ఒక క్లయింటుతో అన్నాడు.

"యీ కేసు జాతకాన్నిబట్టి నా దగ్గరకు రాకముందు మొదట ఒక పనికిమాలిన లాయర్ని చూసివుండాలి. ఏ లాయర్ని చూశారు?"

"ఎవర్నీ చూడలేదండి. మీరే మొదలు."

*   *   *

"ఇంత దారుణమయిన హత్య ఎలా చేశావు? నీవు మనిషివా, రాక్షసుడివా?" అన్నాడు జడ్జి.

అందుకా ముద్దాయి "సరిగ్గా యిదే మాటన్నాడండి. అందుకే చంపివేశాను" అన్నాడు కోపంగా.

"అయితే వాడ్ని గట్టిగా పట్టుకోండి. మరో హత్య కూడా చేయొచ్చు" అన్నాడు జడ్జి భయంగా, పోలీసులను ఆదేశిస్తూ.

*   *   *

"యీ కళ్లద్దాలకు చీమలు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి, డాక్టర్."

"అవి చీమలు కావండి స్వామి, బొద్దింకలు" అన్నాడు డాక్టర్.

★

రమణశ్రీ
చంద్ర..

"జాగ్రత్తగా దిగు. అక్కడ దిగగానే క్షేమంగా చేరినట్లు వుత్తరం వ్రాయి. బాబు జాగ్రత్త!" బస్ కదలబో తూండగా పదవసారి హెచ్చరించాడు జగపతిరాజు భార్యను.

"అలాగే. మీ ఆరోగ్యం జాగ్రత్త. నేను లేనుకదాని, చిల్లర తిరుగుళ్ళు తిరగకండి. ఒంటికి మంచిది కాదు. సాధ్య మైనంత త్వరలో వచ్చేస్తాను" బస్‌లోంచి హెచ్చరించింది శశికళ.

బస్ గర్భిణీ స్త్రీలా మెల్లగా నడుస్తూ స్టాండు వదిలింది.

హుషారుగా యీల వేసుకుంటూ బస్‌స్టాండ్ కాంటీన్ లోకి నడిచాడు జగపతిరాజు.

సర్వర్ని పిలిచి వేడి దోశకు ఆర్డరిచ్చాడు.

జగపతిరాజు రైల్వేడివిజనల్ ఆఫీసులో క్లార్కుగా పని చేస్తున్నాడు. వారం రోజుల నుండి దేశవ్యాప్తంగా జరుగు తున్న రైల్వే పనివారి సమ్మెలో అతనూ పాల్గొంటున్నాడు. సమ్మె అసలు ప్రారంభ మవదు అనుకున్నాడు. కానీ ప్రారంభమైంది. ఏదో రెండు రోజులు జరుగుతుంది, అంతేలే అనుకున్నాడు. కానీ వారం రోజులైంది. ఇంకా విరమించే సూచనలు కనబడలేదు. ఇంకా ఎంతకాలం జరుగుతుందో అర్థం కావడం లేదు. క్రిందటి నెల తాలూకు జీతాలు ఇంకా రాలేదు.

నెల జీతాల మీద ఆధారపడే వాళ్ళు. ఓ నెల జీతం అందకపోతే, బస్తీలో జీవనం గడపడం చాలా కష్టమే! పోనీ వుద్యోగంలోకి వెళ్ళి జీతం తీసుకుందామంటే. యూని యన్ వాళ్ళతో ఓ పెద్ద పేచీ వచ్చేలా వుంది. అదీ గాక పేపర్లలో చూస్తూనే వున్నాడు. విధేయులైన సిబ్బంది అగ చాట్లు.

సరిగ్గా అదే సమయంలో ఆపదలో ఆపద్బాంధవుడిలా

శశికళ ఫ్రెండ్ దగ్గర నుండి ఓసారి వెంటనే రమ్మని పిలుపు వచ్చింది. వెంటనే ఓ నిర్ణయానికి వచ్చాడు జగపతిరాజు. భార్యను స్నేహితురాలింటికి పంపిస్తే, కొంత ఖర్చు తగ్గుతుందని భావించి ప్రయాణానికి తగిన ఏర్పాట్లు చేశాడు.

కానీ శశికళ ఓ పట్టాన ఒప్పుకోలేదు. తను లేకపోతే భర్త ఎలా తిరుగుతాడో శశికళకు బాగా తెలుసు.

జగపతిరాజుకి స్త్రీ వ్యసనం కొంచెం ఎక్కువ. కాలేజీ స్టేజిలోనే ఒక వెలుగు వెలిగాడు. అతని పెళ్ళి కూడా విచిత్రంగానే జరిగింది. ఆఫ్‌కోర్స్ అది పెళ్ళి అని చాలామంది అనరు. ఉద్యోగంలో స్థిరపడిన తరువాత గూడా జగపతిరాజులో పెద్ద మార్పేమీ కనబడలేదు. ఐతే పెళ్లాం మోజులో కొంత మార్పు కనబడినా, అతని మనస్సు అప్పుడప్పుడు వెరైటీని కోరుతుండేది.

ఇటీవలే అతని చూపు ఎదురింటి కనకమ్మ మీద పడింది. శశికళ వచ్చేలోగానే కనకాన్ని లొంగదీయాలని పథకం వేస్తున్నాడు.

టిఫెన్ చేసి, కాఫీ త్రాగి బయటకు వచ్చాడు జగపతిరాజు.

అతని మనస్సంతా ఫ్రీగా వుంది. హృదయమంతా సంతోషంతో నిండివుంది.

దానికి కారణం ఆ రోజు రాశిఫలం.

జగపతిరాజుకు జ్యోతిష్యాల మీద అపారమైన నమ్మకం వుంది. అతని జీవితంలో చాలావరకు జ్యోతిష్కులు చెప్పినట్లే జరిగింది.

బయటకు రాబోతూండగా ఎదురుగా భారత్ మెజర్స్ వారి వేయింగ్ మెషిన్ కన్పించింది.

అతని మనస్సులో ఏదో ఆలోచన చటుక్కున మెరిసింది.

గబగబ మెషిన్ దగ్గరకు నడిచాడు.

మెషిన్ స్టెప్స్‌మీద నిలబడి. బల్బ్ వెలగగానే జేబులో నుంచి పదిపైసల నాణెం తీసి హోల్‌లో వేశాడు.

గిర్రున చక్రం తిరిగింది. పది సెకన్లలో వెయిట్ నోట్ చేసిన కార్డు మరో హోల్‌లోంచి వచ్చింది.

వెయిట్ చూసుకున్నాడు. 50 కిలోలు.

కార్డు వెనక్కు తిప్పాడు. ప్రతి కార్డు వెనుక ఫ్యూచర్ గురించి వ్రాసి వుంటుంది.

'మీరు చాలా అదృష్టవంతులు. త్వరలోనే కష్టాలనుండి విముక్తి పొందుతారు' అని ఇంగ్లీషులో వ్రాసివుంది రెండు లైన్లలో.

ఆ రెండు లైన్లను మూడుసార్లు చదువుకున్నాడు జగపతి రాజు.

అతని మనస్సు ఆనందంతో పురకలు వేసింది.

ఉదయం కొన్న తమిళనాడు రాఫిల్ టికెట్ కళ్ళముందు రెపరెప లాడింది. స్పెక్యులేషన్ మార్కెట్ అంతా కళ్ళ ముందు డాన్స్ చేసింది.

'ఈసారి తనను తప్పక అదృష్టం వరించాలి. తను కొన్న తమిళనాడు రాఫిల్ డ్రాలో ఫస్ట్ ప్రయిజ్ లక్ష రూపాయలు తనకే వస్తాయి. ఇక ఆర్థికపరమైన కష్టాల నుండి విముక్తి పొందవచ్చు' అనుకున్నాడు జగపతిరాజు.

అదే సమయంలో మరో ఆలోచన వచ్చింది జగపతి రాజుకు.

వెంటనే పబ్లిక్ ఫోన్ దగ్గరకు నడిచాడు.

రిసీవరు అందుకొని నంబర్ డయల్ చేశాడు. అవతల నుండి రెస్పాన్స్ రాగానే నాలు పదిపైసల బిళ్ళలు బాక్స్‌లో వేసి 'హల్లో!' అన్నాడు.

"రహంతుల్లా అండ్ కంపెనీ. స్పెక్యులేషన్ ఏజంట్స్

హియర్" వినబడింది.

"సలామ్ అలేకుం రహంతుల్లా సాబ్. నేను జగపతి రాజును మాట్లాడుతున్నాను."

"అలేకుంసలామ్‌జీ సాబ్. ఏమిటి విశేషం?" అడిగాడు.

"నేను క్రితం వారం బుక్‌చేసిన కాటన్ మార్కెట్ ఎలా వుంది?"

"బహుత్ అచ్ఛా సాబ్. మీకు మంచి లాభాలు వస్తాయి."

"థాంక్యూ. జూట్ మార్కెట్ ఎలా వుంది? స్పెక్యులేషన్ ఏమన్నా లాభించే సూచనలు వున్నాయా?" అడిగాడు.

"ఓ సాబ్, ఈ నిమిషం వరకు జూట్ మార్కెట్ మూడువందల యాభై అయిదు రూపాయలు వుంది. మార్కెట్ మంచి రైజింగ్ పొజిషన్‌లో వుంది. ఏమన్నా బుక్ చేయమంటారా?"

"రైటో! నా పేరున ఓ అయిదువేలకు బుక్ చేయించండి. సాయంత్రం వచ్చి అడ్వాన్స్ పే చేస్తాను."

"జీ సాబ్!"

"అచ్ఛా."

రిసీవర్ క్రెడిల్ చేశాడు జగపతిరాజు.

'తనకీ రోజు చాలా బాగుంది. తన రాశిఫలంబట్టి లాటరీలో లక్షరూపాయలు, స్పెక్యులేషన్‌లో ఓ ఇరవై వేలు రావాలి' అనుకున్నాడు జగపతిరాజు.

తృప్తిగా నవ్వుకున్నాడు.

జేబులోంచి బర్కిలీ సిగిరెట్ తీసి వెలిగించి గుండెలదాకా పొగపీల్చి వదిలాడు జగపతిరాజు.

కనకం గుర్తుకు వచ్చింది. ఆమె వంపులు మత్తెక్కిస్తూ కవ్వించాయి.

'ఎలాగైనా సరే, యీ వారంలో కనకంను లొంగ

మీకు తెలుసా?

1. నైట్రో గ్లిసరీన్ ప్రేలుడు పదార్థం. కాని దీనిని గుండెజబ్బు రోగులకు మందుగా వాడతారు.

2. సీమటపాకాయలను డబ్బా కిందో, బిందెకిందో వుంచి కాల్చటం మనకు సర్వసాధారణం. కాని ఇలా చేయటం చాలా ప్రమాదం. అలాటి వస్తువు ఒక చిన్న సైజు బాంబుతో సమానం.

3. టపాకాయలు ఇంటి లోపల కాల్చటం అట్టే మంచిదికాదు. సరియైన వెంటిలేషన్ సదుపాయాలు లేకుంటే ఊపిరి ఆడక చనిపోయే ప్రమాదముంది.

4. ఆస్ట్రేలియా జనాభా 13 మిలియన్లు. మన దేశ జనాభా ప్రతి సంవత్సరం 13 మిలియన్లకు పైగా పెరుగుతూంది.

5. కృష్ణాజిల్లాలోని తోర్రగుంటపాలెం అనే 86 చ॥ మైళ్ళ విస్తీర్ణం ఉన్న గ్రామపు జనాభా కేవలం ముగ్గురు మాత్రమే.

6. ఆరోగ్యవంతుని శరీరంలో ఉండే రక్తం 6_7 లీటర్లు.

7. మగవాడిలో ప్రతిక్యూబిక్ మిల్లీ మీటరు రక్తంలో 48_50 లక్షల ఎర్ర రక్త కణాలుంటాయి. స్త్రీలో 40_45 లక్షల ఎర్ర కణాలుంటాయి.

8. భూగ్రహానికి చంద్రుడు ఒక్కడే. కాని జూపిటర్ గ్రహానికి 12 మంది చంద్రులున్నారు.

9. చంద్రుడు తనచుట్టూ తాను ఒకసారి తిరగటానికి 27 రోజులు పడుతుంది. అంటే చంద్రమండలం మీద ఒకరోజు మన లెక్క ప్రకారం 27 రోజులు.

—ఏ. కల్యాణి.

దీయాలి' స్థిరంగా నిశ్చయించుకున్నాడు.

సిగరెట్ పీలుస్తూ కులాసాగా స్టాండింగ్‌లోంచి బయటకు నడిచాడు జగపతిరాజు.

* * *

సన్నగా యీలపాట పాడుకుంటూ నడుస్తున్నాడు జగపతి రాజు. అతని మనోఫలకంపై లాటరీ టికెట్టు, స్పెక్యులేషన్ మార్కెట్, కనకం, అన్నీ ఒకటి తర్వాత ఒకటి సినిమా రీళ్ళులా కదిలిపోతున్నాయి.

నడుస్తున్నవాడల్లా హఠాత్తుగా వులిక్కిపడి ప్రక్కకు గెంతాడు జగపతిరాజు.

కీచుమంటూ ఆగింది అంబాసిడర్.

"ఏయ్ మిష్టర్, బతకాలని లేదా? అంత చావాలనివుంటే కారుక్రిందకాదు, కాలువలో దూకు" చిన్నగా అరిచాడు డ్రైవ్ చేస్తున్న వ్యక్తి.

ఆశ్చర్యపోతూ అటు చూశాడు జగపతిరాజు.

ఎర్రటి శరీరచ్ఛాయ, నెరసిన బట్టతల, గంభీరమైన విగ్రహం, హుందాగా కూర్చొని వున్నాడు డ్రైవింగ్ సీటులో. అతని కళ్ళకున్న వైట్ గాగుల్స్‌లోంచి జగపతి రాజును నిశితంగా చూస్తున్నాడు.

"సర్, ధనగర్వంచే కారు వున్నదనే అహంకారంతో ఇష్టమొచ్చినట్లు మాట్లాడకండి. నేను సరియైన రూట్‌లోనే వెడుతున్నాను. నువ్వే రాంగ్‌రూట్‌లో వచ్చి నాకు డాష్ ఇవ్వబోయావు. నేను అదృష్టవంతుడినికనుక తప్పుకో కలిగాను. మరెప్పుడూ ఇలా మాట్లాడక. నాకు అదృష్టం కలిసివస్తే రేపు నీ దగ్గిరనుండే యీ కారును నేను కొనవచ్చు. టీ కేర్" విసురుగా అన్నాడు జగపతిరాజు.

చిన్నగా నవ్వాడా వ్యక్తి.

"రాజూ!" పిలిచాడు.

ఆశ్చర్యపోతూ చూశాడు జగపతిరాజు.

"మిష్టర్ జగపతిరాజూ!" మళ్ళీ పిలిచాడు.

ఈసారి మరింత ఆశ్చర్యపోయాడు జగపతిరాజు.

"ఎవరు మీరు? నా పేరు మీకెలా తెలుసు?"

మళ్ళీ నవ్వాడా వ్యక్తి. తన పిల్లిగడ్డం సవరించుకొంటూ-

"మిష్టర్ రాజూ, నాకు నీ పేరేకాదు, నీ చరిత్ర మొత్తం తెలుసు."

"మీ కెలా తెలుసు?".

"తెలుసుకోవాలని వుందా? ఐతే కారు ఎక్కు."

"ఎక్కడికి?"

"నేను తీసుకు వెళ్లిన చోటుకు."

"ఎందుకు?"

"మిష్టర్ రాజూ! నువ్వు చాలా అదృష్టవంతుడివి. అందుకే నా దృష్టిలో పడ్డావు. నీకు అదృష్టం కలిసి రావాలంటే కారు ఎక్కు" చిన్నగా నవ్వాడా వ్యక్తి.

అదృష్టం పేరు వినగానే ఎగిరి గంతేశాడు రాజు.

"ఐతే పదండి" కారు ఎక్కి డోర్ మూశాడు.

కారు స్పీడ్‌గా ముందుకు సాగింది.

"మిమ్మల్ని నే నెక్కడా చూసినట్లు గుర్తులేదు. మీకు నా పేరెలా తెలిసిందో అర్థంకావడంలేదు" ఆశ్చర్యంగా అడిగాడు జగపతిరాజు.

చిన్నగా నవ్వాడా వ్యక్తి.

"మీరు వూహించింది నిజమే. మీకూ, నాకూ ఎక్కడా పరిచయం లేదు. కానీ నాకున్న కొన్ని అపూర్వ శక్తుల వలన మీ గురించిన వివరాలన్నీ తెలిశాయి."

"అపూర్వ శక్తులా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును. నేను వారణాసి విశ్వవిద్యాలయంలో తెలుగు ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాను. నా పేరు సేత్నా."

"ఆశ్చర్యంగా వుందే! మీ పేరు చూస్తే మీరు ఆంధ్రులలా కనబట్టంలేదు."

"కరెక్ట్! నేను బెంగాలీని. నాకు తెలుగుమీద మక్కువ ఎక్కువ. అలాగే మంత్రాలు, తంత్రాలను ఎక్కువగా అభిమానిస్తాను. ఎంతో కష్టపడి నేను తెలుగులో ఆచార్య పదవి సంపాదించాను."

"ఐతే మీకు యీ అపూర్వ శక్తులెలా వచ్చాయి?"

చిన్నగా నవ్వాడు ప్రొఫెసర్ సేత్నా.

"కాళికాదేవి మా ఇలవేల్పు. నేను చిన్నతనంనుండి దేవిని ఉపాసిస్తున్నాను. ఆ దేవి ఉపాసనవలనే నా కా శక్తులు స్వాధీనం అయ్యాయి."

"ఈజిట్?" రాజుకు కొంచం మైకం వదిలింది. శ్రద్ధగా రెండు చేతులు జోడించాడు. అతనికి తెలుసు వుపాసకులు ఎంత మహిమ కలవారో.

"ఎస్ మిష్టర్ రాజూ! ప్రస్తుతం నా కొక సాహసిక వ్యక్తి కావాలి. అలాంటి వ్యక్తి కోసమే వెదుకుతున్నాను. నేటికి నా కృషి ఫలించింది."

"మీరనేది నాకర్థం కావడంలేదు ప్రొఫెసర్‌జీ!"

చిన్నగా నవ్వాడు ప్రొఫెసర్ సేత్నా.

"నాకు కావలసిన వ్యక్తివి నువ్వే మిష్టర్ రాజూ! నీలో ఆ సాహసం వుంది."

"ప్రొఫెసర్‌జీ నేనంత సాహసికుడినా?"

"నాకు తెలుసు మిష్టర్ రాజూ నువ్వెంత సాహసికుడివో. వివాహిత స్త్రీని వలలో వేసుకొని ఆమెతో గడపడం సామాన్యమైన విషయంకాదు."

"ప్రొఫెసర్‌జీ" కంగారుగా పిలిచాడు. "మీరేమి మాట్లాడుతున్నారో నాకర్థంకావడం లేదు. పరాయి స్త్రీని నేను వలలో వేసుకోవడం ఏమిటి?"

గంభీరంగా నవ్వాడు ప్రొఫెసర్ సేత్నా.

"నాకంతా తెలుసు మిష్టర్ రాజూ! చెప్పమంటావా?"

"ఊఁ" చిన్నగా మూలిగాడు రాజు.

"నీ భార్య పేరు శశికళ కదూ?"

"అవును ప్రొఫెసర్."

"ఆ శశికళ నువ్వు చేసుకున్న భార్య కాదుగదూ?"

"ప్రొఫెసర్‌జీ" బిత్తరపోతూ అన్నాడు జగపతిరాజు.

సమ్మోహనంగా నవ్వాడు ప్రొఫెసర్.

"మిష్టర్ జగపతిరాజూ, నాకంతా తెలుసు. నీ భూత భవిష్యత్, వర్తమానమంతా నా మనోఫలకంమీద నగ్నంగా కనబడుతోంది.

సరిగ్గా రెండేళ్ళ క్రితం నువ్వు కాకినాడలో వుద్యోగం చేస్తున్నావు. నువ్వు స్త్రీలోలుడవు. చాలామంది యువతులను అతిచాకచక్యంగా ఆకర్షించేవాడవు. నిన్ను చూసిన ప్రతి కన్నె నీ పొందుకోసం తహతహలాడేది. అలాంటి ఆకర్షణ శక్తి వుంది నీలో.

అదే సమయంలో నువ్వు వుంటున్న రూం ఖాళీచేసి మరో యింట్లో గది అద్దెకు తీసుకున్నావు. అప్పుడే నీకు పరిచయమయింది శశికళ.

శశికళకు పాతికేళ్ళు వుంటాయి. చక్కని అవయవ పొందికతో చాలా అందంగా వుండేది. శశికళ ఆ యిల్లు గలాయన భార్య. అతని పేరు రంగధామం.

రంగధామం కొంచెం కురూపి. శశికళ అతనికి భార్యగా

లభించడం కాకి ముక్కుకు దొండపండు అమరినట్లుగా వుండేది.

రంగధామం చాలా మంచివాడు. భార్యను అపురూపంగా చూసుకొనే వాడు. అతను గవర్నమెంట్ హాస్పిటల్‌లో కాంపౌండర్‌గా పనిచేస్తుండేవాడు. తరచు అతనికి నైట్ డ్యూటీలు పడుతుండేవి.

మంచి పరువంలో వున్న శశికళ, భర్తవలన ఒక రకంగా అసంతృప్తినే పొందసాగింది.

ఆ విషయం నువ్వు వూహించావు. నీ దృష్టి శశికళపై పడింది. ఆమె అందచందాలు నీ కళ్లకు విందుచేశాయి.ఎలాగైనా ఆమెను పొందాలని చూశావు. అందుకు పథకం ప్రారంభించావు.

మెల్లగా శశికళతో పరిచయం చేసుకున్నావు. ఆమెకు కొన్ని పనులు అత్యంత ఆప్తుడిలా చేసి పెట్టేవాడివి. ఆమెతో అనేక విషయాలు చర్చించేవాడివి. క్రమేపీ ఆమెకు సన్నిహితుడుగా మారిపోయావు.

ఇక నీ పథకాన్ని అమలు చేశావొక రోజు. ఆ రోజు రాత్రి రంగధామం నైట్ డ్యూటీకి వెళ్ళాడు. నువ్వు నీ రూములో నాటకం మొదలుపెట్టావు. జ్వరమొచ్చి బాగా బాధపడిపోతున్నట్లు మెలికలు తిరిగిపోతూ మూలగసాగావు. నీ మూలుగు విని శశికళ నీకు సహాయం చేద్దామని నీ గది లోకి వచ్చింది.

ఆ సమయాన్ని నువ్వు వృథాచేయలేదు. ఆమెకు మాయ మాటలుచెప్పి, ఆ రాత్రే ఆమెను లొంగదీసుకున్నావు.

"ఆగండి ప్రొఫెసర్" అరిచాడు జగపతిరాజు.

"ఇదంతా మీకెలా తెలుసు?"

చిన్నగా నవ్వాడు ప్రొఫెసర్ సేత్నా.

"మిస్టర్ రాజూ, నేను దేవీ ఉపాసకుడ్ని అన్నమాట మర్చిపోతున్నావు. ఇంకా నీ చరిత్ర చెబుతాను విను" చెప్పసాగాడు:

"నైట్ డ్యూటీ భర్తవలన సుఖపడలేక పోతున్న శశికళ నీకు తేలికగానే లొంగిపోయింది. ఆ తరువాత నిన్ను వదులుకోలేక పోయింది. ఒక మూడు నెలలపాటు మీరు రహస్య జీవితం గడిపారు.

అయితే మీ రహస్యం రంగధామానికి తెలిసిపోయింది. అతను మీ మీద విరుచుకుపడ్డాడు. ఇల్లు కాళీచేయమని నీకు నోటీసిచ్చాడు.

ఇక ఆయన బాధపడలేక మీ రిద్దరూ కలిసి ఓ నిర్ణయానికి వచ్చారు. దాని ప్రకారం...."

"ఇక చెప్పకండి ప్రొఫెసర్" అరిచాడు జగపతిరాజు.

"ఆగు మిష్టర్ రాజూ నన్ను చెప్పనీ. ఇంతవరకు మీరు చేసిన ఆ ఘాతుకక్రియ ఎవరికీ తెలియదు. కానీ నేను దివ్య శక్తితో తెలుసుకున్నాను. అదిగూడా విను.

మీరిద్దరూ కలిసి చేసుకున్న నిర్ణయం ప్రకారం రంగధామాన్ని విషప్రయోగంతో హత్యచేశారు. ఆ తరువాత నువ్వు విజయవాడ ట్రాన్స్‌ఫర్ చేయించుకొని, శశికళను తీసుకొని వచ్చేశావు" చెప్పడం ముగించాడు ప్రొఫెసర్ సేత్నా.

జగపతి రాజు ఆ మాటలు వింటున్నంత సేపు అదిరిపోయాడు. అతనికి ఆశ్చర్యంతో నోట మాటరావడం కష్టమైపోయింది.

ప్రక్కకు తిరిగిచూశాడు.

ప్రొఫెసర్ మౌనంగా కారు డ్రైవ్ చేస్తున్నాడు. అతని

మొఖంలో ఏదో దివ్యతేజస్సు కనబడింది రాజుకు. మరు క్షణంలో తన రహస్యాలన్నీ తెలిసిన అతన్ని చూడగానే భయం కూడా కలిగింది.

"ప్రొఫెసర్‌జీ" చిన్నగా పిలిచాడు.

"ఎస్ మిష్టర్ జగపతిరాజూ!"

"ఇప్పుడు నన్నెక్కడకు తీసుకువెడుతున్నారు? పోలీస్ స్టేషన్‌కా?"

బిగ్గరగా నవ్వాడు ప్రొఫెసర్ సేత్నా.

"మిష్టర్ రాజూ!" గంభీరంగా చెప్పాడు.

"ఇప్పుడు నీ జీవితం నా చేతులలో వుంది. యీ క్షణంలో పోలీసులకు అప్పజెప్పగలను. కానీ నేనా పని చేయబోవడం లేదు."

"మరేం చేస్తావ్? బ్లాక్‌మెయిలింగా? నా దగ్గర పైసా లేదు. వున్నా నేను ఇవ్వను. కావాలంటే పోలీసులకు పట్టివ్వండి. లేదా కనికరించి క్షమించండి" విసురుగా అన్నాడు.

చిన్నగా నవ్వాడు ప్రొఫెసర్ సేత్నా.

"మిష్టర్ రాజూ, నువ్వు చాలా పొరబాటు పడుతున్నావు. నీకు అపాయం తలపెట్టడానికి కాదు, నిన్ను తీసుకువెళ్ళేది. దేవి ఆజ్ఞమీద నిన్ను తీసుకు వెడుతున్నాను. ఆ దేవదేవి నిన్ననుగ్రహించింది."

"ఏమిటి ప్రొఫెసర్ మీరనేది?"

"చెప్తాను. అంతా చెప్తాను. ప్రస్తుతం నీ భార్య వూళ్లో లేదు కదూ?"

"అవును ప్రొఫెసర్" అన్నాడు ఆశ్చర్యంగా జగపతి రాజు.

"మరో వారం రోజులవరకు రాదు కదూ?"

"అవును ప్రొఫెసర్‌జీ."

చిన్నగా నవ్వాడు ప్రొఫెసర్ సేత్నా.

"మిష్టర్ రాజూ, అదృష్టమంటే నీదేనోయ్. ఎన్నో సంవత్సరాలు వుపాసనలు చేసినవారిని గూడా అనుగ్రహించని ఆ దేవి నిన్ననుగ్రహించింది. ఇక నీకు అడ్డులేదు. నువ్వు పట్టింది బంగార మవుతుంది. ఇక నువ్వు కష్టాల నుండి విముక్తి పొందుతావు."

జగపతి రాజుకేమీ అర్థం కాలేదు.

"ఏమిటి ప్రొఫెసర్‌జీ, మీరనేది నాకేమీ అర్థం కావడం లేదు."

"నువ్వు కోటీశ్వరుడవు కాబోతున్నావు రాజూ!" చిన్నగా చెప్పాడు ప్రొఫెసర్.

ఒక్క-క్షణం ఆశ్చర్యపోయాడు.

"నిజంగా ప్రొఫెసర్‌జీ" ఆనందంగా అన్నాడు.

"ఇటీజ్ రియల్ మిష్టర్ రాజూ!" దృఢంగా అన్నాడు ప్రొఫెసర్ సేత్నా.

"థాంక్స్ ప్రొఫెసర్‌జీ. నా జీవితంలోని నిగూఢమైన రహస్యాలు చెప్పిన మీ మాటకు తిరుగువుండదు. ఇంతటి శుభవార్త ముందుగానే నాకు తెలియచేసిన మీకు ఆ అదృష్టంలో తప్పకుండా షేర్ యిస్తాను."

"ఏమాత్రం షేర్ ఇస్తావు?" నవ్వుతూ అడిగాడు సేత్నా.

"తమిళనాడు రాఫిల్ డ్రాలో ఫస్ ప్రయిజ్‌వస్తే లక్ష రూపాయలు వస్తాయి. స్పెక్యులేషన్‌లోగూడా వేలల్లోనే లాభాలు వస్తాయి. మీకు టెన్ పర్సంట్ షేర్ యిస్తాను."

చిన్నగా నవ్వాడు ప్రొఫెసర్ సేత్నా.

"మిష్టర్ రాజూ, నీకు లాటరీలో వస్తే లక్షలే వస్తాయి. స్పెక్యులేషన్‌లో వేలు వస్తాయి. కానీ యిప్పుడు అదృష్టమే

నిన్ను వెతుక్కుంటూ వచ్చింది. నీకు కోట్లు రాబోతున్నాయి! ఆ దేవదేవి నిన్ననుగ్రహించింది."

"నాకు కోట్లు వస్తాయా?" ఆశ్చర్యపోయాడు రాజు.

"ప్రొఫెసర్‌జీ. మీరు నన్ను అవహేళన చేస్తున్నారేమో ననిపిస్తోంది. నాకు కోట్లు రావడమేమిటి?"

"అది అంతే మిష్టర్ రాజూ! నీకంతా విపులంగా చెబుతాను" అంటూ కారును ఓ పెద్ద బంగళా ముందు ఆపాడు ప్రొఫెసర్ సేత్నా.

* * *

ప్రొపెసర్, రాజు యిద్దరూ ఓ గదిలోకి ప్రవేశించారు.

ఆ గది ప్రొఫెసర్ పూజామందిరం. ఓ మూలగా పెద్ద కాళీ విగ్రహం భయంకరంగా కోరలు చాచుకొని చూస్తూ వుంది. గదంతా అనేక విధములైన దేవీ చిత్రాలతో అలంకరించబడి వుంది.

"మిష్టర్ రాజూ, ఇదే నా పూజా మందిరం. అదుగో దేవి."

ఏదో మంత్రం చదువుతూ దేవికి నమస్కారం చేశాడు ప్రొఫెసర్.

అప్రయత్నంగానే రాజు గూడా దేవికి తల వంచి స్థుతించాడు.

తరువాత ఇద్దరూ క్రింద పరచివున్న తివాచీ మీద కూర్చున్నారు.

"ప్రొఫెసర్‌జీ" పిలిచి అడిగాడు రాజు.

"ఇంతకు ముందు అంతా విపులంగా చెబుతానన్నారు. ఇప్పుడు చెబుతారా?"

చిన్నగా నవ్వి, ఓ నిమిషం కళ్ళు మూసుకున్నాడు ప్రొఫెసర్.

"జగపతిరాజూ!" పిలిచాడు.

"ఏమిటి ప్రొఫెసర్ జీ?"

"నీకు భూత శక్తుల మీద, దేవీ వుపాసనల మీద నమ్మకం వుందా?"

ఓ నిమిషం ఆలోచించాడు రాజు.

"ఇంతవరకు వారి మహిమలు నే నెక్కడా చూడలేదు. అంతమాత్రం చేత నమ్మకం లేదని నేను అనను. దేవి మా ఇలవేల్పు. ఆ దేవిని వుపాసించినవారికి శక్తులు కలుగుతాయని తెలుసు."

"మంచిది. ఐతే నేను చెప్పేది జాగ్రత్తగా విను" చెప్పసాగాడు ప్రొఫెసర్:

"నేను చిన్నతనం నుండి దేవీ భక్తుడిని. దేవిని ప్రత్యక్షం చేసుకోవాలని నా చిరకాల వాంఛ. నా కోర్కె నెరవేర్చుకోడానికై నేను హిమాలయాలకు వెళ్ళాను. అక్కడ చాముండీ శిఖరంపై దేవీ వుపాసన ప్రారంభించాను. అలా తొమ్మిది సంవత్సరాలు దేవిని వుపాసిస్తూ ఘోరమైన తపస్సు చేశాను.

చివరకు నా కృషి ఫలించింది. దేవి నాకు ప్రత్యక్షమైంది. ఆ దేవదేవిని స్థుతించి నాకు కావలసిన వరాలను సంపాదించుకున్నాను. ఆ వరాల ప్రభావంతో అనేక విద్యలు సాధించాను.

నేను సాధించిన విద్యలలో ఒకటే రసాయన విద్య.

ఈ రసాయన విద్య చాలా అమూల్యమైనది. మిక్కిలి శక్తివంతమైనది. ఆ విద్య ప్రభావంతోనే కోటీశ్వరులు కావచ్చు. ఆ విద్య సహాయంతోనే నేను కొన్ని వేలమందికి సహాయం చేశాను.

కానీ ఈ క్షణిక భోగభాగ్యాల మీద మక్కువ లేదు. ఈ

విద్యలో గడపడం నాకిష్టం లేదు. మళ్ళీ ఆ దేవి సాంగత్యం కోసం హిమాలయాలకు వెళ్ళి పోవడానికి నిశ్చయించుకున్నాను.

కానీ నేను సాధించిన యీ అమూల్యమైన విద్య నాలోనే వృధా ఐపోవడం నాకిష్టం లేదు. అందుకే ఆ విద్యను ఎవరికైనా జీవితంలో కులాసాగా బ్రతకనేర్చిన వాడికి వుపదేశించాలని నిశ్చయించుకున్నాను.

ఐతే ఆ విద్యను ఆశించే వ్యక్తి మిక్కిలి సాహసవంతుడై వుండాలి. భగ భగ మండే మంటలలో దూకే ధైర్యం వుండాలి. అలాంటి సాహసవంతుని కోసమే నేను సంవత్సరం నుండి గాలిస్తున్నాను. నేటికి నువ్వు కనబడ్డావు.

నిన్ను చూడగానే తగిన వ్యక్తివని నిర్ణయించుకున్నాను. ఆ తరువాత, నీ కావిద్య నేర్పవచ్చని, నువ్వు తగిన సాహసవంతుడివని దేవి నాకు తెలియచేసి, నీతో పరిచయానికి ప్రేరేపించింది.

"ప్రొఫెసర్‌జీ" సంతోషంగా అన్నాడు జగపతిరాజు.

"నేనెంత అదృష్టవంతుడిని. సాక్షాత్తు ఆ అదృష్ట దేవతే మీ రూపంలో నా దగ్గరకు వచ్చింది. కృతజ్ఞుడిని ప్రొఫెసర్‌జీ కృతజ్ఞుడ్ని."

చిన్నగా నవ్వాడు ప్రొఫెసర్ సేత్నా.

"మనలో మనకు కృతజ్ఞతలతో పనిలేదు మిస్టర్ రాజూ! మనమంతా ఆ దేవదేవికి కృతజ్ఞతలు తెలియచేసుకోవాలి."

"ప్రొఫెసర్‌జీ, ఓ చిన్న అనుమానం. రసాయన విద్య అంటే ఏమిటో తెలియ చేస్తారా!"

ఓ రెండు నిమిషాలు కళ్ళు మూసుకొని ధ్యాననిమగ్నుడై, ఆ తరువాత కళ్లు తెరిచి చెప్పసాగాడు ప్రొఫెసర్:

"మిస్టర్ రాజూ, రసాయన విద్య ఒక మహత్తర విద్య.

అతి కష్ట సాధ్యమైన విద్య. ఈ విద్యను నేను అనేక కష్ట నష్టాల కోర్చి సాధించాను. పూర్వం పురాణాలలో పరుస వేది అనే విద్య ఒకటి వున్నట్లు పేర్కొన బడింది. మీకు గుర్తుందా? అలనాటి పరుసవేది విద్యయే యీనాటి రసాయన విద్య. ఆనాడు పరుసవేది విద్యను సాధించిన వారు ఇనుమును బంగారం చేసే వారు. ఈ నాడు రసాయన విద్యను అభ్యసించినవారు రాగిని బంగారం చేయగలరు."

ఒక్క క్షణం ఆశ్చర్యపోయాడు జగపతిరాజు.

"ఏమిటీ విచిత్రం ప్రొఫెసర్ జీ. రాగి బంగారం కావడమా? ఇది సంభవమా ప్రొఫెసర్?"

"ఎందుకు కాదు మిష్టర్ రాజూ! మనలోని మహత్తరమైన మానసిక శక్తులను సద్వినియోగం చేసుకుంటూ సుఖంగా కాలం గడప వచ్చును."

"అయినా నేను నమ్మలేకపోతున్నాను ప్రొఫెసర్ జీ."

చిన్నగా నవ్వాడు ప్రొఫెసర్ సేత్నా.

"నమ్మడం కష్టమే. కానీ నేను చెప్పింది యదార్థం! అంతేకాదు. నేను సాధించిన రజిత విద్యద్వారా ఇనుమును వెండి చేయగలను. వశీకరణ విద్య ద్వారా సర్వులను వశం చేసుకోగలను."

"వశీకరణ విద్యా! అంటే ఏమిటి స్వామీ?"

"ఇది స్త్రీ, పురుష లిరువురూ నేర్చుకొన తగు విద్య. ఈ విద్య సహాయంతో స్త్రీ-పురుషులు ఒకరినొకరు వశం చేసుకోవచ్చు. ఇలాంటి విద్యలెన్నో నేను దేవీ వుపాసన ద్వారా సంపాదించాను."

"ప్రొఫెసర్ జీ. మీరు చాలా గొప్పవారు. మీలాంటి అసాధారణ వ్యక్తి దృష్టిలో పడటం నిజంగా నా అదృష్టం" సంతోషంగా అన్నాడు జగపతిరాజు.

సన్మోహనంగా నవ్వాడు ప్రొఫెసర్ సేత్నా.

జగపతిరాజు మనసులో కనకం తళుక్కున మెరిసింది. 'నిజంగా అదృష్టదేవత కనికరించి తన దగ్గరకు వచ్చింది. తను వుదయమే కనకాన్ని లొంగదీసు కుందామనుకున్నాడు. కనకాన్ని ఎలా లొంగతీసుకోవాలో మధనపడుతున్న యీ తరుణంలో, సకల విద్యా పారంగతుడైన ప్రొఫెసర్ దేవీ ప్రేరేపితుడై తన చెంతకు రావడం ఎంత అదృష్టం'

పరిపరివిధాల ఆలోచించ సాగాడు రాజు.

బిగ్గరగా నవ్వాడు ప్రొఫెసర్.

"మిస్టర్ రాజూ, నువ్వు కోటీశ్వరుడవు కాబోతున్న తరుణంలో గూడా ఆ కనకం గురించి ఆలోచిస్తున్నావంటే, ఆ కనకం అందాన్ని అభినందించాలి."

ఈసారి మరింత ఆశ్చర్యపోయాడు రాజు.

"ప్రొఫెసర్‌జీ, నేను కనకం గురించి ఆలోచిస్తున్నట్లు మీరెలా వూహించారు."

చిన్నగా నవ్వి అన్నాడు ప్రొఫెసర్. "మిస్టర్ రాజూ, దివ్యజ్ఞానసంపన్నులమైన మాకు వూహించవలసిన అవసరంలేదు. మేము భూతవర్తమానభవిష్యత్‌లను నిమిష మాత్రంలో నిలువుటద్దంలోచూపి చెప్పినట్లు చెప్పగలం."

"ప్రొఫెసర్‌జీ, ఓ చిన్నమాట అడుగుతాను. కోపగించుకోరు కదా?"

"కోపమా?" నవ్వుతూ అన్నాడు ప్రొఫెసర్. "నువ్వు అడగబోయే దేమిటో నాకుతెలుసు. రసాయనవిద్యను ఎన్ని రోజులలో స్వాధీనం చేసుకోవచ్చని అడుగుతున్నావ్. అంతే కదా?"

"అవును ప్రొఫెసర్‌జీ."

"ఆ విద్య నేర్చుకోవడానికి నువ్వు చాలా కష్టపడాలి

రాజూ. వరుసగా మూడురాత్రులు నువ్వు స్మశానంలో గడపాలి. అక్కడ కొన్నిపనులు చేయాలి. చివరకు ఆ విద్య నీకు శ్మశానంలోనే స్వాధీనమవుతుంది. మరో విషయం. నువ్వు రసాయన విద్యకొరకు జరిపే కృషిలో సఫలీకృతుడవైతే నీకు రజిత విద్యకూడా స్వాధీనమైనట్లే!"

"నిజంగా ప్రొఫెసర్?"

"ఎస్ మిష్టర్ రాజూ! రసాయనవిద్యకు ముందుగానే రజితవిద్య నీకు స్వాధీనమవుతుంది."

"థాంక్స్ ప్రొఫెసర్‌జీ. మరి యీ రోజునుండీ మొదలు పెడదామా సర్!"

"అది నీ యిష్టం."

"ప్రొఫెసర్‌జీ, మరో అనుమానం?"

"నాకు తెలుసు. నీ కంతటి శక్తివున్నదా, అని నీకే అనుమానం కదూ?"

"అవును ప్రొఫెసర్‌జీ."

"సరే. నీ కంతటి శక్తివున్నదో, లేదో నువ్వే ఋజువు చేసుకుందువుగాని. ఇదే సమయంలో నా శక్తిని గూడా కళ్లారా చూద్దువుగాని. నాకున్న అనేకవిద్యలలో నీకే విద్య కావాలో కోరుకో. రసాయనవిద్యకు ముందుగా నీ కావిద్య నేర్పుతాను."

"మెనీమెనీ థాంక్స్ ప్రొఫెసర్‌జీ."

ఓ రెండునిమిషాలు ఆలోచించాడు జగపతిరాజు.

"ప్రొఫెసర్‌జీ, ఇంతకు ముందు మీకు వశీకరణ విద్య తెలుసునన్నారు. దయచేసి ఆవిద్య నాకు నేర్పండి."

"ఆల్‌రైట్ మిష్టర్ రాజూ. వశీకరణవిద్య నీకు నేర్పుతాను. నువ్వు దానిని కనకంమీదే ప్రయోగించి చూసుకో, ఫలితం నాకు చెప్పు."

"అలాగే ప్రొఫెసర్‌జీ."

"వెల్. ఈ రోజు రాత్రి పన్నెండుగంటలకు యీ దేవీ మందిరంలోనే నీ కా వశీకరపువిద్య స్వాధీనం చేస్తాను. అందుకు కావలసిన కొన్ని ప్రయత్నాలు చూడు" కళ్ళు మూసుకొని మెల్లగా చెప్పసాగాడు ప్రొఫెసర్ సేత్నా.

*   *   *

గదంతా అగరువత్తుల సువాసనలతో గుబాళించి పోతోంది.

కాళికాదేవి విగ్రహం ముందువున్న హోమగుండంలో అగ్ని ప్రజ్వరిల్లుతోంది.

హోమగుండానికి ఇరువైపులా కూర్చొని వున్నారు ప్రొఫెసర్, జగపతిరాజులు.

ఇద్దరూ అప్పుడే స్నానంచేసి, చిన్న అంగవస్త్రాలు మొలకుచుట్టుకొని కూర్చొని వున్నారు.

ప్రొఫెసర్‌చేతిలో ముంజేతి ఎముక ఒకటి తళతళ మెరుస్తున్నది. నుదుట తిలకం ఎర్రగా ప్రకాశిస్తోంది. కళ్ళు అగ్నిగోళాల్లా మండుతున్నాయి.

క్రింద దర్భలు పరచుకొని వాటిపై పద్మాసనం వేసుకొని కూర్చొని వున్నాడు జగపతిరాజు.

"రాజూ!" పిలిచాడు ప్రొఫెసర్.

"ఎస్ ప్రొఫెసర్‌జీ."

"నిర్మలమనస్కుడవై, దేవియందు చిత్తమును నిలిపి శ్రద్ధగా విను. నేను దేవీ వుపాసనద్వారా సంపాదించిన మంత్రమును నీకు వుపదేశిస్తున్నాను. జాగ్రత్తగా విని ఆ మంత్రమును చిత్తశుద్ధితో పదివేలసార్లు జపించు."

"అలాగే ప్రొఫెసర్."

చిన్నగా మంత్రం చెప్పసాగాడు ప్రొఫెసర్. దానిని

అపరాధ పరిశోధన పోటీ—71 [ఫలితాలు]

జూన్ 74 నెల' "అపరాధ పరిశోధన పోటీ–" 71కి సరియైన సమాధానాలు:

1. కాల్పులు.
2. నల్లబడతాడు.
3. మమకారం.
4. మాట కరుకుదనం.
5. సౌందర్యం.

పై జవాబుల ప్రకారం నలుగురు మాత్రం ఆల్ కరెక్ట్‌గా పంపారు. వీరికి సెప్టెంబర్ '74 నెలనుండి 10 నెలలపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక గాని "సప్లిమెంట్" గాని ఉచితంగా పంపబడుతుంది. "సప్లిమెంట్" పొందగోరిన విజేతలు ఆ విషయం యీ నెల 15వ తేదీలోగా మాకు తెలియజేయగోర్తాము.

(1) శ్రీమతి బి. సరస్వతి, కేరాఫ్—ఎమ్. ఆంజనేయులు, పాత ఆసుపత్రి వీధి, కాకినాడ–2.

(2) శ్రీమతి సవిత, పోస్టు—మత్యం, వయా—అరగొండ, చిత్తూరు జిల్లా.

(3) శ్రీ ఎమ్. బిక్షమయ్య, 15–8–425 ఫీలుఖానా, హైదరాబాద్–500012.

(4) శ్రీ బి. బి. వెంకటేశ్వరరావు, 3–7–114/ఏ, కాసరాబాద్ రోడ్, సూర్యాపేట–508213 (నల్లగొండ జిల్లా.)

అనుకరించసాగాడు రాజు.

"ఓం మదమద మా దయ మా దయ హ్రీం వశయ 'కనకం' స్వాహా."

"ఓం మదమద మా దయ మా దయ హ్రీం వశయ 'కనకం' స్వాహా."

"వెల్ మిష్టర్ రాజూ! ఇదే ఆ దేవమంత్రం. ఈ మంత్రాన్ని నిశ్చలదృష్టితో పదివేలసార్లు జపించిన ఎడల నీకా మంత్రం సిద్ధించును. తరువాత ఆ మంత్రం ఫలించే మార్గం మరొకటి వుంది."

"అలాగే ప్రొఫెసర్‌జీ."

"మంచిది ఆ దేవదేవి నిన్ననుగ్రహించుగాక. ఇక ప్రారంభించు."

"ఓం మదమద మా దయ మా దయ హ్రీం వశయ కనకం స్వాహా" జపం ప్రారంభించాడు జగపతిరాజు.

ప్రొఫెసర్ కళ్లు మూసుకొని రుద్రాక్షమాలలోని పూసలను లెక్కించసాగాడు.

దాదాపు మూడుగంటలు గడిచాయి.

నెమ్మదిగా కళ్లు తెరిచాడు ప్రొఫెసర్.

"రాజూ!" పిలిచాడు.

రాజులో చలనంలేదు. తదేకంగా మంత్రాలను వుచ్చరించసాగాడు.

"జగపతిరాజూ!" గట్టిగా పిలిచాడు.

మెల్లగా కళ్లు తెరిచాడు రాజు. ఎదురుగా ప్రొఫెసర్ కన్పించాడు.

"పిలిచారా ప్రొఫెసర్‌జీ!"

"ఎస్ మిస్టర్ రాజూ, నీ జపం పూర్తి ఐంది. నేను చెప్పిన వస్తువులు తీసుకు వచ్చావా?"

"ఎస్ ప్రొఫెసర్. ఇవిగో" చూపించారు.

"గుడ్. ఇదిగో, యీ తెల్ల గన్నేరు పుల్లతో తయారు చేసిన కలాన్ని ఆ నల్ల వుమ్మెత్త ఆకుల రసంలో ముంచి యీ తాటి ఆకుపై నువు సాధించిన మంత్రాన్ని వ్రాయి. ఆ తరువాత కనకం యీ ఇంటికి రావాలని కోరుతూ మంత్ర పూరితమైన ఆ ఆకును అగ్నిలో పడవేసి దేవిని మరోసారి ప్రార్థించు" చెప్పాడు.

"అలాగే ప్రొఫెసర్‌జీ" అంటూ ప్రొఫెసర్ చెప్పినట్లుగా చేశాడు.

"వెల్ మిస్టర్ రాజూ! నీకు వశీకరణ మంత్రం సిద్ధించింది. కావాలంటే ఋజువు చేసుకో. మరో పది నిమిషాలలో కనకం ఇక్కడకు వస్తుంది. ఐతే ఒక్క షరతు. మొట్ట మొదటి రోజున నువ్వు కనకం ముఖం చూడగూడదు. చీకటి గదిలోనే ఆమెతో రమించాలి. తెలిసిందా?"

"అలాగే ప్రొఫెసర్‌జీ" సంతోషంగా అన్నాడు రాజు ప్రొఫెసర్‌కు నమస్కరిస్తూ.

"గుడ్. వెంటనే తయారు కా. మళ్ళీ కనకం వచ్చేస్తుంది" చిన్నగా నవ్వాడు ప్రొఫెసర్ సేత్నా.

*   *   *

"గుడ్‌మార్నింగ్ ప్రొఫెసర్‌జీ!"

"హల్లో! గుడ్‌మార్నింగ్ మిస్టర్ రాజూ! రాత్రి అంతా సుఖంగా గడిచిందా?" చిన్నగా నవ్వుతూ అడిగాడు.

సిగ్గుగా తల వంచుకున్నాడు రాజు.

"ప్రొఫెసర్‌జీ, మీకెలా కృతజ్ఞతలు తెలియచేయాలో అర్థం కావడం లేదు. మీ మంత్ర మహత్యం అమోఘం! నిజంగా కనకాన్ని పొందగలనని యీ జన్మలో నేను వూహించలేదు."

"ఊహించనివి జరిగినప్పుడే మనకానందం మిస్టర్ రాజూ!" చిన్నగా నవ్వాడు ప్రొఫెసర్.

"సర్, ఈరోజు రాత్రినుండి రసాయన విద్య కొరకు అభ్యాసం ప్రారంభిద్దామా?"

"అలాగే. కానీ. మరో షరతు."

"ఏమిటి సర్?"

"రసాయన విద్య నీ స్వాధీనం అయ్యేవరకు మత్తు పానీయాలను దరిచేరనీయరాదు. మనసు చాలా నిష్కల్మషంగా వుండాలి."

"అలాగే ప్రొఫెసర్‌జీ. మీమాట జవదాటను."

"గుడ్. మరో విషయం. ఈ రసాయన విద్య చాలా కష్టమైనది. అందులోనూ, ఇది సాధించబోయేది స్మశానంలో. కాబట్టి గుండె ధైర్యం అవసరం. ఏ క్షణాన నీ గుండె బెదిరిపోయి వెనకడుగు వేసినా, యీ జన్మలో నీ కా విద్య స్వాధీనమవ్వదు."

చిన్నగా నవ్వాడు జగపతిరాజు.

"ప్రొఫెసర్‌జీ, అత్యంత శక్తిపరులు మీరు నా చెంత నుండగా, నేను భయపడతానా? అవసరం వస్తే ఎంతటి సాహసానికైనా సిద్ధమే!"

"వెల్. ఈ రాత్రినుండే ప్రారంభిద్దాము. మొదటి రెండు రోజులు దేవిని వుపాసించి ఆ రసాయన విద్యను స్వాధీనం చేసుకోవాలి. ఇందుకు కొన్ని వస్తువులు మనకు కావాలి. కొంచం కష్టమైనా వాటిని సంపాదించు."

"అలాగే ప్రొఫెసర్‌జీ. చెప్పండి."

కళ్లు మూసుకొని చెప్పసాగాడు ప్రొఫెసర్ సేత్నా.

* * *

అర్ధరాత్రి పన్నెండు గంటలైంది.

స్మశానంలో వాతావర్ణమంతా భయంకరంగా వుంది. నక్కలు వికృతంగా అరుస్తున్నాయి. అక్కడక్కడ చితులు ఇంకా కాలుతూనే వున్నాయి.

ఓ చితికి దగ్గరగా కూర్చొని వున్నారు ప్రొఫెసర్, జగపతిరాజులు.

ఇద్దరూ అప్పుడే స్నానం చేసి చిన్న అంగవస్త్రం మొలకు చుట్టుకొని కూర్చొని వున్నారు.

ప్రొఫెసర్ చేతిలో కపాలమొకటి తళతళ మెరుస్తున్నది.

క్రింద దర్భలు పరచుకొని వాటిపై పద్మాసనం వేసుకొని కూర్చొని వున్నాడు రాజు.

"మిస్టర్ రాజూ!" పిలిచాడు ప్రొఫెసర్.

"నేను రెడీ ప్రొఫెసర్‌జీ!"

"గుడ్. గత రెండు రోజులు మన కార్యక్రమం ఆ దేవదేవి దయవలన నిర్విఘ్నంలేక కొనసాగింది. ఇది మూడవ రోజు. ఈనాటితో నీ కా విద్యలు సిద్ధిస్తాయి. మనకు దిగ్విజయం ప్రాప్తించడానికై దేవిని మరోసారి ప్రార్థించు."

జగపతిరాజు దేవికి నమస్కరిస్తూ ప్రార్థన చేశాడు.

"మిష్టర్ రాజూ, గత రెండురోజులలో రెండు మంత్రాలను నీ స్వాధీనం చేశాను. నేడు చివరి రోజు. ముందుగా ఒక మంత్రం చెబుతాను. దానివలన నీకు రజితవిద్య స్వాధీనమవుతుంది. ఆ తరువాత ఒక మంత్రంతో రసాయన విద్య నీ హస్తగత మవుతుంది."

"ధన్యుడిని ప్రొఫెసర్‌జీ. అలాగే చేయండి."

నెమ్మదిగా కళ్లుమూసుకొని ప్రొఫెసర్ సేత్నా మంత్రం చెప్పసాగాడు. దానిని వెంటనే అనుకరించాడు రాజు.

"ఓం నమోహరామి రజితం సిద్ధి కురుకురు స్వాహా."

"ఓం నమోహరామి రజితం సిద్ధి కురుకురు స్వాహా."

"మిష్టర్ రాజూ, యీ మంత్రంకూడా అతివిలువైనది. దీనితో రజిత విద్యను స్వాధీనం చేసుకోవచ్చు. ఈ రజిత విద్య సహాయంతో రాగిని వెండిగా మార్చవచ్చును. కాబట్టి ఆ మంత్రమును అతి నిష్టతో మూడువేలసార్లు జపించు. అప్పుడు ఆ మంత్రం నీకు సిద్ధిస్తుంది. ఆ తరువాత మంత్రం ఫలించే మార్గం చెబుతాను."

"అలాగే ప్రొఫెసర్‌జీ."

"ఓం నమోహరామి రజితం సిద్ధి కురుకురు స్వాహా" మంత్రం జపించసాగాడు జగపతిరాజు.

కళ్లు మూసుకొనివున్న ప్రొఫెసర్ రుద్రాక్షమాలలోని పూసలను లెక్కించసాగాడు.

గంటన్నర గడిచింది.

"స్టాప్ మిష్టర్ రాజూ!" చెప్పాడు ప్రొఫెసర్.

నెమ్మదిగా కళ్లు తెరిచాడు జగపతిరాజు.

"వెల్ మిష్టర్ రాజూ. నీకు రజితవిద్య సిద్ధించినట్లే! ఆ తెల్లజిల్లేడి వేరు, రససింధూరం, అరటిదుంప రసంచే మర్దించి నొసట తిలకంగా అలంకరించుకో. ఆ తరువాత కపిలగోవుపాలతో నిండివున్న యీ పాత్రలో రాగిని తడిపినచో వెండిగా మారును. ఒకసారి ప్రయోగించి చూసుకో" చెప్పాడు ప్రొఫెసర్.

"థాంక్స్ ప్రొఫెసర్‌జీ" అంటూ ప్రొఫెసర్ చెప్పినట్లు చేశాడు. తిలకం నొసటన తీర్చిదిద్దుకొని, రాగి నాణెములు రెండు కపిలగోవుపాలతో నిండవున్న ఆ పాత్రలో వేశాడు.

ఆశ్చర్యం! మరుక్షణం రెండూ వెండి నాణెములుగా మారాయి. స్వయంగా ప్రొఫెసర్ పాత్రలోంచి నాణెములను తీసి చూపించాడు.

జగపతిరాజు ఆనందానికి మేరలేకపోయింది.

"మెనీ మెనీ థాంక్స్ ప్రొఫెసర్‌జీ. మీ మంత్రశక్తి అమోఘం! ఇంతవరకు ప్రపంచంలో జరగని వింతను నేను చూశాను. నిజంగా మీరు దివ్యపురుషులు."

చిన్నగా నవ్వాడు ప్రొఫెసర్ సేత్నా.

"పొగడ్తల కిది సమయం కాదు మిష్టర్ రాజూ. రసాయన విద్యకూడా నీ కీ రాత్రే స్వాధీనం కావాలి. మళ్ళీ యీ రూము దాటితే ప్రయోజనం వుండదు."

"అలాగే ప్రొఫెసర్‌జీ.ఆ మంత్రంకూడా ఉపదేశించండి" చిన్నగా తలవంచి వినయంగా అన్నాడు రాజు.

మెల్లగా కళ్లుమూసుకొని మంత్రం ఉపదేశించసాగాడు ప్రొఫెసర్.

"ఓం నమో హరిహరాయ రసాయన సిద్ధిం కురుకురు స్వాహా"

"ఓం నమో హరిహరాయ రసాయన సిద్ధిం కురుకురు స్వాహా" అనుకరించాడు జగపతిరాజు.

"వెల్ మిష్టర్ రాజూ! ఇదే అన్నిటిలోకి విలువైన, కష్టసాధ్యమైన రసాయన మంత్రం. దీనినిగూడా నిష్టతో మూడు వేలసార్లు జపించు. అప్పుడా మంత్రం నీకు సిద్ధిస్తుంది. ఆ తరువాత మంత్రం నీకు ఫలించే మార్గం చెబుతాను."

"అలాగే ప్రొఫెస్సర్‌జీ."

"ఓం నమో హరిహరాయ రసాయన సిద్ధిం కురుకురు స్వాహా" మంత్రంను జపించసాగాడు జగపతిరాజు.

మౌనంగా రుద్రాక్షమాలలోని పూసలను లెక్కించసాగాడు ప్రొఫెసర్.

రెండు గంటలు గడిచాయి.

"రైట్ మిష్టర్ రాజూ. ఇక ఆపు" గట్టిగా చెప్పాడు ప్రొఫెసర్.

మెల్లగా కళ్లు తెరిచాడు జగపతిరాజు.

"ధన్యుడవు మిష్టర్ రాజూ! ఇంతవరకు నిర్విఘ్నంగా జరిగింది. రసాయన మంత్రం నీ వశమైంది. ఇక అది ఫలించే మార్గమే కొంచం కష్టం."

"చెప్పండి ప్రొఫెసర్" ఆతృతగా అన్నాడు.

"మిష్టర్ రాజూ, ఇప్పుడు నువ్వొక సాహసకార్యం చేయాలి. ఆ ధైర్యం నీకు వున్నదనే నేను నిన్ను ఎన్నుకున్నాను. వెనుకడుగు వేయకుండా దిగ్విజయాన్ని పొందు. ఏమాత్రం వెనుకడుగు వేసినా, ఇప్పటివరకు నువ్వు చేసినదంతా వృధా!"

"మీ రేమాత్రం సందేహించకండి ప్రొఫెసర్‌జీ. నేనెలాంటి సాహసకార్యమైనా చేయడానికి సింసిద్ధుడనే!"

"అల్‌రైట్ మిష్టర్ రాజూ! ఇది నీకు అగ్నిపరీక్ష. నువ్వు యీ మంత్రాన్ని నిలువెత్తు మంటలో నిలబడి నూట పదకొండుసార్లు పఠించాలి. అప్పుడు నీకు రసాయన విద్య స్వాధీనమవుతుంది."

అదిరిపడ్డాడు రాజు. "నిలువెత్తు మంటలోనా?"

చిన్నగా నవ్వాడు ప్రొఫెసర్ సేత్నా.

"మిష్టర్ రాజూ, ఇప్పుడు నువ్వు దేవీ ఉపాసకుడవు. నీలో ధైర్యం, సాహసం, తెగువ ముఖ్యం. ఒకటిమాత్రం నిజం. దేవీధ్యానంలో వుండే నిన్ను నిలువెత్తు మంటలు అంటనుగూడా అంటవు. ధైర్యే సాహసే లక్ష్మి."

"అలాగే ప్రొఫెసర్‌జీ. మీరు చెప్పినట్లుగానే చేస్తాను" అన్నాడు దృఢంగా జగపతిరాజు.

వెలుగుతున్న చితిని మరింత పెద్దదిగాచేశాడు ప్రొఫెసర్. నిలువెత్తుమంటలు ప్రజ్వరిల్లుతూ మండుతున్నాయి.


ఆఁ! నోరు తెరవండి...
గొప్ప
ప్రదర్శన

"గో ఆన్ మై బోయ్. నీకు శుభం కలుగుతుంది" చిన్నగా నవ్వాడు ప్రొఫెసర్ సేత్నా.

దేవదేవిని మనస్సులో స్మరించుకొని ఒక్కసారిగా మంటల్లోకి దూకాడు జగపతిరాజు.

ఆశ్చర్యం! మంటలు అంటుకోవన్న ప్రొఫెసర్‌మాట అబద్ధమైంది. రాజు ఒళ్ళు ఒక్కసారిగా భగ్గుమంది.

చటుక్కున బయటకు దూకబోయాడు రాజు. అంతలోనే తలమీద దబ్బున ఏదో పడ్డట్లయింది. తెగిన గాలి పటంలా మంటల్లో ఒరిగిపోయాడు.

మంటలు జగపతిరాజు శరీరాన్ని తమతోబాటు మండించ సాగాయి.

జగపతిరాజు సజీవదహనం పూర్తయిన తరువాత తృప్తిగా తల పంకించి బయటకు నడిచాడు ప్రొఫెసర్ సేత్నా.

* * *

ప్రొఫెసర్ సేత్నా రహస్యంగా దాచిన తనడైరీ తీశాడు. మొదటిపేజీ తెరిచాడు.

"కె. రంగధామం. క్లార్క్ - సదరన్‌రైల్వే - కాకినాడ" అందంగా వ్రాసివుంది.

చిన్నగా నవ్వుకుంటూ మరోపేజీ తెరిచాడు.

"ఈ రోజు చాలా దుర్దినం. నే నెంత ప్రేమగా చూసుకుంటున్నా శశికళ ఎందు కిలత పనిచేసింది. జగపతిరాజుతో పెంచుకొంటున్నబంధాన్ని త్రుంచివేయాలి."

పేజీ వెంట పేజీ తిరిగి పోతున్నాయి.

జగపతిరాజుకు గట్టిగా వార్నింగ్‌యిచ్చాను. ఇల్లు కాళీ చేయమని నోటీసు కూడా యిచ్చాను. శశిని గూడా హెచ్చరించాను.

"థాంక్ గాడ్! ఈ రోజు ఎంత అదృష్టం! తనకు లాటరీలో లక్ష రూపాయలువచ్చాయి. ఆ ఆనందంతో ఇంటికి రాగానే అదిరిపోయాను. లోపలనుండి గుసగుసలు వినబడుతున్నాయి. వాటి సారాంశం తెలుసుకొనేసరికి ఒళ్లు గగుర్పొడిచింది. దుర్మార్గులు, తమ సౌఖ్యం కొరకు నన్ను హత్యచేయడానికి సిద్ధపడ్డారు శశికళ, జగపతిరాజులు."

"ఎత్తుకు పై ఎత్తు వేశాను. వారుచేసిన విషప్రయోగంలో చనిపోయినట్లు నటించాను. ఆ తుచ్ఛులు విజయవాడ లేచిపోయారు."

"రంగధామం యికలేడు. లోకం దృష్టిలో రంగధామం చచ్చిపోయాడు. మారుపేరుతో సుఖంగా బ్రతకడం ప్రారంభించాను."

"నాలో పగ చల్లారలేదు. అది ప్రతిదినం ప్రజ్వరిల్లుతూనేవుంది. ప్లాన్ వేశాను. ఎలాగైనా జగపతిరాజును మట్టుపెట్టాలని నిశ్చయించుకున్నాను."

"కార్యక్రమం మొత్తం సిద్ధమైంది జగపతిరాజు దినచర్యలన్నీ పసిగట్టాను. అవకాశంకొరకు ఎదురుచూస్తున్నాను."

"శశికళ వూరువెళ్ళింది. జగపతిరాజు ఒక్కడేవున్నాడు. అనుమానం రాకుండా రాజును మట్టుబెట్టడానికి యిదే తరుణమని నిర్ణయించుకున్నాను. అతనికి ప్రొఫెసర్ సేత్నాగా పరిచయమయ్యాను."

"జగపతిరాజు అత్యాశాపరుడు. నన్ను పూర్తిగా నమ్మాడు. ఇంకా నమ్మకం కలిగించడానికి వశీకరణవిద్య అంటూ ఒకటి నేర్పాను. పాపం పిచ్చిరాజు చీకటిగదిలో బజారు సరుకును అనుభవించి కనకంగా భావించి ఆనందపడుతున్నాడు."

"నామీద పూర్తి నమ్మకం కుదిరించి - రసాయనవిద్య నేర్పుతానని ఆశపెట్టాను. గత రెండురోజులు స్మశానం లోకి తీసుకువెళ్ళి ఏవో మంత్రాలుచెప్పి నామీద మరింత నమ్మకం కుదిరేటట్లుచేశాను. మరుసటిరోజు అతని పర లోకప్రయాణానికి లగ్నంపెట్టాను.''

జేబులోంచి కలంతీసి డైరీలోని మరోపేజీలో వ్రాయ సాగాడు ప్రొఫెసర్ సేత్నాగా నటించిన రంగధామం.

''ఈ రోజు జగపతిరాజుకు తుదిరోజు. ఎంతో కష్టపడి తయారుచేసిన ప్లాను యీ రోజు అమలుచేశాను. నా మీద బాగా నమ్మకం పెంచుకున్న జగపతిరాజును రసాయనవిద్య నేర్పుతానని మభ్యపెట్టి, స్మశానానికి తీసుకువెళ్ళాను. ఏదో నోటికొచ్చిన మంత్రం చెప్పాను. పాపం రాజు కష్టపడి పఠించాడు. మెర్క్యూరీ క్లోరైడ్ సహాయంతో వెండి తయారై నట్లు నాటకం ఆడాను. మంత్ర ప్రభావంతోనే వెండి తయా రైందని మురిసిపోయాడు రాజు. నన్ను పూర్తిగానమ్మాడు. రసాయనవిద్య ప్రాప్తికొరకు అగ్నిలో నిలబడమన్నాను. నామీద నమ్మకంతో రాజు మంటలోకి దూకాడు. అంతే. అతనుబయటకు రాకుండా కర్రతో బలంగా మోదాను.

జగపతిరాజును చంపేశాను. ఎవరికీ అనుమానం కలగని రీతిలో స్మశానంలోనే అతని దహనక్రియ పూర్తయింది. నేనువేసిన ప్లాన్ ఫలించింది. తనంతట తానే ప్రాణత్యాగం చేసుకున్నాడు రాజు.

నేటికి నా పగ చల్లారింది. జగపతిరాజును పరలోకం పంపించాను. ఇప్పుడు నాకు తృప్తిగా వుంది. నన్ను మోసం చేసిన శశికళకు తగిన శాస్తి జరిగింది.''

వ్రాయడం పూర్తిచేసి, డైరీ మూసి, పక్కపై వాలాడు రంగధామం.

★

పాఠకుల
పరిశోధన
పోటీ

53. లజపతిరాయ్ హత్య?

(బహుమతి రు. 50/- లు నగదు)

"రండి శవం ఆ గదిలో వుంది" వినయంగా చెప్పాడు నౌకరు రమణయ్య.

అతన్ని అనుసరించాడు ఇన్‌స్పెక్టర్ రవివర్మ.

తలుపుకి ఎదురుగా 20 గజాల దూరంలోవున్న అయిదడుగుల వెడల్పు టేబుల్ వెనుకకుర్చీలో వుంది లజపతిరాయ్ శవం. గుండు గుండెల్లోంచి దూసుకుపోయింది.

శవం నుదురు టేబుల్ అంచుకి ఆనివుంది. ఆ గది అంతా అత్యాధునికంగా అలంకరింపబడి వుంది. గది అంతా న్యూ మోడరన్ ఆర్టుతో నిండివుంది.

లజపతిరాయ్‌కి ఎడమవైపు టేబుల్‌మీద టెలిఫోన్, కాలింగ్ బజ్జర్, యాష్ ట్రే, రీడింగ్ బుక్స్ షెల్ఫ్ వున్నాయి. కుడివైపు ఏవో ఫైల్స్ వున్నాయి.

లజపతిరాయ్ రెండు చేతులు క్రిందికి వాలిపోయి వున్నాయి.

కుడిచేయి గుప్పిట కొద్దిగా తెరచుకొని అందులోంచి ఒక తెల్లని నైలాన్ బటన్ కనపడుతోంది.

యాష్ ట్రేలో అన్నీ 555 సిగరెట్ బిట్స్ వున్నాయి. కాని ఒక్క బర్క్‌లీ బిట్ (పీక) వుంది.

వేలిముద్రల నిపుణుడని బర్క్లీ సిగరెట్ బిట్ మీద వేలి ముద్రలు, బటన్ మీద వేలిముద్రలు తీయమని చెప్పి నెమ్మదిగా హాలులోకి నడిచాడు ఇన్స్పెక్టర్ రవివర్మ.

హాలులోవున్న సోఫాలో ఇద్దరు వ్యక్తులు విచారంగా కూర్చునివున్నారు. నెమ్మదిగా వారిని సమీపించాడు రవివర్మ.

"మీ పేరు" లాల్చీ పైజమాతో కూర్చునివున్న ఒక ఇరవయ్యేళ్ళ యువకుడిని అడిగాడు.

"సుధాకరం" ఆ వ్యక్తి తల దించుకుని సమాధానం చెప్పాడు.

"హతులైన లజపతిరాయ్‌గారు మీకేమవుతారు?"

"వారు నాకు బావగారు" తల దించుకునే చెప్పాడు సుధాకరం.

"అసలు ఏం జరిగిందో వివరంగా చెప్పండి" ఎదురుగా వున్న సోఫాలో కూర్చుని అడిగాడు రవివర్మ.

"నేను మేడమీద కూర్చుని 'అపరాధ పరిశోధన' చదువుతున్నాను. నాకు దాహం వేసి మధ్యలో క్రిందికి వచ్చాను. రిఫ్రిజిరేటరు బావ గదిలో వుంది. అందుకని ఆయన గదివైపు నడిచాను. గది తలుపులు మూసివున్నాయి. తలుపు తెరిచేసరికి ఎదురుగా బావ శవం కనపడింది. వెంటనే వెనక్కితిరిగి హాలులోవున్న ఫోనులో మిమ్మల్ని పిలిపించాను" అంతా ఒక్కసారి చెప్పాడు సుధాకరం.

ఇక అతనివద్దనుండి తమకు ఏ విధమైన సమాచారం తెలియదని నిశ్చయించుకుని మూలగా చేతులు కట్టుకున్న నౌకరు రమణయ్యని సమీపించాడు రవివర్మ.

తన దగ్గరకివచ్చిన రవివర్మని భయంగా చూసాడు రమణయ్య.

"నేను అడిగిన దానికి సూటిగా సమాధానం చెప్పు.

హత్యాసమయంలో అంటే అరగంట క్రితం నువ్వేం చేస్తున్నావ్'' ప్రశ్నించాడు రవివర్మ.

''నేను వంట ఇంటిలో అమ్మగారికి సహాయంచేస్తున్నానండి. ఎవరో పిలిస్తే ఎల్లానండి. ఎవరో బాబుగారు కావాలని అడిగారండి. ఆరికి బాబుగారి గది చూపించి లోనికెల్లమని సెప్పి, నేను వంట ఇంట్లోకి వొచ్చేసినానండి'' చెప్పాడు రమణయ్య.

''ఆ వచ్చిన వ్యక్తి ఏడీ?'' అనుమానంగా ప్రశ్నించాడు రవివర్మ.

''అదిగోండి, ఆ మూల కూకుండారు'' అని మూలగా విచారంగా కూర్చునివున్న వ్యక్తిని చూపించాడు రమణయ్య.

నెమ్మదిగా ఆ వ్యక్తి వైపు నడిచాడు రవివర్మ.

రవివర్మని చూసి ఆ వ్యక్తి గౌరవంగా లేచి నిలబడ్డాడు.

''మీ పేరు.''

''రామ్‌నాథ్.''

''ఇక్కడికి ఎందుకొచ్చారు?'' రవివర్మ ప్రశ్నించాడు.

''లజపతిరాయ్‌గారు ఒక కంపెనీకి డైరెక్టర్. ఆయన ఆధ్వర్యంలో రేపు ఉదయం ఇంటర్వ్యూ జరుగబోతుంది. ఆయనను ప్రార్థిస్తే ఏమైనా నాకు ఉద్యోగం వస్తుందేమోనని వచ్చాను'' చెప్పాడు రామ్‌నాథ్ భయంగా. ''కానీ నేను ఆయన గదిలోకి వెళ్ళలేదు భయంవలన. నేను తిరిగి వెళ్ళబోయేంతలో హత్య జరిగిందని నన్ను ఉంచేసారు ఇక్కడ.''

''మీ స్లాక్ బటన్ హత్యా ప్రదేశంలో కనిపించింది. దీనికి మీ సంజాయిషీ'' కొద్దిగా కరకుతనాన్ని మిశ్రమం చేసి ప్రశ్నించాడు రవివర్మ, పై బటన్ లేని రామ్‌నాథ్ షర్టు వైపు చూస్తూ.

రామ్‌నాథ్ మొహం నల్లబడింది.

కంగారుగా తన షర్టు వైపు చూసుకున్నాడు రామ్‌నాథ్.

"పై బటన్ లూజ్‌గా వుంది. ఎక్కడైనా జారి పడి పోయిందేమో?" అన్నాడు కంగారుని కప్పి పెట్టడానికి ప్రయత్నిస్తూ.

రవివర్మ దృష్టి రామ్‌నాథ్ జేబులోవున్న బర్కిలీ మీదకి పాకింది. చిన్నగా తల పంకించాడు రవివర్మ.

అతని వద్ద ఏ విధమైన సమాచారం రాదని నిశ్చయించు కుని, మెల్లిగా వంట ఇంటిలో కూర్చుని ఏడుస్తున్న లజపతి రాయ్ భార్య దగ్గరికి నడిచాడు రవివర్మ.

ఏడుస్తున్న ఆవిడ ఏడుపు ఆపి రవివర్మ వైపు చూసింది.

"నేను వంట ఇంట్లో వుండి బట్లర్‌కి ఏం చెయ్యాలో చెప్తున్నాను. సుధాకరం ఏడుస్తూ వచ్చి విషయం చెప్పాడు" చెప్పి ఘొల్లుమంది లజపతిరాయ్ భార్య.

ఆమెని ఇంకా ప్రశ్నించి లాభం లేదని నిశ్చయించుకొని మళ్ళీ హాల్‌లోకి నడిచాడు రవివర్మ.

* * *

[ఇదీ కథ. దీనిలో లజపతిరాయ్‌ను హత్య చేసిన హంతకులెవరో పరిశోధించి మాకు వ్రాయండి. మీ జవాబులను ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితంపై వ్రాసి, యీ నెల 20వ తేదీ లోగా మాకు చేరేటట్లు పంపండి. కేసును చక్కగా పరిశోధించిన ఐదుగురు "హోమ్‌డెలివరీ" సభ్యు లకు ఒక్కొక్కరి రు. 10/-లు చొప్పున రు. 50/-లు నగదు బహుమతి పంపగలము. ఇప్పటి వరకు "హోమ్ డెలివరీ" సభ్యత్వము పొందని పాఠకులు వెంటనే తమ సభ్యత్వ రుసుమును పంపుతూ పోటీలో పాల్గొన వచ్చును. తుదినిర్ణయం సంపాదకులదే. ఫలితాలు అక్టోబరు '74 నెల సంచికలో ప్రకటిస్తాము. —ఎడిటర్.]

పోటీ నెం 51 (ఫలితాలు)

హంతకుడు—రంగనాథన్.

రంగనాథన్ పేరు తప్ప, మిగతా ముగ్గురు అనుమానితుల పేర్లలోను, హతుడి పేరులోను వున్న సిమిలారిటీ ఇది: "అపన" రచయితల పేర్లు, హంతకుడు మినహాయించి మిగతా నలుగురి పేర్లలోను సిమిలారిటీ వుంది.

వెంకట్—మల్లాది వెంకటకృష్ణమూర్తి
రామ్మోహన్—ఏ. వీ. మోహన్రాన్
సీతారామ్—కె. శివరామ్
నిర్మలారాణి—ఉప్పలూరి ఉషారాణి

పై విధంగా సిమిలారిటీ లేని పేరు 'రంగనాథన్' ఒక్కటే.

ఈ కేసుని చక్కగా పరిశోధించిన యీ క్రింది ముగ్గురు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 10/-లు చొప్పున బహుమతి యీ నెలాఖరులోగా అందజేయబడుతుంది.

(1) శ్రీ రంకిరెడ్డి రాము, బిం. కా. సెక్రటరీ, లిటరరీ క్లబ్, తండ్రిపేరు—ఆర్. సుబ్బారావు, 6 వ వార్డు, తాడేపల్లిగూడెం-534101.

(2) శ్రీ టి. రామమూర్తి, బి. ఏ. ఇంటి నెంబర్: 20-1/3-17, నాయుడు బిల్డింగ్స్, చిత్తూరు-517001.

(3) శ్రీ ఏ. నాగేశ్వరరావు, బి. కాం.. కేరాఫ్—ఏ. ఎల్. రావ్, 95-బి రైల్వే క్వార్టర్స్, పూరి-2 (ఒరిస్సా స్టేట్)

★

నిప్పులాంటి అమ్మాయి

ఎ.వి. మోహనన్

రాత్రి ఒంటి గంటయింది.

అరండల్‌పేట ఆరో వీధిలోని అరవై నంబరు ఇంటిముం దాగింది టాక్సీ.

రామనాథం దిగాడు. మీటర్ చూసి డబ్బు ఇస్తుండగా రాజ్యలక్ష్మికూడా తన స్థూలకాయాన్ని మెల్లగా వెలుపలకు జేరవేసింది.

పొట్టిగా, తెల్లగా, లావుగా, తెల్లఏనుగు పిల్లలా వుంటుంది రాజ్యలక్ష్మి. పిల్లల్లేరు.

రామనాథాన్ని రెండోపెళ్ళి జేసుకుంది. ఆమె మొదటి భర్త చనిపోయి మూడేళ్ళయింది. కావలసినంత ఆస్తి వది లేసి పోయాడు. ఒంటరిగా వుండలేక తన జతకోసం వెతికింది.

రామనాథానిక్కూడా భార్య చనిపోయి పదహారేళ్లయింది. ఒక్కతే కూతురు. పేరు అరుణ. రాజ్యలక్ష్మి అజమా యిషీలో నడుస్తున్న రాకెట్ ఫైర్ రిక్రేడింగ్ కంపెనీలో మేనేజరు. ఇద్దరికీ బాగా పరిచయముంది. పరిస్థితుల ప్రభావం బాగ ఇద్దరిపైనా పడటంతో తక్కువ నిరాడంబరంగా పెళ్ళి చేసుకున్నారు.

కాలింగ్ బెల్ నొక్కాడు. సౌండ్ వినిపిస్తూందే తప్ప తలుపు తీసేందుకు ఎవ్వరూ రాలేదు.

"తినటానికి కావలసినంతమందున్నారు కొంప నిండా. ఎప్పుడన్నా ఇలా ఆలస్యంగా వస్తామంటే కాస్త మేలుకొని, బెల్ కొట్టగానే తలుపు తియ్యాలన్న జ్ఞానం వుండదు. వెధవ సంత!" అంది విసుగ్గా వచ్చి భర్తప్రక్క నిలబడుతూ.

రామనాథం ప్రయత్నం కొనసాగిస్తూనే వున్నాడు.

రాజ్యలక్ష్మి కొద్దిగా వంగి తలుపులకేసి చూసి "మీ తెలివి తెల్లారినట్లుంది. అంత పెద్ద తాళం కప్ప గడియలకు వ్రేలాడుతుంటే బెల్ నొక్కి ప్రయోజనమేమిటి? పనివా

ళ్ళిద్దరూ ఏమయినట్లు? అరుణ ఏమైంది?'' అంది కోపంగా.
"పనివాళ్లు శెలవు కావాలన్నారు. సరే వెళ్లమన్నాను. అమ్మాయి వచ్చిందాకా వుండి, తాళాలు అప్పజెప్పి మరీ వెళ్ళమన్నాను. అరుణ ఏమైందో! ఒకవేళ అదికూడా ఏ సినిమాకన్నా వెళ్ళిందేమో? ఈపాటికి వచ్చేస్తూంటుంది. నువ్వు ఎక్కువసేపు నిలబడలేవు గానీ, ఆ మెట్లమీద కూర్చో!'' అన్నాడు రామనాథం.
"అదీ నిజమే!'' అంటూ ఆపసోపాలు పడుతూ వెళ్ళి మెట్టు అంచుమీద చటుక్కున కూలబడింది.
రామనాథం గేటుదగ్గరకు రెండుసార్లు వెళ్ళి వీధి రెండు వైపులా చూసొచ్చాడు. అరుణ వస్తున్నజాడ కనుపించలేదు.
"ఆడపిల్ల. అందులోనూ మంచివయసు జోరులో వుంది. ఇలా భయం, భక్తీ లేకుండా రాత్రిళ్లు తిరుగుతుంటే మందలించుకోరూ! మన కర్మం బాగులేక ఏ వెధవో దానికి కడుపో, కాలో చేస్తే ఆ తర్వాత ఏడవవలసింది మీరే! అన్నానని నన్ను ఆడిపోసుకొని ప్రయోజనం వుండదు తర్వాత!'' అంది రాజ్యలక్ష్మి.
"అమ్మాయి నిప్పులాంటిదే! అరుణ స్వభావం నీకు మాత్రం తెలీదు. అనవసరంగా నువ్వు భయపడి, నన్ను భయపెట్టకు. సినిమా వదలటం ఆలస్యమై వుంటుంది. ఈ పాటికి వచ్చేస్తూంటుంది'' అన్నాదు రామనాథం.
మరో అరగంట అలా అరుణకోసం ఎదురుచూస్తూ గడిపారు భార్యాభర్తలు. ఆమె వస్తున్న సూచన లేకపోవడంతో రాజ్యలక్ష్మికి విసుగెత్తుకొచ్చింది. భర్తను నానా మాటలు అంది. డబ్బుగల పెళ్ళాం కాబట్టి అంతలేసిమాటలంటున్నా నోరుమూసుకొని వుండిపోయాడు.
అరుణ కేమైందో అన్న భయ మొకప్రక్కా, భార్యచేసే

గోలకు కోప మింకొకప్రక్కా మిన్నుముట్టసాగాయి అతడికి.

అరగంట గంటగా మారింది.

"ఆ మహాతల్లి ఇంక రాదుగానీ, ఏ రాయో రప్పో పెట్టి ఆ తాళం పగులగొట్టండి. ఈ చలిలో, ఇక్కడింకొక గంట కూర్చుంటే నేను గడ్డకట్టిపోతాను" అంది రాజ్యలక్ష్మి.

రామనాథం తోటంతా తిరిగి లావుపాటి ఇనుప గండి లాంటి దొకటి తెచ్చి తాళంకేసి బలంగా నాలుగైదు దెబ్బలు కొట్టాడు. తాళం వూడింది.

ఇద్దరూ లోనికి జేరారు.

రాజ్యలక్ష్మి మారుమాట లేకుండా తిన్నగా తన గదివేపు కెళ్ళిపోయింది.

రామనాథం బట్టలు మార్చుకుని, అరుణ గదికెళ్ళి చూశాడు. అందులో మూలగావున్న కూతురి బట్టల స్టాండుకేసి పరిశీలించి చూశాడు. ఎర్రపూల నల్ల జార్జెట్ చీర కనుపించింది.

అంటే అమ్మాయి ఇంటికొచ్చిందన్న మాట. వచ్చాక వెళ్ళింది. ఎక్కడికెళ్ళింది?

హాల్లోకి వచ్చి కూర్చున్నాడు. మధ్యగావున్న రాకింగ్ ఛెయిర్‌లో కూర్చుని సిగరెట్ కాల్చుకుంటూ కూతురికోసం ఎదురుచూడసాగాడు రామనాథం.

కాలం గడిచేకొద్దీ ఆయన ఆలోచనలు, కూతురికి ప్రమాద మేమన్నా జరిగిందేమోనని అనుమానించసాగాయి.

ఆయన కర్థంకానిదల్లా ఇంటికి వచ్చిన అరుణ తిరిగి ఎందుకు వెళ్ళింది? అంత అవసరమైన పనులే ముండి వుంటాయి?

ఇంటికి తాళంవేసి, దాన్నెవ్వరికీ ఇవ్వకుండా తీసుకుపోయిందంటే తను తిరిగి వెంటనే రాబోతుందనేగా? మరి ఎందుకు రాలేదు? ఏమైంది?

తెల్లవారిందాకా కంటిపైన కునుకు లేకుండా అరుణ వస్తుందేమోనని చూడసాగాడు. ఆమె రాలేదు. ఇంక రాదన్న అనుమాన మేసింది.

వెళ్ళి భార్యను లేపి విషయం చెపుదామని ఆమె గదికి వెళ్ళాడు. భయంకరంగా గురక పెడుతూ, పడుకొని నిద్ర పోతూంది రాజ్యలక్ష్మి. ఆమెను లేపడం అసాధ్యమనుకొని వెనక్కి తిరిగొచ్చాడు.

వెలుపలకెళ్ళి ఎదురింట్లోను, ప్రక్క ఇంట్లోను వాకబు చేశాడు. వాళ్లు తమకేం తెలియదని, అరుణను అసలు చూడనేలేదని చెప్పారు.

మళ్లీ లోనికొచ్చి తెలిసిన ఫ్రండ్స్‌కంతా ఫోన్ చేశాడు. కానీ వాళ్ళతో అరుణ కనుపించడంలేదని చెప్పలేదు. ఫోన్ చేసి మామూలుగా క్షేమసమాచారాలు అడిగాడు. అరుణ వాళ్ల ఇళ్లలో వుండివుంటే చెప్తారుగదా అన్న ఆశతో. ఆ ఆశా అడియాసయింది.

రాజ్యలక్ష్మి లేచొచ్చింది. అరుణ రాలేదన్న విషయం తెలుసుకుని నిప్పులుతొక్కిన కోతిలాగ గెంతులు వేసింది. పనివాళ్లకు ఆ దినం శెలవు ఇవ్వడంవల్ల, అరుణ లేక పోవడంవల్ల, అన్నిపనులూ ఆమె నెత్తిన పడ్డాయి. ఆ కోపంతో అడ్డమైన అవాకులూ, చెవాకులూ పేలింది భర్త పైన.

రామనాథం వింటూ నిలబడ్డాడు.

"మీరు తిన్నగా పోలీస్ స్టేషనుకు వెళ్ళి రిపోర్టు ఇచ్చి, ఆ సంగనాచి ఫొటో ఒకటి పేపర్లవాళ్లకిచ్చి కనుపడుటలేదు అని ప్రకటన వేయించే ఏర్పాటుచేసి, తిరిగి వచ్చేటప్పుడు హోటల్లో కారియర్‌లో అన్నం తీసుకురండి. అందాక నేను అక్షరమెత్తు లేవలేను. అర్ధణా పని చెయ్యలేను" అంటూ

కూలబడింది సోఫాలో.

అరుణ పెళ్లి డుకొచ్చిన పెళ్లి కావలసిన పిల్ల. ఆమె కనపడటంలేదని ప్రకటనలు చేసి, పోలీస్ రిపోర్టులిచ్చి నానా అల్లరి చేసుకుంటే నష్టపోయేది తనే!

భార్య సలహా రామనాధానికి నచ్చలేదు. ఆమాట ఆమెతో చెప్పలేకపోయాడు. ఇంకేదైనా దారి చూడాలనిపించింది.

అకస్మాత్తుగా అతనికి ప్రైవేట్ డిటెక్టివ్ సుధాకర్ పేరు గుర్తొచ్చింది. లైన్స్ క్లబ్‌లో మాట్లాడేందుకు ఆ దినం ఆయన ఆ వూరు వచ్చివున్నాడు. ఆ సంగతి పేపర్లో చదివాడు. ఇంకా ఇక్కడే వుండివుంటాడు. ఆయన్ని కలుసుకొని తన సమస్య చెపితే సాయం చెయ్యగలుగుతాడు.

వెంటనే లైన్స్ క్లబ్‌కు ఫోన్ చేశాడు. క్లబ్ సెక్రెటరీ సుధాకర్ హోటల్ 'సుధారా' లో రూం నెంబరు రెండొందలా ఏడులో బసచేసి వున్నారని చెప్పడంతో మనసు తేలికపడింది.

మళ్లీ వచ్చి కారియర్‌లో భోజనం తెస్తానని భార్యతో చెప్పి, డ్రెస్ చేసుకుని వెళ్ళిపోయాడు వీధిలోకి.

2

"వసంతా! ఆయన చెప్పిన వివరాలన్నీ నోట్ చేసుకున్నావా?" అడిగాడు సుధాకర్.

"ఆఁ!" అంది వసంత తలూపుతూ.

"రామనాధంగారూ! అరుణ ఎవరినన్నా ప్రేమించిందా?" అడిగాడు సుధాకర్.

"నాకు తెలిసి ఆమెకు ఎవ్వరితోనూ పరిచయం లేదండీ!"

"ఇంతకు ముందెప్పుడయినా ఇలా రాత్రిళ్ళు రాకుండా ఆమె ఫ్రెండ్సు ఇళ్ళల్లో వుండిపోవడం జరిగిందా?"

"లేదండీ! అందుకే నా కీ ఖంగారు."

"ఆమె స్నేహితురాళ్ళ అడ్రసులన్నీ ఇచ్చారుగా?"

"నాకు తెలిసినంతవరకూ ఇచ్చాను."

"ఆల్ రైట్! మీరు వెళ్ళండి! మీ అమ్మాయి విషయం మేము పరిశోధిస్తాం" అన్నాడు సుధాకర్.

రామనాధం శెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

"వసంతా!" పిలిచాడు సుధాకర్.

"యస్ బాస్!" వెళ్ళి ప్రక్కగా నిలుచుంది వసంత.

"రామనాధం ఇచ్చిన మూడు అడ్రసులకూ వెళ్ళి అరుణ ఫ్రెండ్స్‌ను కలుసుకో. వాళ్ళ ద్వారా ఆమె వివరాలు సేకరించు. ముఖ్యంగా మగపిల్లలతో ఎవరితోనన్నా చనువుగా తిరుగుతుందా అన్న విషయమై నీ పరిశోధన అవసరం. నేనీలోగా పోలీసు స్టేషనుకు వెళ్ళి ఏమైనా వివరాలు దొరుకుతాయేమో చూస్తాను" అన్నాడు సుధాకర్.

"అలాగే! నే వెళ్తాను" అంది వసంత.

వసంత వెళ్ళిపోయాక సుధాకర్ తను కూడా డ్రెస్ చేసుకుని హోటల్ ఆవరణలో పార్కు చేసిన రెడ్ ఇంపాలా ఎక్కి కూర్చున్నాడు.

కారు టూటౌన్ పోలీస్ స్టేషను ముందాగింది.

హెడ్ కానిస్టేబుల్‌తో రొటీన్ వ్యవహారాలు మాట్లాడుతున్న మూర్తి కారును చూడగానే లేచి వెలుపలకొచ్చి,సుధాకర్‌కు కారు వద్దే స్వాగతం చెప్పాడు. ఇద్దరూ లోనికొచ్చారు. కానిస్టేబుల్ కనకయ్యను పిలిచి రెండు కప్పులు స్పెషల్ కాఫీ తెమ్మన్నాడు.

"అవన్నీ వద్దు మూర్తీ! నీతో కొద్దిగా పనుండి వచ్చాను" అన్నాడు సుధాకర్.

"అన్నప్పుడల్లా వస్తారా మీరు! తీసుకురానివ్వండి.

ఇంతకూ అసలు మీరొచ్చిన పనేమిటి?" అడిగాడు ఇన్స్పెక్టర్ మూర్తి.

"ఏం లేదు రాత్రి ఎనిమిది గంటలనుండి ఇప్పటిదాకా ఈ వూళ్ళో ఏవైనా ఆక్సిడెంట్లు జరిగాయా! అందులో ఇరవై సంవత్సరాల వయసున్న అందమైన పెళ్లిగాని అమ్మాయికి దెబ్బలు తగలడంగానీ, చనిపోవడంగానీ జరిగిందా! కాస్త వెరిఫై చేసి చెప్పాలి!" అన్నాడు సుధాకర్.

"ఏదైనా కేసా?"

"అలాంటిదే! ఆ అమ్మాయి ఫాదర్ నా దగ్గరకొచ్చాడు. మీ దగ్గరకు వెళ్ళమన్నాను. సందేహించాడు. అతని బాధ అర్థమయింది.అందుకే ఒప్పుకున్నాను" అన్నాడు సుధాకర్.

"నా స్టేషనుకు ఇంతదాకా అలాంటి సమాచారం రాలేదు. మిగిలిన స్టేషన్లకు కూడా ఫోన్‌చేసి కనుక్కొని చెపుతాను" అంటూ చకచక పనిలో పడ్డాడు.

కనకయ్య కాఫీ తెచ్చి టేబుల్‌పైన పెట్టాడు.

సుధాకర్ కప్పు అందుకుని సిప్ చెయ్యసాగాడు.

మూర్తి ఫోన్ పెట్టేస్తూ "ఎక్కడా ఏక్సిడెంటు జరగలేదుసార్!" అన్నాడు.

"గుడ్! అయితే ఆ అమ్మాయి ప్రాణాలతో వున్నట్లే. కాబట్టి పట్టుకోవడం సులభమే!" అన్నాడు.

"చాలా థాంక్స్ మూర్తీ! వస్తాను. అవసరమైతే మళ్ళీ కలుస్తాను" అంటూ శెలవు తీసుకొని వెలుపలికొచ్చి కారెక్కి, అరండల్ పేటవైపు పోనిచ్చాడు.

అరవై నెంబరు ఇంటిముందాపి, దిగి లోనికి వెళ్ళాడు. హాల్లో పర్వతంలా కూర్చునున్న మనిషిని చూపి "రామనాథంగారు లేరా?" అడిగాడు.

"లేరు! కూతురెవరితోనే లేచివెళ్ళింది. ఎవరితో

వెళ్ళిందో తెలుసుకునేందుకు కాలికి బలపం కట్టుకొని తిరుగు తున్నట్లున్నాడు. మీ రెవరు బాబూ!'' అడిగింది రాజ్యలక్ష్మి కుర్చీలోంచి లేవకుండా, సుధాకర్‌ను కూర్చోమనకుండా.

''నా పేరు సుధాకర్! ప్రైవేట్ డిటెక్టివ్‌ను''చెప్పాడు.

ఆ పేరు వినగానే అంతలావు ఆకారం అమాంతం పైకి లేచింది. ''మీరా! అబ్బా! మీ పేరు విన్నాను. మీరు పరిశోధించిన కేసులు కథల్లా గుంటాయి. చాలా చదివాను, కూర్చోండి. మావారెలా తెలుసు?'' అడిగింది.

రామనాధం తన్ను కలుసుకుని సాయం అడిగిన విషయం చెప్పి ''రాత్రి మీరు ఎన్ని గంటలకు సినిమాకు బయలుదేరి పోయారు?'' అడిగాడు.

''మేము ఎనిమిదిగంటలకల్లా వెళ్ళాం! వంటవాడు పని మనిషి వున్నారు. అరుణ రాలేదు'' అంది రాజ్యలక్ష్మి.

''ఐ. సీ. పదిగంటలకు మొదలుపెట్టే ఆటకోసం అంత తొందరగా వెళ్ళడం....''

''కారు రిపేరులో వుంది. టాక్సీలు ఓపట్టాన దొరకవు. నా ఆకారం చూసి రిక్షావాళ్ళు మామూలు కిరాయికి రారు. వాళ్ళతో ఒక పట్టాన మాకు బేరం కుదరదు. అందుకని నడుచుకుంటూ వెళ్దామని కాస్త ముందే బయలుదేరాము!'' అంది రాజ్యలక్ష్మి.

ఆమె మాటలకు నవ్వొచ్చినా సభ్యతగా వుండదని ఆపుకున్నాడు సుధాకర్.

''ఎదురింటి వాళ్లు, ప్రక్కఇంటివాళ్ళు మీతో బాగుంటారా?''

''వాళ్ళా! నా పెళ్లికిముందు బాగుండేవాళ్లు. నేను రెండో పెళ్లి ఈ రామనాధంగార్ని చేసుకున్నాక మాట్లాడడం మానేశారు. నేనేదో పెద్ద తప్పు చేశానని వాళ్ళ అభిప్రాయం.

ఆ ఎదురింట్లో వుండే ఏకాంబరం మావారు బ్రతికుండగానే నన్ను తినేసేలా చూసేవాడు. ఆయన పోయాక రెండు ప్రేమలేఖలు సానుభూతి చూపుతూ పనిమనిషిచేత పంపాడు. దాన్ని నాలుగు తన్ని పంపాను. ఆ తర్వాత లాభంలేదని పెళ్లి చేసుకున్నాను" అంది రాజ్యలక్ష్మి.

"ఆయన భార్య ఎటువంటిది?"

"అబ్బో వెంకటలక్ష్మి అసాధ్యురాలు. అస్తమానం అవతల వాళ్ళ వ్యవహారాలు కావాలి దానికి. దాని మొగుడ్ని నేను వల్లో వేసుకుంటున్నాననీ,డబ్బాశ చూపించి రమ్మంటున్నాననీ చెప్పుకొందట అందరితోనూ. వాడ్ని చూస్తే అసలు డోకొస్తుంది'' అంది రాజ్యలక్ష్మి.

అంతలో ఆమెకు అనుమానమొచ్చింది వాళ్ళ గురించి సుధాకర్ అన్ని వివరాలెందుకు అడుగుతున్నాడని. తన అనుమానం తీర్చుకునేందుకు అడిగింది అతన్నే.

"ఏమీలేదు! ఊరకే అడిగాను. అరుణ గురించి మీ అభిప్రాయమేమిటి?" అడిగాడు సుధాకర్.

"అదా! చూపులకు అమాయకురాలులా వుంటుంది. కానీ లోతు మనిషి. ఒక పట్టన బైట పడదు సాధుపలక'' అంది.

"థాంక్స్! వస్తాను. రామనాధంగారింటికొస్తే ఓ మారు నాకు హోటల్‌కు ఫోన్ చెయ్యమనండి'' అంటూ వెలుపలికి వచ్చేశాడు. గుమ్మం పట్టుకుని చూస్తూ నిలుచుంది రాజ్యలక్ష్మి.

ఇంటిముందు సైకిల్ రిక్షా ఆగిన శబ్దం కావడంతో తలెత్తి చూసింది రాజ్యలక్ష్మి. అందులోంచి దిగుతున్న కుమార్ కనుపించాడు. కుమార్ రాజ్యలక్ష్మికి పెద్దనాన్న కొడుకు. అప్పుడప్పుడూ వచ్చి పోతుంటాడు.

"ఏరా! ఎక్కడ్నుంచి ఇలా ఊడిపడ్డావ్! నువ్వొచ్చి సంవత్సరం పైన కాలేదూ!" అంది గుమ్మంలోనే.

"అయిందక్కా! బావలేడు!" అడిగాడు లోపలికి ఆమె వెంట నడుస్తూ.

"ఉన్నాడులే! అంతా బాగున్నారా?"

"ఆఁ! అరుణేది."

"దాంతో నీకేం పనిరా! నేను ఇంత చిక్కిపోయినా ఒక్కమాట అనలేదు. అదింట్లో లేకున్నా దాన్ని గురించి అడుగుతున్నావ్. నువ్వొచ్చింది నాకోసం కాదురా! దాని కోసం!" అంది రాజ్యలక్ష్మి కోపంగా.

"అలా గనకు! ఊరకఅడిగాను. నేను వెళ్ళి కాస్త రెస్ట్ తీసుకుంటాను" అంటూ లోనికి వెళ్ళిపోయాడు కుమార్.

3

"రండి! ఎవరు కావాలి?" అడిగాడు రామనాథం ఇంటి కెదురుగావున్న ఇంట్లో వుంటున్న ఏకాంబరం.

"ఏకాంబరంగారంటే మీరే కదూ!"

"అవునండీ!"

"నేను ప్రైవేట్ డిటెక్టివ్‌ను. ఒక కేసులో పనిచేస్తున్నాను. నా పేరు సుధాకర్. మీ శ్రీమతిగార్ని కాస్త పిలవండి. మాట్లాడాలి" అడిగాడు.

"కొంపదీసి అదెవర్నీ హత్యచెయ్య లేదుగా?"

"చెయ్యగలదని మీ రనుకుంటున్నారా?"

"అబ్బే! ఎలుకను చూస్తే ఎగిరిపడే రకం. మీరు పని గట్టుకుని ఇలా వెతుక్కుంటు వస్తే భయంవేసింది."

"కాస్త సమాచారం కావాలి. అంతే!"

"బ్రతికించారు!" అంటు గుండెలు కుదుటబరుచు

మీరే ఎన్నుకోండి? [బ్యాలెట్ ఫలితాలు]

జులై '74 నెల "సప్లిమెంట్" లో నిర్వహించబడిన బ్యాలెట్ లో శ్రీ శ్యాంబాబుగారి 'ఎడారిలో ప్రాణగండం' నవల అత్యధిక మెజారిటీతో ఉత్తమ నవలగా ఎన్నుకోబడినది. ఆ రచయితకు రు. 116/-లు బహుమతి త్వరలో అందజేయబడుతుంది.

ఈ నెలలో మొత్తం నాలుగు నవలలకు వచ్చిన ఓట్ల వివరాలు, వాటి వరుసక్రమం ఇది:

1. ఎడారిలో ప్రాణగండం (60.0%)
2. ఫ్యామిలీ డాక్టరు (15.6%)
3. న్యూక్లియర్ టెస్ట్ (13.3%)
4. తొమ్మిదేళ్ళక్రితం హంతకుడు (11.1%)

పై వరుసక్రమంలో నవలల ఎన్నికను సరిగ్గా చేసిన యీ క్రింది నలుగురు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 10/లు చొప్పున మొత్తం రు. 40/-లు బహుమతి యీ నెలాఖరులోగా పంపగలము.

(1) శ్రీమతి పి. మైథిలీ, కేరాఫ్—పి.వి. సుబ్బారావు (జమీందారు), అకివీడు, ప. గో. జిల్లా.

(2) శ్రీ వి. నాగేశ్వరరావు, టైపిస్ట్, మునిసిపల్ ఆఫీసు, తెనాలి, గుంటూరు జిల్లా.

(3) శ్రీ డి. వెంకటరాజేశం, కావ్యశ్రీ రాంపూర్ పోస్ట్, (కాజిపేట-వార్థాలైన్.)

(4) శ్రీ మిట్టె శివానంద, 9/36 వీవర్స్ స్ట్రీట్. బళ్ళారి-1 (కర్ణాటక స్టేట్.)

కున్నాడు ఏకాంబరం. లోనికిచూస్తూ. "ఏమేవ్? ఒక్కసారిలా రా?" అంటూ పెద్దగా అరచాడు.

మసిచేతులు తుడుచుకుంటూ, ముసిముసిగా నవ్వుకుంటూవచ్చి గుమ్మంవోరగా నిలబడింది ఏకాంబరం భార్య వెంకటలక్ష్మి. క్రొత్త మనిషినిచూసి ఆశ్చర్యపోతూ.

"నమస్కారమండీ! నా పేరు సుధాకర్" అంటూ తన్ను తానే పరిచయంచేసుకుని ఎదురింటి అరుణ అంతర్ధానమైన విషయం వివరించి చెప్పి. "మీ రేమైనా సమాచారం చెప్పగలరేమోనన్న ఆశతోవచ్చాను" అన్నాడు.

"చెప్తామనేవుంది. కానీ ఆ రాజ్యలక్ష్మి వీధినబడి నన్నూ నా సంసారాన్నీ పాడుతుంది. అది పడలేము బాబూ!" అంది వెంకటలక్ష్మి.

"అలాంటి దేమీలేదు! ఆమెతో చెప్పే వచ్చాను" అన్నాడు సుధాకర్.

"నీ వెందుకే ఈ విషయాలు తెలుసుకొంటావ్. ఇప్పుడు వీరొచ్చారు. ఇంకాసేపటికి పోలీసులు వస్తారు. నీకు వెయ్యిసార్లు చెప్పాను. ఎదురింటికేసి ఇలా ఇరవైనాలుగు గంటలు పరిశోధనచెయ్యొద్దని!" అంటూ మందలించాడు ఏకాంబరం.

సుధాకర్ కూర్చున్నాడు.

"మీరు చెప్పండమ్మా! రాత్రేం చూశారు?"

"వాళ్ళిద్దరు సినిమాకు వెళ్లారు. ఆ తర్వాత గంటకో గంటన్నరకో అరుణ వచ్చింది. తిన్నగా లోనికివెళ్ళింది. ఆ తర్వాత పదినిముషాలకు పనివాళ్ళిద్దరూ చిన్నసంచులతో వెలుపలకు వెళ్ళిపోయారు. అరుణకూడావెళ్ళి పడుకుంటుం దేమోలే ననుకున్నాను. కానీ ఆ పిల్ల ఇంట్లోకి బయటకూ ఆసులోదారంలా అదేపనిగా తిరగసాగింది. ఎవరికోసమో

ఎదురుచూస్తున్నట్లుంది. వీధి దీపాలు కరెంటుకోతవల్ల వెలగడం మానేసి ఆర్పెల్లయింది. వీధంతా మసకచీకటిగా వుంది. పదకొండుప్రాంతంలో స్కూటరొచ్చి ఆగింది. దానిమీదో యువకుడున్నాడు. అతని మొహం నాకు సరిగ్గా కనుపించలేదు. సూట్‌లోవున్నాడు. నెత్తిన టోపీవుంది. అతన్నిచూడగానే అరుణలోనికివెళ్ళి తలుపు తాళంవేసి వచ్చింది. ఇద్దరూ రోడ్లోనే రెండునిముషాలు మాట్లాడుకున్నారు. ఆ తర్వాత ఆమె ఎక్కి వెనుకవేపు కూర్చుంది. స్కూటర్ వెళ్ళిపోయింది. అంతే!" అంది.

"రామనాధంగారు సినిమానుండి రావడం చూశారా?" అడిగాడు సుధాకర్.

"లేదండీ! చూద్దామని కిటికీదగ్గర నిలబడ్డాను. ఆయనేమో తిడుతూ చేరాడు. ఆ పోరుపడలేక వెళ్ళి పడుకున్నాను" అంది వెంకటలక్ష్మి.

"థాంక్స్! వస్తాను. ఏకాంబరంగారూ మీరేం భయపడకండి. మీ యింటికి పోలీసులురాకుండా చూసే పూచీనాది!" అన్నాడు సుధాకర్.

"ఆ సాయం చెయ్యి బాబూ! చాలు! ఇకపైన దీనికీ బుద్ధిపోయేట్లు చూస్తాను!" అన్నాడు ఏకాంబరం. ఆ మాటలు వినిపించుకోకుండా సుధాకర్ వెలుపలకొచ్చి, రోడ్‌దాటి మళ్ళీ రామనాధం యింట్లోకి ప్రవేశించాడు.

టీపాయ్‌పైనున్న బ్రీఫ్‌కేస్ కేసిచూసి "రామనాధంగారు వచ్చారా?" అడిగాడు ఎదురుగావున్న కుర్చీలో కూర్చుంటూ.

"రాలేదండీ! విజయవాడనుండి మాతమ్ముడు కుమార్ వచ్చాడిప్పుడే! స్నానం చేస్తున్నాడు" అంది.

"నా క్కాస్త అరుణగది చూపిస్తారా?"

"మీరు వెళ్ళిపోయారనుకున్నాను."

"లేదండీ! చుట్టుప్రక్కల సమాచారం దొరకుతుందేమోనని వాకబుచేస్తూండి పోయాను" అన్నాడు సుధాకర్.

మెట్లపైకి దారితీస్తూ "ఏమైనా దొరికిందా?" అడిగింది రాజ్యలక్ష్మి.

"లేదండీ!" అన్నాడు సుధాకర్.

"ఏమో! ఏమయిందో? మా కుమార్‌గాడికి ఆ పిల్లను చేసుకోవాలని వుండేది. ఈ విషయం విని చెడ్డ బాధపడి పోయాడు వాడు" అంది.

"అరుణ ఎవరినైనా ప్రేమిస్తోందేమో మీకు తెలీదా?"

"తెలీదు బాబూ! తెలిస్తే చెప్పేదాన్నిగా?"

ఇద్దరూ అరుణ గదిలోకి వెళ్ళారు. సుధాకర్ ఆ గదంతా చెక్ చెయ్యాలనుకున్నాడు. మంచినీళ్ళు తెచ్చిపెట్టమని ఆమెను పురమాయించాడు. ఆమె గడపదాటగానే పరిశోధన మొదలుపెట్టాడు. డ్రాయరు సొరుగులోంచి ఆమె పర్సు తీశాడు. తెరచిచూశాడు. అందులో మేకప్ సామానుతోపాటు రెండు సినిమా టికెట్లున్నాయి. వాటిపైన నాజ్ థియేటరు అనివుంది. అంటే ముందురోజు రాత్రి ఆమె మరెవరితోనే కలిసి సినిమాకు వెళ్ళిందన్నమాట. గదంతా తల్లక్రిందులు చేశాడు. మంచంపైనున్న పరుపు పైకెత్తాడు. దానిక్రిందో మడచిన తెల్లకాగితం కనుపించింది.

దాన్ని విప్పిచూశాడు. అది అరుణకు రాసిన ఉత్తరం. విషయం ఆసాంతం చదివి ఆశ్చర్యపోయాడు. దాన్ని మడచి జేబులో పెట్టుకున్నాడు.

రాజ్యలక్ష్మి వగుస్తూ [illegible]ంటూ మంచినీళ్ల గ్లాసుతో లోనికొచ్చింది. గదివున్న పరిస్థితిచూసి "గదంతా చక్కబెట్టారే!" అంది నీళ్ల గ్లాస్ అందిస్తూ.

"ఏమైనా ఆధారాలు దొరుకుతాయేమోనని" అంటూ నీళ్ళగ్లాసు తీసికొని గడగడ తాగసాగాడు.

"రాజ్యలక్ష్మిగారూ! అరుణ నెలనెలా బహిష్ఠు అవుతోందా?" అడిగాడు.

"నా కెలా తెలుస్తుందండీ! అయినా చదువుకొనేపిల్ల. ఈ కాలంలో దూరంగా వుండటమనే ఆచారం ఎవరూ పాటించడం లేదుగా" అంది.

అంతలోనే ఏదో ఆలోచించి "ఆమె కడుపుతో వుందని మీకేమైనా అనుమానమా?" అడిగింది.

"లేదు! ఊరకే అడిగాను" అన్నాడు సుధాకర్.

ఇద్దరూ దిగి క్రిందికొచ్చారు. స్నానంచేసి వచ్చాడు కుమార్. అతన్ని సుధాకర్‌కు పరిచయం చేసింది రాజ్యలక్ష్మి.

"మీ రెప్పుడు వచ్చారు?" అడిగాడు సుధాకర్.

"ప్రొద్దున్నే వచ్చానండి! విజయవాడనుండి వచ్చాను."

"ఐ. సీ. ఏమైనా పనిమీద వచ్చారా?"

"అక్కయ్యను చూద్దామనిపించి వచ్చేశాను."

"అమలాపురం కదూ అన్నారు మీ ఊరు. అక్కడ్నుంచి నిన్ననే వచ్చేశారా విజయవాడకు."

"లేదండీ! మొన్నొచ్చాను. నిన్నంతా విజయవాడలో వున్నాను. ప్రొద్దున్నే ఇక్కడికొచ్చాను. కొంపదీసి నన్ను అనుమానించడం లేదుగా మీరు అరుణ గొడవల్లో" అడిగాడు కుమార్.

"అబ్బే! నా ప్రశ్నలు అలా వుంటాయి. అంతే! నేను వస్తాను. అరుణ ఫోటోవుంటే ఒకటివ్వండి" అన్నాడు సుధాకర్.

రాజ్యలక్ష్మి తెచ్చిచ్చింది.

4

నాజ్ థియేటరు ముందు కారు ఆపాడు సుధాకర్. లోనికెళ్ళి మానేజర్‌ను కలుసుకుని ముందురోజు సాయంకాలం మూడురూపాయల క్లాసు గేటుదగ్గరున్న మనిషిని పిలిపించ మన్నాడు. మార్నింగ్‌షో ఉండటంవల్ల అతడు హాల్లోనే వున్నాడు. అతను రాగానే అరుణ ఫోటో చూపించి "నిన్న ఈమె సినిమాకు వచ్చింది. ఈమె వెంట వున్న వ్యక్తిని నువ్వు చూశావా?" అడిగాడు.

"చూశాను బాబయ్యా! అతను నాకు బాగా తెలుసు. వారానికి రెండు సార్లన్నా సినిమాకు వస్తారు. కూర్చొని సినిమా చూడరు. మాట్లాడుకుంటూనే వుంటారు. ఒక్కోసారి ఆమె మధ్యలోనే వెళ్ళిపోతుంది" అన్నాడు.

"నిన్న ఆమె సినిమా అయిందాకా వుందా?" అడిగాడు సుధాకర్.

"ఉంది బాబూ! కానీ నిన్న ఒక తమాషా జరిగింది. వాళ్ళిద్దరు లోనికి వెళ్ళిన పది నిముషాలకు మరో అబ్బాయి వచ్చాడు. లోపల వాళ్ళ వాళ్ళెవరో వుండాలని వెళ్ళి చూసొస్తానన్నాడు. నేను వీల్లేదన్నాను, కాళ్ళ వేళ్ళ బడ్డాడు. సరే వెళ్ళమన్నాను. అన్ని వరసలూ తిరిగి మూలగా వున్న ఈ జంటను చూసి మాట్లాడకుండానే తిరిగొచ్చాడు. కనపడ్డారాని అడిగాను. సమాధానం చెప్పకుండా వెళ్ళిపోయాడు. రెండు నిముషాల్లో టిక్కెట్టు కొనుక్కుని వచ్చి మొదట్లోనే కూర్చున్నాడు. సిగరెట్టు కాల్చబోయాడు. తప్పన్నాను. ఎ.పి. థియేటర్, పొగ తాగడం నిషేధించ బడిందని చెప్పాను. వినకుండా మొండిగా కాల్చాడు. వెళ్ళి ప్యాకెట్, అగ్గిపెట్టి లాక్కున్నాను. నోట్లో వున్న సిగరెట్ కూడా పీకి దూరంగా పారేశాను. అవి నా దగ్గరే వున్నాయి. చూపిస్తాను" అంటూ

వెళ్ళి గబగబా తెచ్చాడు ఒక విల్స్‌ఫ్లేక్ పాకెట్, అగ్గిపెట్టి.

"అతన్ని చూస్తే నువ్వు గుర్తు పట్టగలవా?"

"ఓ! సన్నగా పొడుగ్గా వుంటాడు. కాఫీ కలర్ సూట్ వేసుకున్నాడు. ముఖాన బొట్టు పెట్టుకునేచోట కాల్చిన గుర్తు గుండ్రంగా వుంటుంది" అన్నాడు అతను.

"థాంక్స్! అవసరమైతే మళ్ళీ వస్తాను" అన్నాడు సుధాకర్.

దిగి కారు దగ్గరకు వచ్చేసరికి వసంత ఎదురు చూస్తూంది.

"నేనిక్కడున్నానని ఎవరు చెప్పారు?" అడిగాడు సుధాకర్ ఆమెకు కారెక్కమని డోర్ తీస్తూ.

"నా పని ముగించుకు పోతోంటే కారు కనిపించింది. ఆగిపోయాను" అంది వసంత.

కారు స్టార్టయింది.

"గరల్స్ హాస్టల్‌కు వెళ్ళాను. ఆమె క్లాస్‌మేట్లు అందర్నీ ప్రశ్నించాను. అరుణ రామ్మూర్తి అనే కుర్రాడ్ని ప్రేమిస్తూందట. ఆమె చెప్పుకొన్న దాన్నిబట్టి తను గర్భవతి నని, రామ్మూర్తి వల్లే తనకు గర్భం వచ్చిందని పెళ్ళి మాట ఎత్తితే దూరంగా పోతున్నాడనీ, తన గతి ఏమవుతుందో అర్థంకావడం లేదని మొత్తుకొంది. అది ఒకరితోగాదు, అందరితో. కొందరామెకు పెద్దస్నేహితులు కూడా కాదు. ఐనా వాళ్ళతోనూ చెప్పుకొంది" అంది వసంత.

"ఓవేళ అతను పెళ్ళాడనని చెప్పివుంటే తన రహస్యం బయట పడకుండా వుండేందుకు ఆత్మహత్య చేసుకుందేమో?" అంది వసంత.

"పాజ్‌బుల్! ఇంతకూ మనకు శవం దొరకాలిగా. రామ్మూర్తి అడ్రసు వుందా?" అడిగాడు సుధాకర్.

"తెచ్చాను" అంటూ డైరీ తెరచి చూపించింది. చూసి

కారును పాత పట్టాభిపురం వైపు మరల్చాడు సుధాకర్.

పది నిముషాల్లో కారు కృష్ణమూర్తి ఇంటి ముందాగింది.

వసంత సుధాకర్ లోనికెళ్లారు. తమ్ము తామే పరిచయం చేసుకొని రామ్మూర్తితో మాట్లాడాలన్నారు. జ్వరంలో పడు కొని వున్నాడని చెప్పాడు కృష్ణమూర్తి. సుధాకర్ లేచి లోని కెళ్ళాడు.

మంచం పైన పడుకుని వున్న యువకుణ్ణి చూసి అతనే రామ్మూర్తి అయివుండాలని ఊహించాడు సుధాకర్.

"రామ్మూర్తీ!" పిలుస్తూ మంచం ప్రక్కనే వున్న స్టూలుపైన కూర్చున్నాడు.

"మీరు ..." అంటూ ప్రశ్నార్ధకంగా చూశాడు రామ్మూర్తి.

సుధాకర్ తన వివరాలు చెప్పి "అరుణను ప్రేమించావా?" అడిగాడు.

"లేదండీ! కాస్త ఫ్రెండ్లీగా తిరిగేవాణ్ణి. అంతే!"

'ఆమె గర్భవతని అందరి ఫ్రెండ్స్‌తోనూ చెప్పిందట. నీతో చెప్పిందా?"

"లేదండీ! తను నా కెప్పుడూ చెప్పలేదు."

"ఐ.సీ. రాత్రి నువ్వూ, ఆమె సినిమాకు వెళ్లారా?"

"లేదండీ! జ్వరంతో ఇంట్లోనే వున్నాను."

"నీకు స్కూటరుందా?"

"వుందండి! రాత్రి డాక్టరు దగ్గరకు వెళ్లి మందు తెచ్చు కుంటూ, మధ్యలో హోటల్ ముందాపి కాఫీ త్రాగేందుకు లోనికి వెళ్ళాను. తిరిగి వచ్చేసరికి కనుపించలేదు. తాళాలు కూడా మరచిపోయి వెళ్లడంతో ఆ దొంగకు నా స్కూటర్ తీసుకెళ్ళడం సులభమైంది. పోలీసు రిపోర్టు కూడా ఇచ్చాను" అన్నాడు రామూర్తి.

"ఎప్పుడిచ్చావ్?" అడిగాడు సుధాకర్.

"ఇందాకే నండి!"

"మరింతదాకా ఎందుకు ఆలస్యం చేశావ్?"

"ఎవరేనా తెలిసినవాళ్ళు నన్ను ఏడిపించుదామని హోటల్ దగ్గర్నుండి తీసుకెళ్ళి వుంటారేమో, తెచ్చిస్తారని అనుకున్నాను. అలాంటిదేమీ జరక పోవడంతో పోలీస్ రిపోర్టు ఇచ్చేశాను" అన్నాడు రామ్మూర్తి.

"నీకు కుమార్ తెలుసా?"

"ఏ కుమార్ గురించి మీరడిగేది?"

"అరుణకు మేనమామవుతాడు. అతను."

"తెలీదండీ!"

"గుడ్! రెస్ట్ తీసుకో! వస్తాను. అరుణ కనిపించటం లేదు. ఆ అమ్మాయి ఏదో అఘాయిత్యం చేసుకుందని నా అనుమానం. నీకేదైనా తెలిసిన విషయాలుండి, చెప్పాలనిపిస్తే నాకు హోటల్ 'సుధారా'కు ఫోన్ చెయ్యి" అంటూ వెలుపల కొచ్చాడు.

"బాస్! ఏమిటి మీ అభిప్రాయం? రామూర్తి, అరుణను హత్య చేసి వుంటుందంటారా?"

"అదేమీ ఖచ్చితంగా చెప్పలేను. కానీ అతను చెప్పిన వన్నీ అబద్ధాలే!" అన్నాడు.

కారు టూటౌన్ పోలీస్ స్టేషను ముందాగింది. సుధాకర్ దిగి లోనికెళ్ళి మూర్తికి స్కూటర్ నెంబరు చెప్పి ఎక్కడన్నా దొరికిందేమో కనుక్కోమన్నాడు. నల్లపాడుకు పోయే దోవలో మునిసిపాలిటివాళ్ల చెత్తంతా కుప్ప బోసే స్థలానికి దగ్గరలో పడివుందని అంతకుముందే వర్తమానం

వచ్చిందనీ. ఇద్దరు కానిస్టేబుల్స్ అక్కడికి వెళ్ళారనీ చెప్పాడు మూర్తి.

మూర్తిని కారెక్కమని, స్టార్టు చేశాడు. అరగంటలో కారు ఆ స్థలం చేరుకుంది. పోలీసు కానిస్టేబుల్స్ సైకిళ్ళ పైన పోతూండటంతో వాళ్ళను మధ్యలోనే దాటింది కారు.

స్కూటరు ఏటవాలుగా పడివుంది. సుధాకర్ మెల్లగా దాని వద్దకు వెళ్లాడు. అక్కడ భూమంతా బూడిదతో నిండి వుంది. దాంట్లో నాలుగైదు అడుగుల జాడలు కనుపించాయి. పోలీసు పటాలాన్ని పిలిపించమని, చెత్త కుప్ప వైపు వెళ్లాడు. వెనుక వేపు కదలించినట్లు కనుపించింది. ఆ వైపు చేత్తో లాగాడు.

పది నిముషాలు శ్రమ తర్వాత అరుణ శవం కనుపించింది. ఆమె గొంతు పిసికి చంపబడివుంది.

వసంత, మూర్తి శవం చుట్టు ప్రక్కల గాలించారు. ఆధారాలు ఏవీ దొరకలేదు.

పోలీస్ వాన్ వచ్చింది. స్కూటర్ పైని వ్రేలిముద్రలు, బురదలోని అడుగుజాడలు అన్నీ తీసుకున్నారు ఫింగర్ ప్రింట్ ఎక్స్పర్ట్స్. వాటి రిజల్ట్సు వెంటనే కావాలని చెప్పాడు మూర్తి.

సుధాకర్, మూర్తికి రహస్యంగా చెవిలో ఏదో చెప్పాడు. మూర్తి వాన్‌లో వెళ్ళిపోయాడు. వసంతను కారెక్కించుకుని రామ్మూర్తి వద్దకు వెళ్ళాడు.

"రామ్మూర్తీ! నువ్వు నిన్న డాక్టరు దగ్గరకు వెళ్ళ లేదు. మీ డాక్టర్ చెప్పాడు. నీ స్కూటర్ నువ్వే ఎవరికో ఇచ్చావ్. అరుణను చంపించేందుకు ఎవర్నో నియోగించావ్. ఇప్పటికైనా నిజం చెప్పు" అన్నాడు సుధాకర్.

"నేను అరుణను చంపమని ఎవర్ని నియోగించలేదు. రాత్రి సినిమా హాల్లో కుమార్ కలిశాడు. అతను, నేను క్లాస్‌మేట్లం. అతను అరుణకు బంధువని నాకు తెలీదు. సినిమా వదిలాక నన్ను కలుసుకుని తను అరుణను పెళ్ళాడా లనుకుంటున్నానని చెప్పాడు. నాకు అభ్యంతరం లేదు అన్నాను. ఆమెను మరచిపొమ్మన్నాడు. సరే నన్నాను. నా స్కూటర్ ఇస్తే ఆమెను దూరంగా తీసుకెళ్ళి ఏదో ఒకటి చెప్పి ఒప్పిస్తానని బలవంత పెట్టాడు. ఇచ్చాను. అతనే ఆమెను చంపివుంటాడు" అన్నాడు రామ్మూర్తి.

"అంతేనా! నువు తన్ని చంపమని అడగలేదా?"

"లేదు!"

"అయితే నువ్వు మాతోరా!" అంటూ అతన్ని వెంట బెట్టుకుని రామనాథం ఇంటికొచ్చారు.

మూర్తి గుమ్మం దగ్గరే ఎదురై "కుమార్ హత్య చేశాడు సార్ అరుణను. రామ్మూర్తిని మరచిపొమ్మన్నా డట. ఆమె ఒప్పుకోలేదు. తను గర్భవతినని, ఆ గర్భం రామ్మూర్తి వల్లే వచ్చిందనీ చెప్పిందట. దాంతో రెచ్చి పోయి ఆమెను గొంతు పిసికి చంపాడట. జరిగిన ఘోరం అర్థం చేసుకుని, ఏం చెయ్యాలో తోచక శవాన్ని ఆ చెత్త కుప్పలో దాచేసి వచ్చాడట. అక్కడ దొరికిన వేలిముద్రలు, అడుగు జాడలు ఇతనికి సరిపోయాయి" చెప్పాడు మూర్తి.

"కుమార్! నిన్ను నమ్మి ఎలా వచ్చింది అరుణ నీతో?" అడిగాడు సుధాకర్.

"రామ్మూర్తికి నేను వచ్చి చెపుతాననీ, అతను నా ఫ్రెండనీ వూరి బయట కాచుకుని వుంటానన్నాడనీ చెప్పాను.

వెంటనే వచ్చింది. సినిమా హాల్లోనే వాళ్ళు నా కళ్ళ బడ్డారు. అక్కడే చెప్పాను రామ్మూర్తితో మాట్లాడి ఇంటికి వస్తానని." అన్నాడు తలవంచుకొంటూ.

"రామ్మూర్తీ! ఆమె గర్భవతేనా?" అడిగాడు సుధాకర్.

"కాదు సార్? అంతా అబద్ధం. మా వాళ్ళు యీ పెళ్ళికి ఒప్పుకోవడం లేదన్నాను. ఎలాగైనా నన్ను పెళ్ళాడాలని అరుణ ఈ పుకారు లేపింది. దాంతో చచ్చినట్లు తన్ను పెళ్ళాడుతానని భావించింది" అన్నాడు రామ్మూర్తి.

"రియల్లీ గుడ్ గర్ల్!" అన్నాడు సుధాకర్.

మూర్తి కుమార్ చేతులకు బేడీలు వేశాడు.

అప్పుడే లోపలకు వచ్చిన రామనాధం విభ్రాంతుడయి నాడు. ★

"ఉదయం ఏడింటికల్లా రమ్మంటే, ఇప్పుడొచ్చావేమోయ్!"

"ఏం చేయనండీ, ఉదయం ఇంట్లో పెద్ద గొడవయి పోయింది. ఉదయం ఆరింటికల్లా లేపితే రూపాయిస్తానని రాత్రి మా ఆవిడతో చెప్పాను."

"ఏం, ఆవిడ లేపలేదా?"

"అక్కడే వచ్చిందండీ గొడవ! ఆవిడ లేపకముందే నాకే మెలకువచ్చి కూర్చున్నాను. అయ్... నాకు రూపాయి ఇవ్వవలసి వస్తుందని మీరే లేచేశారా?— అంటూ మా ఆవిడ యుద్ధానికి దిగింది."

—జి. రమేష్‌కుమార్, ముసారంబాగ్.

హామేషా హంగామా

సర్పంతో సయ్యాటం?

రచన: ఆర్. నర్సింహాచారి

"చల్లని రాజా ఓ చందమామా,
నీ కథలన్ని తెలిశాయి ఓ చందమామా,
నా చందమామా."

"అబ్బబ్బా...., అంతా కుర్, కుర్, అన్న శబ్దమేకాని పాట విన్పించడం లేదండీ. నా మాట విని ఆఫ్ చేయండి" చిరుకోపా న్నభినయించింది మందాకిని.

అయితే నా పాట వింటావా?

"చల్లనిదానా ఓ హృదయభామా, నీ...." రాగం తీశాడు శేఖర్.

ఇంతలోనే కెవ్వుమని అరిచింది మందాకిని. "చూడండి! ఆ మూల పాము ఎలా పడగ తీసిందో" వణుకుతున్న కంఠంతో అంది మందాకిని.

"ఉష్! ఇంతమాత్రానికే భయమా? చూడు నేను దాన్నెలా ఆడిపిస్తానో" అంటూ పైకి లేచాడు శేఖర్.

"ఏమండీ, దాని జోలికి పోకండి. సర్పంతో సయ్యాట మంచిది కాదు" వారించింది మందాకిని.

పాముదగ్గఱకు నడిచి, అమాంతం దాని పడగను పట్టుకున్నాడు శేఖర్.

"ఏమండీ, నాకు భయమవుతుందండీ, నా మాట విని దాన్ని విడిచేయండి" వారించడానికి ప్రయత్నించింది మందాకిని.

"నో. నో. డార్లింగ్. నువ్వు భయపడాల్సిన విషయ మేమీ లేదు" వచ్చి కుర్చీలో కూర్చున్నాడు శేఖర్.

ఒక్కసారి మందాకినికి తన జాతకం జ్ఞాపకమొచ్చింది. తన జాతకంలో తన భర్త తన వివాహమైన రెండు సంవ త్సరాల లోపే సర్పవాత పడతాడని ఉందట.

"ఏమండీ, అవి క్రూరజంతువులు. వాటితో ఆడాలనా మీకు సరదా?"

"హహ్హహ్హహ్హా, మందాకినీ, ఈ మనుష్యుల్లో అంతకన్నా క్రూరజంతువు ఉంటారు. సర్పానికి కోరలలో మాత్రం ఉంటే, వారికి నిలువెల్లా వుంటుంది. ఫర్వాలేదు. నాకేం భయంలేదు."

"ఒకవేళ, మీరు గనక ఆ పాముని విడవకపోతే, నేను పిస్టల్‌తో ఆత్మహత్య చేసుకుంటాను" అంటూ టేబుల్ సొరుగులోంచి పిస్టల్ బయటకు తీసింది మందాకిని.

"అయితే, వన్ మినిట్. దీని కోరలోంచి విషం తీసి వదిలేస్తాను. సరేనా?" అంటూ టేబుల్‌మీదున్న చిన్న ఖాళీ సీసాను ఎడమచేతిలోకి తీసుకొని, దాని గొంతుదగ్గర నొక్కాడు శేఖర్. నాలుగైదు విషపు బిందువులు సీసాలో పడ్డవి.

"ఫర్వాలేదు. భయంలేదు" పాముని విడిచాడు శేఖర్.

పాము ప్రాకుతూ కిటికీలోంచి బయటకు వెళ్ళిపోయింది. మందాకిని భయంతో వెంటనే కిటికీ తలుపులు మూసివచ్చింది.

"హమ్మయ్య, రక్షించారు" గుండెపై చేయివేసుకొని మంచంమీద కూర్చుంది మందాకిని.

"డియర్, అప్పుడు నా పాట పూర్తిగా వినలేదు" మందాకిని ప్రక్కగావచ్చి కూర్చున్నాడు శేఖర్.

"ఇప్పుడే పదైంది. ఇక మీ పాటే వినుకుంటూ కూర్చుంటే, మరి ఆ పా...."

"ఊఁ, మరి?"

"ఆ పాట."

"ఏ పాట?"

"నేనే చెప్పాలా?"

"నువ్వే చెప్పాలి!"

"అలాగా?" అంటూ శేఖర్‌ని తన కౌగిల్లోకి తీసుకుంది మందాకిని.

"ఇంకా?"

"ఛీ! పొండి!" సిగ్గుతో కుంచించుకుపోయాయి—ఆ సుకుమారి ఎఱ్ఱటి బుగ్గలు.

మందాకినిని గట్టిగా హత్తుకున్నాడు శేఖర్. ఒక్కొక్క వస్త్రాన్నీ వేరుచేసి, నగ్నంగా తయారయ్యారిద్దరూ.

"నీవన్నావే ఆ పాట నువ్వే పాడగలవా?"

"నేనా?"

"ఊఁ, నువ్వే."

"మీ రాడవారు కాకపోయ్యారు. నేనే మగవాడినయ్యుంటే చూపించేదాన్ని."

ఒక్కసారి మగతనం విజృంభించింది శేఖర్‌లో.

అంతే! అతడి చేతిలో నలిగిపోయిందా వయ్యారి. కామ దాహం తీరిన ఇద్దరూ మైమరచి నిద్రపొయ్యారు.

దూరంగా వికృతంగా అరుస్తున్నాయి నక్కలు. ఎక్కడి నుంచో భయంకరంగా అరుస్తోంది గుడ్లపిట్ట.

ఏదో కొంప మునిగిపోయినట్లు అరుస్తున్నాయి వీధిలో

తిరిగే శునకాలు.

ఏదో శబ్దము. గుర్, గుర్ అన్న శబ్దము విని కళ్ళు తెరిచింది మందాకిని. ఒక్కసారి ఆమె నిలువునా కొయ్యబారి పోయింది.

శేఖర్ మెడచుట్టూ బిగుసుకు పోయివుంది నాగుబాము. మెలికలు తిరుగుతున్నాడు శేఖర్. చివరిసారిగా బాధగా అరిచి చల్లబడిపోయాడు శేఖర్.

"ఏమండీ!" అంటూ అలాగే స్పృహతప్పి పడిపోయింది మందాకిని.

★

డిటెక్టివ్ సాహసిక గాధ!

రచన: ఎమ్. వి. కమలాకరరావు

ప్రొడ్యూసర్ వినాయకరావు హడావుడిగా డిటెక్టివ్ 'పక' దగ్గరికి వచ్చాడు.

'పక' అంటే 'పగటి కల' అని మాత్రమే ...ఆయన కలలో దొంగల గుడారాలు, అంతర్జాతీయ ద్రోహుల స్థావరాలు ఒకటేమిటి జ్యోతిలక్ష్మి డాన్స్ సైతం ఈస్టమన్ కలర్‌లో చూసే గొప్పతనం ఆయనకుండబట్టి ప్రభుత్వం వారు ఆయన్ని సింపుల్‌గా 'పక' అని బిరుదిచ్చి, ఓ శుభ ముహూర్తాన సన్మానించారు.

ఆయన అసిస్టెంట్ పేరు మాత్రం మామూలుదే-పరాంకుశం! ఇతను గూడా గవర్నమెంట్ వారిచే రికగ్నయిజ్ చేయబడినాడు.

ప్రొడ్యూసర్ వినాయకరావుని చూడంగానే పరాంకుశం ఓసారి ముక్కు ఎగరేసి "సార్....సార్! వినాయకరావు

గారు వచ్చారు'' అన్నాడు డిటెక్టివ్ పక గారితో.

ఆయన తన కలలో చూస్తున్న ఈస్ట్‌మన్ కలర్ సీన్ కట్ చేసి, సొరుగు లాగి 'హేండ్సప్!' అన్నాడు ఆదుర్దాగా, రివాల్వర్ పట్టుకుని.

వినాయకరావు అదిరిపోతూ—

''అవి....అవీ డమ్మీ బుల్లెట్స్, అవునా?'' చేతులు ఎత్తుతూ పరాంకుశం వైపు తిరిగి అడిగాడు, ఏడుపు ముఖం పెట్టి.

''ఇందులో గుళ్ళు వెయ్యలేదండీ'' ఎత్తుపళ్లు బయటికి వచ్చేలా నవ్వుతూ, డిటెక్టివ్ పక ''ఇంతకీ తమరు...!'' సావధానంగా అడిగాడు.

''ఏమీ లేదండి .... మా కొత్త పిక్చర్‌లో మీ కోసం అర్జంటుగా ఓ సీను పెట్టాం, హీరోయిన్ గారిని రక్షించటం దొంగల బారినుండి'' నణుగుతున్నట్లు అన్నాడు.

''ఫీజేమీ తీసుకోను లెండి. నాకలవాటేగా ఇటువంటి సీన్లలో అద్భుతంగా నటించటం. ఐతే గ్యాలరీ ప్రేక్షకులను థియేటర్‌లో కనిపెట్టి ఉండమనండి, వారి చప్పట్లకి థియేటర్ కూలిపోతుందేమో?—''

''మేము తీసే పిక్చర్‌ని ఓపెన్ థియేటర్‌కే పరిమితం చేస్తాం. రేపాదివారమే షూటింగ్. ఆ మర్నాడే రిలీజ్. చెరువు పక్కనే వున్న....'' నసిగాడు ప్రొడ్యూసర్.

''వెరీగుడ్! నా టాలెంట్ చూపి మీ చిత్రాన్ని రెండు రోజుల్లో పైకి వెళ్ళిపోయేలా చూసే భారం నామీద పెట్టండి'' వెకిలినవ్వు నవ్వుతూ అన్నాడు డిటెక్టివ్ పక.

ప్రొడ్యూసర్ ''సర్లేండి....'' అని వెళ్ళిపోయాడు, ముఖం వేలాడేసి.

''మరి నాకోండి....ఓ పాత్ర!'' సన్నగా అన్నాడు అపి

స్టైంట్ పరాంకుశం.

పరధ్యానంగా ఉన్న డిటెక్టివ్ పక—

"రాములమ్మని అడుగు" అన్నాడు.

ముఖం చిన్నబుచ్చుకున్నాడు పరాంకుశం.

*　　*　　*

జోరుగా నటిస్తున్నాడు డిటెక్టివ్ పక!

ముందు దొంగల కారు....గిలగిల లాడుతున్న హీరోయిన్....!

'పక'కి చాలా కోపమొచ్చింది.

ఆ కారు స్పీడు-నూట నలభై మైళ్ల స్పీడులో పోతున్నట్లు చూపిస్తున్నాడు కెమెరామాన్.

గిరగిరా ఫాన్ చక్రం తిప్పినట్లు కెమెరాని ఊపేస్తున్నాడు కెమెరామెన్....!

కిళ్ళీ నములుతున్న డిటెక్టివ్ పకని చూసి ప్రొడ్యూసర్-

"ఊఁ! మీరిప్పుడే వెళ్ళాలి, లేకపోతే ఆ దొంగల కారు అందుకోలేరు" అన్నాడు అరుస్తూ.

ప్యాంట్ తొడుక్కోబోతున్న డిటెక్టివ్ పక ఇక ఆగలేక తుండుతోనే పరిగెత్తాడు ఆ కారు వైపు.

"అయ్యో, డిటెక్టివ్‌గారూ! ఇదిగో—అలా పరిగెత్తుతారేమిటి....? ఆ వంతెన ప్రక్కనే మన నాయుడు పెట్టిన మోటార్ బైక్ ఎక్కండి. ఊ! త్వరగా—" ఆదుర్దాతో అరిచాడు ప్రొడ్యూసర్.

డిటెక్టివ్ తుండుగుడ్డ చుట్టుకుని ఉన్న సంగతి ఎవరూ ఆ తొందర్లో పట్టించుకోలేదు.

'పక'కి ఆయన అన్నమాటలు వినబడినాయ్. ఊడిపోబోయిన తుండుని గట్టిగా బిగించి, పళ్లు ఊడిపోయేలా 'పట, పటా' కొరుకుతూ, అక్కడే సిద్ధంగా ఉంచిన

మోటారు బైక్ మీదకు లాఘవంగా ఎగిరి కూర్చుని.లోపల ఉన్న స్పీడా మీటర్‌ని చేత్తో 80 మైళ్లదాకా తిప్పాడు.

ప్రొడ్యూసర్ వినాయకరావు, కెమెరామెన్ డిటెక్టివ్ పక తెలివికి అమోఘంగా 'విజిల్స్' వేసారు—ఆనందం పట్టలేక.

ఎలా అయితేనేమి పకగారి బండి మంచి స్పీడుమీద వెళ్తోంది. ఆ స్పీడ్‌కి ఆ మోటర్ బైక్ తట్టుకోలేక బాధ పడ్డట్టు 'కయ్ః' మని టైరు పగిలింది.

డిటెక్టివ్ పకకి ఎంతకోపం వచ్చిందో చెప్పలేము? ఆవేశంగా ఆ మోటారు బైక్‌ని ఎత్తి అవలీలగా ఎవరెస్ట్ శిఖరంమీద పడేట్లు విసిరి, ప్రొడ్యూసర్‌గారి వైపు చూసాడు. ఆయనకీ దిక్కు తోచలేదు.

"అదిగో ఆ కిళ్ళీ కొట్టు ప్రక్కనే సైకిలుంది అది వేసుకోండి....ఊః క్విక్—" అరిచారాయన.

"వో....ఏం స్పీడు తొక్కుతున్నాడు? పంచర్ పడినా చక్రం బెండ్ పోయినా....? ఆహా....ఆహా....! అందుకే నేను ఈ డిటెక్టివ్‌గారిని ఎన్నుకున్నా....!" ప్రొడ్యూసర్ వినాయకరావు ఆనందం అంతా ఇంతా కాదు.

పరాంకుశం కోతిలాగా కుప్పిగంతులు వేస్తున్నాడు.

కెమెరామెన్ కెమెరా వదిలేసి ఒక్కోసారి రెండు వ్రేళ్ళూ నోట్లోపెట్టుకుని నాలిక ఊడి పోయేంతగట్టిగా ఈల వేస్తున్నాడు.

చెక్కుచెదరకుండా దొంగలకారు వెళ్ళిపోతూంది.

డిటెక్టివ్, పకగారికి చెమటలు - నీళ్ళబిందెకి చిల్లిపడి నీళ్లు కారిపోతూన్నట్లు కారిపోతున్నాయి.

వినాయకరావు ఆ బాధ చూడలేక "అయ్యో డిటెక్టివ్ గారో....! మీరు ఎన్నోసార్లు హైజంప్‌లు చేశారు గదా!

దయచేసి ఓ పెద్ద లాంగ్ - హై - జంప్‌చేసి ఆ పోతున్న బోయింగ్ విమానం ప్రొపెల్లర్స్ పట్టుకోండి'' అన్నాడు.

ఓ పెద్ద జంప్‌చేసి దాని ప్రొపెల్లర్స్‌పట్టుకున్నాడు మొత్తానికి డిటెక్టివ్ పక - నిజంగానే.

ఈ సారి దొంగల నాయకుడికి కోపంవచ్చి విమానాన్ని ఒక్క తుపాకీ గుండుతో కాల్చాడు.

ఇక లాభంలేదని డిటెక్టివ్ పక ప్రొపెల్లర్స్ ఒదిలేసి క్రిందకి చూశాడు.

గిరగిరా తిరుగుతున్నాడు.

వినాయకరావు ''అబ్బ! ఎంత ఒరిజినల్ షాట్ ఇది?''

పట్టలేని ఆనందంతో పొట్ట పగిలేట్లు నవ్వుతున్నాడు.

గాలిలో గిరగిరా తిరుగుతూ కూడా డిటెక్టివ్ అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు.

ఆ పైనుంచి డిటెక్టివ్‌కి క్రింద అన్నీ స్పష్టంగా కనిపిస్తున్నాయి!

అప్పలమ్మ గుడిసె ప్రక్కనే ఉన్న చిదంబరం రిపేర్ షాపులో ఉన్న తన రాయల్ ఎన్‌ఫీల్డ్ కనబడింది అతనికి.

ఆ పై నుంచి కోతిలా ఓ గెంతు గెంతి దానిమీదపడి మెకానిక్ అరుస్తున్నా వినిపించుకోకుండా అతివేగంగా దాన్ని స్టార్ట్ చేసాడు.

అతగాడి చాకచక్యానికి ప్రొడ్యూసర్ లక్షరూపాయలు ఇచ్చాడు మనస్సులో.

కెమేరామాన్ "వాటె వండర్!'' అని గట్టిగా అరిచాడు.

దొంగలకారు అల్లంత దూరంలో ఉంది.

డిటెక్టివ్ ఆనందంగా తుండుగుడ్డ సరిచేసుకుని ముందుకి వంగి ముందు చక్రాన్ని గట్టిగా ముద్దుపెట్టుకున్నాడు.

ప్రొడ్యూసర్ ఆనందపు అరుపులు-కేరింతలు మామూలే!

గ్యాలరీ ప్రేక్షకుడు కుర్చీలు విరగకొట్టినట్లు తన ప్రక్కనే వున్న డ్రైవర్ భుజంమీద ఆనందపు చరుపులు చరిచాడు. అతని ప్రక్క ఎెముకలు విరిగి అతను గట్టిగా ఏడ్చాడు.

ఇదంతా పట్టించుకునే స్థితిలో లేడు వినాయకరావు.

డిటెక్టివ్ కిస్‌ని ఆజ్ఞగా శిరసావహించి ముందు చక్రం వింతగా పరిగెత్తికెళ్ళి ముందుకు వెళ్ళిపోబోయిన కారుకి గోడకట్టినట్లు అడ్డంగా నిలబడింది.

డిటెక్టివ్ పక మీసాలు ఊడిపోయేలా త్రిప్పాడు—గర్వంగా.

ఆ తర్వాత అందరూ మక్కెలు విరిగేలా తన్నులు తిని పారిపోయారు. హీరోయిన్ రాణి విషాదగీతం ఆలపించింది.

* * *

"ఏమండీ! డిటెక్టివ్ పకగారూ! ఈ ఉద్యోగంనుండి నేను వెళ్ళిపోతున్నాను. ఈ రోజునుండి ఓ నాలుగు 'అపరాధ పరిశోధన' పుస్తకాలు అమ్ముకున్నా నాకు డబ్బులు వస్తాయి. మనం ఈ ఏజన్సీ పెట్టి మూడునెలలైనా ఒక్కడు గుమ్మం తొక్కితే ఒట్టు! ఇంటి అద్దెగా మీ సైకిల్ ఆయన పట్టికెళ్ళాడు. నా మాట విని ఈ దీక్ష మాని, మీరుకూడా నాతో పాటు పుస్తకాలు అమ్ముదురుగాని పదండి!"

అంటున్న అసిస్టెంట్ వైపు కళ్ళు నులుముకుని చూశాడు డిటెక్టివ్ 'పక'. ★

స్క్రెకెట్ లవర్!!

రచన: సుంచు కృష్ణస్వామి

"అమ్మా!" కెవ్వున కేక వినిపించడంతో, బయట కూర్చుని ఏదో ఆఫీసు పని చూస్తున్న రాఘవయ్య

గారూ. వంట గదిలోనుండి పార్వతమ్మగారూ కేక/విన్పిం చిన కొడుకు గది వైపు వెళ్ళారు.

ప్రసాద్ ఎందుకో భార్యను కొడుతున్నాడు. ఆ దృశ్యం చూడగానే గొంతువరకూ కోపం ముంచుకు వచ్చింది రాఘవయ్యగారికి.

"ఏమిట్రా? ఒరే వెధవా దాన్నెందుకురా అలా బాధ పెడతావు" అంటూ మధ్యకెళ్ళి "ఛీ! ఛీ! సిగ్గులేదు. భార్య మీదే చేయి చేసుకునేంత సమర్థుడవయ్యావా?" అంటూ గర్జించారు.

వనజ గబగబా బట్టలు సర్దుకో సాగింది ఏడుస్తూనే.

పార్వతమ్మ కోడలిని ఆపే ప్రయత్నమేమీ చేయకుండా, కొడుకు వైపు చూస్తూ నిలుచుంది.

'నాన్నగారూ మీరు నా సొంత విషయాల్లో జోక్యం కలుగ జేసుకోకండి. దాన్ని కొట్టినా, చంపినా పాపం లేదు. నా ఇంట్లో ఉంటూ, నా మాటను నిర్లక్ష్యం చేస్తూ నా చెల్లెలిని ఇంట్లోంచి గెంటాలని చూస్తుందా? వెళ్ళు! మళ్ళీ నీ ముఖం నాకు చూపించకు!" వనజ వైపు చూస్తూ తనలోని కక్ష్యను వెళ్ళగక్కాడు ప్రసాద్.

ప్రసాద్ కిదేమీ కొత్తగాదు. రోజూ ఏదో కారణంగా కోడలిని బాధపెడుతూనే ఉన్నాడు. రాఘవయ్యగారిక తమాయించుకోలేకపోయ్యారు. "ఏమిట్రా పేలుతున్నావు" అంటూ ప్రసాద్ కాలరు పట్టుకొని ఈ చెంపా, ఆ చెంపా వాయించారు.

ప్రసాద్ బుసకొడుతూ రాఘవయ్యగారిపైకి చెయ్యి లేపి, క్రిందకు దించుకున్నాడు.

"ఒరేయ్ ఏమిట్రా నాన్నగారి పైకే చెయ్యి లేపు

తున్నావా! అయ్యో ఎంత ఘోరం. ఇక ఈ ఇల్లు బాగుపడే దెప్పుడో? ఈ గొడవలన్నీ ఈవిడగారు వచ్చినప్పటినుండే ఆరంభమయ్యాయి. ఇక ఈ శని విరగడయ్యేది ఎప్పుడో?'' వనజవైపు చూస్తూ కూనిరాగం మొదలుపెట్టింది పార్వతమ్మ.

ఇక అక్కడ నిలబడలేక బయటికి వెళ్ళారు రాఘవయ్య. టేబిల్ ముందు కూర్చుని తనలో తనే కుమిలి పోసాగారు.

తన భార్య, కొడుకూ, కూతురూ కలిపి అమాయకు రాలైన కోడల్ని హింసిస్తున్నారు. తనొక్కడి ఆదరణవల్ల కోడలి మనస్సు సంతోషంగా ఉంటుందా? ఆయన కను కొలకుల్లో నీరు నిలిచింది.

అయిదు నిముషాల తర్వాత ఏడుస్తూ, చేతిలో సూటు కేసుతో బయటికి వచ్చింది వనజ. రాఘవయ్యగారి వైపో క్షణం చూసి, తల వంచుకొని చరచరా తలుపువైపు కెళ్ళింది.

''ఆగమ్మా! అసలీ గొడ వెందు కొచ్చిందో చెప్పనే లేదు'' అన్నారు నోరు పెగల్చుకొని.

రాఘవయ్య గారలా అనగానే వనజలో దుఃఖం కట్టలు త్రెంచుకుంది. రాఘవయ్యగారు వనజ వద్దకెళ్ళి అనునయంగా తల నిమురుతూ ''చెప్పమ్మా అసలీ గొడవెందుకు జరి గింది'' శాంతంగా అడిగారు.

''మీరు ఆఫీసునుండి రాక పూర్వం ఒక కుర్రాడువచ్చి, తను కమలను మనసారా ప్రేమిస్తున్నానంటూ ఆశీర్వదిస్తే పెళ్ళి చేసుకుంటా నన్నాడు. కానీ కమల అతన్ని నిరాక రిస్తూందట! ఏదో ఆఫీసులో ఉద్యోగం కూడా చేస్తున్నా డట! ఆ కుర్రాణ్ని చూడగానే ఆయన కోపంతో బుస కొడుతూ, ఆ కుర్రాడి కాలరుపట్టుకొని బయటికి గెంటే

శారు. ఆ కుర్రాడు బాగున్నాడు కూడా. పైగా కమలను కట్నం లేకుండా పెళ్లి చేసుకుంటానని ప్రాధేయపడు తున్నాడు. అతనికిచ్చి కమల పెళ్ళి జరిపిస్తే బాగుంటుం దన్నాను. అంతే.'' కన్నీళ్లు తుడుచుకుంటూ చెప్పింది వనజ.

రాఘవయ్యగారు వనజ స్థితికి జాలిపడుతూ వనజ దుఃఖంలో పాలు పంచుకున్నారు.

''నాకు తెలుసమ్మా మా కుటుంబక్షేమాన్ని కోరే చిత్ర హింసలకు గురవుతున్నావు. బంగారం లాంటి భవిష్యత్తును కాలదన్నుకుని, నేను వద్దన్నా వినకుండా ఇలాంటి చీడపురు గును ప్రేమించానంటూ ప్రాణప్రదంగా ప్రేమించిన తల్లి తండ్రులను కూడా ఎదిరించి పెళ్ళి చేసుకున్నావు. అసలిదం తటికి కారణం నేనమ్మా. నా నిర్లక్ష్యంవల్లే వాళ్ళిద్దరూ అలా తయారయ్యారు. లక్షాధికారి బిడ్డవు! కోరి ఊబిలో దిగ బడ్డావు. నీ భవిష్యత్తును దేవుడే కాపాడాలి పదమ్మా. నిన్ను మీ ఇంట్లో దిగబెట్టి వస్తాను. అక్కడైనా కాస్త మనశ్శాంతి లభిస్తుంది' లాలనగా అన్నారు రాఘవయ్యగారు.

''వద్దు మావయ్యా నువ్వక్కడికి వస్తే నాన్న నీతో గొడవ పెట్టుకుంటాడు. వద్దు!''

''ఫరవాలేదమ్మా గేటు వరకూ వదిలి వస్తాను పద.''

బరువైన హృదయాల్తో ఇద్దరూ బయటికి నడిచారు.

* * *

రాఘవయ్యగారు వనజను తీసుకు వెళ్లిపోగానే ఆలోచిస్తూ కూర్చున్నాడు ప్రసాద్.

రాఘవయ్యగారు ప్రయివేట్ కంపెనీలో క్లర్క్‌గా పని చేస్తూ ఎక్కువగా ఓవర్ టైమ్ చేస్తూ, కుటుంబాన్ని ఓ మాదిరిగా ఈడ్చుకొస్తూ పిల్లలను అదుపాజ్ఞల్లో లేకుండా పెంచారు.

ప్రసాద్ స్కూల్ ఫైనల్ చదువుతున్నప్పుడే స్నేహితులంటూ షికార్లంటూ జల్సాలు చేయడం నేర్చుకున్నాడు.

కమల కూడా షికార్లంటూ, పికినిక్ లంటూ చాలామంది కుర్రాళ్లతో పరిచయం ఏర్పరుచుకుంది.

వారిద్దరి దురలవాట్లు చూసి లోలోపల బాధ పడేవారు రాఘవయ్యగారు.

ఇంటర్ ఐపోగానే ఒక సంవత్సరం జల్సారాయుడిగా తిరిగి బి. ఏ. చదవాలంటూ ట్యుటోరియల్ కాలేజిలో చేరాడు ప్రసాద్.

అక్కడ వనజతో పరిచయం ఏర్పడింది.

వనజ తండ్రి రామారావుగారు గొప్ప లక్షాధికారి. ఆయనకు బంజారాహిల్స్‌లో ఓ పెద్ద మేడ ఉంది. వివిధ వ్యాపార సంస్థల్లో వాటాలున్నాయి. ఆయనకు వనజ ఒక్కతే సంతానం! ఎంతో గారాబంతో చూస్తారు వనజను.

వనజ సౌందర్యవతి కాదు, అలాగని అనాకారి కాదు. ఆమెను పెళ్ళి చేసుకుంటే ఆమె ఆస్తికంతా తనే వారసుడవ్వొచ్చు అనే ఆలోచన వచ్చింది ప్రసాద్‌కు.

అప్పటినుండీ తనెంతో బుద్ధిమంతుడుగా నటించి, వనజ అభిమానానికి పాత్రుడయ్యాడు.

ప్రసాద్ తనను ప్రేమిస్తున్నాడని, తను లేకుండా బ్రతకలేడని నమ్మింది వనజ. రామారావుగారూ, రాఘవయ్యగారూ వద్దని వారించినా వినకుండా ప్రసాద్‌ను పెళ్ళిచేసుకుని, రాఘవయ్యగారింటికి కోడలుగా వచ్చింది.

అక్కడే ప్రసాద్ ఊహ తారుమారయ్యింది. రామారావుగారికి ఇతర సంతానం ఎవరూలేరు గనుక, కూతుర్ని అల్లుడిని ఆయనింట్లోనే ఉంచుకుంటా రనుకున్నాడు. తనేనాడూ వనజను మనస్ఫూర్తిగా ప్రేమించలేదు, వనజ ఆస్తిని

ప్రేమించాడు. తనూహించిన దానికి భిన్నంగా జరిగేసరికి నీరసించిపోయాడు.

అప్పటినుండి వనజపై ద్వేషం పెంచుకున్నాడు ప్రసాద్. తన పెళ్ళి జరిగినప్పటినుండీ, సంసార బాధ్యత పెరిగి ఖర్చులకు డబ్బులుకూడా ఇవ్వడంలేదు రాఘవయ్యగారు.

వనజ ఎప్పుడూ రామారావుగారిని డబ్బడగలేదు. రెండు మూడుసార్లు మామగారిని డబ్బడగమని బలవంతం చేశాడు కూడా, ఐనా వనజ డబ్బు తేలేదు.

దాంతో ప్రసాద్‌లో ద్వేషం కరుడు గట్టిపోయింది. కమల చెడు తిరుగుళ్లు వనజను హింసించడానికి చాలా ఉపకరించాయి.

కమల ప్రవర్తన బాగాలేదనీ, తొందరగా కమల పెళ్ళి చేయమని తనతో చెప్పినపుడల్లా 'పేచీపెట్టుకొని, అవమానిస్తున్నాడు. వనజ ఎంతో ఉత్తమురాలు! భర్త ఎన్ని హింసలు పెట్టినా సహిస్తుంది.

ఎలాగైనా వనజను పుట్టింటికి పంపి తనూ ఆమెవెంట వెళ్ళగలిగితే చాలనుకున్నాడు. ఇక్కడుండాలంటే ఇలాంటి గొడవలు తప్పవు! ఇష్టం లేకపోతే పుట్టింటికి వెళ్ళిపొమ్మని కొట్టాడు. తననూ రమ్మంటుందనుకున్నాడు. కానీ అలా జరగలేదు.

ఇక ఇప్పుడేమిటి చేయడం అని ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఎన్నోరోజులుగా జల్సాలకు, షికార్లకూ డబ్బులేక బాధ పడుతున్నాడు.

ఎలా వస్తుంది డబ్బు? చాలాసేపు ఆలోచించిన మీదట, అతని ఆలోచనలు వక్రమార్గంలో పయనించి, తన సమస్యలను పరిష్కరించే చక్కటి ఆలోచన స్ఫురించింది.

కొద్దిసేపు తనలో తనే తర్జన భర్జన చేసుకుని, అవును

అలాగే చేయాలని నిశ్చయించుకున్నాడు.

*   *   *

సరిగ్గా రాత్రి పన్నెండు గంటలవుతోంది. రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది.

బంజారా హిల్స్ రోడ్ నం. 12 లోకి వచ్చి ఆగింది ఆటో! లాల్చి పైజామా, మెడకు మఫ్లర్‌తో ఆటోలోనుండి క్రిందకు దిగాడు ప్రసాద్.

ఆటో ఫేర్ చెల్లించి ముందుకు సాగాడు.

గడ్డమీదుగా వెళ్ళిన రోడ్డు చివరన రామారావుగారి బంగళా ఉంది. ఆ వేళలో రోడ్డు మీద జన సంచారం ఉండదు.

అధునాతనంగా కట్టబడి అక్కడొకటి ఇక్కడొకటి చొప్పున విసిరివేయబడ్డట్టున్న ఆ ఇళ్లన్నీ ఎంతో అందంగా ఉన్నవి. అక్కడుండేవారంతా లక్షాధికారులు కనుక ప్రతీ ఇంటిలోనూ కుక్కలున్నాయి.

రామారావుగారింటిలో మాత్రం కుక్క కాకుండా ప్రత్యేకంగా గూర్ఖా ఉన్నాడు. ఈ వేళలో వాడెక్కడో హాయిగా నిద్రపోతూంటాడు.

రామారావుగారి బంగళాకు కాస్త దూరంలో నిలుచుని దృష్టి సారించాడు. గేటు ముందున్న గూర్ఖాను చూడగానే నీరుగారిపోయాడు.

ముందు గేట్లోనుండి లోపలికెళ్ళడం అసంభవం.

బంగళా వెనకవైపుకెళ్లి ప్రహరిగోడనెక్కి లోపలికి దూకాడు. దబ్బున చప్పుడైంది.

కొన్ని నిముషాలు చెట్లలోనే నక్కి కూర్చున్నాడు. గూర్ఖా వస్తున్న అలికిడి కాలేదు. తను వెంట టార్చి తెచ్చుకో

నందుకు తనపై తనకే కోపం వచ్చింది.

ఆ బంగళాలోని అంగుళమంగుళం అంతా తెలుసు తనకు. టార్చి లేకపోయినా ఫరవాలేదని సరిపెట్టుకుని చెట్ల చాటునుండి లేచాడు.

మేడపైన వనజగది ఉంది. పైప్‌పైనుండి ఎగబ్రాకుతూ పైకి వెళితే ఊచలులేని గాజు కిటికీ ఉంది. అది వనజగదికి అటాచ్డ్ బాత్‌రూమ్. బాత్‌రూమ్‌లోనుండి వనజగదిలోకి వెళ్ళడం అతిసులభం.

ఒకసారి చుట్టూ పరికించి ధైర్యం కూడగట్టుకుని వాటర్ పైప్‌వద్దకెళ్ళి చెప్పులు విడిచేశాడు. పైప్ పట్టుకుని గబగబా పైకి ఎగబ్రాకి కిటికీ అందుకున్నాడు. కిటికీ తలుపులు ఎప్పుడూ వేసి ఉండవు. బాత్‌రూమ్‌లోకి దిగాడు.

అడుగులో అడుగు వేసుకుంటూ వనజగదిలోకి అడుగు పెట్టాడు.

గదిలో చల్లగా ఉంది. ఏర్‌కూలరు చప్పుడు విని పిస్తోంది. అంతా చీకటి. బెడ్‌లైట్‌కూడా వేసిలేదు.

ఆశ్చర్యం వేసింది ప్రసాద్‌కు! ఇంత చలికాలం ఏర్ కూలరు పెట్టుకుంది! ఎప్పుడూ బెడ్‌లైటు లేకుండా నిద్ర పోని వనజ గదిలో లైటులేకుండా పడుకుంది.

అసలు గదిలో వనజ లేదేమో అన్న అనుమానంతో మంచంవైపు చూశాడు. ముసుగు తన్నుకుని పడుకున్న ఆకారం లీలగా కనిపించింది.

ఇదంతా తన అదృష్టం! లైటుకూడా వేసిలేదు. వనజ మేల్కొని తనను గుర్తించే అవకాశంలేదు.

కళ్లు చీకటి కలవాటు పడగానే తడుముకుంటూ పైజామా జేబులోంచి సరికొత్త బ్లేడ్ తీశాడు. కవరు చించి మంచం ప్రక్కనున్న టేబిల్‌పై పెట్టాడు బ్లేడును. లాల్చీ పైజామా

వింత ప్రపంచం?

1. 'ఓలివర్ క్రాంవెల్' ప్రజాకంటకుడు. బ్రతికి వుండగా చట్టానికి అందలేదు. చచ్చిన తర్వాత అతని శవాన్ని విచారించి, ఉరితీశారు.

2. 'గియో వాన్ని గాలంటి' అనే ఓ ఇటాలియన్ అబ్బాయివి గుడ్లగూబ కళ్ళు. పగలు బొత్తిగా చూపా నదు. చీకటి రాత్రులు అతడికి పగటి పూటలు.

3. 'లెబ్ ప్రోమర్' అనే ఆయన ముక్కోపి. తన నూత్న వధువుని ఏదో విషయంగా తిట్టాడు. ఆవిడ చాల ఘోరంగా ఆత్మహత్య చేసుకుంది. ప్రోమర్ పశ్చాత్తాపంతో ముప్పైఏళ్ళ మౌనవ్రతం అవలంబించాడు, స్వయంశిక్షగా.

4. షేక్స్‌పియర్ కూతురికి చదువను రాయనూ రాదు.

5. క్రీ. శ. 1000 లో ప్రపంచం అంతమౌతుందన్న నమ్మకంతో, ఓ పెద్ద భూస్వామి తన భూమిలోని ఓ కొండను ఓ కాన్వెంట్‌కి దానం చేశాడు. అయితే ప్రపంచం అంతంకాలేదు. కాబట్టి తను చేసిన దానం తనకి తిరిగి ఇవ్వవలసిందిగా కోరాడు ఆ కాన్వెంటుని. వాళ్ళు తిరస్కరించగా కోర్టుకెక్కాడు. అది మొదలు నేటివరకు ఆ ఉభయ-దాత-గ్రహీత-వంశీకులు వంశ పారంపర్యంగా ఆ కొండపై హక్కుల్ని గూర్చి కేసు నడిపిస్తూనే వున్నారు. ఇంతవరకు నేపెల్స్ కోర్టు ఎలాంటి తీర్పు ఇవ్వలేకపోయింది. ఇప్పటికి 975 సంవత్సరాలు గడిచిపోయాయి.

—ఎస్. వాహిద్.

విడిచి స్టాండుపై పడవేశాడు.

ఈ సమయంలో వనజనుకూడా వివస్త్రను చేస్తాడు తను. కాని ఇప్పుడు మార్పు చేయాలి. తన వీపులో పులిపిరికాయ ఉంది. ఆ పులిపిరికాయను వనజ చూస్తే, తనింతగా వేసు కున్న ప్లాను వ్యర్థమవుతుంది.

ఇక ఆలస్యం చేయకూడదు అనుకుంటూ వనజపైనుండి బ్లాంకెట్ లాగివేశాడు. స్పష్టంగా వనజ ముఖం కన్పించ లేదు. అలాగే తన ముఖంకూడా వనజకు కన్పించదు. చిన్న ప్పటినుండీ తనందరి గొంతులూ అనుకరించడంవల్ల తన గొంతుకూడా వనజ గుర్తించదు. నిర్భయంగా తన పని తను చేసుకుపోవచ్చు.

మెల్లిగా మంచంపై వాలాడు. తనప్రక్క నెవరో రావ డంతో మెల్కొన్నట్టుంది. ఇటు తిరిగి చేత్తో తడిమింది.

చేతికి ప్రసాద్ తల తగలగానే కెవ్వుమని కేకవేసింది. వెంటనే ఒకచేత్తో నోరు నొక్కాడు.

ప్రసాద్ గుండె లదిరాయి. ఆ కేకగాని రామారావుగారు వింటే గబగబా పైకి వచ్చేస్తారు. రాగానే నోరు నొక్కేయ నందుకు తనపై తనే విసుక్కున్నాడు. ఇప్పుడేమిటి చేయడం? వళ్లంతా చెమటలు పట్టింది.

కొన్ని నిముషాలు అలాగే మౌనంగా ఉన్నాడు.

ఎవరూ పైకి వస్తున్న సూచనలు కనిపించలేదు.

బహుశా కేక ఎవరూ వినలేదేమో? తన అదృష్టానికి తనే మురిసిపోయాడు. పంజరంలో పడ్డ పక్షిలా అటూ ఇటూ గింజుకుంటోంది వనజ.

“భయపడకు! నిన్ను చంపనులే. నా భార్య లేదు. అందుకే వచ్చాను. కొద్దిసేపు సహించి ఊరుకున్నావా సరే! లేదా ప్రాణం తీస్తాను” సాధ్యమైనంతవరకూ గొంతు

మార్చి అన్నాడు.

ఆ మాటలతో కాలు చేతులు ఆడించడం మానుకుని, చప్పుడు చేయకుండా పడుకుంది.

భయంవల్లనేమో ఊపిరికూడా భారంగా పీల్చి వదులుతూంది. నోరు నొక్కిన మోచేతికి ఊపిరి పీలుస్తున్నపుడు ఎగిసిపడుతున్న వక్షాలు మెత్తగా తగులుతున్నాయి.

ఇక ఆలస్యం భరించలేకపోయాడు. ఆమెను బాగా దగ్గిరికి జరుపుకున్నాడు. నోటిపైనుండి చేయితీసి వీపుచుట్టు బిగించిపట్టాడు. వీపు తడుముతూ జాకెట్టు గుండీలు త్రెంచివేశాడు. ఆమె నోటినుండి కూడా ఉచ్ఛ్వాసనిశ్వాసలు భారంగా వెలువడుతున్నాయి. ఆమె స్తనాలు ఛాతీకి అదుముతూంటే గిలిగింతలు పెట్టినట్లైంది. ఇంకా దగ్గరగా జరుపుకున్నాడు. మరో చేత్తో పొత్తికడుపు తడుముతూ చీర కుచ్చిళ్లు లాగివేశాడు. ఇక ఆమె ఒంటిపై బ్రాసరీ లంగా ఉంది. మార్పుకోసం అవి అలాగే ఉంచేశాడు.

అంతవరకూ మెదలకుండా పడున్న వనజ, ఒక్కసారిగా తనను చుట్టివేసింది. తన ఎడమ కాలెత్తి అతనిపై వేసి, గట్టిగా అతన్ని అదుముకుంటూ, ఆయాసపడిపోతూ, చేత్తో వీపు నిమురుతూ ఆగిపోయింది.

ప్రసాద్ గుండె ఝల్లుమంది. తన వీపులో పులిపిరి కాయపై ఉంది ఆమె చేయి. క్షణం తర్వాత ఆ చేయి ఇంకా బిగుసుకుంది. ఇంకా ఆలస్యం భరించలేక అతన్ని తనపైకి లాక్కుంది.

పది నిముషాల తర్వాత గట్టిగా వీపుపైన పెనవేసుకున్న ఆమె చేతుల్ని విదిలించి, ప్రక్కకి జరిగాడు.

ఆమె చప్పుడు చేయకుండా పడుకుంది, బాగా భయపడిందేమో.

టేబిల్ని తడుముకుండా, బ్లేడ్ అందుకుని, ఎడమచేతిని ఆమె తలక్రిందకు పోనిచ్చాడు. నోరు నొక్కిపెట్టాడు. మరో చేత్తో ఆమె కుడితొడపై సన్నని గాటుపెట్టాడు.

ఉలిక్కిపడిం దామె. బాధతో అరవాలని ప్రయత్నించి బలమైన బాహువుల్లో ఇరుక్కుని అరవలేక పోయింది.

"అరవకు, అరిచావా ప్రాణాలుతీస్తాను. ఇలాగే ఒక్క గాటు నీ స్తనాలమధ్య కూడా పెడతాను ఓర్చుకో" అంటూ చేతిని పైకి లాక్కుని స్తనాలమధ్య గాటుపెట్టాడు.

మెల్లగా లేచి బట్టలు తొడుక్కున్నాడు.

తను బయటికి వెళ్లేవరకూ ఆమె అరవదు, అంతవరకూ నిశ్చయం. తనతో ఇంత బాగా సహకరించింది. ఒకవేళ తనని గుర్తించిందేమో!

తనను గుర్తించి ఉండదు. గుర్తిస్తే దగ్గరకు రానిచ్చేది కాదు. ఆమె తనను గుర్తించలేదని నిశ్చయించుకొని, అంతవరకూ తన ప్రయత్నానికి అంతరాయం కలగకుండా వచ్చిన పని నెరవేరినందుకు సంతోషిస్తూ వెళ్ళబోయి ఆగాడు.

"చూడు నేను బయటికి వెళ్లేవరకూ అరవకు, చిన్న చప్పుడుచేసినా మీ ఇంట్లోఉన్న వారందరినీ చంపి వెళతాను జాగ్రత్త" చీకట్లోనే హెచ్చరించి బాత్ రూమ్‌లోకి దూరాడు.

భయంవల్ల నోరు మెదపలేదు వనజ. పైప్‌పట్టుకొని సర్రున క్రిందకి జారాడు.

ప్రక్కనే ఏదో చప్పుడయింది. గుండె ఝల్లుమంది!!

ప్రక్కకి తిరిగి చూశాడు. పందికొక్కు! పారిపోయింది.

గేటునుండి ఎవరో వచ్చినట్లైంది. చటుక్కున చెట్లలోకి పారిపోయి, కొన్ని క్షణాలు నిలుచుని, ప్రహరీమాకి రోడ్డు పైకి వచ్చాడు.

ప్రసాద్ మనస్సంతా సంతోషంతో నిండిపోయింది.

ఇక తన కష్టాలన్నీ గట్టెక్కినట్టే. వనజ ఎంతో ఉత్తము రాలు! తన శీలం పాడైనందుకు ఆత్మహత్య చేసుకోవచ్చు! భర్తే దైవంగా భావించే ఇల్లాలు తప్పకుండా ఆత్మహత్య చేసుకుంటుంది. వనజపేర్న ఉన్న ఆస్తి అంతా తనకే రావొచ్చు!

ఒకవేళ అలా జరగకపోయినా ఫరవాలేదు. అందుకే తను ప్లానుగా అన్నీచేసి వచ్చాడు. వనజ తొడలపై, స్తనాలపై గుర్తులుపెట్టి, ఆమెను బెదిరిస్తూ అయిదువేలు కావాలని ఉత్తరం వ్రాసి, బాత్ రూమ్‌లోని అద్దం స్టాండులో ఉంచి వచ్చాడు.

ఒకసారి ఉత్తరంలో వ్రాసిన సారాంశాన్ని మననం చేసుకున్నాడు.

"డియర్ వనజా!

నేనెవర్నో నీకు తెలియదు. నీ శీలాన్ని నేను దోచుకున్నాను. ఈ విషయం నీ భర్తకుచెప్పి నీ సంసారం గుల్ల చేయగలను. అందుకే నీ స్తనాలపైనా, తొడపైనా గుర్తులు పెట్టాను.

నీవు బీదదానివేం కాదు, నా నోరు మూయించగల శక్తి నీకుంది. ఈ విషయం నీ భర్తతో చెప్పకుండా ఉండాలంటే, రేపు రాత్రి ఎనిమిదిగంటలకు పబ్లిక్ గార్డెన్లోకి అయిదువేల రూపాయలతో రా! ఒక కుర్రాడువచ్చి "వనజగారూ తెచ్చారా" అంటాడు. వాడికి డబ్బిచ్చి తిరిగి చూడకుండా వెళ్ళిపో.

ఈ విషయం ఇతర్లతో చెప్పావా మరుసటి దినపత్రికలో ఈ వార్త ప్రచురింపబడుతుంది, జాగ్రత్త!

—సీక్రెట్ లవర్."

వనజ డబ్బివ్వగానే, హాయిగా జల్సాలు చేసుకోవచ్చు.

హాయిగా ఈలవేస్తూ, ఇంపాలా కారులో కూర్చుని ప్రయాణంచేసినట్లుగా ఫీలయ్యాడు.

* * *

ఉదయం పది గంటలకు రామచంద్రాపురం బస్సునుండి దిగాడు ప్రసాద్.

రాత్రి ఇంటికి వెళ్ళకూడదని రామచంద్రాపురం తన స్నేహితుడింటికి వెళ్ళాడు. అతని ఆలోచనలు ఇంటి చుట్టూ తిరుగుతున్నాయి.

'వనజ ఆత్మహత్య చేసుకొనుంటుందా? లేక ఈ రోజు ఐదువేలు తీసుకుని పబ్లిక్ గార్డెన్‌కు వస్తుందా' అని ఆలోచిస్తున్నాడు.

ఇల్లు దగ్గరికి రాగానే ఆలోచనలకు సంకెళ్లు వేసి ఇంట్లోకి అడుగు పెట్టాడు.

షాక్ తిన్నట్లు నిలబడి పోయాడు ప్రసాద్!!

అందరూ ఘొల్లున్న ఏడుస్తూ ప్రసాద్ వంక తీవ్రంగా, అసహ్యంగా చూశారు.

రాఘవయ్య ఉరేసుకొని చచ్చిపోయారు! పార్వతమ్మ స్పృహ తప్పి పడిపోయింది!!

ప్రసాద్ గుండె చెరువయ్యింది. బోరున ఏడుస్తూ రాఘవయ్యగారి పాదాలను చుట్టివేసి వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

మిగతా వారంతా "పాపిష్టోడు, దుర్మార్గుడు, రాఘవయ్య గారికి చెడ పుట్టాడు, ఛీ వీడి ముఖం చూస్తేనే పాపం!!" అందరూ తనను అంటున్న మాటలను వింటూ ఉంటే ప్రసాద్ దుఃఖం మరీ ఉద్రిక్తస్థాయిని అందుకుంది.

తల్లితండ్రులను ఆ స్థితిలో చూస్తున్నందుకు కాకుండా, చుట్టూ ఉన్న వారంటున్న మాటల్ని వింటూంటే ఎక్కడలేని

దుఃఖం వచ్చేస్తోంది ప్రసాద్‌కు.

'నేను చేసిన పాపం ఏమిటి? నా వల్ల తండ్రి ఉరేసుకో వలసిన అవసరం! ఒకవేళ నిన్న వనజను కొట్టినందుకా? లేక ఆయనపైకి చెయ్యి లేపినందుకా? హే భగవాన్....' ఆలోచించలేక పోతున్నాడు ప్రసాద్.

'ఏమిటిది తనొచ్చి ఇంతసేపైనా ఎవరూ రారేమిటి? కమల ఎక్కడికి కెళ్ళింది?' ఏడుస్తూనే ఇల్లంతా చూశాడు. కమల ఎక్కడా లేదు.

ప్రసాద్‌కు పిచ్చెత్తినట్లైంది "కమలా! కమలా! ఎక్కడికెళ్ళావమ్మా ఇక్కడ చూడు! నాన్నా! నాన్నా!" అంటూ ఏడుస్తున్నాడు.

పార్వతమ్మకు స్పృహ పోయిందో లేక ప్రాణం పోయిందో తెలియదు. ఆమె మాట్లాడలేదు.

ప్రసాద్ అలా అనగానే అక్కడున్న వారంతా ప్రసాద్‌ను అసహ్యంగా చూస్తూ, కొందరు ఉమ్మివేస్తూ బయటికి వెళ్ళి పోవడం చూస్తుంటే, ప్రసాద్‌కేమీ అర్థం కాలేదు.

ప్రక్కింట్లోనే ఉంటున్న రామం వెళ్ళిపోవడం సహించ లేక పోయాడు ప్రసాద్. పరుగున వెళ్ళి రామం కాళ్ళు పట్టు కున్నాడు.

రామంగారూ! ఏం జరిగిందో కాస్త వివరంగా మీరైనా చెప్పండి?"

రామం, ప్రసాద్ ముఖంలోకి జాలిగా చూశాడు.

"ప్రసాద్ మీ అమ్మగారి చేతిలో ఉత్తరముంది చదువు. నేనేమీ చెప్పలేను" అంటూ బయటికి వెళ్ళిపోయాడు.

ప్రసాద్ కనుబొమలు ముడివడ్డాయి. అప్పటికి గాని తెలిసి రాలేదు, పార్వతమ్మ చేతిలో కాగితం ఉన్న సంగతి!

గబగబా లేచి పార్వతమ్మ వద్ద కెళ్ళాడు. చేతిలోని ఉత్త రాన్ని మడతలు విప్పాడు.

అది తనకే, తన పేరునే వ్రాసి ఉంది. ఆశ్చర్యంగా అక్ష రాలపై కేంద్రీకరించాడు కళ్ళని.

"ప్రసాద్!

నిన్ను అన్నయ్యా అని పిలవడానికే అసహ్యంగా ఉంది. నేను నీ చెల్లెల్ని అని చెప్పుకోవడం కూడా సిగ్గు చేటు. నేను జీవితంలో చెయ్యరాని పెద్ద ఘోరం చేశాను. ఆ పాపం నుండి బయటపడాలని నేనూ, వదినా మా తనువుల్ని చాలిస్తున్నాము.

నిన్న రాత్రి నువ్వు వదినతో పోట్లాడి కొట్టి, వెళ్ళగొట్టా వట! నేను వచ్చేవరకూ ఇంట్లో నువ్వు గానీ, వదిన గానీ ఎవరూ లేరు. నిన్నటితో నా జీవితానికి పరమార్థం ఏమిటో తెలియ వచ్చింది. వదిన నన్నెందుకు తిడుతోందో నా కర్థం అయింది.

అందుకే ఆమెను నువ్వు పుట్టింటికి పంపించడం సహించ లేకపోయాను. నేనూ వెంటనే వదిన ఇంటికి వెళ్లాను. వదిన ఎంతో బాధ పడుతోంది. ఆమెను ఇంటికి రమ్మని బ్రతిమా లాను. మావయ్య పంపించనని వారించినా ఉదయమే రావ డానికి సమ్మతించింది వదిన. మావయ్య వదినకు ఎంతో నచ్చచెప్పాడు అక్కడికి వెళ్ళొద్దని. ఐనా వదిన వినలేదు. చివరికి మావయ్యకూడా ఒప్పుకున్నాడు.

అందరం ఆ రాత్రి సినిమాకెళ్లాలని నిశ్చయించుకున్నాం. సినిమాకెళ్ళే సమయానికి నాకు తలనొప్పిగా ఉండి నేను వెళ్ల లేకపోయాను. అయిష్టంగానే నన్ను విడిచి మావయ్యతో సినిమాకి వెళ్ళింది వదిన.

సరిగ్గా రాత్రి పన్నెండు గంటలకు, బాత్‌రూమ్‌లోనుండి నువ్వొచ్చావ్.

నువ్వేనని ఎలా తెలుసుకున్నానని ఆశ్చర్యపడుతున్నావా? నువ్వు వెళ్ళగానే వదిన వచ్చింది. నా బట్టలకు రక్తం మరకలుండడంతో విషయం అడిగింది వదిన. అంతా చెప్పాను. బాత్‌రూమ్‌లోకి వెళ్ళి చూడగానే నువ్వు వ్రాసిపెట్టిన ఉత్తరం చూశాము. అప్పుడుకూడా దుర్మార్గుడివి నువ్వేనని అనుమానం రాలేదు. ఉత్తరం నువ్వు రాయలేదుగా!

కానీ నిజం నిప్పులాంటిది. బాత్‌రూమ్ క్రింద నువ్వొదిలిపోయిన చెప్పుల్ని చూసి నువ్వేనని నిశ్చయించుకున్నాము. నీ వీపులో పులిపిరికాయ ఉందనికూడా వదిన చెప్పింది.

ఇక ఇంత పాపం వొడిలో పెట్టుకొని ఎలా బ్రతకమంటావు. వదినకూడా నువ్వింత దుర్మార్గుడివని, నీ భార్యగా బ్రతకడంకంటే చావడం మేలని నిర్ణయించుకుంది. ఈ ఉత్తరం నువ్వు చూసేవరకు మేమిద్దరం ఈ లోకంలో ఉండము. మళ్లీ జన్మలోనైనా నీవంటి దుర్మార్గునికి చెల్లినై పుట్టకుండా నన్ను ఆశీర్వదించు.

దౌర్భాగ్యురాలు, కమల.

ఉత్తరం చదవగానే కుప్పలా కూలిపోయాడు ప్రసాద్.

* * *

"పాపాత్ముణ్ణి! ....

అయిదువేలు!! .... ఆత్మహత్య!! ...."

అంటూ రోడ్డుపట్టి తిరిగే ప్రసాద్‌ను గుర్తుపట్టనివారెవరూ లేరు హైద్రాబాదులో. పాపాత్మునికి ప్రాయశ్చిత్తం తప్పదని అందరూ నమ్ముతారు. అందుకు మరొక నిదర్శనం ప్రసాద్ జీవితం.

★

దొంగ
వెధవ
కంచర్ల
రమణారె

హోటల్ జూపిటర్‌లో ఫలహారంచేసి, బయటికివచ్చి రిస్టువాచీ చూసుకున్నాడు పాపారావు. ఎనిమిదిగంటలైంది. అప్పుడే ఎండ వీపుని చుర్రుమనిపిస్తోంది.

ప్లేటు ఇడ్లీ, ప్లేటు పూరీ తినేసరికి హోటలువాడు రూపాయి లాగేసుకున్నాడు. ఇంక జేబులో మిగిలినవి మూడు రూపాయలు. అవాల్టి ఖర్చుకు తనకు మాత్రం సరిపోతుంది, ఇంటి ఖర్చులకు యేమీ మిగలదు.

అవాల్టికి నాలుగు రోజులైంది పాపారావు దొంగతనం చేసి. ఆ రోజు ఏమైనా సంపాయించకపోతే పస్తులుండాల్సిందే మర్నాటినుంచీ.

పస్తులుండడం తనకు, తన వాళ్ళకు అలవాటులేని పనేమీ కాదు గాని, పదిహేనో తారీఖు దాటిపోయిందంటే, ఉద్యోగస్థుల జేబులు తేలికైపోతాయి. రూపాయో, రెండో తప్ప పెద్ద మొత్తాలు జేబులోవేసుకుని తిరగరు. అప్పుడు తను జేబులు కొట్టడం ఆరంభిస్తే, శ్రమ మిగులుతుంది తప్ప ఫలితం ఉండదు.

పాపారావు తిన్నగా పోలీసుమామ అప్పలస్వామి దగ్గరకు వెళ్ళాడు. మామ యింకా డ్యూటీకి వెళ్ళలేదు. ఇంటి దగ్గరే ఉన్నాడు.

"యేటిమావా? ఇయాల కూడా పనిలోకి యెల్లమంటావా? వొద్దా? మనగ్గర డబ్బులైపోనాయి" అన్నాడు పాపారావు.

పోలీసు అప్పలస్వామికి పాపారావుకు చుట్టరికమేదీ లేదు. కాని తమ వృత్తిరీత్యా, బంధువులకన్నా బహూసన్నిహితులు.

పోలీసు డిపార్టుమెంటు ఊళ్లో ఉన్న దొంగల్ని పట్టడం

గురించి బందోబస్తు చేసినప్పుడల్లా పాపారావును హెచ్చరిస్తుంటాడు అప్పలస్వామి.

అప్పలస్వామి హెచ్చరిక అందుకుని, దొంగలమీద పోలీసులు నిఘావుంచిన నాలుగు రోజులు అజ్ఞాతవాసం చేస్తాడు పాపారావు.

వృత్తిరీత్యా తనకు సంభవించే ప్రమాదాలవల్ల రక్షిస్తున్నందుకు, నూటికి పదిరూపాయలు భరణం చెల్లిస్తుంటాడు పాపారావు, అప్పలస్వామికి.

"ఇయాల కూడ ఎల్లకురోయ్. మీ వోల్లమీద నిఘాతగ్గ లేదు యింకాను" చెప్పాడు అప్పలస్వామి.

పాపారావు క్రుంగిపోయాడు ఆ మాటలు విని.

"యేటిమావా అలా గంటావ్? ఇంక నా కాడ మూడు రూపాయలు మాత్రం ఉన్నాయి. ఇయాల సంపాయించక పోతే, యింటికాడ, కుండలు డింకీలు కొట్టాయి" అన్నాడు పాపారావు దిగులు, బాధ మిళితమైన స్వరంతో.

"తొందరపడి పోకురా కుర్రకుంకా! నాను సెప్పింది యినుకో. దొంగల్ని పట్టుకోడానికి ఏయో ప్లానులుయేసి నారు పెద్దోల్లంతా కూకుని. ఒక్క యెదవ దొరకనేదంట. యెర్రెత్తిపోతన్నారు. ఇంకో నాల్రోజులు నిఘా యెక్కువ సేసినారట. రాజానాగ పనిలోకి యెల్లిపోదువుగాని రెండ్రోజు లాగు" పరిస్థితి నచ్చ చెప్పడానికి గట్టి ప్రయత్నంచేసాడు అప్పలస్వామి.

పాపారావు యేమీ అనలేకపోయాడు. తల వంచుకుని వచ్చేసాడు బయటికి.

అప్పలస్వామి కేం పోయింది? అలాగే అంటాడు. వీళ్లైతే దొంగతనం చెయ్యడమే మానుకోమని హితబోధ చేస్తాడు. అతనికైతే ఒకటో తారీఖుకల్లా టంచనుగా జీతం

వచ్చేస్తుంది. పైగా తనలాంటి వాళ్ళదగ్గర రోజూ రెండో మూడో తడిమేసుకుంటాడు.

పూర్వపు అలవాటు ప్రకారం పాపారావు కాళ్లు మెయిన్ రోడ్డుమీదకు తీసుకెళ్ళాయి.

అప్పుడే క్రిక్కిరిసిన జనంతో ఏదో నెంబరు బస్సు అతని ప్రక్కనుంచి రయ్యినవెళ్లింది.

ఆ బస్సును చూడగానే పాపారావు మనస్సు బాధతో మూలిగింది.

ఆ బస్సు రూటే తనదీను. నాలుగుట్రిప్పులు అలా ఆ బస్సులో వచ్చాడంటే, ఒక్కటైనా లభిస్తుంది. దగ్గర దగ్గర స్టాపులు. ఎక్కే జనానికీ, దిగే జనానికీ అంతుండదు. జేబు దొంగకు బంగారం గని ఆ రూటు. కొంగు బంగారం ఆ బస్సు.

నాలుగు రోజుల నుంచి, చెయ్యి ముడుచుకుని కూచున్నాడేమో, అరచేయి దురద పెడ్తోంది అతడికి.

ఈ పోలీసు అప్పలస్వామి ఒకడూ! ఇంకో రెండు రోజులాగమని చంపేస్తున్నాడు.

వాడి మాట వినకపోతే, ఎటుపోయి ఎటు వస్తుందో?

పోలీసులు గట్టి బందోబస్తు పెట్టారంటాడు అప్పలస్వామి.

ఐతే, ఊరంతా పెట్టి ఉండరు. ఏయే రూట్లవైపు దొంగతనం ముమ్మరంగా సాగుతుందో అక్కడ పెడతారు.

దొంగతనం విస్తారంగా జరిగే రూట్లు తనకు తెలుసు. వాటిని వదిలేసి, తతిమ్మా రూట్లవైపు పోయి కాస్త చెయ్యి సాపు చేసుకొస్తేనో?....

బావుంది! మంచి ఆలోచన. ఊర్లో బస్సులు వదిలెయ్యాలి.

ఐతే, యెటుపోతే బావుంటుంది? పాపారావు నిశితంగా

ఆలోచించాడు.

మొదట సింహాచలం రూటువైపు వెళదామనుకున్నాడు.

తీరా, చావుల మదుంకు వచ్చేసరికి మనస్సు మారి పోయింది.

గాజువాక పోయే బస్సులు ఆగే స్టాపువద్ద క్రిక్కిరిసిన జనం అవుపించారు.

వాళ్ళందరూ ఆఫీసుకు పోయే ఉద్యోగస్తులే.

బస్సులు బాగా నిండేవరకు బస్సు లాపేస్తారు అక్కడ.

ఎంతైనా మంచి వసూళ్లు వచ్చేది ఆఫీసు టైమప్పుడు తిరిగే ట్రిప్పుల్లోనే గదా!

వచ్చిన బస్సు బాగా నిండుతుందని నిర్ధారణ చేసుకున్నాకనే బస్సు ఎక్కాడు పాపారావు.

కండక్టరు ఆశకు అంతు లేదు. క్లీనర్ వెనుకనుంచి జనాన్ని ముందుకు పొమ్మని గదమాయిస్తుంటే, కండక్టరు ముందునుంచి జనాన్ని వెనక్కి సర్దుకోమని చెబుతున్నాడు.

ఇంకా తృప్తి చెందక, క్లీనరు బస్సులోకి చొరబడి, జనాన్ని మూడు వరుసలుగా సర్దాడు.

బస్సు యెంత క్రిక్కిరిసి ఉంటే తనకంత చెయ్యి వాటం అవుతుంది.

కండక్టరు, క్లీనరు కలసి చెరోవైపు జనాన్ని బస్సులో కుక్కేస్తుంటే పాపారావు పొంగిపోయాడు.

బస్సు బయలుదేరింది.

తన చుట్టూ ఉన్నవారిని పరిశీలించ నారంభించాడు పాపారావు.

ఒకరిద్దరు తప్ప, అందరూ ఆఫీసులకు పోయే ఉద్యోగస్తులే. నీటుగా ముస్తాబై దర్జాగా అవుపిస్తున్నారు.

ఐతే, ఇందులో ఎంతమంది వద్ద పది రూపాయలకు

మించి డబ్బు ఉన్నాదన్నది శేష ప్రశ్న.

ముస్తాబును బట్టి, దర్జా బట్టి, విధిగా వాళ్ళ జేబులో బాగా డబ్బు ఉండాలన్నది లేదు.

వాళ్ళ జేబుల వైపు తన ఎక్స్-రే కళ్ళతో జూసాడు పర్సులున్న జేబులు ఎత్తుగా ఉంటాయి. తీరా, అవి కొడితే, అందులో రూపాయి చిల్లర మినహా ఇంకేమీ ఉండదు.

ఖచ్చితంగా, నోట్లు బొత్తి ఉన్న జేబుకోసం వెతుకు తున్నాడు పాపారావు, కోడిపిల్ల కోసం వెతుకుతున్న డేగ లాగు.

అతని ఆశలు ఫలించాయి.

ఎవరిదో కల్లీ చొక్కా ప్రక్క జేబు అవుపించింది. చిన్నగా చిరిగిన ఆ జేబులోంచి, పది రూపాయల నోట్ల బొత్తి ఊరిస్తూ అవుపించింది.

పాపారావు గుండె ఆవేశంతో ఊగిసలాడిపోయింది. ఆ జేబు కొట్టేయడం బహు తేలిక.

ఆ వ్యక్తివైపు చూసాడు. అతనికి ఏభై ఏళ్లుంటాయి. ఖద్దరు చొక్కా, పంచె ధరించాడు. బట్టతల నున్నగా మెరుస్తోంది.

ఏమాత్రం ఉంటుంది ఆ డబ్బు? నోట్లు మడతపెట్టి అంచులు బైటికి అవుపించేలా పెట్టాడేమో, కాస్త శ్రమ పడితే తెలుస్తుంది, అదెంతుందో.

జాగ్రత్తగా చూపు నిదానించి, నోట్ల అంచులు లెక్క పెట్టాడు పాపారావు. సరిగ్గా పదహారు అంచులు. అంటే, ఎనభై రూపాయలు.

ఫరవాలేదు. శ్రమపడితే తగిన ఫలితం ఉంది.

ఎప్పుడైతే ఎక్కువ జనం దిగడం ఆరంభిస్తారో, ఆ సందట్లో అతని జేబు కొట్టేయాలి.

పైప్లైన్సు స్టాపువద్ద జనం యెక్కువమంది దిగుతారని పాపారావుకు తెలుసు.

ఆ స్టాపువద్ద ఆ జేబు యెంత చాతుర్యంగా కొట్టేయాలో ఆలోచించసాగాడు పాపారావు.

ఉన్నట్టుండి పాపారావు ఆలోచనలకు బ్రేకు పడింది.

పోలీసు బందోబస్తు ఇటువైపు లేదని గ్యారంటీ ఏమిటి? తను ఎక్కిన బస్సులో ఇద్దరు పోలీసులు వస్తున్నారాయె.

డబ్బు కొట్టేసి, తను బస్సు దిగి వెళ్ళిపోయేంతవరకు ఆ వ్యక్తి అల్లరి చెయ్యకుండా ఉంటే ఫరవాలేదు.

ఒకవేళ చేసాడో, ఆ ఇద్దరు పోలీసులు టకీమని బస్సు లోనివాళ్ళను చెక్ చేస్తారు. తను డబ్బుతో దొరికిపోతాడు.

అలా కావడానికి వీలులేదు.

తన డబ్బే ఆ వ్యక్తి దొంగిలించాడని అల్లరిపెడ్తే?.... అప్పుడు అతడ్ని చెక్ చేస్తారు. అతడి జేబులో డబ్బు దొరుకుతుంది. తను కరక్టు సొమ్ము చెప్తాడు కాబట్టి, అది తన సొమ్ము అని పోలీసులు నమ్ముతారు. సునాయాసంగా ఎనభై రూపాయలు తన పరం అవుతాయి.

వాడెవడోగాని, వాడి వాలకం చూస్తే వొట్టి బేవార్సు గాడిలా అవుపిస్తున్నాడు. తనజేబులో డబ్బు వాడు కొట్టేశాడని గోలపెడితే, పోలీసులు తప్పక నమ్ముతారు.

తను చెయ్యవలసిందల్లా సమయంచూసి గోలచెయ్యడం, ఆ వ్యక్తి చెయ్యిపట్టుకుని నిలబెట్టడం.

తన కొత్త పథకం అన్నివిధాల బాగుందనిపించింది పాపారావుకు.

బస్సు పైప్‌లైన్సు వద్దకు వచ్చి ఆగింది. ఆగి ఆగగానే దిగేవాళ్ళ సంరంభం యెక్కువైంది.

అంతవరకూ నిల్చున్నవాళ్లు కాళీ ఐన సీట్లకోసం యెగబడుతున్నారు. రెండో వ్యక్తి కూర్చునే లోపల తామే ఆక్రమించుకోవాలని తొందర.

పాపారావు చూటువేసిన వ్యక్తికూడా తొందరగా దిగిపోవాలని ఆతృత పడుతున్నాడు. పాపారావు అతని వెనుకే వెళ్లాడు. ఫుట్ బోర్డువద్ద మాత్రం అతని కడ్డంగా త్రోవలో చెయ్యిపెట్టి, తను ముందు దిగాడు. అతని వెనుకనే సరిగ్గా ఆ వ్యక్తి దిగాడు.

దిగీ దిగగానే బస్సువాడికి డబ్బులివ్వడంకోసం జేబు తడుముకున్నట్టు, తన జేబులమీద కంగారుగా చెయ్యి వేసుకుని "ఏదీ నా డబ్బు. బాబోయ్ నా ప్యాకట్టు ఎవడో కొట్టేశాడు" అని అరిచాడు పాపారావు. ఆ అరుపులో ఏడుపు ధ్వనించేలా జాగ్రత్తపడ్డాడు, సీను రక్తికట్టడంకోసం.

"ఏమైంది?" అన్నారొకరు.

"ఎంత పోయింది?" అన్నారు ఇంకొకరు.

"ఎంత సేపయింది పోయి?" అన్నారు మరొకరు.

"వాడెవడో ఇక్కడే ఉంటాడు. పారిపోయి ఉండడు. పట్టుకో" అన్నారు మరొకరు.

అదే అదను గ్రహించి. తను గుర్తుపెట్టుకున్న వ్యక్తి చెయ్యి పట్టుకుని నిలబెట్టాడు పాపారావు.

"వీడే నా జేబు కొట్టేశాడు. ఇందాక నా వెనకనున్నాడు వీడే. అదే పనిగా నాకు చెయ్యి తగిలిస్తుంటే యేమిటో అనుకున్నాను" అంటూ ఆ వ్యక్తి జేబులు తడమసాగాడు.

"ఏమిటది; నా జేబులు తడుముతున్నావు? ఎవరు నువ్వు?" ఆ వ్యక్తి పాపారావును ఆపు చెయ్యబోయాడు.

లాభం లేకపోయింది. అప్పటికి, ఆ వ్యక్తి జేబు తడిమి, డబ్బుపెట్టికి లాగాడు పాపారావు.

"చూడండి. ఇవిగో నా ఎనభై రూపాయలు" అంటూ నోట్లు లెక్కపెట్టి చూపాడు పాపారావు.

ఎక్కువో, తక్కువో వుంటాయేమోనని ఓ క్షణం పాపారావు గుండె భయంతో బిగుసుకుపోయింది కాని, నిజంగా ఎనభై రూపాయలున్నాయి.

ఆ వ్యక్తి చిరిగిపోయిన చొక్కా, పాత పంచె, చెప్పుల్లేని పాదాలవైపు చూసి, అతడు పాపారావు వద్దనుంచి ఆ డబ్బు కొట్టేసాడని నిర్ధారణ చేసుకొన్నారు జనం.

"తన్నండి దొంగవెధవని, మక్కలిరగదీసెయ్యండి. ఇంకెక్కడా యిహముందు, యిలాంటి పన్లు చెయ్యకుండా" నలుగురూ అరిచారు నాలుగు ప్రక్కలనుంచీ.

"పోనీద్దురూ! డబ్బు దొరికిందిగదా వదిలెయ్యండి" అన్నాడెవరో భూతదయ గల వ్యక్తి.

కాని, పాపారావుకు ఊరుకో బుద్ధికాలేదు.

నాటకం మరి కాస్త రక్తి కట్టించడం కోసం, ఆ వ్యక్తి కాలరు పుచ్చుకుని, "దొంగ వెధవా! నా జేబు కొడతావట్రా" అని కేక వేసాడు ఆ వ్యక్తిమీద.

అదే సమయంలో పోలీసులు అక్కడికి కొచ్చారు.

"ఏమిటి గొడవ?" అంటూ మూగిన జనాన్ని దూరంగా తప్పుకోమన్నారు.

పోలీసులు రాబట్టిగాని, పాపారావు నాలుగు తగిలించి వుండేవాడు ఆ వ్యక్తిని.

"చూడండీ యీ దొంగ వెధవ! నాజేబులోంచి డబ్బు కొట్టేసి పారిపోదామనుకున్నాడు" చెప్పాడు పాపారావు పోలీసులవైపు తిరిగి.

"ఏదీ ఆ డబ్బు?" ఓ పోలీసాయన అడిగాడు.

"ఇదిగో" అంటూ నోట్ల బొత్తి, తన జేబులో పెట్టుకున్నది టక్కున బయటకుతీసి చూపించాడు పాపారావు.

నోట్లవైపు ఓసారి చూసి, లెక్కపెట్టి "యివి మీవేనా?" అని అడిగాడు పోలీసాయన.

పాపారావు గొంతుకలో ఏదో అడ్డుపడినట్లయింది. క్షణం కంగారుపడి, వెంటనే సర్దుకుని, "నాదే" అన్నాడు.

పోలీసాయన తన జేబులోంచి పొడుగు కాయితం ఒకటి తీసాడు. అందులోకి అయిదు నిముషాలు చూసాడు.

"నీ పేరేమిటి?" కరకుగా అడిగాడు పోలీసాయన పాపారావుని.

చెప్పాడు పాపారావు.

"ఎన్నాళ్ళనుంచి, యీ కొత్త పద్ధతిలో దొంగతనం మొదలుపెట్టింది?" అడిగాడు పోలీసాయన తీవ్రంగా.

ఆ ప్రశ్నకు, పాపారావు బిక్కచచ్చిపోయాడు. ఎవరో చేతితో పట్టుకుని అతని గుండెకాయను ఆపేసినట్టయింది.

అయినా, నిగ్రహించుకుని, "యేమిటండీ ఇది? దొంగతనం చేసినోడ్ని వదిలేసి నన్ను దొంగ అంటారేమిటి?" కోపం, దుఃఖం మిళితమైన గొంతుకతో అన్నాడు.

"ఆయన దొంగకాదు. మఫ్టీలో ఉన్న పోలీసు. నీలాంటి వాళ్ల పోల్చుకోకుండా ఉండాలని, పొన్నూరునుంచి కొంత మంది పోలీసుల్ని తెప్పించాం. మా స్టాఫుకు యిచ్చిపంపిన నోట్ల వివరాలు నెంబర్లతో సహా యీ లిస్టులో ఉన్నాయి. పద పోలీసుస్టేషనుకు" అంటూ పాపారావును యింకేమీ మాట్లాడనియ్యకుండా, సిటీవైపు వెళ్తున్న బస్సులోకి బలవంతంగా యెక్కించారు ఆ పోలీసు లిద్దరూ.

నివ్వెరపోయి చూస్తూ నిలుచున్నారు జనం. ★

ఈనెల జోక్స్

కె. ప్రభాకరదేవ్

ఏడుస్తున్న ఒక పిల్లవాడ్ని దారిన పోయే పెద్ద మనిషి "ఎందుకేడుస్తున్నావ్?" అని ప్రశ్నించాడు.

"మా అన్నయ్యకు వేసవి సెలవులు ఇచ్చారు. నాకివ్వ లేదు" మూలుగుతూ చెప్పాడు పిల్లవాడు.

"ఏం ఎందుకనీ?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.

"నేనింకా బళ్లో చేరలేదుగా!" అన్నాడు పిల్లవాడు.

* * *

ఇంటాయన:- మీ ఇల్లంతా ఖాళీగా వుందేమిటి? ఇల్లు మార్చేస్తున్నారా??

అద్దెకున్నతడు:- కాదయ్యా బాబూ! దొంగలు పడ్డారు!

* * *

పై వూర్లో చదువుకుంటున్న ఓ చదువుల్రావ్ తన తండ్రి కిలా వుత్తరం వ్రాశాడు.

"ఇకనుండీ నేను ప్రతి నెలా పాతిక రూపాయలైనా పొదుపు చేయాలనుకుంటున్నాను. కనుక, మీరు వచ్చే నెల నుండీ నాకు పాతిక రూపాయలు ఎక్కువ పంపండి."

* * *

తుపాకి గురి నేర్చుకుంటున్న ఒక సైనికుడు గురి కుదరక విసుగెత్తి, "నాకు సరిగ్గా తుపాకిని గురిచూసి కాల్చడం రాకుండా వుంది. అందువలన యుద్ధానికి వెళ్ళడం తప్పుతుందా?" అని సైనికాధికారిని ప్రశ్నించాడు.

"యుద్ధానికి వెళ్ళడం తప్పదు గాని, తిరిగి క్షేమంగా రావటం తప్పుతుంది" అన్నాడు అధికారి మండిపడుతూ.

* * *

"సీతా! చిన్నవాడు ఏడుస్తున్నాడు. వాడు అడిగింది ఇచ్చెయ్య కూడదూ?" విసుగ్గా అన్నాడు సంసారి.

"అలా ఇచ్చినందుకే ఏడుస్తున్నాడండి."

"ఏమిటిచ్చావ్?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఎండు మిరపకాయ."

* * *

ఒక వ్యాపారస్తుడు ఫైర్ యిన్సూరెన్స్ పాలసీ

కట్టాడు. ఆ రాత్రే అతని ఫ్యాక్టరి పూర్తిగా కాలిపోయింది. ఇన్సూరెన్స్ కంపెనీవారికి ఇందులో ఏదో మోసం వుందని పించింది. వెంటనే వారినుండి వ్యాపారస్తుడికి ఒక లేఖ యిలా వచ్చింది.

"అయ్యా! ఈ నెల రెండవ తారీఖు, వుదయం పది గంటలకు మీరు ఒక ఇన్సూరెన్స్ పాలసీని పొందివున్నారు. ఆ రోజు రాత్రి పదిగంటలకు మీ ఫ్యాక్టరీకి నిప్పు అంటు కుంది. ఈ ఆలస్యం ఎందువల్ల కలిగిందో తెలుసుకోవ డానికి మా మనుషుల్ని పంపిస్తున్నాం."

* * *

ఒక పిల్లకవి తన ప్రియురాలితో కలిసి సముద్ర తీరానికి షికారుగా వెళ్ళాడు. ఎగిసిపడే కెరటాలను చూస్తుంటే పిల్లకవికి ఏదో ఆలోచన వచ్చింది.

అతడు ప్రేయసితో "చూడు డార్లింగ్! నీ ముఖార విందాన్ని చూడడానికి సముద్రుడు ఎలా తంటాలు పడు తున్నాడో....!!" అన్నాడు. ఉవ్వెత్తున లేస్తున్న కెర టాలను చూపిస్తూ.

"అవునవును. కాని, మీ ముఖాన్ని చూడలేక, భయపడి, సముద్రుడు పారిపోతున్నాడు" అంది వెంటనే విరగబడి, వెనక్కిపోతున్న కెరటాలను చూపి.

* * *

ఇద్దరు భార్యాభర్తలు జానపద సినిమాకి వెళ్ళారు. రాణి పక్కనున్న దాసీని చూస్తూ భార్య భర్తతో "ఏమండీ! రాణి వేషం వేసినావిడకన్నా ఆమె పక్కనున్న దాసీది చాలా అందంగా వుందికదండి" అంది.

ఆ మాటలకు భర్త తలాడిస్తూ: "అవునవును. మన ఇంట్లో పనిమనిషి సుబ్బులు లాగే" అని నాలిక్కరుచు

కున్నాడు భర్త.

* * *

టాక్సీలో ప్రయాణిస్తున్న మనిషి డ్రైవరుతో విసుగ్గా ఇలా అన్నాడు:

"డ్రైవర్! నీకు మద్రాసుకొత్తనుకుంటాను. మైలాపూర్ తీసుకెళ్ళమంటే యిది నాలుగోసారి లజ్ కార్నర్ దాటటం."

"క్షమించండి బాబు! మీరు మద్రాసుకు కొత్తవారని పొరబడ్డాను" అన్నాడు డ్రైవర్ క్షమాపణగా.

* * *

ఒక యువకుడు న్యూ యియర్ గ్రీటింగ్స్ కొనడానికి షాపుకు వెళ్ళాడు.

షాపువాడు యువకుడికి గ్రీటింగ్స్ చూపిస్తూ, "ఈ గ్రీటింగు కార్డు తీసుకోండి సార్! ఇందులో మంచి వాక్యం వుంది 'నా ప్రాణప్రదమైన ఏకైక ప్రేయసికి' అని" చెప్పాడు.

"ఆ రకం కార్డులు ఒక డజను యివ్వు" అన్నాడతను స్టయిలుగా. ★

బ్యాచిలర్
శవాలు
శశికుమార్

"విమలా! నిన్ను వదిలి నేను బ్రతకలేను." అన్నాడు రాజేష్.

"రాజూ! నిన్ను వదిలి నేను మాత్రం ఉండగలనా?" అంది విమల తృప్తిగా.

"ఇంకా ఎన్నాళ్ళు యీ దాపరికాలు?"

"ఏం చెయ్యమంటావు నన్ను? నాకు ఒక భర్త వున్నాడు. ఆయన పట్ల నాకు కొంత బాధ్యత వుంది సంఘం దృష్టిలో. ఆ బాధ్యతని తెంచుకుని వద్దామన్నా చట్టం ఒప్పుకోదు. ఎలా రాజేష్! ఏం చెయ్యను?" అడిగింది విమల బాధగా.

"పోనీ విడాకులు తీసుకో? అప్పుడు మనమిద్దరం కలపి ఒకటిగా వుండవచ్చుగా?"

"ఎన్ని సార్లు చెప్పినా నీకు అర్ధం కాదు రాజూ! అలా చెయ్యడానికి నా భర్త ఒప్పుకోడు."

"ఏం?"

"కారణాలు అనేకం వున్నాయి. కుటుంబ పరువు ప్రతిష్ఠలు ఒక కారణం. నా మీద అభిమానం ఒక కారణం. ఇలా చాలా కారణాలున్నాయి. విడాకు లివ్వడానికి ఆయన వొప్పుకోడు. అడగాలంటే నాకు ధైర్యమూ చాలదు."

"ఐతే ఎలా ఇప్పుడు! మీ ఆయన మిలటరీలో వున్నన్నాళ్ళూ కలిపి వుండడం, ఆ తర్వాత విడిపోవడమేనా మనం?" దీనంగా అడిగాడు రాజేష్.

"అమ్మో! అలా అనకు రాజూ! నిన్నొదిలి నేను వుండలేను" ఇసుక తిన్నెమీద పడుకున్న రాజేష్ ఛాతిమీద తల పెట్టి అన్నది విమల.

"నీకేం, నీ భర్త నిన్ను అభిమానిస్తాడు. నాకేగా ఎవరూ లేనిది" నిష్ఠూరంగా అన్నాడు రాజేష్.

విమలనవ్వి, రాజేష్ చెంపలు నిమురుతూ "పిచ్చి రాజూ!

అభిమానమంటే అభిమానం కాదు నా మీద నా భర్తకి వుంది. స్పష్టంగా చెప్పాలంటే నా మీద ఆయనకి వున్నది సానుభూతి'' అన్నది.

'''సానుభూతా! దేనికి?'' ఆశ్చర్యంగా అడిగాడు.

'అదంతా ఒక పెద్ద కథలే. తర్వాత చెపుతాను. ముందు యీ సంగతి ఆలోచించు. ఇంకో విషయం. నా భర్త ఎల్లుండి మెయిల్‌లో వస్తున్నాడు.''

''ఛ! నిజంగానా! మరి యీ విషయం ఇంతవరకూ చెప్పవే? ఏదో ఒకటి త్వరగా ఆలోచించి నిర్ణయించుకోవాలి. లేకపోతే మళ్లా ఎల్లుండి నించి నిన్ను ఇలా కలుసుకోవడానికి వీలుండదు. సెలవు మీద వస్తున్నాడా?'' అడిగాడు రాజేష్.

''అవును. రెండు నెలలు సెలవు. ఆ రెండు నెలలూ నన్ను వదిలి పెట్టడు.''

రాజేష్ రక్తం వడివడిగా ప్రవహించింది. పళ్ళు కొరికాడు. ''ఇడియట్!'' అన్నాడు.

ఇద్దరూ ఐదు నిమిషాల పాటు మౌనంగా వుండిపోయారు. ఆ ప్రదేశాన్ని పూర్తిగా చీకటి ఆక్రమించుకుంది.

''విమలా! మీ ఆయనకి ఏదో ఒక దురలవాటువున్నదని నిరూపించి, దాన్ని నువ్వు భరించలేకపోవడంవలన విడాకులు కావాలని కోర్టులో అడగవచ్చు. అలాటప్పుడు నీకు విడాకులు మంజూరుచేస్తుంది కోర్టు. నీ భర్తకి ఏదైనా దురలవాటువుందా?'' అడిగాడు రాజేష్.

''ఊఁహూఁ. లేదు'' అంది విమల.

''మిలిటరీలో పనిచేస్తున్నాడు. భార్యను, కుటుంబాన్ని వదిలి దూరంగా వుంటున్నాడు. ఏ దురలవాటూ లేకుండా ఎలా వుంటుంది? ఏదో ఒకటివుండే వుంటుంది. బాగా ఆలో

చించు. ఏ త్రాగుడో, జూదమో - ఏదో ఒకటి'' అన్నాడు రాజేష్.

''లాభంలేదు రాజూ! ఆయన నాకు చిన్నప్పటినించీ తెలుసు. ఆయన అటువంటివాడు కాదు. ఆయనని దురల వాట్ల పాలు చేద్దామని మనం ప్రయత్నించినా ప్రయోజనం వుండబోదు.''

రాజేష్ తీవ్రంగా ఆలోచనలోపడ్డాడు.

విమలకి తన భర్త నడవడికమీద నమ్మకమున్నది. తన భర్త మంచివాడని తనకి తెలుసు. మరి తన నెందుకు ప్రేమిస్తోంది!

ప్రేమించడంలేదా! అంతా నాటకమా! తన భర్త లేనప్పుడు తనని ఆమె వుపయోగించుకుంటోందా! విమల నిజంగా అటువంటిదా!

ఛ, ఛ! కాదు. విమల తనని నిజంగా ప్రేమిస్తోంది. కారణం తనకి తెలుసు. విమలచెప్పిన ఆ విషయం తను యింకా మరిచిపోలేదు.

విమల తనని నిజంగానే ప్రేమిస్తోంది. అందులో సందేహంలేదు. కాని విమలని తన దానిగా ఎలా చేసుకోవాలి?

విమలచెప్పే దాని ప్రకారం ఆమె భర్తనించి విడాకులు పొందే అవకాశం ఎలా చూసినా కనపడడం లేదు. మరైతే ఎలా ఆమె భర్తని తమ దారిలోంచి తొలగించాలి? అవును అతడిని శాశ్వతంగా తొలగిస్తే! గుడ్ అయిడియా! అంతే! అంతకన్నా మార్గాంతరంలేదు.

రాజేష్ ఒక నిర్ణయానికి వచ్చాడు.

''విమలా!'' పిలిచాడు రాజేష్.

''ఊఁ'' అన్నది విమల.

''నువ్వు నన్ను నిజంగా ప్రేమిస్తున్నావా?'' సీరియస్‌గా

అడిగాడు.

"నీకు అనుమానమా రాజూ!"

"లేదు. కాని ఒకటి, విమలా! నీకు నేను కావాలో, నీ భర్త కావాలో నిర్ణయించుకో. బాగా ఆలోచించి నిర్ణయించుకో."

"ఆలోచన అనవసరం. నాకు నువ్వే కావాలి" నిశ్చయంగా చెప్పింది విమల.

"థాంక్ యు. అయితే నేను చెప్పినట్లు చెయ్యడానికి నువ్వు ఒప్పుకోవాలి" అన్నాడు రాజేష్ స్థిరంగా.

విమల ఆ ఆనందంలో అది చీకటి అని మర్చిపోయి తలవూపి, తర్వాత "అలాగే!" అన్నది.

రాజేష్‌లో ఆనందం కట్టలు తెంచుకు ప్రవహించింది. విమలని గట్టిగా కావిలించుకుని, రహస్యంగా ఏదో చెప్పాడు.

2

విమల భర్త జయకర్ రెండునెలలు సెలవుమీద వచ్చాడు ఆవేళ మధ్యాహ్నం.

అతను ఈస్టర్న్ టెర్రిటరీస్‌లో ఆర్మీ ఆఫీసరుగా పని చేస్తున్నాడు. స్వయంకృషిమీద ఆ స్థాయికి వచ్చాడు అతను.

గుమ్మంలో అడుగుపెట్టగానే "విమలా!" అని కేక వేశాడు.

విమల పరిగెత్తుకు వచ్చింది. అతన్ని చూడగానే ఆమెకి తెలియని భయమేదో ఆమెని ఆవహించింది. తడబడింది. బలవంతాన లేని నవ్వు తెచ్చిపెట్టుకుని "బావున్నారా! లోపలికి రండి" అన్నది.

ఆమె గుండెని ఎవరో పట్టుకుని నలిపేస్తున్నట్లుంది. ఏదో తెలియని బాధ ఆమెని ఆక్రమించుకుంటోంది. తను

ఏం మాట్లాడుతుందో, ఎలా మాట్లాడుతుందో ఆమెకే అర్థం కావడంలేదు.

జయకర్ లోపలికి వచ్చాడు. చేతిలోవున్న బెడ్డింగ్‌ని, హేండ్‌బాగ్‌ని పక్కన పెట్టాడు.

బాగ్‌లోంచి ఏదో ఒక పాకెట్ తీసి, "విమలా! కళ్లు మూసుకో. నీకో బహుమతి తెచ్చాను" అన్నాడు ఆనందంగా.

విమల కళ్లు మూసుకుంది నవ్వుతూ. అది నవ్వు కాదు, పెదిమల్ని విప్పారించి వుంచింది. అంతే. ఆమె కళ్లు, పెదిమలు వణుకుతున్నాయి.

తన పెదిమలమీద ఏదో వెచ్చగా తగిలేసరికి కళ్లు విప్పింది. జయకర్ పెదాలు తన అధరాలని ముద్దాడుతున్నాయి.

విమలకి అసహ్యం వేసింది. కాని ఏమీ చెయ్యలేక నిస్సహాయంగా వుండిపోయింది అతన్ని చూస్తూ.

జయకర్‌కి ముప్ఫయి ఏళ్లుంటాయి. ఐదడుగుల తొమ్మిదంగుళాల ఎత్తూ, ఎత్తుకితగ్గ లావు, హుందాతనం. అతని మొహమంతా గగ్గులు గగ్గులుగా వున్నది. చిన్నప్పుడు స్ఫోటకం రావడాన అలా ఐంది అతని మొహం. లావుగా, దిబ్బలావున్న ముక్కు అతన్ని మరింత వికారంగా చేస్తోంది. ఒక్కమాటలో చెప్పాలంటే అతను పూర్తిగా అనాకారి, అందవిహీనుడు.

విమలకి ఒక్కసారి తను ఇతన్ని ఎలా వివాహమాడానా అనిపించింది. పెళ్ళి చేసుకునే సమయంలో తను ఇతని అందవికారాన్ని గుర్తించలేకపోయింది. దానికి కారణం వున్నది. ఆ సమయంలో ఆమె హృదయమంతా అతనిపట్ల కృతజ్ఞతాభావంతో నిండివున్నది.

ఆ కృతజ్ఞతలో ఆమెకి అతని అందవిహీనత కనిపించ లేదు. ఆమెకి కనిపించింది అతని హృదయవైశాల్యం మాత్రమే.

విమల మనసు రెండేళ్ళ వెనక్కి పరుగులు తీసింది.

* * *

అప్పుడు విమల వయసు పద్దెనిమిదేళ్లు.

నిండు యవ్వనంలో విరబూసిన లేగులాబిలా ఆమె అందం కాంతులీనుతూవున్న సమయం. ఆమె మనసు ఏదో తెలియని కోర్కెని కోరుతున్న తరుణం అది.

విమలకి తండ్రి వున్నాడు. అతనే విమలని పెంచి పెద్ద చేశాడు. విమల తల్లి విమలకి ఆరేళ్ళ వయసప్పుడే చచ్చి పోయింది. అప్పట్నుంచి ఆమె తండ్రే ఆమెని కంటికి రెప్పలా కాపాడుకుంటూ, గారాబంగా పెంచాడు.

ఆమె తల్లి, తండ్రి కులాంతర వివాహం చేసుకున్నారు. ఆ కారణాన సొంతవూరినించి వెలివేయబడి, వచ్చి రామాపురంలో కాపురం పెట్టారు.

విమల తల్లిదండ్రులిద్దరూ చాలా అన్యోన్యంగా వుండే వాళ్లు. ఒకళ్లనొకళ్లు మనస్ఫూర్తిగా ప్రేమించుకున్నారు.

ఆ కారణంగానే విమలతల్లి చనిపోయినపుడు తన వాళ్ళు వచ్చి తమతో రమ్మన్నా వెళ్ళకుండా, మరో పెళ్ళి చేసుకోకుండా తన భార్యనే తలుచుకుంటూ, విమలని పెంచి పెద్ద చేశాడు వాళ్ళ నాన్న.

పద్దెనిమిదేళ్ళు వచ్చినా ఏ బరువూ బాధ్యతా ఆమె మీద వుండేవి కాదు. వాళ్ళ నాన్నే వెళ్ళి పనిచేసి డబ్బు సంపాయించుకు వచ్చి, ఇంటి దగ్గిర ఇంటిపని కూడా చేసేవాడు.

అందువలన విమలకి తినడం, తిరగడం తప్ప వేరే పని లేదు. ఫోర్తుఫారం వరకూ చదువుకుని మానేసింది.

విమలవాళ్ళ యిల్లు వూరికి చివరగా వుంది. వాళ్ళింటి పక్కనించే కృష్ణా నదిలోకి వెళ్ళేదారి వుంది.

వాళ్ళ ఇంటి పక్కన వున్న యింటిలో అప్పుడు జయకర్, అతని పదేళ్ళ తమ్ముడు వుండేవాళ్ళు. అప్పుడు కూడా జయకర్ ఆర్మీలోనే పని చేస్తుండేవాడు.

అయితే అతను అప్పుడు మిలటరీలో ఆఫీసర్ రాంక్‌లో లేడు. సంవత్సరానికి ఓ రెండు నెలలు వచ్చి, తమ్ముడితో రామాపురంలో వుండి వెళుతుండేవాడు. అతనికి చాలా మంచివాడని పేరుంది వూళ్లో.

విమల అప్పుడప్పుడు అతన్ని చూస్తూండేది. అతన్ని చూస్తే ఆమెకి ఏ అభిప్రాయం కలగలేదు కాని అతనిలో వున్న గంభీరతను చూసి అతను గౌరవించదగినవాడు అనుకునేది.

కాలం వేగంగా గడుస్తోంది. విమలకి ఎన్నో పెళ్లిసంబంధాలు చూశాడు వాళ్ల నాన్న. కాని ప్రయోజనం లేకపోయింది.

కులాంతర వివాహం వలన పుట్టిన పిల్లని చేసుకోవడానికి ఎవరూ ఒప్పుకోలేదు.

విమల తండ్రి వయసు రానురాను పెరుగుతోంది. ముసలితనం పరిగెత్తుకుని వస్తోంది. దానికితోడు విమల పెళ్ళి విషయంలో దిగులు. అసలు పెళ్ళే కాదేమో విమలకి అని భయపడ్డాడు. అది మనోవ్యాధిగా పరిణమించింది. మంచాన పడ్డాడు ఆయన.

ఒకసారి ఏదో పనిమీద జయకర్‌వాళ్ళ ఇంటికి వెళ్ళింది. లోపల జయకర్ వున్నాడు. అతను అప్పటికి సెలవుమీద వచ్చి పదిహేను రోజులవుతోంది. విమల తండ్రి పరిస్థితి తెలుసుకుని ఆమె అడిగిన సాయం చేశాడు.

ఆ తరవాత ప్రతిరోజు విమల వాళ్ళింటికి వెళ్ళి ఆయన యోగక్షేమాలు తెలుసుకుని, కావలసిన సహాయం చేసి వస్తూండేవాడు.

"నీ కెందుకు బాబూ యీ శ్రమ" అన్నాడు ఒకసారి ముసలాయన.

"అలా అనబాకండి, నాకు తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోయారు. ఎలాగూ వాళ్ళ ప్రేమకి నోచుకోలేక పోయాను. మీరు నా తండ్రిలాంటివారు. ఈ పరిస్థితిలో సాయం చెయ్యడంలో శ్రమ ఏముంది" అన్నాడు జయకర్.

ఆ మాటలు పక్క గదిలోంచి విన్న విమల హృదయం పరవశించింది.

అలానే మరో నెల రోజులు గడిచాయి. విమల తండ్రి ఆరోగ్య పరిస్థితిలో మార్పేమీ రాలేదు. ఆయన అనారోగ్యం నించీ కోలుకోలేక పోతున్నాడు.

జయకర్ ప్రతి రోజూ విమల వాళ్ళింటికి వెళ్ళి, ఆమె తండ్రిని పరామర్శించి వస్తున్నాడు. ఊళ్లో గుసగుసలు బయలుదేరాయి. చాలామంది జయకర్, విమల కోసమే వాళ్లింటికి వెళుతున్నాడని బాహాటంగానే అనడం మొదలు పెట్టారు.

ఒకరోజు విమల తండ్రికి ఎవరో ఆ విషయం చెవిన పడేశారు. ఆయన మరీ కృంగిపోయాడు.

జయకర్ రాగానే "బాబూ! నువ్వు ఇక మా ఇంటికి రావద్దు" అని చెప్పాడు.

"ఏమండీ! నేనేమైనా పొరపాటు చేశానా! ఇంకో పది రోజులు ఆగితే నేను డ్యూటీకి వెళ్లిపోతాను. అప్పుడు మీరు రమ్మన్నా నాకు రావడానికి వీలుండదు. ఇంత తొందర పడి మీరీమాట ఎందుకన్నారో నాకర్థం కావడం లేదు." అన్నాడు

జయకర్ గంభీరంగా.

"బాబూ! జయకర్! నేను ఆడపిల్ల తండ్రిని. నాకు నా ప్రాణం కన్నా నా కూతురు ఎక్కువ. బయట వూళ్లో పుకారు నువ్వు వినలేదా?" దీనంగా అడిగాడు.

ఆయన పరిస్థితి చూస్తే జయకర్‌కి నవ్వు వచ్చింది, జాలి వేసింది.

"అదా సంగతి? విన్నాను. రోడ్డు మీద కుక్కలేవో మొరిగాయని మనం వాటికి భయపడతామా! అలా ప్రతి దానికి మనం భయపడుతూంటే బ్రతకడమే కష్టం" అన్నాడు.

"అలాకాదు బాబూ! నీకు చింతలేదు. కాని అది పెళ్ళి కావలసిన ఆడపిల్ల. ఇప్పటికే దాన్ని పెళ్ళిచేసుకోడానికి ఎవరూ ముందుకి రావటంలేదు. ఇంకా యీ అపవాదుకూడా జోడైతే దాని జీవితం నాశనం అయిపోతుంది. దానికి యీ జన్మలో పెళ్ళికాదు" అంటూ ఖంగు ఖంగున దగ్గాడు.

ఆ దగ్గుతోపాటు ఆయన నోట్లోంచి రక్తం వచ్చింది భళ్ళున.

జయకర్ గుండె తరుక్కుపోయింది. గబగబ వూళ్లోకి వెళ్ళి డాక్టర్‌ని తీసుకువచ్చాడు. డాక్టర్ ఆయన్ని పరీక్ష చేసి ఏదో ఒక ఇంజక్షన్ ఇచ్చి. పక్కకి తీసుకెళ్ళి "మిష్టర్ జయకర్! ఆయన ఏదో మానసికంగా చాలా బాధపడు తున్నారు" అన్నాడు.

జయకర్ చెవుల్లో ఆయన అన్నమాటలు గింగురు మన్నాయి.

"మానసిక వ్యాధే కాదు—"

"డాక్టర్!"

"అవును. ఆయనకి యింతవరకూ అంతర్గతంగా వున్న

టి. బి. వుధృతమవుతోంది యిప్పుడే. త్వరగా మెడికల్ కేర్ తీసుకోకపోతే పరిస్థితి విషమిస్తుంది. వెంటనే టౌన్‌కి తీసుకు వెళ్ళి హాస్పిటల్‌లో జాయిన్ చెయ్యండి. వస్తాను'' అని మెడికల్ చెస్టు తీసుకుని బయటికి నడిచాడు డాక్టర్.

జయకర్ విమల తండ్రి దగ్గిరికి వెళ్ళాడు. ఆయన ఏదో గొణుక్కుంటున్నాడు.

ఆయన మంచం పక్కన వున్న కుర్చీలో కూర్చొని, ఆయని చేతిని పట్టుకున్నాడు. ఆయన మెల్లగా కళ్ళు తెరిచి జయకర్‌ని చూశాడు.

''మీ అమ్మాయిపెళ్ళి గురించి మీరు బెంగపెట్టుకున్నారా?'' జాలిగా అడిగాడు జయకర్.

ఆ ప్రశ్నకి విమలతండ్రి మనసు ద్రవించింది. కళ్ళమ్మట నీళ్లు పెట్టుకున్నాడు. అవునన్నట్లు తలవూపాడు ఆయన.

''బాధపడబాకండి. మీ అమ్మాయికి ఏం తక్కువని అంత బాధపడతారు?''

విమలతండ్రి కన్నీరు కారుస్తూ తల అడ్డంగా తిప్పాడు.

''మీ కుమార్తెని ఎవరో అక్కరలేదు. నేను చేసుకుంటాను'' అన్నాడు దృఢ నిశ్చయంతో.

ఆ మాటలు వినగానే ఆ ముసలాయన గుండెల్లో వెయ్యి వీణలు మోగినట్లయింది. ఆయన మొహం జ్యోతిలా వెలిగిపోయింది.

అంతలోనే మొహం తిప్పి ''లేదు బాబూ! దాని సంగతి తెలిస్తే నవ్వా చేసుకోవు'' అన్నాడు నీరసంగా.

''ఏం?'' అడిగాడు జయకర్.

''నేనూ, వాళ్ళ అమ్మా కులాంతరవివాహం చేసుకున్నాము. ప్రతిఫలమే యీ నా విమల. ఇప్పుడు చెప్పు బాబూ! ఎలా చేసుకుంటావు కులంలేని దాన్ని?'' నీరసంలో

కూడా ఆవేశంగా అన్నాడు ఆయన.

విమల యీ సంభాషణ అంతా పక్క గదిలో వుండి, వింటోంది.

జయకర్ విషాదంగా నవ్వాడు.

"ఏమండీ! నా చిన్నప్పుడే నాకు తల్లి తండ్రీ దూర మయ్యారు. నా చిన్న తమ్ముణ్ణి ఎలా పెంచాలో, నేనెలా బ్రతకాలో నాకు సరిగా తెలియని రోజులవి. నా బంధువు లందరి దగ్గిరికీ వెళ్ళి అడిగాను. ఎవరూ ఆశ్రయమివ్వలేదు నాకు. నా సొంత కాళ్ళమీద నిలబడి నేను సంపాదించి నా తమ్ముడిని, నన్ను నేను పోషించుకున్నాను. ఈనాడు యీ స్థితిలో వున్నాను.

అప్పుడు నాకు ఏ సహాయం చెయ్యని కులంతో నాకు పనిలేదు.

నేను ఎవరికీ భయపడను. ఇక మీ గురించైనా నేను పట్టించుకోవడానికి కారణం మీకూ వెనక ఎవరూ లేరని తెలిసి—నా చిన్నప్పటి స్థితి గుర్తుకురావడమే! మీకు నా మీద ఏ దురభిప్రాయమూ లేకపోతే మీ అమ్మాయిని మనస్ఫూర్తిగా వివాహం చేసుకుంటాను. నాకు కులం, మతంతో నిమిత్తం లేదు.'

గదిలోంచి ఆ మాటలు వినగానే విమల మనస్సు జయ కర్‌పట్ల కృతజ్ఞతా భావంతో నిండిపోయింది, ఆమె ఆనం దంతో పరవశించింది.

ఆ ముసలాయన హఠాత్తుగా లేచి కూర్చున్నాడు— సంతోషం పట్టలేక. కాని అంతలోనే నీరసం ముంచుకురాగా పడుకుండిపోయి "విమలా!" పిలిచాడు.

విమల రాగానే "విమలా! అమ్మా! ఇన్నాళ్ళకి నా కలలు ఫలించే రోజు వచ్చింది. అమ్మా! నా బంగారుతల్లీ! ఆయన

నిన్ను పెళ్లిచేసుకుంటానన్నారమ్మా! నీకు పెళ్లి నిశ్చయమైందమ్మా! నా చిట్టి తల్లి నిజంగా అదృష్టవంతురాలు'' అన్నాడు. ఆయన కళ్ళ వెంబడి ఆనందబాష్పాలు రాలుతోన్నాయి.

''నాన్నా!'' అంది విమల. సిగ్గుపడుతూ.

ఆ సాయంకాలం జయకర్‌కి, విమలకి విమలవాళ్ళ ఇంటిలోనే వివాహం జరిగింది.

వివాహానికి ఊళ్లోవాళ్లందరినీ పిల్చాడు జయకర్. కాని చాలామంది రాలేదు కులం లేని పెళ్లి అని. నలుగురైదుగురి సమక్షంలో, పురోహితుడు మంత్రాలు చదువుతుండగా, పెళ్ళి నిరాడంబరంగా జరిగిపోయింది.

విమల, జయకర్ భార్య అయింది.

అదే రోజున జయకర్ తన తమ్ముడిని ఏదో కాన్వెంట్ హాస్టల్లో చేర్పించి వచ్చాడు.

*　　　*　　　*

''విమలా! ఏమిటి పరధ్యానంగా వున్నావు? వొంటిలో బాగాలేదా!'' లాలనగా అడిగాడు జయకర్.

విమల కళ్ళవెంబడి నీళ్ళు వచ్చాయి.

ఛ! నిజంగా ఇతను ఎలాటివాడు! ఇలాటివాణ్ణా తను మోసం చెయ్యాలనుకుంటోంది? బాధగా నిట్టూర్చి కళ్లు తెరిచింది.

ఎదురుగా జయకర్ వున్నాడు. తన కుడిచేతి చూపుడు వేలితో ఆమె కన్నీటిని తుడుస్తూ ''ఛ! పిచ్చిదానా! ఎందుకు ఏడుస్తున్నావు? వచ్చేశాగా!'' అంటున్నాడు బుజ్జగిస్తూ.

అసలు జయకర్‌ను తను ఎందుకు ద్వేషిస్తోంది? కారణం ఏమిటి? ఆలోచించసాగింది.

తమ వివాహం జరిగిన వారం రోజులకే తండ్రి మర

ణించాడు హాస్పిటల్లో. అదే విచారం ఆమెను బాగా క్రుంగ దీసింది. భర్త నెలరోజుల తర్వాత డ్యూటీకి వెళ్ళి పోయాడు.

ఒకరోజు—

పచారు సామానులు తెచ్చుకోవడానికి కిరాణా కొట్టుకి వెళ్లినప్పుడు అక్కడ విమల స్నేహితురాలు కాంతి కని పించింది.

ఇంటికి వచ్చేటప్పుడు దారిలో కాంతి అన్న మాటలకి విమల మనస్సు చెదిరపోయింది.

"ఏమే విమలా! నువ్వేమీ అనుకోవుకదా, నా మనసులో వున్న మాట అంటే? మీ ఆయన నిన్ను నీ అందం చూపి పెళ్లి చేసుకున్నాడేకాని మీ నాన్న కోసంకాదు. లేకపోతే మీ పెళ్లి అవగానే హాస్పిటల్‌లో చేర్పించిన మీ నాన్నగారు ఎలా మరణిస్తారు! సరిగా చూడవద్దని మీ ఆయనే ఆ హాస్పిటల్ వాళ్ళకి చెప్పి వుంటాడు. ఏమంటావే!" అన్నది కాంతి.

విమల ఏమీ మాట్లాడలేదు. అసలే తండ్రి మరణానికి బాధపడుతున్న మనసు ఆమె స్నేహితురాలు చెప్పిన దాన్ని నమ్మింది.

దానితో విమలకి జయకర్ మీద వున్న గౌరవభావం అతనిపట్ల అసహ్యంగానూ, ద్వేషంగానూ మారిపోయింది.

"ఏమైంది విమలా!" మళ్ళీ అడిగాడు జయకర్. విమల ఆలోచనలనుండి తేరుకుంది.

తల తిప్పి "ఏమీలేదు. ఏవో పాత జ్ఞాపకాలు గుర్తుకు వచ్చాయి. అంతే!" అంది.

"సరేలే! చూడు యీ చీరె బావుందా? నీకని ప్రత్యేకంగా తీసుకున్నాను. ఫారిన్ షిఫాన్. ఈ జాకెట్ కూడా నీ కోసమే! జార్జెట్! జాకెట్ ఎలా కుట్టించానని ఆశ్చర్యంగా

వుందికదూ! పోయినసారి నేను వచ్చి వెళ్లినప్పుడు నీ జాకెట్ ఒకటి పోయిందికదూ! సరిగా గుర్తుతెచ్చుకో! అది పోలేదు. నేనే తీసుకువెళ్లాను.''

అని నవ్వి విమల చెవిలో ఏదో రహస్యంగా చెప్పాడు.

''ఛీ!'' అన్నది విమల.

జయకర్ పగలబడి నవ్వాడు.

విమల మళ్ళీ ఆలోచిస్తోంది. ఏమిటి యీ మనిషి ప్రవర్తన! తనంటే నిజంగా అంత ప్రేమా! బాగా ఆలోచించింది. ఎలా చూసినా అతని ప్రేమని అనుమానించడానికి ఆస్కారం కనిపించలేదు.

కాని గాయపడిన ఆమె మనసు అది ప్రేమ అనడానికి అంగీకరించలేదు.

అతనికి తనమీద వున్నది సానుభూతి అని ఒక నిశ్చయానికి వచ్చింది.

విమలకి తన యవ్వనమంతా అడవికాచిన వెన్నెల అవడం ఇష్టం లేదు. జయకర్‌కి తనంటే ఇష్టం, అభిమానం, ప్రేమ వున్నాయని తెలిసినా ఆమె మనసు వాటికి కట్టుబడడానికి అంగీకరించడం లేదు.

తనకి తనని స్వర్గాల్లో తేల్చగల మొగసిరి, అందమైన పురుషుడు- తన అందానికి దీటైన అందగాడు కావాలి.

విమలకి వెంటనే రాజేష్ గుర్తుకి వచ్చాడు.

అవును. రాజేష్ తనకి అన్ని విధాలా తగినవాడు. తనకి అతను కావాలి. అతన్ని వదిలి తను బ్రతకలేదు— బ్రతకదల్చుకోలేదు.

అందుకే తనకి ఇష్టం లేకపోయినా అతను వేసిన పథకానికి తను అంగీకరించింది.

3

సాయంత్రం ఏడుగంటలకల్లా భోజనాలు పూర్తిచేసేశారు విమలా జయకర్‌లు.

పక్కింటి మామ్మగారు వచ్చింది అంతలో.

ఆమెతో గంటన్నర కాలక్షేపం చేశారు యిద్దరూ.

టైము తొమ్మిది కావచ్చింది. ఆ ముసలావిడ నవ్వుకుంటూ వెళ్ళిపోయింది.

విమల ఆవిడ వెనకే వెళ్ళివచ్చింది.

"తలుపులన్నీ వేసివచ్చావా!" అడిగాడు జయకర్.

"ఊఁ" అంది విమల. ఆమె తలుపులు నిజంగా వెయ్యలేదు. దగ్గిరికి వేసి వచ్చింది. రాజేష్ వస్తే లోపలికి రావడానికి వీలుగా.

"టయిం ఎంతయింది?" అడిగింది విమల.

"తొమ్మిది. ఏం?" అన్నాడు జయకర్.

"ఏమీలేదు ఊరికేనే" అన్నదేకాని ఆమె మనసంతా రాజేష్‌మీదే వుంది.

రాజేష్ చీకటి పడ్డాక, వూరు సద్దుమణిగాక, రాత్రి పది దాటాక వస్తానన్నాడు. అతను వచ్చేటప్పటికి తను మంచి నీళ్ళలోకాని, పాలలోకాని, మత్తుమందు కలిపి జయకర్‌కి ఇవ్వాలి.

ఆ తర్వాత రాజేష్ వచ్చి మిగతా పని పూర్తిచేస్తానన్నాడు.

విమలకి మిగతా పని అంటే ఏమిటో అర్థంకాలేదు. కాని రాజేష్‌కోసం ఎదైనాసరే చెయ్యాడానికి నిశ్చయించుకుంది.

"కబుర్లు ఏమైనా చెప్పండి" అంది విమల టయిం గడవాలని.

జయకర్ మిలటరీ కబుర్లు. అక్కడ తన ఫ్రెండ్స్. వాళ్ళ మనస్తత్వాలూ, అనేక విషయాలు చెప్పాడు సిగరెట్. వెలిగించుకుని పది నిమషాలసేపు.

అంతలో బయట ఉరుము వురిమిన శబ్దమయింది. ''వర్షమా!'' అని లేవబోయాడు జయకర్.

విమల ఆదుర్దాగా లేచి, బయటికి వెళ్ళి చూసింది. ఆకాశమంతా నల్లటి మబ్బులతో నిండివున్నది. వాన చిన్నగా పడుతోంది. అప్పుడప్పుడు వురుములు, మెరుపులు. వాతావరణం భీకరంగా వుంది.

విమల లోపలికి వెళ్ళి ''అవును. వానే!'' అన్నది.

జయకర్ లేచాడు కూర్చున్న పీటమీదనించి. విమల అతని కళ్ళకి దేవకన్యలా కనపడింది. దగ్గిరికివెళ్ళి ఆమె భుజంమీద చెయ్యివేశాడు.

విమలకి అర్థమైంది. అతనికి తను కావాలి ఇప్పుడు. ఎలా! ఇంకా టైం ఉందని మత్తుమందు ఇవ్వలేదు. ఇప్పుడు రాజేష్ వస్తే ఎలా!

విమల అతని చేతిని విదిలించలేదు. అలా విదిలిస్తే అతనికి కోర్కె పెరుగుతుంది. పరిస్థితి విషమిస్తుంది. అతని చేతిని మెల్లిగా తీసింది తన వొంటిమీదనించి. ''మంచినీళ్ళు కావాలా!'' అడిగింది.

''అక్కరలేదు.''

''పాలు కావాలా పోనీ!''

''ఊఁహూఁ!''

''ఏం కావాలి మరి?''

''నువ్వే!'' అంటూ జయకర్ ఆమెని కావిలించుకుని పెదిమల్ని ముద్దు పెట్టుకున్నాడు. అంతటితో ఆగలేదు. ఆమె వొంటి వొంపుల్ని, ఎత్తుపల్లాలని తడిమి తడిమి

చూస్తూన్నాడు. ఆవేశంతో ఆమెని నలిపేస్తున్నాడు.

ఇక లాభంలేదని గ్రహించింది విమల. ఎలా! ఇప్పుడు తను ఏం చెయ్యాలి!

జయకర్‌లో ఆవేశం పెరిగిపోయింది. ఆమెని గదిలోకి తీసుకుపోయాడు. ఆమె వంటిమీదున్న బట్టల్ని వొలిచేశాడు. తనూ అలానే తయారయ్యాడు. ఎంతో కాలానికి కనిపించిన ఆమె స్త్రీత్వం అతణ్ణి రెచ్చకొట్టింది. ముందుకి వెళ్ళి ఆమెని కావిలించుకుని, ఆమెతో ఏకమైపోయాడు.

ఆ పరవశంలో బయట తలుపు తెరుచుకున్న శబ్దం వాళ్ళకి వినిపించలేదు.

రాజేష్ తలుపు తెరుచుకుని లోపలికి వచ్చాడు. విమల చెప్పిన గుర్తులను ఆధారం చేసుకుని పడకగది దగ్గిరికి వెళ్ళాడు. తలుపు తోశాడు. తెరుచుకుంది.

లోపల చిన్న కిరసనాయిల్ దీపం వెలుగుతోంది. ఆ దీపపు కాంతిలో విమలతో ఏకమైవున్న జయకర్‌ని చూడగానే ఒక్కసారి అతని నరాలు జివ్వుమన్నాయి. అతని శరీరం వేడెక్కింది. రక్తం వడివడిగా పరుగులు తీసింది. పిచ్చెత్తినట్లయిందతనికి.

విమల నగ్నంగా జయకర్‌తో....!

ఆ ఊహని భరించలేకపోయాడు.

చకచక లోపలికి నడిచాడు. పాంటుజేబులోంచి బటన్ నైఫ్ తీసి, జయకర్‌ని సమీపించి, గట్టిగా లాగాడు. జయకర్ దూరంగా వెళ్ళి పడ్డాడు ఆ తోపుకి.

వెంటనే రాజేష్ అతన్ని సమీపించి నోటిని తన ఎడమ చేత్తో నొక్కిపెట్టి, కుడిచేతిలో వున్న కత్తితో అతని కడుపులో పొడిచాడు.

రక్తం విరజిమ్మింది.

మరో ఐదు నిమషాలు అలానే జయకర్ నోటిని నొక్కి-పట్టి ఉంచి, అతనిలో చలనం ఆగిందని తెలియగానే చేతిని తీసేశాడు రాజేష్.

జయకర్‌లోంచి పెల్లుబికిన రక్తం చూడగానే విమలకి మైకం వదలి ఈ లోకంలోకి వచ్చిపడింది. గబగబ దుస్తులు వేసుకుని "రాజూ!" అన్నది ఆందోళనగా.

జయకర్ శరీరంనించి విరజిమ్మిన రక్తం చూసి రాజేష్ చల్లబడిపోయాడు. అతని గుండె భయంతో వేగంగా కొట్టుకుంది. కళ్ల ముందు ఉరితాడు కనిపించింది.

"రాజూ! ఎంతపని చేశావు?" విమల కంఠంలో భయం, బాధా గోచరించాయి.

"ఉష్! బిగ్గరగా మాట్లాడకు. ఎవరైనా వింటే ప్రమాదం" అన్నాడు రాజేష్.

"రాజూ! ఐతే యీయన్ని హత్య చెయ్యడానికి ముందే పథకం వేసుకున్నావా?" విమల ఆశ్చర్యంగా అడిగింది.

"అవును."

"మరి నాకు ముందే చెప్పలేదే!"

"చెప్పేదేముంది! జయకర్‌కి మత్తు మందివ్వమని నీకు చెప్పానా ముందే. నువ్వు మత్తుమందు ఇచ్చాక నేను వచ్చి ఇతన్ని తీసుకువెళ్ళి క్రిష్ణ ఒడ్డునవున్న పాడుబడిన బావిలో పడేద్దామనుకున్నాను, కాలికి ఏదైనా ఒక బరువైన రాయి కట్టి. కాని అనుకోకుండా ఇలా ఐపోయింది."

విమల గుండె బండరాయిలా మారింది. ఏమీ మాట్లాడలేకపోయింది.

కృష్ణాఒడ్డున రాజేష్ తనకి అతను కావాలో, జయకర్ కావాలో నిశ్చయించుకోమని అన్న మాటలకి అర్థం యిప్పుడు కాని తెలియలేదు.

ఇప్పుడు ఏమనుకుని ఏం లాభం! అతని భావం తనకి ముందే తెలుస్తే అతని ప్రయత్నాన్ని ఆపేదికాని అతనిమీద ప్రేమవల్ల తనకి అతను హత్య చెయ్యబోతాడని అనుమానమైనా రాలేదు.

ఇప్పుడు ఏదో ఒకటి చెయ్యాలి. జయకర్ శవాన్ని పారేయ్యాలి.

విమల లేచి, మంచంమీదినించి ఒక దుప్పటి తీసి ఇచ్చింది రాజేష్‌కి, అతను చెప్పిన ప్రకారం.

అతను శవాన్ని ఆ దుప్పటిలో చుట్టాడు. విమలని ఒక వైపు పట్టుకోమన్నాడు.

"లేదు. నేను పట్టుకోలేను. నాకు వణుకుగా వుంది" అంది విమల.

రాజేష్ మాట్లాడకుండా తనే ఆ శవాన్ని ఎత్తి భుజాన వేసుకున్నాడు. మెల్లిగా బైటికివచ్చి తలుపు తెరిచి చూసి, ఎవరూ లేరని నిశ్చయించుకుని బైటికి నడిచాడు.

విమల తలుపుబైట గొళ్లెంపెట్టి అతన్ని అనుసరించింది.

బైట వాతావరణం భీభత్సంగా వున్నది. కారు చీకటి. ఆకాశంలో నల్లటి మబ్బులు. జోరుగా వాన. చినుకులు ఆకులమీద పడి విపరీతంగా మోత. గాలి విపరీతంగా వీస్తోంది.

బయట క్రిష్ణానదిలోకి పోయే డొంకరోడ్డుమీద మనిషి మాత్రుడు లేడు. రోడ్డంతా వానకి తడిసి బురద బురదగా ఉన్నది.

"విమలా! జాగ్రత్త! కాలు జారుతోంది" అన్నాడు రాజేష్ చాలా నెమ్మదిగా.

ఇద్దరూ రెండు ఫర్లాంగులు ఆ బురదలో జాగ్రత్తగా నడిచి ఒకచోటికి వచ్చారు.

అక్కడ రోడ్డుకి పక్కన ఒక పెద్ద మర్రిచెట్టు ఉంది. అక్కడ పాడుపడిన పనికిరాని దిబ్బ. ఆ దిబ్బమీద అనేక తాటిచెట్లు, పొదలూ వున్నాయి.

రాజేష్ ఆ దిబ్బమీదకి దారితీశాడు.

ఆ భయంకర వాతావరణంలో ఆ ప్రదేశం దెయ్యాల నిలయంలా ఉంది.

''రాజూ! నాకు భయంగా వుంది'' అంది విమల.

''నేను ఉన్నానుగా! ఫరవాలేదు. నాతో రా!'' అన్నాడు రాజేష్.

ఇద్దరూ లోపలికి ఒక పది గజాలు నడిచారు. ఎక్కడో మేఘాలు గర్జించాయి. అంతలో ఉన్నట్టుండి మెరుపు మెరిసింది. ఆ ప్రదేశమంతా పట్టపగలులా తయారైంది కొన్ని సెకండ్లపాటు.

ఇద్దరూ ఆ వెలుగుని భరించలేక కళ్లు మూసుకున్నారు. ఒక్క క్షణంపాటు తమని ఎవరైనా చూస్తారేమోననే భయంకూడా వేసింది ఇద్దరికీ.

ఇంకొంచెం దూరం వెళ్ళి ఒక పాడుబడిన బావిపక్కన ఆగారు ఇద్దరూ.

రాజేష్ శవాన్ని కిందకి దించి, అగ్గిపుల్ల వెలిగించి, చుట్టూ చూశాడు.

ఒక బరువైన రాయి తీసుకువచ్చి, దానికి జేబులోంచి తీసిన ప్లాస్టిక్ వైర్‌ని జాగ్రత్తగా కట్టి, బలంగా బిగుసుకుపోయిందని నిశ్చయించుకున్నాక ఆ ప్లాస్టిక్ వైర్‌ని జయకర్ నడుముకి బిగించికట్టి, శవాన్ని బావిలోకి తోసివేశాడు. పెద్ద శబ్దమైంది బావిలో.

''విమలా! చాలు. ఇక మన బెడద తీరిపోయినట్లే. జయకర్ శవం యీ బావిలో ఉందని మనుష్యమాత్రుడు

తెలుసుకోలేదు. ఇంకో వారంరోజులు పోయాక ఒకవేళ శవంనించి వాసన వచ్చినా గమనించడానికి ఇటు యెవరూ రారు. ఒకవేళ వచ్చినా యీ పాడుబడిన బావిలోని వాసన గురించి పట్టించుకోరు. భయంలేదు" అన్నాడు నిబ్బరంగా రాజేష్ శవంమీద చుట్టిన దుప్పటిని మడిచి పట్టుకుంటూ.

"ఒకవేళ శవం తేలితే ఎలా! మన బండారం బయట పడదూ!" అడిగింది విమల ఆదుర్దాగా.

"నీకా భయంలేదు. శవానికి బలమైన రాయిని కట్టాను కనుక ఇక పైకి తేలదు. తాళ్ళతో శవాన్ని ఆ రాయికి కడితే కొన్నాళ్ళకి ఆ తాళ్లు చీకిపోయి శవంపై వున్న కట్లుతెగి పైకి రావచ్చని ముందే జాగ్రత్తపడి, ప్లాస్టిక్ వైర్తో కట్టివేశాను" అన్నాడు రాజేష్ హుషారుగా.

4

ఇంటికి రాగానే ఇంటిని కూడా శుభ్రం చేశారు ఇద్దరూ కలిసి. ఆ రాత్రి ఇద్దరూ కలిసి హాయిగా గడిపారు.

తను తనవూరు వెళుతున్నానని, తన వాళ్ళకి విమల గురించి చెప్పి, ఆమెని వివాహం చేసుకోవడానికి అనుమతి తీసుకు వస్తానని, ఒకవేళ వాళ్లుఒప్పుకోక పోయినా తమ పెళ్ళి ఖాయమని, తప్పకుండా పది రోజులలో వస్తానని చెప్పి, రాజేష్ తెల్లవారు ఝామున వెళ్ళిపోయాడు.

మర్నాడు మధ్యాహ్నం జయకర్ స్నేహితుడెవరోవచ్చాడు. జయకర్ ఏదో వూరు వెళ్ళాడని చెప్పింది అతనికి. అతను వెళ్లిపోయాడు.

అతను ఇప్పుడు నమ్మాడు. కాని ముందు? ఎలా! తను ఇతనినే కాదు. అందర్నీ నమ్మించాలి. నమ్మించ గలదా! ఆ రోజంతా ఆ ఆలోచనలతోనే ఆమె మనస్సు విపరీతమైన

వ్యథ చెందింది.

ఇంకో రెండు రోజులు పోయాయి. రాజేష్ వూళ్లో లేడు. ఆమెకి ఆత్మ క్షోభ రాను రాను ఎక్కువవుతోంది.

రాత్రి సరిగా నిద్ర పట్టదు. మగత నిద్రలో ఏవో పిచ్చి కలలు. మేలుకొని వుంటే ఏవేవో అర్ధం లేని ఆలోచనలు. ఆమె భరించలేక పోతోంది.

"పోస్టు!" కేక వినపడే టప్పటికి వులిక్కిపడి లేచింది. బయటికి వెళ్ళి వుత్తరం తీసుకుంది. అది తనకే. రాజేష్ రాశాడేమో! ఆమె మనసు కొంచెం శాంతించింది.

లోపలికి వెళ్ళి తన పడక గదిలో పడుకుని, కవరు చింపి, లోపలి కాగితం తీసి చదివింది.

అంతే. ఆమె గుండె కొట్టుకోవడం ఆగిపోయింది. రక్తం ప్రవహించడం మానేసింది. చెప్పలేని షాక్ తగిలింది ఆమెకి.

చేతులలో మొహం పెట్టుకుని ఆ బాధని భరించలేక ఏడ్వడం మొదలు పెట్టింది.

ఏడ్చి ఏడ్చి గుండెలు బరువు తీరాక మరోసారి చదివింది ఆ వుత్తరాన్ని.

"విమలా!

నువ్వు మొన్న రాత్రి నీ ప్రియుడితో కలిసి ఏం చేశావో నాకు తెలుసు. నా దగ్గిర ఆధారాలున్నాయి. అవి చూపించి నిన్ను, నీ ప్రియుణ్ణి వురికంబానికి ఎక్కించ గలను. కాని నాకు కావలసింది అది కాదు. ఇంకొకటి. క్షేమంగా వుండాలనుకుంటే, వురికంబం ఎక్కకుండా వుండాలంటే, ఇవేళ రాత్రి పదకొండు గంటలకి హోటల్ బ్లూస్టార్‌లో, 405 వ నెంబర్ రూంలో నన్ను కలుసుకో.

—నీ శ్రేయోభిలాషి."

విమలకి ఏం చెయ్యాలో పాలు పోలేదు. అసలు ఆ వేళ రాత్రి తనకి తెలియకుండానే తను, తన భర్త హత్యలో పాత్ర వహించింది.

తను ఇప్పుడు ఏం చెయ్యాలి! రాజేష్ వున్నా బావుండేది. కాని వాళ్ళ వూరు వెళ్ళాడు. ఇప్పుడు ఎలా!

అసలు యీ వుత్తరం ఎవరు రాసి వుంటారు!

తనూ, రాజేష్ జాగ్రత్తగా పరిశీలించుకుంటూనే వెళ్ళారు బావి దగ్గిరికి. ఎవరూ కనిపించలేదు తమకి. మరి ఎవరు రాసి వుంటారు!

ఆమె అనుమానం చటుక్కున రాజేష్ మీదకి పోయింది.

రాజేష్ రాసాడా! దేని కోసం! తన అందం, యవ్వనం కోసం మాత్రం కాదు. అతన్ని పెళ్ళి చేసుకోవడానికి తను అంగీకరించింది. ఇంకా తనతో అతనికి అనుభవమూ వుంది. కనుక దాని కోసం కాదు. మరి దేని కోసం!

తన భర్తకి మిలిటరీలో సర్వీస్ చేసినందుకు అయిదెకరాల పొలం వస్తుందని, దాన్ని తనపేర ఇప్పించవలసిందిగా తన భర్త పై అధికారులకి రాసాడని తను రాజేష్‌కి చెప్పింది. ఆ పొలం కోసమా! అందుకే వూరు వెళ్ళినట్లు నాటకమాడి ఇలా వుత్తరం రాసాడా!

విమలకి తను చిక్కుకున్న విషవలయంలోనుంచి తప్పించుకోవడం అసాధ్యమనిపించింది.

ఇక ఆలోచించలేక పోయింది.ఏమైతే అయింది వెళ్ళి ఆ బ్లాక్ మెయిలర్ని కలుసుకోవాలని నిశ్చయించుకుంది.

5

రాత్రి పదకొండుగంటలైంది. కీచురాళ్లురొదచేస్తున్నాయి. ఆకాశం నిర్మలంగా వుంది. నక్షత్రాలు మెరుస్తున్నాయి.

అమావాస్య కావడాన వాటికాంతే కాంతి.

విమల నెమ్మదిగా తలుపు దగ్గిరికి వేసి, బయటికి నడిచింది తనని ఎవరైనా చూస్తారేమో నని గమనించుకుంటూ. ఆ నిశీధిలో వేగంగా నడుచుకుంటూ ఒక అరగంటలో హోటల్ బ్లూస్టార్ చేరింది.

విమల 405 నెంబరు రూమ్ తలుపు తట్టింది. వెంటనే తెరుచుకుంది తలుపు. లోపలికి వెళ్ళింది.

"గుడ్ మార్నింగ్!" అన్నాడు తలుపు తీసిన భారీ మనిషి.

విమల మాట్లాడ లేదు. అతన్ని పరిశీలనగా చూసింది.

ఆరడుగుల ఎత్తు, లావుగా, భారీగా వున్నాడు. నీగ్రోల లాగా రింగులు తిరిగిన జుత్తు. భయంకరమైన మొహం. అతని మొహం మీద చర్మం సహజంగా లేదు. అంటించిన తోలులా వుంది. మొహంలో ఏదో కాంతి వుంది. మొహమంతా జిడ్డుగా వుంది.

అతను నల్లటి ఫుల్ సూట్‌లో వున్నాడు. చేతికి గ్లవుస్. మెడకి చుట్టూ బనీను కాలర్, కాళ్ళకి షూస్.

అతను నవ్వాడు. ఆ నవ్వులో ఏదో క్రూరత్వం వుంది. విమల లోపలికి రాగానే తలుపు లోపల గడియ వేశాడు.

విమలని లోపలకు తీసుకు వెళ్లి అక్కడున్న సోఫాలో కూర్చోమని, తనూ కూర్చున్నాడు.

"నీకేం కావాలి?" అడిగింది విమల.

"చెపుతాను." అన్నాడు నవ్వుతూ విమలని మింగేసేలా చూస్తూ.

విమలకి అతణ్ణి చూస్తే రాక్షసుడు గుర్తొచ్చాడు. "అసలు నీకు ఎలా తెలిసింది?" అడిగింది.

అతను జేబులోంచి ఒక ఫోటో తీశాడు.

ఆ ఫోటోలో జయకర్ శవాన్ని మోస్తున్న రాజేష్. అతని పక్కన తనూ వున్నారు.

"ఏమిటి ఎలా తెలిసింది! మీరు శవాన్ని తీసుకుని అక్కడికి వస్తారనా! చెపుతాను. ముందు యీ విషయం గుర్తుంచుకో! నేనడిగింది నాకివ్వక పోతే యీ ఫోటో పోలీసుల చేతికి వెళుతుంది. నువ్వూ, నీ ప్రియుడూ కటకటాల వెనక్కి పోతారు. తర్వాత మరణశిక్ష పడినా పడొచ్చు మీకు. ఏమంటావు?" అడిగాడు ఆ ఫోటో చూపిస్తూ.

"చెప్పు" అడిగింది విమల.

"గుడ్ గరల్! ఐతే ఒప్పుకున్నా వన్నమాట!సరే విను. నా పేరు నా వూరు నీ కనవసరం. నే నెవరినైనా నువ్వూ నీ ప్రియుడూ, మీ వూళ్ళో చాలామందీ నాకు తెలుసు. మీ వూళ్లో కాంతి అనే అమ్మాయి వుంది తెలుసా! నీకు స్నేహితురాలు కూడా అనుకుంటాను. ఆమె మీ వూళ్లో వున్న అందగాడు ఆనంద్ని వలచి, ఒకరోజు అతన్ని క్రిష్ణ లోకి తీసుకెళ్లి వలపించు కుంది. అది నాకు తెలిసింది. ఫోటోలు తీశాను.

ఒక్కసారి ఆమెను అనుభవించనిస్తే ఆమె దారికి అడ్డు తగలనని, ఆ రాత్రి పాడుబడ్డ బావి దగ్గరకి రమ్మనీ చెప్పాను. వస్తానంది.

తర్వాత ఆలోచించాను. ఆమె అందగత్తె. అప్పుడప్పుడూ నాకు అందగత్తెల అవసరం వుంటుంది. అందుకని ఆమెని గుప్పిటలోంచి వదల దలుచుకో లేదు. అందుకే ఆమెని వివస్త్రని చెయ్యగానే, ఆమె నగ్న సౌందర్యాన్ని ఫొటో తీసి ఆమెని అవసరం వచ్చినప్పుడు వుపయోగించు కుందామని ఫ్లాష్ కెమెరాని కూడా తెచ్చాను.

ఆ వేళ వర్షం విపరీతంగా వుంది కదూ! బహుశా అందు కని కాంతి రాలేదు. ఆమె కోసం ఎదురు చూస్తున్న నాకు నువ్వు, రాజేష్, రాజేష్ భుజం మీద శవం కనిపించాయి. వెంటనే ఫ్లాష్‌ని క్లిక్ మనిపించాను. అది జరిగింది'' అన్నాడు అతను.

విమలకి అప్పుడు స్ఫురించింది- తాము బావిదగ్గిర వున్నప్పుడు మెరిసిన మెరుపు తమ వెనకనించి మెరిసిందన్న విషయం.

విమలకి అతన్ని గురించి ఆలోచించేసరికి భయంవేసింది.

అతను కాంతి విషయం తనకి స్పష్టంగా, సూటిగా చెప్పాడంటే కారణం అర్థమయింది.

అతనికి అందమైన ఆడవాళ్ళుకావాలి. తను అందగత్తె. కాంతికన్నా అనేకరెట్లు అందగత్తే తను. అంటే తను కావాలా అతనికి?

గడ్డిపోచలా వణికింది ఆ ఆలోచనరాగానే విమల.

''అర్థమయిందాయిప్పుడు మీవిషయం నాకెలా తెలిసిందో? ఇకపోతే నాకేం కావాలని అడిగావుకదూ! చెపుతాను. నాకు నీ అందం, యవ్వనం కావాలి. నాతనివితీరా నిన్ను అనుభ వించాలి నేను. చెప్పు తీరుస్తావా లేకపోతే కటకటాల వెనక్కి పోతావా!'' భయంకరంగా అడిగాడు లేచి ఆమెని సమీపిస్తూ.

''బాబూ! నీ కాళ్ళుపట్టుకుంటాను. నన్ను వదిలిపెట్టు. నన్నేం చెయ్యకు'' అంది విమల బెదురుతూ.

''అదేంకుదరదు'' అని మీదికిదూకి, ఒడిసి పట్టుకున్నాడు.

విమల బల్లినోట్లో చిక్కుకున్న మిడతలాగ గిలగిల లాడింది, గింజుకుంది. లాభంలేకపోయింది. అతని కబంధ

హస్తాలనించి తనని తను రక్షించుకోలేక పోయింది. విమల తనంతటతను నిర్మించుకున్న విషవలయంలో పూర్తిగా కూరుకుపోయింది.

అతను ఆమెని పిట్టలా పట్టుకుని, వొంటిమీద బట్టలన్నీ తీసేశాడు పూర్తిగా. నగ్నంగా తయారయిన ఆమెనిచూసి వెర్రివాడయ్యాడు. ఆమెని తనగ్లవుస్‌వున్న చేతులతో తడిమి తడిమి చూశాడు.

విమలకి పిచ్చెత్తుతోంది. అతని స్పర్శ ఆమెలో అసహ్యాన్ని, జుగుప్సని కలిగిస్తోంది.

అతను కోటు, షర్ట్ తీసేశాడు. అప్పుడు విమల చూసింది. అతని ఛాతీమీద, వీపుమీద కూడా చర్మం అతికించినట్లే వుంది. పాంటు తీసేశాడు. కాళ్ళూ అలానే వున్నాయి. బూట్సులు తీసేశాడు. అతని కాలివేళ్ళు సరిగ్గాలేవు. చాలా భాగం అవి తినివేయబడి వున్నాయి.

అప్పుడు అర్థమయింది విమలకి అతని వొంటిచర్మం చాలాచోట్ల అతికించినట్లుండి, సూనెలాంటి పదార్థంతో మెరుస్తుండడానికి కారణం ఏమిటో.

అతనికి కుష్టు!

అతన్నిచూసి కెవ్వున అరవబోయింది. అది గమనించి తననోటితో అతను ఆమెనోటిని అదిమేశాడు. చేతికిగ్లవుస్ తీసి. తన వ్యాధిపూరిత వేళ్ళతో ఆమెని నలిపెయ్యడం మొదలుపెట్టాడు.

ఆమెకి వొంటిమీద పాములూ, తేళ్ళూ పాకుతున్నట్లనిపించింది. భయంతో వొళ్ళు జలదరిస్తోంది.

అతను ఆమెని పూర్తిగా ఆక్రమించుకున్నాడు.

విమలకి స్పృహ పోయింది. అయినా అతనామెని వదలలేదు.

అలానే వరసగా నాలుగురోజులు పగలూ, రాత్రీఅనక ఆమెని యిష్టంవచ్చినట్లు అనుభవించాడు ఆ కుష్టురోగి.

నాలుగురోజులు గడిచాక అయిదోరోజున ఫొటోలు తీసిస్తూ "ఇంకనువ్వు మీయింటికివెళ్ళు" అన్నాడు ఆ దుర్మార్గుడు తన కోర్కెలని పూర్తిగా తీర్చుకుని.

విమల పూర్తిగా జీవచ్ఛవంలా తయారయింది. ఆమెకి జీవితంమీద రోతపుట్టింది. బతుకుమీద అసహ్యం వేసింది. తనజన్మ నిరర్థకమైందనే కృతనిశ్చయానికి వచ్చింది.

అక్కణ్నించి విమల తిన్నగా ఆ పాడుపడిన బావిదగ్గిరకి వెళ్ళింది.

ఒక్కసారి తన జీవితాన్ని పరిశీలించుకుంది. తను ఏం కావాలని కోరుకుంది!

ప్రేమప్రదమైన జీవితం.వనితగా తనకోర్కెలు తీర్చగల భర్త! అంతే. చాలా సహజమైనకోర్కెలు. తనని తనభర్త జయకర్ ప్రేమించలేదా! ఆ నిశ్చలమైన సమయంలో ఆమె మనసు అతని నిజమైన ప్రేమని అంగీకరించింది.

తను అసలు రాజేష్‌ని ఎందుకు వెతుక్కుంది? అతని పిచ్చిలో ఎందుకు పడింది? కాంతిమాటలు దానికి కారణం. కాంతేకనుక తనకి పురికొల్పకపోతే, తన భర్తనేనమ్మి తను స్వర్గసౌఖ్యాలూ అనుభవించేది. ఈ విపరీత పరిస్థితులూ ఏర్పడేవికావు.

వెంటనే విమలకి తనభర్త తనతండ్రితో తనమీద లోకులు అపవాదువేసినప్పుడు అన్నమాటలు చెవుల్లో గింగురుమన్నాయి.

"రోడ్డుమీద కుక్కలు మొరుగుతాయి. వాటిగురించి పట్టించుకుంటే ఎలా!"

ఆమె గుండె పగిలిపోయింది. ఆనాడే తనభర్త చెప్పిన మాటల్ని తను మరిచిపోయిందా!

తనభర్త అనాకారి అని, అందగాడుకాడని తెలిపి తను రాజేష్‌ని వెతుక్కుంది. కాని తనభర్తకి ముందు తను అందగత్తె అనితెలిసినా ఎవరూ తనకి కులంలేదని పెళ్ళిచేసుకోవడానికి నిరాకరించారు. రాజేష్‌కి మాత్రం ఆసంగతి తెలిస్తే తనని చేసుకునేవాడా? కాదు. ముమ్మాటికీకాదు.

ఇప్పుడే తెలుస్తోంది ఆమెకి జయకర్ ఎటువంటివాడో! తనభర్త దేవుడు. తను దేవుణ్ణే హత్యచేసిన పాతకి. తనకి నిష్కృతిలేదు.

అందగాడికోసం ఆశపడినదానికి ప్రతిఫలంగా తన యౌవనాన్ని ఒక పరమనికృష్టమైన రోగికే అర్పించుకోవలసి వచ్చింది. ఆ వూహరాగానే ఆమెకి తన శరీరంమీద విపరీతమైన అసహ్యం వేసింది.

విమల ఆ పాడుబడిన బావిలోకే దూకింది జరిగిన సంఘటనలను భరించలేక. ★

వెనుక బెంచీలో కూర్చుని అల్లరి చేస్తున్న విద్యార్థిని చూచి మేస్టారు—

"రంగా! నేనడిగిన ప్రశ్నకు వెంటనే ఠక్‌మని జవాబు చెప్పాలి తెలిసిందా?"

"సరే... సార్!"

"మన ప్రధానమంత్రి ఎవరు?"

"ఠక్" వెంటనే జవాబిచ్చాడు విద్యార్థి.

—కొండపల్లి వెంకటేశ్వరరావు, హైదరాబాద్.

పోటీ నెం. 43

1

ఈ క్రింద కొన్ని ఇంగ్లీషు అక్షరాలు ఒక క్రమ పద్ధతిలో ఇవ్వబడ్డాయి. క్వశ్చన్ (?) మార్కు ఇవ్వబడిన స్థానంలో ఒక అక్షరము మాయమైంది. మీరు ఆ అక్షరాన్ని కనుక్కోగలరేమో ప్రయత్నించండి?

A C F J ? U.

—ఆలపాటి రమేష్, రాజమండ్రి.

2

మంచులోను, సున్నంలోను, నోటి పళ్ళలోను, పాల లోను, ముగ్గులోను, మల్లెపువ్వులోను, వెన్నెలలోను, వెన్నలోను, ఉల్లిపాయలోనూ నేనుంటాను.

నేనెవర్నో చెప్పగలరా?

—కురుమద్దాలి విజయలక్ష్మి, విజయవాడ.

3

1 2 3 4 5 6 5 4 3 2 1.

పై సంఖ్య ఎటునుండి చూచినా ఒకటే కదూ! ఒక సంఖ్యను తీసుకొని, అదే సంఖ్యతో దానిని గుణించగా జవాబు ఇది. విచిత్ర మేమిటంటే ఆ సంఖ్య కూడా ఎటు

నుండి చదివినా ఒక్కలాగే వుంటుంది.

మరి, ఆ సంఖ్య ఏమిటో కనుక్కోండి చూద్దాం?

—కాళ్ళ అప్పారావు, యలమంచిలి.

4

ఓ కవిగారి కలం నుండి ఒక పద్యం వెలువడింది. ఆ పద్యంలోని ప్రతిపాదం ఎటునుండి చదివినా ఒకే తీరున వుంటుంది. అయితే ఓ రోజున ఆ పద్యంలోని అక్షరాలన్నీ తిరగబడి, యీ క్రింది విధంగా కలగాపులగమై పోయాయి.

క. శధీయ నీరయరదీశ
రవి భాతత మమనుమ మానుమమాభావిర;
సన వర సాసార వనస
దసమ తామ సదరదా తారర తారదా।

మీరు యీ పద్యాన్ని కవిగారికి సరిచేసి ఇవ్వగలరా?

—షేక్ గౌస్‌బాషా, కావలి.

* * *

[పై నాలుగు సమస్యలకు మీ జవాబులను ఒక పోస్టు కార్డు మీదగానీ లేదా, పోస్టుకార్డు సైజు తెల్ల కాగితంపైగానీ వ్రాసి, యీనెల 15వ తేదీలోగా మాకు చేరేటట్లు పంపండి. కరెక్టుగా వ్రాసినవారి పేర్లు అక్టోబర్' 74 నెల "సప్లిమెంట్" లో ప్రచురిస్తూ, లాటరీ వేసి వారిలో ముగ్గురు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 10/-లు చొప్పున రు. 30/-లు నగదు బహుమతి పంపగలము. హోమ్‌డెలివరీ సభ్యులు మాత్రమే పాల్గొనవలెను. సభ్యత్వము లేనివారి జవాబులు పరిశీలించ బడవు. తుదినిర్ణయం సంపాదకులదే. —ఎడిటర్.]

పోటీ నెం. 41 [జవాబులు]

(1) వజ్రాలు పిస్తోలులో దాయబడినవి.

(2) కబీర్‌దాస్.

(3) మొదటి ఇంటిలో ప్రవేశించిన ఎలుకలు 515.

(4) 79365.

పై నాలుగు జవాబులు కరెక్టుగా వ్రాసిన వారి పేర్లు ఇవి:

1. కుమారి ఈజర్ల శైలజ, పామిడి. 2. బి. సరాశ్రీ, రుద్రంపూర్. 3. గూడూరు లక్ష్మీనరసయ్య, కోవెలకుంట్ల. 4. బి. పేరిందేవి, ప్రొద్దుటూరు. 5. బి. రమాభుజంగరావు, శెట్టిపాలెం. 6. ఎమ్. క్రిష్ణమూర్తి, పూనా. 7. ఎస్. రాజు, రుద్రంపూర్. 8. ఎమ్. రవీంద్రబాబు, పుత్తూరు. 9. మూర్తి, రెడ్డి, గుప్త, హైద్రాబాదు. 10. పి. రత్నకుమారి, అకివీడు.

11. మిట్టపెల్లి నిరంజన్, సికింద్రాబాదు. 12. రెడ్ రోజా, వసంతవాడ. 13. జి. సుభద్రాదేవి, వెంకటాచల సత్రం. 14. ఎన్. ఎస్. రంగాచారి, హన్మకొండ. 15. టి. రామమూర్తి, చిత్తూరు. 16. టి. ఎస్. లక్ష్మిశోభ, చిత్తూరు. 17. వి. క్రిష్ణప్రియ, గుడివాడ. 18. సి. ఆర్. రామచంద్రరావు, అమడగురు. 19. జల్దుబాబ్జీ, పార్వతీపురం. 20. ఏ. త్యాగరాజు, నర్సాపూర్.

21. కె. కళ్యాణి, హిమాయత్ నగర్. 22. కొండ్రేగుల సదానంద్, వల్లంపూడి. 23. ఎస్. కృష్ణమూర్తి, కామారెడ్డి. 24. సిద్దుల కృష్ణ, వారాసిగూడ. 25. రామకృష్ణారావు, తణుగుల, 26. కొమ్మారెడ్డి రోజలీన, మఠంపల్లి. 27. ఇ. విశాల, పామిడి. 28. సి. పురుషోత్తం, తిరుపతి, 29. బి. జగ్గారావు. ఎస్. కోట, 30. ఎస్. సత్యనారాయణ, సదాశివ నగర్.

31. జి. నారాయణరావు, ఏకాంబర కుప్పం. 32. డి. గాంధీ, విశాఖపట్నం, 33. వై. బాబు, వై. చిన్నారి, మద్రాసు- తదితరులు. ★

హోమ్ డెలివరి

"హోమ్ డెలివరీ" మీ కోసం, మీ సౌకర్యం కోసం ఏర్పాటు చేయబడ్డది. పాఠకులకు కలుగుతున్న అనేక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని, ఎందరెందరో చేసిన సూచనలను క్రోడీకరించి, యీ స్కీమ్‌ను తయారు చేశాము. ఇటువంటి స్కీమ్ ప్రకటించటము పత్రికా ప్రపంచంలోనే మొట్టమొదటిది అవుతుంది. పూర్తి వివరాలు క్రింద యిస్తున్నాము. మీ సభ్యత్వం నేడే పంపండి.

హోమ్ డెలివరీ వల్ల మీకు లాభాలు?

1. హోమ్ డెలివరీ సభ్యులకు పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి తగ్గింపు ధరలో రు. 5/-లకే లభిస్తాయి.

2. కాపీలు మీకు నెలనెలా ఖచ్చితంగా. సకాలంలో లభిస్తాయి.

3. డబ్బు ఏ నెలకానెల మీ ఇంటి వద్దనే చెల్లించి, కాపీలు కొనుక్కోవచ్చును. పత్రికలను మీ ఇంటికి పంపడానికి అయ్యే ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

4. పత్రికల కోసం మీరు రోజూ బజార్లు తిరగక్కర లేదు. పత్రికలే విడుదలైన వెంటనే నేరుగా మీ ఇంటికి వస్తాయి.

5. మేము నిర్వహించే అన్ని పోటీలలో, మీరు

పాల్గొని బహుమతులు పొందే అవకాశం లభిస్తుంది. ఏడాదికి సుమారు 300 మంది విజేతలకు రు. 5000/-లకు పైగా నగదు బహుమతులు పంచుతున్నాము.

6. భారతదేశంలో మీరు ఎక్కడ వున్నా, ఏ మారు మూల వున్నా, పత్రికలు ఖచ్చితంగా వచ్చి మీకు చేరతాయి.

7. పత్రికలు మీకు అతిత్వరగా చేరుతాయి.

హోమ్ డెలివరీ నిబంధనలు

1. మీరు రు. 3/-లు మనియార్డరు ద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంపి "హోమ్ డెలివరీ" సభ్యత్వము తీసుకోవాలి. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము కార్డు అందజేయబడుతుంది.

2. సభ్యులకు ప్రతి నెలా పత్రిక, సప్లిమెంట్ రెండూ కలిపి రు. 5/-లకే వి. పి. ద్వారా పంపుతాము. మీ ఇంటి దగ్గరనే పోస్టుమెన్‌కు (మణియార్డరు రుసుముతో సహా) రు. 5-20 పైసలు చెల్లించి కాపీలు పొందవచ్చును.

3. పత్రికలు నెలనెలా తప్పకుండా తీసుకోవాలి. ఎప్పుడైనా వి. పి. తిరిగి వస్తే వారి సభ్యత్వము రద్దవుతుంది. తిరిగి సభ్యత్వము పొందాలంటే రు. 3/-లు పంపాలి.

4. ఏదైన ఒకే పత్రిక తెప్పించుకునేవారికి యీ స్కీమ్ వర్తించదు. విదేశాలలోని పాఠకులకుకూడా యీ స్కీమ్ వర్తించదు.

5. మీ చిరునామాలు మారినప్పుడల్లా తగినంత ముందుగా మాకు తెలియజేయాలి.

6. మిలిట్రీలో పనిచేసేవారికి వి. పి. పి.లు పంపే వీలుండదు కాబట్టి, పోటీలలో పాల్గొనదలచినవారు "హోమ్ డెలివరీ" సభ్యత్వము తీసుకొంటూ, రెండు పత్రికలకు

చందా పైకం ముందుగా పంపేయాలి.

7. సభ్యత్వ రుసుము త్రిప్పి పంపటంగాని, సభ్యత్వం మరొకరిపేర మార్చటంగాని జరగదు.

8. చందాదారులు, ఉచిత చందాదారులు కూడా దీనిలో సభ్యులుగా చేరవచ్చును. ఒక పత్రికకు చందా వున్నవారికి రు. 3/-లు. రెండు పత్రికలకు చందా వున్నవారికి రు. 1/- చొప్పున రెండు కాపీలు కలిపి వి. పి. పంపబడతాయి.

9. సభ్యులలో ఎవరివైన కథలు, ముఖ్యమైన రచనలు ప్రచురించబడితే, వారికి ఆ నెల వి. పి. ఒక పత్రిక ఖరీదు రు. 3/-లకు మాత్రమే పంపబడుతుంది.

10. సభ్యులు తాము జరిపే ఉత్తరప్రత్యుత్తరాలలో, పంపే రచనలపైనను, పోటీ కూపన్లపైనను విధిగా తమ సభ్యత్వము నెంబరు వ్రాయాలి.

పోటీలలో పాల్గొనే వారికి సూచనలు

1. "హోమ్ డెలివరీ" సభ్యులు మాత్రమే అన్నిపోటీలలో పాల్గొనుటకు అర్హులు. సభ్యత్వము లేనివారి కూపన్లు ఎంతమాత్రం పరిశీలించబడవు.

2. పోటీ జవాబులు పోస్టుకార్డు మీదగాని, పోస్టుకార్డు సైజు తెల్లకాగితంపైగాని వ్రాసి పంపాలి. ఎట్టి పరిస్థితులలో కాగితంసైజు పెద్దదిగా వుండరాదు.

3. ఒకే కాగితంపై రెండు పోటీలకు వ్రాయకూడదు. ప్రతి పోటీకి వేరువేరు కాగితాలపై వ్రాసి, అన్నిటినీ ఒకే కవరులో పెట్టి పంపవచ్చును.

4. ప్రతి కూపనుకు వెనుకప్రక్క తమ పూర్తి చిరునామా, హోమ్ డెలివరీ సభ్యత్వము నెంబరు తప్పనిసరిగా వ్రాయాలి.

5. సభ్యత్వము ఎవరిపేరుతో వుంటె, వారు మాత్రమే పోటీలలో పాల్గొనాలి. కలం పేర్లు అంగీకరించబడవు. సభ్యత్వము రద్దుచేయబడ్డవారి కూపన్లు కూడా పోటీకి అంగీకరించబడవు.

6. ఏ విషయంలోను ఉత్తరప్రత్యుత్తరాలు జరుపబడవు. తుదినిర్ణయం సంపాదకులదే. పోటీ నిబంధనలను ఖచ్చితంగా పాటించని పోటీ కూపన్లను పరిశీలించటం జరుగదు.

7. "హోమ్ డెలివరీ" సభ్యత్వము లేని పాఠకులు కూడా వెంటనే తమ సభ్యత్వ రుసుము పంపుతూ, అన్ని పోటీలలో పాల్గొనవచ్చును. అయితే ప్రతి కూపన్‌పైన తాము సభ్యత్వ రుసుము పంపిన తేదీ మున్నగు వివరాలు స్పష్టంగా వ్రాయాలి.

హోమ్ డెలివరీ సభ్యులపేర్లు

"హోమ్ డెలివరీ" సభ్యత్వం పొందిన పాఠకులపేర్లు కొన్ని యీ క్రింద ఇస్తున్నాము. మిగతాపేర్లు వచ్చే సంచికలో ప్రచురించబడతాయి. పేరుకు ముందున్న నెంబరును వారి సభ్యత్వము నెంబరుగా గుర్తించవలెను.

1. మిస్. శ్యామలాజ్యోతి, కందుకుర్తి. 2. జె. మురళీకృష్ణకుమార్, తిరుపతి, 3. జి. ధర్మారెడ్డి, షల్లారెడ్డిపల్లె. 4. మిట్టపెల్లి నిరంజన్, సికింద్రాబాదు. 5. ఎమ్. వెంకటేశం, కరీంనగర్, 6. ఎన్. సుబ్బరాజు, కోడూరుపాడు. 7. జి. రామారావు, లక్ష్మిపోలవరం, 8. డి. సి. హెచ్. వెంకటేశ్వర్లు, ఖమ్మం, 9. ఏ. ఎన్. మూర్తి, కోర్బా. 10. వై. నారపరెడ్డి, యెల్కలపల్లి.

11. బి. శ్రీనివాసమూర్తి, కుప్పం. 12. జి. సుబ్బరాజు, తాడిపూడి. 13. పి. ఆర్. కె. శాస్త్రి, గురజాల. 14. ఎమ్. రాజన్న, ఆలూరు. 15. వి. ఎస్. రావు, బెల్లగుంట. 16. బి. రామచంద్రయ్య, ప్రొద్దుటూరు. 17. కాల్వ శ్రీధర్, మదనపురం. 18. మామిడి రామ సూర్యనారాయణ, వసంతవాడ. 19. కె. పురుషోత్తం పాత్రో, విశాఖపట్టణం. 20. వి. దీనమణి, బొంబాయి.

21. కళాలక్ష్మి, విజయనగర్ కాలనీ. 22. టి. రంగారావు, మలక్ పేట. 23. ఎమ్. ఎస్. మోహనరావు, కోయంబత్తూరు. 24. జి. రాజారెడ్డి, దేవలంపేట. 25. హోట్ల ఫ్రెండ్స్ అసోసియేషన్, గుంతకల్. 26. ఎమ్. మోహన్ రెడ్డి, మేడిపల్లి. 27. ఎస్. శ్రీహరి, వికారాబాద్, 28. ఎన్. వి. ఎస్. రావు. చిత్తరంజన్. 29. డి. కె. రావ్, కంకెర. 30. డి. ఆర్. క్రిష్ణమూర్తి, హిందూపూర్.

31. కొండపల్లి వెంకటేశ్వరరావు, హైద్రాబాదు. 32. పి. హెచ్. దుర్గావరప్రసాద్, విజయవాడ. 33. వి. సాయిబాబ, కర్నూలు. 34. హెచ్. వి. ఎస్. సుబ్రహ్మణ్యం, హైద్రాబాదు. 35. వనమా రాజేశ్వరరావు, విజయవాడ. 36. డి. వి. వి. సత్యనారాయణరాజు, కోలంక. 37. డి. వి. శర్మ, తుమ్సార్. 38. పి. రామనర్సింహం, హన్మకొండ. 39. రావు జె. శంకర్, మోరి. 40. ఎన్. వాసుదేవాచార్, ఆలూరు.

41. పీసపాటి నవనీతం, కటక్. 42. పి. గోపాలరావు, నెల్లూరు. 43. ముద్దా రమేష్, కాకినాడ. 44. రాపర్ల వెంకటేశ్వర్లు, చందోలు. 45. కె. వి. సుబ్బారావు, రూర్కెలా. 46. ఎమ్. జి. మూర్తి, విశాఖపట్టణం. 47. కె. వెంకటరమణ, గడగ్. 48. ఐ. విశ్వనాథం, విజయనగరం.

49. పి. ఎల్. ఎస్. బాబ, అకివీడు. 50. యు. మురళీధర రావు, బెంగుళూరు.

51. డాక్టర్ ఎమ్. ధర్మదానం, హైద్రాబాదు. 52. ఏ. శైలజ, పాండిచ్చేరి. 53. ఎన్. క్రిష్ణకరంత్, తెనాలి. 54. ఎల్. జయరాం. కల్కుంట. 55. ఎడవల్లి ప్రసాదరావు, నెల్లూరు. 56. కె. వి. సత్యనారాయణ, అనకాపల్లి. 57. ఎమ్. సాదిక్, బూర్ల. 58. అలిశెట్టి ప్రభాకర్, జగిత్యాల. 59. వై. ఎస్. ప్రకాశరావు, గుడివాడ. 60. కేశిరాజుక్రిష్ణ, దొడ్డిపట్ల.

61. కొల్లా అరుణ, విశాఖపట్టణం, 62. ఎస్. వాహిద్, కడప. 63. ఆర్. సత్యనారాయణ, సూర్లరోడ్. 64. కె. చంద్రహాస్, చిన్నపురావుపల్లి. 65. కె. ఏ. కె అండ్ కంపెనీ, ఏలూరు. 66. కె. బుచ్చిబాబు, బరంపురం. 67. పి. ఆర్. రామచంద్రరావు, అమడగురు. 68. ఎస్. వి. చంద్రశేఖర్, నగరి. 69. పి. ఎస్. ఆర్. మూర్తి, కాకినాడ. 70. ఎమ్. పి. సత్యనారాయణరెడ్డి, పిట్టల వేమవరం.

71. కోనే నాగవెంకట ఆంజనేయులు. ఏలూరు. 72. శ్రీమతి వి. సీతానర్సింహం, బొంబాయి. 73. ఎస్. పురుషోత్తం, కర్నూలు. 74. జి. కె. శైలా, రాజమండ్రి. 75. ఎమ్. ఏ. గోపాల్, కూచనపల్లి. 76. ఏ. మహ్మద్ షఫీయుల్లా, కడప. 77. ఎమ్. డి. వరప్రసాద్. 78. బి. వెంకటస్వామి అండ్ సన్స్, నాగర్ కర్నూలు. 79. డి. వి. వి. సత్యనారాయణరాజు, లింగరాజుపాలెం. 80. ఇ. ఏ. ఎస్. నారాయణ, కంటబంజి.

(మిగిలిన పేర్లు వచ్చే సంచికలో)

ప్రేమలో తమాషాలు

శిక్షకందని ముద్దాయిలు!

"నువ్వా! ఈ సమయంలోనా రావడం?"

"ఏం? రాకూడదా?"

"అలా అన్నానా? ఎవరైనా చూస్తే?"

"భయపడక! ఎవ్వరూ చూడకుండానే వచ్చాను!"

"అర్థాంతరంలో మా వారు గనక ఆఫీసునించి ఊడి పడితే?"

"పడితే?"

"బావుంది! కొంపలంటుకోవూ?"

"నే నుండగా భయం దేనికి?"

"నీకేం? మనగుట్టు రట్టయితే ఆయన నాకు విడాకులిచ్చి తరిమేస్తారు."

"అప్పుడు నీవు శాశ్వతంగా నా దానివై పోతావు! దిగులు దేనికి?"

"ఇది మరీ బావుంది! ఆయన తరవాత ఈ ఆస్తంతటికీ నేనేగా వారసురాలిని! ఆయన్ని ఎలా వదులుకోడం? ఇంతకీ, నిన్న రాత్రేగా మనం కలుసుకుంది!"

"ఆ ఒక్కరాత్రి ఏ మూలకి? ఎక్కడ చూసినా, ఏవైపు చూసినా నీవే కనుపిస్తున్నావ్! నిన్ను క్షణం వదల బుద్ధి కావడంలేదు! బ్రతుకు దుర్భరంగా ఉంది."

"నన్ను మరీ కన్నెపిల్లని చెయ్యక! పెళ్లై ఒకరి ఖైదులో బ్రతుకుతున్నానని మరచిపోతున్నావు సుమా!"

"నేనూ పెళ్లైన వాణ్ణే కదా?"

"మరి?"

"నాకు మా ఆవిడంటే పరమ అసహ్యం!"

"దేనికో?"

"పరమ కురూపి! ఈ రోజు నీ వెంత అందంగా కనిపిస్తున్నావో తెలుసా?"

"చాల్లే! నేనీ చిలకపలుకులకి లొంగేదాన్నికాను!"

"ప్లీజ్!"

"సారీ! ఈ రోజు వద్దు!"

"ఇలా మాటిమాటికీ ఊరించావంటే నేను పిచ్చివాడినై పోతాను!"

"మన వ్యవహారం మా వారు పసిగట్టారేమోనవి నా కనుమానంగా ఉంది!"

"నీదంతా కేవలం భ్రమ! భ్రమలోపడి ఊరికే భయపడక!"

"ఎప్పుడైనా ఈ విషయం ఆలోచించావా?"

"ఏ విషయం?"

"ఇదే, మనం చేస్తున్నది ఎంతవరకూ న్యాయమైనదో?"

"జీవితంలో మనిద్దరికీ ఇష్టంలేని పెళ్ళిళ్లు జరిగాయి. కాకతాళీయంగా కలుసుకున్నాం. ఒకరితో దొరకని తృప్తిని చెరి సమంగా పంచుకుంటున్నాం! ఇందులో తప్పేముంది?"

"మాటల కేంగానీ. తప్పులు చేసే వాళ్ళంతా ఇలాటి సాకులు చెప్పే మనసుని జోకొడతారు!"

"మరేం చెప్పమంటావ్?"

"ఓ ప్రశ్న అడగనా?"

"ఒకటి కాదు. వెయ్యి అడుగు."

"నీవు నిజంగా నన్ను ప్రేమిస్తున్నావా?"

''నిజంగా కాదు! గాఢంగా!''

''ఐతే నా మాట వింటావు కదూ?''

''వింటానా? శిరసావహిస్తాను! కాని....''

''మళ్ళీ కానీ. అర్ధణా ఏమిటి?''

''నిన్ను విడిచి ఇప్పుడు వెళ్ళమంటే మాత్రం వెళ్లను!''

''నా భయమల్లా మా వారు అర్ధాంతరంలో వస్తారేమోనని! ఇంతకీ, ఆఫీసునించి ఇంత త్వరగా ఎలా రాగలిగావు?''

''నీకో దుర్వార్త, ప్లస్ శుభవార్త మోసుకొచ్చాను!''

''ఏమిటి?''

''మీ ఆయన ఆఫీసులో....''

''ఆగిపోయావేం?''

''మరణించాడు!''

''వాట్?''

''నిజం! ఈ వార్త చెప్పడానికే ఇలా పరిగెత్తుకొచ్చాను. నీకు సడన్ షాక్ తగలకుండా ఇంతసేపూ కబుర్లు చెపుతూ జాగు జేశాను!''

''ఓహ్! ఆయన ఎలా పోయారు?''

''హార్ట్ ఫేల్!''

''అదృష్టమంటే ఇలా ఉండాలి. కొన్ని రోజుల్నించీ నా కనుమానంగానే ఉంది. మన విషయం ఆయనకి తెలిసిపోయిందని. లోకానికి భయపడో, నన్నేమీ అనలేని బలహీనత వల్లో, తనకేమీ తెలీనట్టు నటిస్తూ లోలోపలే కుమిలిపోతూ ఈ రోజు కాస్తా హరీమన్నాడు. ఇప్పుడీ ఆస్తంతా నాదే కదూ?''

''నీతోబాటు....''

''ఆగిపోయావేం?''

''అర్థం చేసుకో మరి!'' —అజీజ్, తాండూర్. ★

మల్లాది వెంకటకృష్ణమూర్తి

సీరియల్

(గత సంచిక తరువాయి)

[జరిగిన కథ: చందన్, చాణక్య ఇరువురూ అన్నదమ్ములు. లండన్‌లో రహస్య జీవితం గడుపుతున్నారు. ఒకరోజు చందన్‌కు త్రాగే షాంపేన్‌లో విషం కలిపి, ఢిల్లీకి పారిపోయాడు చాణక్య. జరిగిన మోసం తెలుసుకొన్న చందన్ కూడ చాణక్యని వేటాడుతూ ఢిల్లీకి బయలుదేరాడు. వారి తండ్రి డోంగ్రేని హత్యచేశాడు చాణ్యక. ఆ కోపంతో చాణక్య ప్రియురాలు జలంధరని హత్యచేశాడు చందన్. —ఇక చదవండి.]

19

నర్స్ లోపలకి వచ్చింది.

"ఇంకా నిద్ర పోలేదా?" అడిగింది కుర్చీలో కూర్చుని వున్న నన్ను, మేలుకుని నా మాటలు వింటున్న అమ్మనీ చూసి.

"లేదు. తెల్లారాక వెళ్ళిపోవాలి నేను. అందుకని మేలుకునే వున్నాము" చెప్పాను నేను నర్స్‌కి.

అమ్మకి మళ్లీ దగ్గు మొదలైంది.

నర్స్ బయటికి వెళ్ళగానే నేనూ లేచాను. సిగరెట్ త్రాగాలని బయటకి నడిచాను. అమ్మ ముందు సిగరెట్ త్రాగాలంటే నాకెందుకో ఇబ్బందిగా వుంటుంది.

కాని చాణక్య వెరవడు దేనికీ. నాకూ చాణక్యకి మరో తేడా మా అమ్మ ముందు. నాన్నని నేను పేరుపెట్టి సంబోధిస్తాను. నేను అమ్మనుంచి రహస్యంగా వుంచను ఏదీ. నేనుచేసిన ప్రతీపనీ చెప్తాను అమ్మకి. ఎంత చెప్పకూడని చెడ్డ పనయినా సరే. చాణక్యమాత్రం చెప్పడు.

సిగరెట్ వెలిగించాను బయట స్థంభానికి ఆనుకుని. నాలు గైంది. ఇంకొంచెంసేపుంటే తెల్లవారిపోతుంది. నీలి ఆకాశంలో నిండుగావున్నాడు గుండ్రటి పూర్ణచంద్రుడు వెండి రేఖలను వెదజల్లుతూ. చల్లటిగాలి వీస్తోంది.

"హలో."

నర్స్ కంఠం వినిపించింది.

తల త్రిప్పిచూసాను. నా వంకచూసి కళ్లు దించుకుంది వెంటనే. సిగ్గుపడుతోందని గ్రహించాను.

"హలో" అన్నాను.

అలాగే తలవంచుకొని మౌనంగా వుండిపోయింది నర్స్.

"ఇక్కడ వాతావరణం చాలా బావుంటుంది" అన్నాను.

నర్స్ తలఎత్తి చూసింది ఓ సారి బయటకి. మైదానంలా వుంది. అక్కడక్కడ చెట్లు విసిరేసినట్లుగా చిన్నచిన్న కుటీరాల్లాంటి పెంకుటిళ్లు.

"అవును" అన్నది.

సిగరెట్ తాగుతూండి పోయాను.

"సిగరెట్స్ తాగటం మంచిది కాదు" అన్నది నర్స్.

"సిగరెట్స్‌కి అలవాటుపడ్డాక అవి త్రాగకుండా బ్రతకడం కూడా మంచిది కాదు."

"దూరంగా కనపడటంలా ఆ కుటీరం. దాంట్లోవున్న వ్యక్తికి ముప్పైరెండేళ్లు. రెండేళ్ళ క్రితం వచ్చిచేరాడు."

"టి. బి. నా!"

"అవును."

"బేడ్ లక్."

"పధ్నాలుగేళ్లనుంచే సిగరెట్స్ అలవాటు."

మాట్లాడ లేదు నేను.

"నిజానికి ఇక్కడ సిగరెట్స్ తాగకూడదు."

"త్రాగితే ఓ విధంగా లాభం నాకు."

"ఎందుకి?"

"నేనూ ఇక్కడే చేరితే మిమ్మల్ని చూస్తూ గడిపేయచ్చు ఎప్పటికీ."

సిగ్గుతో నర్స్ బుగ్గలు ఎరుపెక్కాయి.

"మీ అమ్మగారు చెప్పారు" అన్నది.

"ఏమిటి? ఏమని?" అడిగాను.

తలఎత్తి ఓసారి నా కళ్ళలోకి చూసి అన్నది.

"మీరు నన్ను వివాహం చేసుకోవా లనుకుంటున్నారని."

"అవును. మీ కిష్టమేనా?"

సమాధానం చెప్పలేదు నర్స్.

"చెప్పండి. నేను మీకు నచ్చానా?"

"అది నా అదృష్టం" అన్నది.

"థాంక్స్" నర్స్ కుడిచేతిని పట్టుకుని వ్రేళ్లతో మృదువుగా నిమిరి అన్నాను.

"ఐ లవ్ యు."

"సో డు ఐ."

"నన్ను పెళ్లి చేసుకున్నాక వీళ్ళందరికీ దూరంగా వెళ్లిపోదాం. ఇక వుద్యోగం చేయక్కరలేదు."

నర్స్ కళ్ళలో ఆశ కదిలింది.

"నిజం."

దగ్గరకి లాక్కున్నాను. అభ్యంతరం చెప్పలేదు. పెదవులమీద ముద్దుపెట్టుకున్నాను. కళ్లు మూసుకుంది నర్స్.

ఒక్క ఈ నర్స్ కాదు. అనేకమందిని గమనించాను. ముద్దుపెట్టుకుంటూంటే కళ్లు మూసుకుంటారు. బహుశ తన్మయత్వంతో. కాని నాకు నర్స్ పెదవుల్లో కొత్త రుచి కనిపించింది.

మళ్ళీ ముద్దుపెట్టుకున్నాను.

నా చేతులు నడుముని తడిమి కిందకి జారుతూంటే అన్నది నర్స్ కళ్ళు తెరచి.

"వూహూం."

నేను చూసిన చాలామంది ఆడవాళ్ళలోని మరో దుర్గుణం ఇది.

"ఆల్‌రైట్" అన్నాను.

"నాట్ క్వయిట్. ఆఫ్టర్ మేరేజ్."

డామిట్. ఇదే నాకు నచ్చని కోరిక.

"ఒన్ మినిట్. మళ్ళీ వస్తాను."

నర్స్ వెళ్ళిపోయింది. వెళ్లాక కొత్త సిగరెట్ వెలిగించాను. నర్స్‌ని వశపరచుకున్నాను పూర్తిగా. నర్స్ నాకు సహాయ పడుతుంది ఎన్నో విధాల....ఇక్కడే వుండలేను నేను చాలాకాలం.

నేను ఇక్కడ లేనప్పుడు ఇక్కడి సమాచారం తెలియ చేసే వ్యక్తి కావాలి నాకు. ఆ సహాయం ఇప్పుడు నాకు నర్స్ చేయగలదు.

నా అంతట నేను నర్స్‌తో నా ప్రేమ గురించి చెబితే నమ్మదు. అమ్మ ద్వారా వివాహ ప్రసక్తి తెస్తే త్వరగా నమ్ముతుందని నాకు తెలుసు. కాబోయే భర్తకి సహాయం చేయడం చాలామంది తమ ప్రేమల్ని గుర్తుగా, తమ సన్ని హితానికి సంకేతంగా భావిస్తారు.

నర్స్‌ని జాగ్రత్తగా వుపయోగించుకోవాలి వజ్రాల వేటలో. సిగిరెట్ త్రాగుతూ, చంద్రుడివంక చూస్తూ ఆలో చిస్తూండిపోయాను.

అమ్మ పిలిచింది నన్ను.

సిగరెట్ ఆర్పేసి, పెదిమలను రుద్దుకుని లోపలకి నడిచి

కుర్చీలో కూర్చున్నాను.

"నర్సుతో చెప్పాను" అన్నది అమ్మ.

మౌనంగా వుండిపోయాను. అమ్మ ఆలోచిస్తూండి పోయింది. బహుశ కోడలి గురించి అనుకున్నాను.

"అయితే చాణక్య రానేలేదా?" అడిగాను.

తల అడ్డంగా వూపింది అమ్మ.

"నిన్ను చూసి వెళ్ళివుంటాడనుకున్నాను" అన్నాను.

"రాలేదు. ఏం చేయదలచుకున్నావ్?" అడిగింది అమ్మ నన్ను.

"పదింటికి వెళ్ళిపోతాను. మళ్ళీ ఓ వారం రోజుల్లో వస్తాను" చెప్పాను.

"చాణక్య మీద పగసాధించడానికి వెళ్తున్నావా?"

"అవును" అన్నాను కాస్సేపాగి.

బాధగా అన్నది అమ్మ:

"వద్దురా."

"చాణక్య గురించి వివరంగా చెప్పాను. అలాంటి వాడిని ఏం చేసినా పాపం లేదు" అన్నాను.

"కావచ్చు. కాని నీ స్వంత తమ్ముడు."

"నన్ను హత్య చేయడానికి రెండుసార్లు ప్రయత్నించిన నాడే విస్మరించాను తమ్ముడని. నాన్నని చంపాడని తెలిసిన నాడే నిశ్చయించుకున్నాను కసి తీర్చుకోవాలని."

"నాకు మిగిలింది మీరిద్దరే."

"వాడు మిగిలివుంటే నీకు మేలుకన్నా కీడు ఎక్కువ జరుగుతుంది తెలుసా? అంతేకాదు, నన్ను బ్రతకనివ్వడు. వాడో నేనో తేలిపోవాలి త్వరగా. కేవలం నేను బ్రతకడానికయినా వాడిని చంపాలి."

అమ్మ మాట్లాలేదు,

"నేను భూమిలో ఆరడుగుల లోతున వుండాలని నీవు కోరుకుంటే అలాగే. పిడికెడు బూడిదగా మారాలనుంటే అలాగే."

"నాకు మాట ఇవ్వు చాణక్యని ఏమీ చేయనని. పోలీసులకి పట్టించి జైలుకు పంపు. అక్కడ బ్రతకనియ్యి. నీకు హాని జరగదు."

"ప్రయత్నిస్తాను."

"మాట ఇమ్మన్నాను."

"అలాగే."

నా మాటమీద నాకు నమ్మకం లేకపోయినా అమ్మకి మాట ఇచ్చాను.

"పడుకో ఇక. కాస్సేపైనా నిద్రపో" అన్నది అమ్మ.

20

"గుడ్‌బై."

"బై."

జీప్ ఎక్కి స్టార్టు చేశాను.

"మళ్ళీ వస్తారుగా?" అడిగింది నర్స్.

"తప్పక. అమ్మ కోసం, నీ కోసం."

"ఎదురు చూస్తూంటాను."

"అన్నట్టు ఓ చిన్న సహాయం చేయాలి."

"చెప్పండి."

జేబులోంచి కాగితం తీసి న్యూఢిల్లీలోని నా చిరునామా, టెలిఫోన్ నంబర్ వ్రాసిఇచ్చాను నర్స్‌కి.

"చాణక్య అనే అతను అమ్మని చూడటానికి వస్తే నాకు తెలియచేయాలి తప్పక."

"అలాగే."

"ట్రంక్ కాల్ చేసి చెప్పాలి. ఉత్తరం వ్రాస్తే సరిపోదు."

"అంత అర్జంటా?"

"అవును."

"చాణక్య ఎవరు?"

"నా తమ్ముడు. మరో సంగతి. నాకు తెలియ చేస్తున్నట్లుగా తెలియ కూడదు చాణక్యకి. రహస్యంగా తెల్పాలి నాకు."

"అదేం?"

"చాణక్య హంతకుడు కనక."

"హంతకుడు?" ఆశ్చర్యంగా అన్నది నర్స్.

స్టార్ట్ చేసిన జీప్ ఇంజన్ ఆపి అన్నాను నర్స్‌తో.

"అవును. మర్డరర్."

నమ్మలేనట్లుగా చూసింది.

"మా నాన్నని నిర్దాక్షిణ్యంగా చంపాడు."

వులిక్కి పడింది.

"నన్ను చంపడానికి కూడా ప్రయత్నిస్తున్నాడు."

"తప్పక తెలియ చేస్తాను" అన్నది నర్స్ దృఢంగా.

"మరో సంగతి. చాణక్య నాకన్నా రెండేళ్లు చిన్న. నా కన్నా బావుంటాడు."

"అయితే?"

"అమ్మాయిలని ఎలా ఆకర్షించాలో బాగా తెలు."

నర్స్ మొహం కందగడ్డలా అయింది.

"నేను ఒకరికే. ఎవ్వరికీ లొంగను."

నర్స్ చేతిని మృదువుగా నొక్కి అన్నాను.

"ఐయామ్ సారి ఇఫ్ ఐ డిడ్ హర్ట్ యు. జాగ్రత్త కోసం చెప్పాను, అంతే."

"జాగ్రత్త పడతాను" అన్నది నర్స్.

"ఇరవై నాలుగు మైళ్లేగా ఢిల్లీ. లైన్ త్వరగా దొరుకు

తుంది. నేను వీలయినన్ని సార్లు రావడానికి ప్రయత్నం చేస్తాను ఈ లోపల."

"ప్లీజ్."

జేబులోంచి నోట్లకట్ట తీసి అందించాను నర్స్‌కి.

"దేనికిది?" సందేహంగా అడిగింది.

"నీ కోసం."

"నాకెందుకు ఇంత డబ్బు?"

"ఈ రోజునుంచి నీ సుఖమే నా సుఖం. నన్ను నమ్మ. ఐ లవ్ యు డార్లింగ్."

"ఐ లవ్ యు టూ."

"సో లాంగ్"

జీప్ స్టార్ట్ చేసాను. గాలిలోకి ముద్దు విసిరి పోనిచ్చాను జీప్‌ని.

పది నిముషాల్లో ట్రంక్ రోడ్ మీదకి వచ్చింది నేను దొంగిలించిన ఆ జీప్. వేగం అందుకుంది. ఢిల్లీ వైపు దూసుకు పోతూ.

21

ఢిల్లీ చేరేసరికి మధ్యాహ్నం ఒంటి గంటైంది. నాకు తెలిసిన ఓ షాపులో కొన్ని మేకప్‌కి సంబంధించిన సామాను కొనుక్కొని, జీప్‌ని రైలు కట్టదగ్గర ఆపి, హోటల్ వైపు నడవ సాగాను.

ఢిల్లీ పోలీసులు నాకు కొత్త కాదు. వాళ్ళని ఎలా మాయ చేయాలో నాకు తెలుసు. నా సమస్యల్లా చాణక్యని పట్టు కోవటమే. హోటల్‌కి వెళ్ళి, నా గదిలో పడుకున్నాను మంచం మీద. నిద్ర లేమి వల్ల ఒళ్లంతా తేలిపోతున్నట్లుగా వుంది. (ఇంకా వుంది)

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు సంబంధం వుండే టట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని ఓ పోస్టుకార్డు సైజు తెల్లకాగితంపై వ్రాసి, యీ నెల 10వ తేదీలోపల మాకు చేరేటట్లు పంపండి.

ఇదే విధంగా "సప్లిమెంట్" ముఖచిత్రాలకు కూడా మీ వ్యాఖ్యలు పంపవచ్చును. రెండు పత్రికల వ్యాఖ్యలు వేరువేరు తెల్లకాగితాలపై వ్రాసి పంపాలి. ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా వ్రాయవచ్చును.

అత్యుత్తమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు "హోమ్ డెలివరీ" పాఠకులకు ఒక్కొక్కరికి రు. 20/-లు చొప్పున నగదు బహుమతి పంపుతాము. ★

గత నెల పోటీ ఫలితాలు

(1) జులై '74 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

పరుగెత్తెను శకటము!
ప్రవహించెను రక్తము!!

పంపినవారు: శ్రీ మామిడి రామసూర్యనారాయణ, వసంతవాడ, ఏలూరు తాలూకా (ప. గో. జిల్లా.)

(2) జులై '74 నెల "సప్లిమెంట్" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

మాటువేసి కాటువెయ్యి!
కాటువేసి మాయ చెయ్యి!!

పంపినవారు: శ్రీమతి జి. సుబ్బలక్ష్మి, కేరాఫ్—జి. కనకదుర్గాప్రసాదరావు, చెక్ పోస్టు ఎదుట, గుంటూరు-4.

పై విజేతలకు ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" ఉచితంగా పంపబడుతుంది.

లేఖలు

"అపన" హోమ్ డెలివరీ స్కీమ్ అద్భుతంగా ఉంది. నేను ప్రతినెలా రాయఘడనుండో, వాల్తేరునుండో "అపన" తెప్పించుకుంటున్నాను. ఆలస్యం కావడమో, లేక అసలు దొరకక పోవడమో జరుగుతోంది. ఈ రోజే నేను, మీ సభ్యుడిగా చేరుతున్నాను.

—ఇ. ఏ. ఎస్. నారాయణ, కంటబంజి.

మీరు కొత్తగా ప్రవేశపెట్టిన "హోమ్ డెలివరీ" స్కీమ్ ద్వారా పాఠకులు చాలా లాభాలు పొందుతున్నారు. రు. 6-00ల పత్రికలు రు 5-00లకే లభించటము నిజంగా అదృష్టమే.

—ఎన్. వాసుదేవాచార్, ఆలూరు.

హేపీ "హోమ్ డెలివరీ"కి సుస్వాగతం పలుకుతున్నాము. ఈ స్కీమ్‌వల్ల మీ కీర్తి ప్రతిష్ఠలు మరోమెట్టు పెరిగాయి. పాఠకులందరి సమస్యలు ఏకంగా తీర్చే సరికొత్త స్కీమ్ - హోమ్ డెలివరీ.

—జెడిగం రంగనాయకులు, బొంబాయి.

మీరు క్రొత్తగా ప్రవేశపెట్టిన "హోమ్ డెలివరీ" స్కీమ్ హర్షదాయకంగా వుంది. ఇది తప్పక పాఠకామోదం పొందగలదని ఆశిస్తున్నాను.

—కొండపల్లి వెంకటేశ్వరరావు, హైద్రాబాదు.

మీరు చేసిన మరో క్రొత్తప్రయోగం "హోమ్ డెలివరీ" స్కీమ్, మీకు ప్రశంసలు కురిపించేదిగా వుంది. మా వూరి ఏజెంట్ ఒకనెల కాపీలు తెప్పిస్తే మరోనెల తెప్పించడం లేదు. రైల్వే బుక్‌స్టాల్‌లో కూడా ఆలస్యంగావెళ్ళితే కాపీలు

అయిపోతున్నాయి. "హోమ్ డెలివరీ" మా లాంటి పాఠకు లకు కల్పవృక్షం లాంటిది.

—పీసపాటి నవనీతం, కటక్-1.

"అపన" రేటు ఇప్పటికి సామాన్యులకు తలభారం అయిపోయింది. చాల పత్రికలు రేటు పెంచారు. మనదీ పెంచారు. పేపరు కొరతవలన తప్పదు. పాఠకులు అర్థం చేసుకోగలరు. మార్కెట్లో 2 రూపాయలకు అమ్మే 100 పేజీల నవలల మీద 224 పేజీల "అపన" చాల మెరుగు. కానీ దయచేసి ముమ్ముందు మళ్లీ రేటు పెంచకుండా సాధ్య మైనంతవరకు ప్రయత్నించండి. తప్పకపోతే, పై 24 పేజీలు ఎడ్వర్‌టైజ్‌మెంట్లకు కేటాయించండి. ఈ సూచ నను దయతో స్వీకరిస్తారని ఆశిస్తాను.

—జె. గోపాలక్రిష్ణమూర్తి, విజయవాడ.

"అపన" యొక్క సైజు తగ్గించడంగాని, పేజీలు తగ్గించడంగాని సంపాదకులు చేయరాదని నా మనవి. ఎక్కు వగా పత్రిక ధరపెట్టి కొనలేనివాళ్లు "హోమ్ డెలివరీ" ద్వారా పాతధరకే కొనుక్కోవచ్చును. "హోమ్ డెలివరీ" స్కీమ్ పాఠకులందరికీ సౌకర్యంగా వుంటుందనుటలో సందేహంలేదు.

—మిట్టపెల్లి నిరంజన్, సికింద్రాబాదు.

ఉత్కంఠ కలిగించే సీరియల్స్ కోసం, "అపన" కొరకు నిరీక్షణ తప్పటం లేదు. "అపన" యొక్క ధర పెరిగినా, అందులో ప్రచురించబడే రచనలు, శీర్షికలు ఎక్కువ విలువ కలిగియున్నాయి. ధర ఎంతవున్నా కొనేయా లనిపిస్తుంది. శీర్షికలలో మీరు ప్రకటిస్తున్న బహుమతులు ఆకర్షణీయంగా వుంటున్నాయి. కథలలో వెరైటీ వుండి ప్రతి కథ చదవాలనిపిస్తుంది. ఇలాగే మా అభిమానపత్రిక

''అపన'' మా హృదయాలలో శాశ్వతంగా నిలచిపోవాలని ఆశిస్తాము.

—యం. బి. కె. ప్రమీల, గుంటూరు.

అబ్బ! 'ఖైదీ' సీరియల్ ఎంత బాగుందో రాయటానికి నాకు మాటలు రావటం లేదు. చాలా ఫైన్‌గా వుంది. 'ఖైదీ' సీరియల్‌కు ఎక్కువ పేజీలు కెటాయించాలని మరీ మరీ కోరుతున్నాను.

—మాధవీ మనోహర్, నిజామాబాద్.

జూలై '74 సంచిక చెప్పలేనంత శోభాయమానంగా వెలువడింది. పత్రికను ఇంత అభివృద్ధిలోకి తెచ్చి, తీర్చి దిద్దిన సంపాదకులకు నా అభివందనలు. పత్రికలో చేసిన మార్పులు, చేర్పులూ అపరాధ పరిశోధక సాహిత్యానికి వన్నె తెచ్చి పెట్టాయి. ''హోమ్ డెలివరీ'' పాఠకులకు గోల్డెన్ అపర్చునిటీ.

—ఎస్. కె. గౌస్‌బాషా, కావలి.

ఈ నెల ''సప్లిమెంట్'' నిజంగా ఎక్సలెంట్. శ్యాం బాబుగారి నవల 'ఎడారిలో ప్రాణగండం' మంచి సస్పె న్స్‌తో చివరి వరకు అద్భుతంగా సాగింది. ముత్యాల వంటి నాలుగు నవలలను రు. 3/-లకే అందించటం ముదావహం. ''అపన'' లో కొమ్మూరి గారి కొత్త సీరియల్ ప్రారంభం అతి చక్కగా ఉంది. మిగిలిన కథలన్నీ పత్రిక స్థాయిని పెంచుతున్నాయి,

—విద్యాసాగర్ & ఫ్రాంక్లిన్, ఉజ్జయిని.

Edited and Published by S. DAMODAR REDDY (phone: 36959), 3-4-554 Narayanaguda Hyderabad-500029, and printed at Kranti press, Madras-1